అరుణతార

సాహిత్య సాంస్కృతిక మాస పత్రిక

సంపుటి : 33 సంచిక : 282 అక్టోబరు 2010 వెల : రు 10 పేజీలు : 84



కాశ్మీరీలు అడుగుతున్నది ఏమిటి?



-: ఆజాద్ పుస్తకావిష్కరణ సభ :-



(ఎడమ నుంచి కుడి) ఆర్. ఎస్. రావు, వరవరరావు, గంటి ప్రసాదం, అమిత్ బాదురి, ఘంటా చక్రపాణి
8, నవంబర్ 2010న హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన ఆజాద్ పుస్తకావవిష్కరణ సభ

-: స్వీకారం :-

ముప్పై ఏళ్ల దండకారణ్య సాహితీ సాంస్కృతికోద్యమ చరిత్ర (1980-2010)
ప్రచురణ : విరసం
వెల : రు. 50/-
సహచర, దిశ, నవోదయ

కొత్త చూపు
'అభివృద్ధి-వెలుగునీడలు' ఇతర వ్యాసాలు
ఆర్. ఎస్. రావు
వీక్షణం పబ్లికేషన్స్
వెల : రు. 100/-

అభివృద్ధిని ఇలా చూద్దాం
ముదునూరి భారతి
వ్యాసాలు, సమీక్షలు
వీక్షణం పబ్లికేషన్స్
వెల : రు. 80/-

ఇన్ సెర్చ్ ఆఫ్ మెథడ్
(కలెక్షన్ ఆఫ్ ఆర్టికల్స్)
ముదునూరి భారతి
బి1 కలెక్టివ్ - సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రిసర్చ్ అండ్ కమ్యూనికేషన్
వెల : రు. 200/-

మెథడాలజీ ఆఫ్ సోషల్ ఎంక్వైరీ
ఎ మార్క్సియన్ పర్స్‌పెక్టివ్
ముదునూరి భారతి
బి1 కలెక్టివ్ - సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రిసర్చ్ అండ్ కమ్యూనికేషన్
వెల : రు. 150/-

Mudunuri Bharathi

ఎ ఫిలసాఫికల్ ఎ...
క్రైసిస్ & డెవలప్‌మెంట్ ఇ...
మార్క్సియన్ ఫ్రేమ్‌వర్క్
ముదునూరి భారతి
బి1 కలెక్టివ్ - సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రిసర్చ్ అండ్ కమ్యూనికేషన్
వెల : రు. 80/-

Mudunuri Bharathi

ఇండివిడ్యువల్ సబ్-గ్రూప్స్, గ్రూప్స్ & ఫ్రీడం
ముదునూరి భారతి
బి1 కలెక్టివ్ - సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రిసర్చ్ అండ్ కమ్యూనికేషన్
వెల : రు. 75/-

ఆన్ ఎడ్యుకేషన్
ముదునూరి భారతి
ఆర్.ఎస్. రావు
బి1 కలెక్టివ్ - సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రిసర్చ్ అండ్ కమ్యూనికేషన్
వెల : రు. 100/-

ఉత్తర తెలంగాణ విప్లవోద్యమం అసువులు బాసిన అమరుల జీవిత చరిత్రలు
6వ భాగం
(జూలై 2007-2010 జూలై)
ప్రచురణ : దిక్సూచి
వెల : రు. 20/-

KLVA101M187

అరుణతార

సాహిత్యసాంస్కృతిక మాసపత్రిక

సంపుటి : 33 ♦ సంచిక : 282 ♦ అక్టోబరు, 2010

సంపాదకుడు
చలసాని ప్రసాద్

❖ ❖ ❖

వర్కింగ్ ఎడిటర్
డి.వి. రామకృష్ణా రావు
ఎం.ఐ.జి. - 14, ఎ.పి.ఐ.ఐ.సి. కాలనీ,
కార్బైడ్ కంపెనీ ఎదురుగా,
మౌలాలి, హైదరాబాద్ - 500040
* **కేవలం పోస్ట్, బుక్‌పోస్ట్ ల ద్వారా**
రచనలు పై చిరునామాకూ,
* **ఇ-మెయిల్ ద్వారా**
arunatara1977@gmail.com,
raamki70@gmail.com
లకూ రచనలు పంపవచ్చు

❖ ❖ ❖

కొరియర్, రిజిస్టర్డ్ పోస్ట్ ల ద్వారా
రచనలు పంపితే...
టి. కృష్ణాబాయి
9-19-3, సి.బి.ఎం. కాంపౌండ్
విశాఖపట్నం - 530 003

❖ ❖ ❖

మేనేజర్
ఎస్. రవికుమార్
5-1307, దొరసానిపల్లె రోడ్,
ప్రొద్దుటూరు, కడప జిల్లా - 516360
సెల్ : 9866021257

❖ ❖ ❖

విరసం కార్యదర్శి చిరునామా
పాణి
50-348, L 19 B II,
అరోరా నగర్,
బి క్యాంప్, కర్నూల్ - 2

ఈ సంచిక వెల : రు. 25

సంపాదక లేఖ...

ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టాలని, విస్తరించాలని రాజ్యాంగ చట్రంలో కలగనేవాళ్లకు న్యాయ వ్యవస్థ ఒక గొప్ప ఆలంబన. రాజ్యాంగంలోని విలువలను పరిరక్షించే అంతిమ శక్తిగా న్యాయవ్యవస్థను గౌరవిస్తారు. సమాజ ప్రజాస్వామికీకరణలో న్యాయ ప్రక్రియకు అత్యున్నత స్థానం ఇస్తారు. ఈ పనులన్నీ అది చేయగలిగితే అంతకంటే ఏం కావాలి? న్యాయా న్యాయా వివేచనలో ఆధునిక, సామాజిక దృక్పథాన్ని, విలువలను, పద్ధతులను పాటించగలిగే విశిష్టత ఉంటే దాన్ని గౌరవించడానికి అభ్యంతరం ఎందుకు ఉండాలి? అలాంటి పాత్రను న్యాయవ్యవస్థ పోషించిందనడానికి ఉదాహరణలు కూడా ఉండొచ్చు. అంత మాత్రాన ధర్మాసనాలు అలాంటి ఉచిత పాత్రను సాదా నిర్వర్తిస్తున్నాయని చెప్పడానికి ఏమీ లేదు. అలాంటి భరోసాతో గుండెల మీద చేయి వేసుకొని నిశ్చింతగా ఉండేందుకు సగటు పౌరులకు ఆస్కారం లేదని ఆధునిక భారత న్యాయవ్యవస్థ నిరూపించుకున్నది. అట్లాంటి తాజా నిరూపణే ఇటీవలి అయోధ్య తీర్పు.

న్యాయవ్యవస్థ గురించిన 'పవిత్ర' భావనలను అయోధ్య తీర్పు ద్వారా అలహాబాదు ధర్మాసనం గోతిలో పెట్టేసింది. రాజ్యాంగంలోని లౌకికభావనను, ఆధునిక దృష్టిని కోర్టులు పుణికిపుచ్చుకొని ఉంటే తీర్పు మరోలా ఉండేది. దీన్ని కేవలం అయోధ్యలోని 2.77 ఎకరాల నేల గురించి, దాని చుట్టూ సంఘపరివార్ లేవదీసిన వివాదం గురించిన వైఖరిగానే చూడటానికి లేదు. ఆధునిక భారతదేశ చరిత్రలో ఒక ముఖ్యమైన 'వివాదాస్పద' చరిత్రను రాజ్యాంగం వెలుగులో న్యాయస్థానం ఎలా చూసింది? అనే విషయానికి సంబంధించిన కీలక ప్రశ్న ఇది.

బాబ్రీ మసీదు ఉన్న స్థలం రామజన్మభూమి అనే సంఘపరివార్ వివాదాస్పద, దుర్మార్గ వాదనను కోర్టు చట్టబద్ధం చేసింది. త్రేతాయుగంలో రాముడు అక్కడ జన్మించాడనీ, అది రామాలయమనీ అనడానికి ఆధారాలేవీ అక్కర్లేదు.., అది హిందువులు విశ్వాసమనీ, మెజారిటీ ప్రజల విశ్వాసాన్ని మించిన సాక్ష్యం అవసరం లేదనేది సంఘపరివార్ బరితెగింపు ప్రచారం. ఈ విశ్వాస కేంద్రంగా ఏవేవో వాదనలు కూడా పేర్చిఉండవచ్చు. ఈ వాదనలను ధర్మాసనం న్యాయ పరిభాషలోకి తర్జుమా చేసింది. కాక పోతే సమభావానికి తాను ప్రతినిధినని చెప్పుకోడానికి మూడు భాగాలు చేసింది. ఒక రకంగా ఇది మన దేశంలోని లౌకిక భావనకు తగిన పద్ధతే అనుకోవచ్చు.

మతరహితంగా ఉండవలసిందిపోయి అన్ని మతాలకు సమదూరంలో ఉండడమే లౌకికవాదమని రాజ్యం నమ్మబలికింది. అదైనా ఆచరించిందా ? అంటే అదీ లేదు. అన్ని మతాలకు సమదూరం అంటే మెజారిటీ మతానికి దగ్గరనీ, మైనారిటీ మతాలకు దూరమనీ నిరూపించింది. దగ్గరిది ఎంత దగ్గరైనా కావచ్చు. ఎంతగానంటే - ఆధునిక రాజ్యమే అయినా, హేతుపూర్వకంగా వ్యవహరించవలసిందే అయినా మతవ్యవస్థను చక్కగా వాడుకుంటుంది.

అట్లా న్యాయవ్యవస్థలో కూడా మతతత్వం ప్రతిఫలిస్తుందని అయోధ్య తీర్పు స్పష్టం చేసింది. సుమారుగా ఈ ప్రాతిపదిక మీదే తీర్పు చెప్పింది. ఇది చారిత్రక వివాదాన్ని పరిశీలించవలసిన ఆధునిక దృక్పథానికేగాక, న్యాయ వ్యవస్థ సంబద్ధతకు కూడా వ్యతిరేకం.

వివాదాస్పద భూమిని హిందువులకు అప్పగించడం ద్వారా ప్రజాస్వామ్యంలో తన స్థానాన్ని న్యాయవ్యవస్థ తుడిచేసుకున్నదనీ, మలినపరుచుకున్నదనీ రాజ్యాంగ బద్ధంగా ఆలోచించే వాళ్లు కూడా అభిప్రాయపడక తప్పదు. దేశంలో నిత్యం అనేక సమస్యలు ముందుకు వస్తుంటాయి కాబట్టి అయోధ్య తీర్పు ప్రజల మనసుల్లో మసకేసి పోవచ్చు, 1992లో సంఘపరివార్ ప్రభుత్వం సాక్షిగా ధ్వంసం చేయగా మిగిలిన బాబ్రీ శిథిలాలను భారత న్యాయ వ్యవస్థ కూల్చివేసింది. అంతేగాక వివాదాస్పద స్థలాన్ని హిందువులకు అప్పగించి మన దేశంలో లౌకిక భావన నిజరూపాన్ని బైటపెట్టుకుంది, న్యాయవ్యవస్థ తన స్వభావాన్ని కూడా దాచుకోకుండా బహిర్గతపరుచుకుంది. అ

ఈ సంచికలో...

సంపాదకీయం : (5-6)
ముప్పై వసంతాల దండకారణ్య సాహిత్యోద్యమానికి
విప్లవ జేజేలు - **పాణి**

దృక్పథం (7)
అయోధ్యపై తీర్పు: ఒక చరిత్రకారుని దృక్పథం
- *రోమిలా థాపర్*

సందర్భం (8)
మసీదు కూల్చివేతకు చట్టబద్ధత నిచ్చిన తీర్పు
-*టి. ఆర్. ఆంధ్యారుజిన*

వ్యక్తిత్వం (9-14)
రాజ్యాంగం - రాడికల్ ఉద్యమం - ఎస్. ఆర్. శంకరన్
- *వరవరరావు*

శతవర్ధంతి సందర్భం (15-22)
తోల్‌స్తాయ్ నవల 'యుద్ధం - శాంతి'
- **ఎన్.పి. యస్. నాగభూషణాచార్యులు**

అవగాహన *(23-28)*
అస్తిత్వవాదాలు- ఆధునికత - విముక్తి
- **పాణి**

ప్రత్యుత్తరం (29-33)
ఉద్యమాలకు క్రమ శిక్షణ అవసరం లేదా?
- *రంగనాయకమ్మ*

కథలు
యోధ - **షంషేర్ (34-47)**
ఒక తల్లి - **పి. చంద్ (48-51)**
ప్రయత్నం - పలమనేరు *బాలాజీ* **(52-53)**

పాటలు (54-54)
అమరుల కన్నుల్లో వేల వెన్నెల కాంతులు - *తంగెళ్ల*
సుదర్శనం ; ఉద్యమించ రారండోయ్ - **దినమణి**

కవిత్వం (55-67)
ప్రజాగ్రహం - **దినమణి** ; చర్య ప్రతిచర్య ; తట్టిలేపిన
మట్టివాసన ; సంగ్రామం - **శాఖమూరి రవి** మూడు కవితలు;
మెత్తటి స్పర్శ - **మాతంగి** ; ఆదివాసీ హవాహో -
పోటు నారాయణ ; బహుముఖయుద్ధగాడు - **నాగేశ్వర్** ;
ఆదివాసీ ; ఎవరికయినా ; రాళ్ళు కూడా మాట్లాడతాయి -
ఉదయమిత్ర కవితలు మూడు ; దుఃఖపు క్రీనీడలో చింతన ;
మననమూ మౌనమూ - **పాణి** కవితలు రెండు ;
అహింసపై చర్చ - **సచ్చిదానందన్** ;
అతడు సామాన్యుల ప్రవక్త - **నల్లమల**

గల్పిక (68-69)
చినిగిన మార్క్స్ ఎంగెల్స్ బొమ్మలు!

నివేదిక (69)
కథా రచయిత శారద సంస్మరణ సభ

తీర్మానాలు (70)
అక్టోబరులో జరిగిన ప్రత్యేక సర్వసభ్య సమావేశ తీర్మానాలు

పుస్తక పరిచయం (71-76)
దండకారణ్య మహిళా ఉద్యమ చరిత్ర
- **ఎం. రత్నమాల**

నవల సీరియల్ (77-82)
గుమ్మెటమోత - **పాణి**

చందాలు, బకాయిలు మనియార్డర్, డి.డి.ల రూపంలో మేనేజర్‌కు
పంపించండి. డి.డి.లను ఎస్. రవికుమార్, ప్రొద్దుటూరు పేర తీయండి.
విడి సంచిక వెల : రు. 10
సంవత్సర చందా : రు. 100
జీవితచందా : రు. 1000

కవర్‌పేజీ : స్వేచ్ఛ, స్వయం నిర్ణయాధికారాల కోసం పోరాడుతున్న కాశ్మీరీ ప్రజల దృశ్యాలు
ఫొటోలు : గూగుల్ నెట్, ఆజాద్ పుస్తకావిష్కరణ సభ ఫోటో - ఆర్.ఎస్.జె. థామస్

సంపాదకీయం

ముప్పై వసంతాల దండకారణ్య సాహిత్యోద్యమానికి విప్లవ జేజేలు

- పాణి



ఆధునిక భారత దేశ చరిత్రలో మూడు అతి పెద్ద ప్రజా, విప్లవ సాహిత్య కళా ఉద్యమాలు ఉన్నాయి. ఒకటి : వలసవాద వ్యతిరేక సాహిత్య, కళా ఉద్యమం. రెండు : అంతర్జాతీయంగా రెండో ప్రపంచ యుద్ధ వ్యతిరేక కాలంలో కమ్యూనిస్టు నేపథ్యంలో దేశంలో వెల్లువెత్తిన అభ్యుదయ సాహిత్య కళా ఉద్యమం. మూడు : నక్సల్బరీ ఉద్యమ ప్రేరణతో కొనసాగుతున్న సాహిత్య కళా ఉద్యమం. ఆధునిక భారత దేశంలో అని మొదట అనడానికి ఒక కారణం ఉన్నది. అంతక ముందు కూడా అనేక సాహిత్య సాంస్కృతికసంచనాలు, ఉద్యమాలు చాలా జరిగాయి. ఉదాహరణకు భక్తి ఉద్యమ వాహికగా సాగిన సాహిత్యం. ఆనాటి సమాజ ప్రత్యేకతల వల్ల ఆధిపత్య శక్తుల మీద తిరుగుబాటుగా వచ్చిన సాంఘిక ఉద్యమాలన్నీ ప్రబలమైన సాహిత్య సాంస్కృతిక వ్యక్తీకరణలుగా, చాలా వరకు సాహిత్య, సాంస్కృతిక మాధ్యమాలుగానే సాగాయి.

పైన చెప్పిన మూడు సాహిత్య, కళా ఉద్యమాలు ఆధునికతలో భాగమైనవి కాబట్టి, రాజకీయ ఉద్యమాల ప్రభావంతో, వాటిలో అంతర్భాగంగా వచ్చాయి. మొదటి రెండింటి కంటే భిన్నంగా భూస్వామ్యానికి, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా మొదలైన సాయుధ విప్లవోద్యమంలో భాగంగా విప్లవ సాహిత్య, కళా ఉద్యమం మొదలైంది. నక్సల్బరీ శ్రీకాకుళ సాయుధ పోరాటాల ప్రేరణతో ప్రారంభమైన సాహిత్య, కళా ఉద్యమానికి శిఖరాయమానం దండకారణ్య సాహిత్య, కళా ఉద్యమం. 1980లలో దండకారణ్యాన్ని వ్యూహాత్మక కార్యక్షేత్రంగా ఎంచుకున్న విప్లవోద్యమం సాహిత్య, కళా ఉద్యమానికి కూడా తరగని గని అయింది.

సుమారుగా ముప్పై ఏళ్లుగా దండకారణ్యంలో కొనసాగుతున్న సాహిత్య ఉద్యమాన్ని అప్పట్లో సృజన పత్రిక, అప్పటి నుంచి నేటిదాకా అరుణతార తెలుగు సమాజంలో ప్రచారం చేస్తూ వచ్చాయి. దండకారణ్య సాహిత్యానికి, కళలకు ఝుంకార్ అధికార పత్రికగా ఉన్నా, అనేక ప్రత్యేకతల వల్ల, పరిమితుల వల్ల ఝుంకార్‌గాని, మొత్తంగా దండకారణ్య సాహిత్య కళా ఉద్యమం గాని తెలుగు ఆలోచనా రంగానికి, సాహిత్య ప్రపంచానికి పెద్దగా అందుబాటులోకి రాలేకపోయింది. అరుణతార ఎంతో కొంత ఆ అవసరాన్ని నెరవేర్చుతూ వస్తోంది. అజ్ఞాతవాసంలో ఉన్న రచయితల సాహిత్యాన్ని, సాహిత్య సాంస్కృతిక విశ్లేషణలను, నివేదికలను అరుణతార తెలుగు పాఠకులకు అందిస్తూ వచ్చింది. ఒక రకంగా దండకారణ్య సాహిత్యోద్యమానికి అరుణతార అనధికార వేదికగా కొనసాగడం వల్ల విప్లవ సాహిత్య రంగంలో విరసం నిర్దేశించుకున్న లక్ష్యాన్ని ఇనుమడింప చేస్తోంది.

ఈ ప్రయత్నాన్ని మరింత ముందుకు తీసుకపోతూ విరసం దండకారణ్య సాహిత్య సాంస్కృతిక ఉద్యమం అనే సమగ్ర పుస్తకాన్ని అచ్చేసింది. దండకారణ్యంలోని చేతనా నాట్యమంచ్ తెలుగు, హిందీ, ఒడియా తదితర భాషల్లో, లిపి లేని ఆదివాసీ భాషల్లో కూడా చేస్తున్న కృషిని ఇంత కాలం ఝుంకార్ ప్రచురిస్తూ ఉండేది. ఇప్పుడు ముప్పై ఏళ్ల దండకారణ్య సాహిత్య కళా ఉద్యమ చరిత్రను అజ్ఞాత రచయితలు సమగ్ర పుస్తకంగా రాశారు. తెలుగులో వందేళ్లుగా వచ్చిన సాహిత్య, కళా ఉద్యమాలు ఏవీ... విరసంతో సహా... తమ ఉద్యమం గురించి ఇంత సమగ్ర పుస్తకాన్ని రాసుకోలేదు. ఈ పుస్తకం నిర్దేశించుకున్న చట్రం వల్ల, రాసిన తీరు వల్ల దీన్ని చరిత్ర అనడంలో కొన్ని ఇబ్బందులు ఉన్నా భారతదేశంలోని సువిశాల ప్రాంతంలో పలు భాషా సంస్కృతిక సమ్మేళనంగా సాగుతున్న విస్తృత స్థాయి కృషిని ఈ పుస్తకం ఒక చోటికి చేర్చింది. తెలుగులో సాహిత్య చరిత్రలుగా వచ్చిన పుస్తకాల కంటే ఇది చాలా వరకు ప్రామాణికంగానే ఉన్నదనవచ్చు. ముఖ్యంగా ఏ ప్రాంతంలో ఈ సాహిత్యోద్యమం నడుస్తున్నదో ఆ సమాజ చరిత్ర పట్ల, అందులోని వైవిధ్యం, ప్రత్యేకతల పట్ల రచయితలకు స్పష్టత ఉన్నదని పాఠకులకు నమ్మకం కలుగుతుంది. ఆ సమాజానికి ఉన్న సొంత చరిత్ర, దాని ఆర్థిక వ్యవస్థ, సాంఘిక వ్యవస్థలు, వీటిలో వస్తున్న మార్పుల పట్ల రచయితలకున్న అవగాహన విశ్వసనీయత కూడగట్టుకుంటుంది. ఈ రచనకు తాము ఎంచుకున్న ప్రాతిపదికలను ముందుగా సూత్రీకరించకపోయినా, తమ పద్ధతి ఏమిటో ప్రకటించకపోయినా ఆ ఒరవడి మాత్రం ఈ పుస్తకంలో కనిపిస్తుంది.

దండకారణ్య సాహిత్య సాంస్కృతికోద్యమానికి ముప్పై ఏళ్ల సందర్భంలో ఈ పుస్తకం విడుదలైంది. 1980ల కాలాన్ని విప్లవోద్యమం కీలకంగా గుర్తిస్తుంది. ఈ విషయం పుస్తక రచయితలు ప్రస్తావించారు. 1980 మధ్యలో విప్లవోద్యమం ఆంధ్ర, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ సరిహద్దులు చెరుపుతూ దండకారణ్యంలోకి ప్రవేశించింది" అన్నారు. మరో మాట కూడా అన్నారు. కరీంనగర్- ఆదిలాబాదు రైతాంగ పోరాటం అందించిన తొలి తరం నవ యువకులు ఈ ప్రాంతంలో తొలి అడుగులు వేశారు అని.

మరో సందర్భంలో - ఆ దశాబ్దమంతా విప్లవోద్యమ ప్రేరణతో తెలుగులో ఉధృతంగా సాగిన సాహిత్య కళా ఉద్యమాల ప్రభావాన్ని కూడా గుర్తు చేసుకున్నారు. దండకారణ్య సాహిత్యోద్యమ ప్రత్యేకత ఏమంటే-ఒక రాజకీయ ఉద్యమమే సాహిత్య సాంస్కృతిక ఉద్యమంగా ఆవిర్భవించి విస్తరించడం. ఎవరైనా దీన్ని పరిమితి అని కూడా అనవచ్చు. అంత మాత్రాన దీని విశిష్టత ఇసుమంత కూడా తగ్గదు.

రాజకీయ ఉద్యమమే సాహిత్య సాంస్కృతిక ఉద్యమంగా కూడా రూపొందడం అనేది వర్గపోరాట క్రమంలో ఏఏ సాంఘిక అస్తిత్వాల ప్రజలు ఎట్లా ఉద్యమంలో భాగం అవుతారు? అనే దానికి మంచి ఉదాహరణ. విప్లవోద్యమం కేవలం రాజకీయ, ఆర్థిక కేంద్రంగానే కాక సాంఘిక, సాంస్కృతికంగా కూడా నడిచినందు వల్ల ప్రబలమైన

సాహిత్య సాంస్కృతిక ఉద్యమం నిర్మాణమైంది. దండకారణ్యంలోని ఆదివాసీ ప్రజలు చరిత్ర నిర్మాణంలో పాలుపంచుకుంటూ ఒక రాజకీయ ఉద్యమాన్ని నిర్మించినట్లే, సాహిత్య సాంస్కృతి కోద్యమాన్నీ నిర్మిస్తున్నారు.

1980లో 'గెరిల్లా జోన్ నిర్మించండి' అనే రాజకీయ నినాదం భారతదేశంలోని విస్తారమైన ప్రాంతంలో బలమైన సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమానికి ఊపిరిపోసినట్టే చాలా అరుదైన కళా సాహిత్య ఉద్యమానికి కూడా పునాది వేసింది. అంతకముందు జరిగిన భూస్వామ్య, సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలకు దండకారణ్యంలోని పోరాటాలకు మౌలికమైన తేడా ఉన్నది. ఇప్పుడా చర్చలోకి పోనవసరం లేదుగాని, ఆ ఉద్యమం తన లాంటి వైవిధ్యభరితమైన సాంస్కృతి కోద్యమానికి జన్మనిచ్చింది. అది నక్సల్బరీ శ్రీకాకుళ పోరాటాల ప్రేరణతో తెలుగులోనూ, దేశవ్యాప్తంగా వెల్లువెత్తిన విప్లవ సాహిత్య సాంస్కృతికోద్యమాలను ఉన్నత స్థాయికి తీసికెళ్లింది.

అయితే ఈ పుస్తక రచయితలు దండకారణ్య సాహిత్య సంస్కృతికోద్యమానికి తెలుగులోని విప్లవ, ప్రజా సాహిత్య సాంస్కృతికోద్యమానికి మధ్య పదే పదే సంచరిస్తూ ఈ చరిత్ర రాశారు. ఇది కేవలం ఈ పుస్తకంలోని రచనా శిల్పానికి సంబంధించిన విషయమేకాదు. తెలుగులోని విప్లవ సాహిత్యోద్యమానికి, సృజన పత్రికకు, మరీ ఎక్కువగా జననాట్యమండలికి దండకారణ్య సాహిత్యోద్యమంతో పేగు బంధం ఉన్నదని, మొత్తంగా తెలుగు ప్రగతిశీల సాహిత్య సాంస్కృతికోద్యమం నుంచి దండకారణ్య సాహిత్యోద్యమం ఊతమందుకున్నదని రచయితలు రాశారు. తెలుగ సమాజానికి సంబంధించినంత వరకు శ్రీకాకుళ పోరాటం ఉత్తర తెలంగాణకూ, అక్కడి నుంచి దండకారణ్యానికి విస్తరించిన క్రమంలో ఆ ప్రాంత సాహిత్య సాంస్కృతికోద్యమం రూపొందిందని ఈ పుస్తక రచయితలు గుర్తుచేశారు.

ఈ ఉద్యమానికి ఉన్న ప్రత్యేకతలను, విశిష్టతలను సామాజిక రాజకీయార్థిక సాంస్కృతిక పునాది నుంచి విస్తృత విశ్లేషణ చేయవచ్చు. ఆ బృహత్తర ప్రయత్నానికి అవసరమైన ముడిసరుకు, సమాచారం, ప్రాతిపదికలు, సూత్రీకరణలు ఈ పుస్తకంలో చాలా కనిపిస్తాయి. అవన్నీ అలా ఉంచి చాలా క్లుప్తంగా రెండు మూడు విషయాలు ఈ సందర్భంలో చెప్పుకోవచ్చు. నాగరిక సమాజం అనేది కనీసంగా గుర్తించని ఆదివాసీ ప్రజల జీవితం నుంచి, జీవన్మరణ పోరాటాల నుంచి ఈ ఉద్యమం పుట్టింది. మైదాన ప్రాంత సంపర్కం, ప్రేరణ ఉన్నప్పటికీ ఆదివాసీల అస్తిత్వం దానికి ఆధారం. మామూలుగా ప్రజా సంస్కృతిని దానికదిగా నిలిపి ఉంచాలనీ, పరిరక్షించాలనే వాదన ఒకటి ఉంది. కానీ దండకారణ్య ఆదివాసీలు తమ సామాజిక స్థితిని ప్రగతిదాయకంగా తీర్చిదిద్దుకొనే క్రమంలో ఒక సాంస్కృతికోద్యమాన్ని నిర్మించుకుంటున్నారు.

భారతదేశంలోనే అతిపెద్ద సాహిత్య సాంస్కృతికోద్యమం దండకారణ్యంలో నడుస్తోంది. 2004లో ఈ ఉద్యమం ఒక ముఖ్యమైన మలుపు తిరిగింది. అంతకు ముందు నుంచి దండకారణ్య రచయితలు పేరుతో సాగిన కృషి చేతనానాట్యమంచ్ అనే విస్తృత ప్రజాసంఘంగా అవతరించింది. ఒక రకంగా చేతనానాట్యమంచ్ ఇవాళ భారతదేశంలోని అతి పెద్ద సాహిత్య సాంస్కృతిక సంస్థ. గ్రామీణ స్థాయి నుంచి సిఎన్ఎం కమిటీలు ఏర్పడ్డాయి. దండకారణ్యంలో ఊరూరా ఆదివాసులు సాంస్కృతిక కమిటీల్లోకి వచ్చారు. గత పదేళ్లలో 1100 శిక్షణా శిబిరాలు సీఎన్ఎం నిర్వహించింది. వీటిలో సుమారుగా 25 వేల మంది శిక్షణ పొందారు. వీళ్లలో ఆరువేల మంది మహిళలు ఉన్నారు. పాటల రచన, కళారూపాల రచన, వాయిద్య పరికరాల్లో, కళా ప్రదర్శనల్లో శిక్షణ పొందిన కళాకారులు దండకారణ్యంలోనే గాక దేశవ్యాప్తంగా ప్రదర్శనలు ఇచ్చారు. 14 రాష్ట్రాల్లో 60కి పైగా అతిపెద్ద ప్రదర్శనలు ఇచ్చారు.

పాట, కళా రూపాల రచనలో, ప్రదర్శనలో అసమానమైన కృషి చేస్తున్న సీఎన్ఎం తన ముందున్న సవాళ్లను, తన పరిమితులను కూడా ఈ పుస్తకంలో జాబితా వేసింది. ముఖ్యంగా కథ, నవల ప్రక్రియల్లో వెనకబడి ఉన్నట్లు గుర్తించింది. సాహిత్యం, కళా సంబంధమైన ఉద్యమాన్ని స్థూల అర్థంలో సాంస్కృతికోద్యమం అనడం అలవాటు. కానీ దీనిలో కొన్ని చిక్కులు ఉన్నాయి. సాహిత్యం, కళలు సంస్కృతీ నిర్మాణానికి తప్పక దోహదపడతాయి. సందేహం లేదు. అయితే సంస్కృతి అనే ఆవరణ చాలా విశాలమైనది. అది లిఖిత సాహిత్య రూపాల ద్వారా, మౌఖిక ప్రజా కళారూపాల ద్వారా, వీటిలో నూతన విలువలతో, లక్ష్యంతో చేసే కృషి మాత్రమే కాదు. ఈ మొత్తం సాంస్కృతిక రంగానికి సమానం కూడా కాదు. సాంస్కృతికోద్యమం ఇంత మాత్రమే కాదు. ఈ కోణంలో చూసినప్పుడు సిఎన్ఎం నిజమైన సాంస్కృతికోద్యమం అనిపిస్తుంది. అది ఆదివాసీల రాజకీయ ఉద్యమానికి ప్రేరణగా, వాహికగానేగాక వాళ్ల రోజువారీ జీవితంలోని అనేక కోణాలను స్పృశించింది. ఆ అన్ని కోణాల్లో వాళ్లకు అవసరమైన, ప్రగతిదాయకమైన, శాస్త్రీయమైన జీవితాన్ని ఆవిష్కరిస్తున్నది. ఈ పని ఆదివాసులు తమ కోసం తాము చేసుకుంటున్న రాజకీయ, సామాజిక, సాంస్కృతిక ప్రయోగం.

అందుకే సిఎన్ఎంను కేవలం నిర్మాణపరంగానే అతిపెద్ద ఉద్యమం అననవసరం లేదు. సంఖ్యాపరంగా అయితే మరే సంస్థలోనైనా అంత మంది కళాకారులు, రచయితలు ఉంటే ఉండవచ్చునేమో! కానీ దండకారణ్య సాహిత్య సాంస్కృతికోద్యమం తన గుణంలో, పాత్రలో చాలా విస్తృతమైనది, గుణాత్మకంగా మిగతా సాంస్కృతికోద్యమాల కన్నా విశిష్టమైనది. భారతదేశంలోని ప్రగతిశీల, విప్లవ సాంస్కృతికోద్యమానికి ఒక చూపును అందించగల ప్రయోగశీలత అందులో ఉన్నది. ముఖ్యంగా తెలుగు సాహిత్యలోకం దండకారణ్య సాహిత్య సాంస్కృతికోద్యమం గురించి ఆలోచించవలసిన అవసరం ఉన్నది. దాన్నుంచి ఏమైనా స్వీకరించగలిగితే చాలా మేలు జరుగుతుంది. చైనాలో మావో ఏనాన్ ప్రసంగాల్లో చెప్పిన లక్షణాలను అక్షరాలా పుణికి పుచ్చుకున్న సాహిత్య సాంస్కృతికోద్యమం అది. మైదాన ప్రాంతాల్లో, నగరాల్లో మధ్యతరగతి రచయితల, కళాకారుల నేతృత్వంలో సాగే ఉద్యమానికి ఉపయోగపడే అంశాలు కూడా అందులో ఉన్నాయని ఈ పుస్తకం ద్వారా తెలుస్తోంది.

ఈ ముప్పై ఏళ్ల సందర్భంలో దండకారణ్య ఆదివాసీ సాహిత్య సాంస్కృతికోద్యమానికి పునాదులు వేసిన అమర కళావేత్తలకు, రచయితలకు, సాంస్కృతిక మార్గదర్శకత్వం వహించిన వాళ్ళకు అరుణతార జోహార్లు చెప్తోంది. సీఎన్ఎం, ఝంకార్ నిర్వాహకులకు, దండకారణ్య సాహిత్యవేత్తలకు అభినందనలు చెప్తోంది. ●

అయోధ్యపై తీర్పు: ఒక చరిత్రకారుని దృక్పథం

(చరిత్ర పట్ల గౌరవాన్ని ఆ తీర్పు తుడిచివేసింది - చరిత్ర స్థానంలో మత విశ్వాసాన్ని ఉంచింది)

- రోమిలా థాపర్

అనువాదం : అరుణ్

ఆ తీర్పు ఒక రాజకీయ తీర్పు - సంవత్సరాల కిందటే ప్రభుత్వం తీసుకోగలిగిన నిర్ణయాన్ని ఆ తీర్పు ప్రతిబింబిస్తుంది. ఆ తీర్పు - భూమిని పొందడంపై, కూల్చబడిన మసీదు స్థానంలో మందిర నిర్మాణంపై కేంద్రీకరిస్తుంది. సమస్య ఏమిటంటే మతపరమైన గుర్తింపులతో కూడి ఉన్న సమకాలీన రాజకీయాలు, అదే సమయంలో చారిత్రక రుజువులపైన ఆధారపడి ఉన్నదనే వాదన కూడా ఉంది. ఈ రెండవ అంశాన్ని మొదట గుర్తించిన, తర్వాత, తీర్పులో పక్కన బెట్టారు.

న్యాయ స్థానం - ఒక దేవుడు గాని, అవతార పురుషుడు గాని జన్మించిన స్థలంగా ఒక నిర్దిష్ట స్థలాన్ని ప్రకటించింది. అంతేకాదు ఆ దేవుడి / అవతార పురుషుని జన్మదిన శుభకార్యాన్ని జరుపడానికి ఎక్కడ దేవాలాయాన్ని నిర్మించాలో తేల్చింది. ఈ తీర్పు, హిందువుల విశ్వాసానికి స్పందనగా ఇచ్చినది. హిందువుల వాదనకు రుజువులు లేవు కాబట్టి, న్యాయ స్థానం నుండి అలాంటి తీర్పు ఎవ్వరూ ఊహించేది కాదు. హిందువులు, రామున్ని దేవునిగా కొలుస్తారు కాని, జన్మస్థలాన్ని భూమి అప్పగింత, భూమిని పొందేందుకు దోహదం చేసే, ఒక ప్రధాన చారిత్రక కట్టడపు ఇచ్ఛాపూర్వక కూల్చివేత - వీటిపై చట్టబద్ధమైన నిర్ణయానికి రావడానికి ఆ విశ్వాసం మద్దతు నిస్తుందా (తోడ్పడుతుందా)

క్రీ.పూ. 12 వ శతాబ్దంలో దేవాలయం ఉండేదని, దాన్ని కూల్చివేసి మసీదు నిర్మించారని, అందువల్ల (అదే ప్రదేశంలో) కొత్తగా దేవాలయ నిర్మాణం చట్టబద్ధమైనదని తీర్పు చెబుతుంది (క్లెయిమ్).

ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా వారి తవ్వకాలను, దానిపై వారి అధ్యయనాలు, చాలా మంది పురాతత్త్వ శాస్త్రవేత్తలు, చరిత్రకారులు విభేధించినా, పూర్తిగా అంగీకరింపబడ్డాయి. ఇది ఒక వృత్తిపరమైన నైపుణ్యాతకు సంబంధించినది. దానిపై చాలా తీవ్రమైన విభేధాలున్నాయి. అందువల్ల, ఒక దృక్పథాన్ని, అది చాలా తేలికగా అంగీకరించడమనేది ఆ తీర్పుపై విశ్వసనీయతను కలుగనీయదు.

ఒక న్యాయమూర్తి, తాను చరిత్రకారుడు కాదు కాబట్టి, చరిత్రలోనికి లోతుగా తరచి చూడననడం అలా అంటూనే, చరిత్ర, పురాతత్త్వ శాస్త్రం, ఈ తీర్పు నివ్వడానికి తప్పని, సరికాదని అన్నాడు. కాని, అక్కడ సమస్య ఏమిటంటే వివిధ వర్గాల చట్టబద్ధ హక్కుకు సంబంధించిన వ్యాజ్యాలలో వెయ్యేళ్ళ కిందట చారిత్రక కట్టడాల చారిత్రకత.

500 సంవత్సరాల క్రితం నిర్మించబడ్డ ఒక మసీదు, అదీ మన సాంస్కృతిక వారసత్వంలో భాగమైన కట్టడాన్ని, రాజకీయ నాయకత్వం రెచ్చగొట్టడంలో, ఇచ్ఛాపూర్వకంగా కూల్చివేసారు. ఈ తీర్పులో ఆ దుర్మార్గమైన కూల్చివేత గురించి ఒక్క మాట లేదు. మన వారసత్వానికి వ్యతిరేకంగా చేసిన నేరం ఖండింపబడలేదు. మసీదు కూల్చబడ్డ స్థలంలో, రామున్ని జన్మభూమిగా తలుస్తున్న స్థలంలో, కొత్త దేవాలయపు గర్భగుడి ఉంటుంది. అక్కడేదో మందిరం ఉందని, అది కూల్చి వేయబడ్డదని ఖండించబడుతుంది. కొత్తగా దేవాలయ నిర్మాణానికి అదొక న్యాయ సమ్మతాన్ని అందిస్తుంది. కాని, మసీదు కూల్చివేత మాత్రం ఖండించబడదు. సౌకర్యవంతంగా, ఆ విషయాన్ని 'కేసు' ఫరిధి బయట ఉంచబడుతుంది.

- రాబోయే కాలానికి కోర్టు ఒక నమూనాను సృష్టించింది.
- తామొక గుంపుగా నిర్దేశించుకొని, ఆ గుంపు ఒక ప్రదేశాన్ని తాము ఆరాధించే దేవత / అవతార పురుషుని జన్మస్థలంగా ప్రార్థిస్తున్నామని చెబుతు, భూమిపై హక్కును డిమాండ్ చేయడానికి, న్యాయస్థానంలో ఈ తీర్పు ఒక ఒరవడిని సృష్టించింది. తగిన ఆస్తులు లేక వివాదాలు సృష్టించే అవకాశాలున్న చోటంతా ఇప్పుడు అలాంటి ఎన్నో జన్మస్థానాలు పుట్టుకురావొచ్చు. ఒక చారిత్రక కట్టడాన్ని ఇచ్ఛాపూర్వకంగా కూల్చివేయడాన్ని ఖండించకపోవడం వల్ల, ఇక ఇతర కట్టడాలను కూల్చకుండా ప్రజల్ని ఎవరు ఆపగలరు? ప్రార్థనా స్థలాల యథాస్థితి మార్పుకు వ్యతిరేకంగా 1993లో చేసిన చట్టం పనికి రాకుండా పోయింది.

చరిత్రలో జరిగిందేదో జరిగింది. దాన్ని మార్చలేము. కాని, అది ఏ సందర్భంలో జరిగిందో అని విషయాన్నుండి మనం అర్థం చేసుకోవడానికి నేర్చుకోవాలి. నమ్మదగ్గ ఆధారాల నుండి ఆ సంఘటనను పరికించాలి. నేటి రాజకీయాలను సమర్థించడానికి మనం గతాన్ని మార్చలేము. ఈ తీర్పు చరిత్ర పట్ల మనకు గల గౌరవాన్ని తుడిచివేసింది. చరిత్ర స్థానంలో మత విశ్వాసాలకు స్థానమిస్తుంది. ఈ దేశంలో న్యాయమనేది కేవలం విశ్వాసం, నమ్మకముపై గాక రుజువులపై ఆధారపడుతుందనే నమ్మకం కల్గినప్పుడే, నిజమైన పరస్పర అవగాహన పెంపొందుతుంది.

●

(మూలం: 'ది హిందూ' 2 అక్టోబర్ 2010)

సందర్భం

మసీదు కూల్చివేతకు చట్టబద్ధత నిచ్చిన తీర్పు

- టి. ఆర్. అంధ్యారుజిన
(సీనియర్ అడ్వకేట్, భారతదేశ మాజీ సొలిసిటర్ జనరల్)

అలహాబాద్ హైకోర్టు అయోధ్య తీర్పులో కొట్టవచ్చినట్టుకనబడే అంశం : 1992, డిసెంబర్ 6న బాబ్రీ మసీదు కూల్చివేత అనే ఆటవిక చర్యపై ఏలాంటి ఖండన లేకపోవడమే.

1994లో ఆ కూల్చివేతపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు "చాలా కొద్ది సమయంలోనే, మొత్తం నిర్మాణం కూల్చివేయబడింది. నేలమట్టం చేయబడింది. వాస్తవంగా, అది "దేశం సిగ్గుపడాల్సిన" చర్య. అక్కడ కూల్చివేయబడ్డది కేవలం ఒక ప్రాచీన కట్టడం కాదు, దేశంలోని మెజారిటీ ప్రజల న్యాయమైన, ధర్మబద్ధమైన స్వభావంపై మైనారిటీల కుండే విశ్వాసం కూల్చబడింది. అది, చట్టబద్ధమైన పాలన, రాజ్యాంగ బద్ధమైన చర్యలపై వారికి (ముస్లింలకు) ఉండిన నమ్మకాన్ని తొలగించింది. ఏ మాత్రం రక్షణ లేని, ఏ కట్టడమైతే ప్రభుత్వపు సంరక్షణలో ఉందో, అలాంటి 500 సంవత్సరాల నిర్మాణం కూల్చబడ్డది.

కూల్చివేతపై నాటి ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రం "అయోధ్యలోని రామ జన్మభూమి - బాబ్రీ మసీదు కట్టడాలు 6 డిసెంబరు 1992 నాటి కూల్చివేత, అంత్యంత హేయమైనది. ఈ చర్యకు పాల్పడినవారు ఒక ప్రార్థనా స్థలాన్ని కూల్చడమే కాదు, మన రాజ్యాంగంలో పొందుపరిచిన సెక్యులరిజం, ప్రజాస్వామ్యం, చట్టబద్ధ పాలనలను దెబ్బతీసారు. సిగ్గుచేటైన, ఒక ఆకస్మిక దాడిలో, కొన్ని వేల మంది ఆ దాడికి బాధతో, విచారంతో స్పందించిన అన్ని వర్గాలకు చెందిన లక్షలాది ప్రజల మనసులను గాయపరిచారు."

నాటి ఆగ్రహావేశాలు ఎంత తీవ్రంగా ఉన్నాయంటే, నాటి ప్రధాన మంత్రి, కేంద్ర ప్రభుత్వం 1992 డిసెంబర్ 7న, 27న, చేసిన ప్రకటనలలో మసీదును తిరిగి నిర్మిస్తామని చెప్పారు.

డిసెంబర్ 6, 1992 దౌర్జన్య కూల్చివేత గురించి అలహాబాద్ హైకోర్టు ఒక్క మాట ప్రస్తావించలేదు. అంతేగాక ఆ కూల్చివేతను వివాదస్పద స్థలం 2.77 ఎకరాలు ఖాళీ స్థలమయినట్టు, ఆ మసీదు కేంద్రంలో రాముడు జన్మస్థలముందని హిందువులు విశ్వసిస్తున్నారు కాబట్టి, ఆ స్థలం హిందువులకు చెందుతుందని, రామ్ చబుత్రా, సీతారసోయి ఉన్న ప్రదేశాన్ని నిర్మోహి అఖారాకు అప్పగించాలని మిగిలిన వివాదస్పద స్థలాన్ని విభజించి, 2/3 వంతు హిందువులకు, 1/3 వంతు ముస్లింలకు అప్పగించాలని తీర్పునిచ్చింది. ఈ తీర్పులు 1992 కూల్చివేతను చట్టబద్ధం చేస్తాయి. న్యాయ సమ్మతాన్ని చేకూరుస్తాయి. దానికి కారణం కోర్టు తీర్పు. ఆ వివాదస్పద స్థలంలో మసీదు లేదు అనే ప్రాతిపదికపై ఆధారపడింది.

వివాదంలో ఉన్న ఒక పక్షం చట్టాన్ని తన చేతుల్లో తీసుకొని, అక్కడ ఉన్న పరిస్థితిని తమకనుకూలంగా మార్పు చేస్తే (1992 మసీదు కూల్చివేత హిందూ వాదులకు అనుకూలంగా మార్చినట్టు) కోర్టు, తొలుత, గత పరిస్థితిని పునరుద్ధరించాలని ఉత్తర్వులు ఇయడమనేది న్యాయస్థానంలో ప్రాథమిక న్యాయసూత్రం.

అది (గత పరిస్థితి పునరుద్ధరణ) సాధ్యం కాకపోతే ఇప్పటి వివాదంవలె, న్యాయస్థానం చట్టరాహిత్యానికి పాల్పడిన వారు లబ్ధిపొందేలా అనుమతి నీయదు. ఈ ప్రాథమిక న్యాయ సూత్రాన్ని అలహాబాద్ హైకోర్టు తీర్పు పట్టించుకోలేదు.

కోర్టు తీర్పు యొక్క న్యాయపు పరీక్ష : మసీదు కేంద్ర గుమ్మటం కింది స్థలం రాముని జన్మభూమి అని లేదా 1528లో దేవాలయపు శిథిలాలపై మసీదు నిర్మించబడిందని హైకోర్టు సూత్రీకరించడం సరైనదే అనుకుందాం. అలాంటప్పుడు, ఆ మసీదు కూల్చివేయ బడకపోతే, ఆ వివాదస్పద స్థలాన్ని, కోర్టు నేడు విభజించి, భాగాలు పంచినట్టుగా, పంచమని ఉత్తర్వులీయగలదా? 500 సంవత్సరాల కింద నిర్మితమైన మసీదును కూల్చినప్పుడే అలా సాధ్యమయివుండేది. అలా (కూల్చమని) తీర్పు నివ్వడమనేది సాధ్యమయ్యేదికాదు.

అలాంటి పరిస్థితి లేనప్పుడు మసీదు కూల్చివేత అనే చట్టవ్యతిరేక చర్య ఆధారంగా, ఆ వివాదస్పద స్థలాన్ని విభజించమని (ఇపుడు తీర్పు నిచ్చినట్టుగా) న్యాయస్థానం తీర్పునివ్వగలదా?

హైకోర్టు మెజారిటీ తీర్పు మంచి ఉద్దేశ్యంతో కూడి ఉన్నది. ఇరువర్గాల మధ్య రాజీ కుదర్చడానికి, ఐక్యత కొరకు ఇవ్వబడినదని భావించవచ్చు. ఆ భావంతో ముస్లిం ప్రజలు తీర్పునంగీకరిస్తే దేశంలో మత కలహాల సమస్య పరిష్కరించబడుతుంది. అలా జరగాలని మనమంతా కోరుకోవచ్చు, కాని, అలా జరగకపోతే, ముస్లింలు కోర్టు తీర్పును అంగీకరించకపోతే, ముస్లింలలో అసంతృప్తి చెలరేగుతూనే ఉంటుంది. ఎందుకంటే, ముస్లిం సమాజం ఆ తీర్పు, ఆ ప్రార్థన స్థలాన్ని ధ్వంసం చేయడాన్ని న్యాయస్థానం క్షమించిందని, న్యాయ సమ్మతం చేసిందని అనుకోవడం జరుగుతుంది.

●

(మూలం: 'ది హిందూ' 5 అక్టోబర్ 2010)

వ్యక్తిత్వం

రాజ్యాంగం - రాడికల్ ఉద్యమం - ఎస్. ఆర్. శంకరన్

- వరవరరావు

జీవిత ఖైదీల విడుదల గురించి 2009లో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులో ఏడు సంవత్సరాలు శిక్షా కాలం పూర్తి చేసి సత్ప్రవర్తన కలిగిన వారిని పరిశీలించామని ఉటంకిస్తూ ఇచ్చిన మినహాయింపులలో 'పబ్లిక్ సర్వెంట్'ను చంపిన వారికి ఈ ఉత్తర్వు వర్తించదన్నారు. అట్లా 19, 15 సంవత్సరాల నుంచి జీవితఖైదు అనుభవిస్తూ సత్ప్రవర్తన గురించి జైలు సిబ్బంది మన్ననలు కూడా పొందిన రాజకీయ ఖైదీలు కూడా విడుదల కాకుండా ఈనాటికీ జైల్లో మగ్గుతున్నారు.

పబ్లిక్ సర్వెంట్స్ అంటే ప్రజా సేవకులు.

ఎవరు? ప్రభుత్వోద్యోగులు. సర్పంచ్ నుంచి ఎం.పి. వరకు ఎన్నికయిన ప్రజా ప్రతినిధులు. వీళ్లలో సర్పంచ్‌లను చంపి జైలుకు వచ్చిన వాళ్లు హైకోర్టుకు పోతే హైకోర్టు సర్పంచ్‌లు ప్రజా ప్రతినిధులవుతారు గానీ 'ప్రజా సేవకులుగా భావించనక్కర్లేద'ని అభిప్రాయ పడింది. దానర్థం సర్పంచ్‌లు ప్రజాసేవకులు కాదని హైకోర్టు చెప్పినట్లు కాదు.

కాని నిజంగా ప్రభుత్వోద్యోగుల్లో గానీ, ఎన్నికయిన ప్రజా ప్రతినిధుల్లో గానీ ఎంతమంది మనసా, వాచా, కర్మణా తాము అధికారులూ, నాయకులూ అని కాకుండా ప్రజాసేవకులమని భావించే వాళ్లున్నారు?

బహుశా ప్రభుత్వాధికారుల్లో ఎస్.ఆర్. శంకరన్ వంటి వాళ్లను అటువంటి అరుదయిన జీవి (రేర్ స్పీషీస్)గా చెప్పవచ్చు.

కమ్యూనిస్టులంటే ఎవరని ఒక్క మాటలో చెప్పమంటే మావో సె టుంగ్ 'ప్రజలకు సేవ చేసేవాళ్లు, ప్రజా సేవకులు' అని చెప్పాడట. యేనాన్ విముక్త ప్రాంతంలో గుహల్లో ఉన్నప్పుడు కలవడానికి వచ్చిన సామాన్య ప్రజానీకానికి. ప్రొలిటేరియట్‌కు, బూర్జువాజీకి తేడా ఏమిటని కమ్యూన్‌లో పని చేస్తున్న వాళ్లను 1971లో బ్రిటిష్ చరిత్రకారుడు మాక్స్‌వెల్ అడిగితే, వాళ్లలో వాళ్లు ఆలోచించి, చర్చించుకొని నిస్వార్థపరులకు, స్వార్థపరులకు ఉన్న తేడా అని తాము అర్థం చేసుకొన్నట్లు చెప్పారట శ్రామికులు.

ప్రజాసేవకులయిన కమ్యూనిస్టులకు తాను పబ్లిక్ సర్వెంట్‌ననుకునే ఎస్.ఆర్. శంకరన్ అంటే గౌరవాభిమానాలు ఏర్పడడం ఆశ్చర్యకరమేమీ కాదు.

బ్రిటిష్ ఇండియాలో ఇండియన్ సివిల్ సర్వీస్ అనే మాట వాడిన దగ్గర్నించి ఇవ్వాళ ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ అని వాడుతున్న దాకా లోకమంతా కొమ్ములున్న పరిపాలనా అధికారులనుకునేవాళ్లు శాసనరీత్యా సర్వీస్ (సేవ) చేయవలసిన వాళ్లే. అట్లా భావించిన వాళ్లలో శంకరన్ ఒకరు.

1957లో ఐ.ఎ.ఎస్.లో చేరిన దగ్గర్నించే ఉద్యోగంలోను, ఉద్యోగ విరమణ తర్వాత కూడా రాజ్యాంగ స్ఫూర్తితో ఐదు దశాబ్దాలకు పైగా ప్రజలకు సేవ చేసిన ఎస్.ఆర్. శంకరన్ 1967లో నక్సల్బరీ పోరాట కాలం నుంచి 1969లో మా-లె పార్టీ ఏర్పడిన నాటి నుంచి ఇవ్వాళ దేశవ్యాప్తంగా మావోయిస్టు పార్టీ ప్రజా యుద్ధం పేరుతో పోరాడుతున్న కాలం వరకు వాళ్ల అభిమానాన్ని చూరగొనడం వైరుధ్యంగా కనిపిస్తుందా?

ఎందుకంటే విప్లవకారులకు రాజ్యాంగంలో విశ్వాసం లేదు. 'ఈ దోపిడి రాజ్యాంగం రచనే ఒక కుట్ర' అని చెరబండరాజు ఏనాడో రాసాడు. ఆ చెరబండరాజు అంటే శంకరన్‌కు ఎంత ప్రేమనో. ఆయన సస్పెన్షన్, నిరుద్యోగం, అనారోగ్యం వంటి కత్తుల వంతెన జీవితంలో ఆయనకు, శ్యామలకు ఆయన ఎంత అండగా నిలబడినాడో ఆ ఇద్దరికి కూడా తెలియనంత గుప్త సహాయమాయనది. 'కుడిచేతి సహాయం ఎడం చేతికి తెలియకూడదన్న' జీసస్ మానవీయ నీతి ఆయనది. అది నాకు ఆయన చేసిన సహాయం విషయంలోనూ వర్తిస్తుంది. అశేష దళిత, బడుగువర్గాల విషయంలోనూ వర్తిస్తుంది.

రాజ్యాన్ని కూల్చడానికి పోరాడుతున్న మావోయిస్టులకు, రాజ్యాంగబద్ధుడయి నడుచుకున్న శంకరన్‌కు సయోధ్య ఎట్లా? ఎక్కడ?

కేవలం నా అనుభవాల నుంచి చూసే ప్రయత్నం చేస్తాను.

1975 జూన్ నెల అనుకుంటాను, శంకరన్‌గారు సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శిగా ఎస్.సి., ఎస్.టి. విద్యార్థులకు ఇచ్చే ఉపకార వేతనాల విషయంలో తీసుకున్న నిర్ణయం వాళ్లకు పూర్తి సంతృప్తినివ్వలేదు. వాళ్లు సెక్రటేరియట్‌కు వచ్చి ఆయనను ఘెరావ్ చేసారు. ఆయన ప్రమేయం లేకుండానే పోలీసులు వచ్చి లాఠీచార్జ్ చేసి చెదరగొట్టారు. ఈ సంఘటనపై 'చలో సెక్రటేరియట్' పిలుపు ఇచ్చాయి ఆర్.ఎస్.యు., పి.డి.ఎస్.యు. అప్పటికే సదుద్దేశ్యంతో ఆయన తీసుకున్న నిర్ణయాన్ని అపార్థం చేసుకున్నామని ఎస్.సి. విద్యార్థి సంఘాలు భావిస్తున్నాయి. హాస్టల్‌లో ఉండకున్నా, ఇద్దరు ముగ్గురు ఎస్.సి., ఎస్.టి. విద్యార్థులు కలిసి గది తీసుకుని ఉన్నా వాళ్లకు ఉపకార వేతనం వర్తించాలని శంకరన్ కాలంలోనే ప్రభుత్వ ఉత్తర్వులు వచ్చాయి.

ఆర్.ఎస్.యు., పి.డి.ఎస్.యు. విద్యార్థులు చలో సెక్రటేరియట్ అని కదిలి వస్తే తాము అడ్డుకొని ఎదురిస్తామని శంకరన్‌గారు 'వెట్టి చాకిరీ' నుంచి విముక్తం చేసిన వెట్టి విముక్త సంఘాలు ప్రకటించాయి. ఈ సున్నితమైన, ఇబ్బందికరమయిన సమస్యను పరిష్కరించుకొందామని ఆయా సంఘాలను, వరంగల్ నుంచి నన్ను రప్పించారు వరంగల్‌లో కలెక్టర్‌గా, మా కాలేజీ కమిటీ చైర్మన్‌గా నాకు ప్రగాఢ పరిచయమున్న కాకి మాధవరావు గారు.

సమస్య అందరికీ ఆమోదయోగ్యంగా పరిష్కారమైంది. అట్లా

నాకు 1975 జూన్‌లో ఎస్.ఆర్. శంకరన్ గారు పరిచయమయ్యారు. అప్పుడే రెండు రోజులు ఆయనతో ఉండి ఆయన దైనందిన జీవితాన్ని చూసాను. అవివాహితుడు. ఒకే గది ఉన్న ప్రభుత్వ క్వార్టర్‌లో ఉండేవాడు. అప్పటికాయన నెల ఖర్చు మూడు వందల రూపాయలు. హరగోపాల్ రాసినట్లు మిగతా జీతం డబ్బులన్నీ ఎవరో పేదల సహాయం కోసం తన దగ్గర పెట్టారని పంచేవాడు. ఉదయం లేచే వరకు ఆయన గది ముందర ఆయన వెట్టి నుంచి విముక్తం చేసిన మాల, మాదిగ, చాకలి, మంగలి, మొదలైన వృత్తుల వాళ్లు ఎప్పుడూ పదుల సంఖ్యలో ఉండేవాళ్లు - స్నేహితుల వలె.

కొద్దిరోజుల్లోనే ఎమర్జెన్సీ వచ్చింది.

ఎమర్జెన్సీ ఎత్తివేసి నేను జైలు నుంచి విడుదలయ్యాక శంకరన్‌గారు నన్ను చూడాలనుకుంటున్నారని కన్నబిరాన్ గారు చెప్పంపారు. ఒక సాయంత్రం ఆయన ఇంట్లో కలుసుకున్నాం. కలవగానే ఆయన మొదటి మాట 'Perhaps people like me legitimised the emergency' అన్నాడు సెటైర్ వంటి అపరాధ భావంతో. ఎమర్జెన్సీతో పాటు ఇరవై సూత్రాలు ప్రకటించిన ఇందిరాగాంధీ హామీలను భూమిలేని వారికి భూమి, ఇల్లు లేని వారికి ఇల్లు, పశువులు, మేకలు, కోళ్లు ఇచ్చి అమలు చేయడానికి శంకరన్ వంటి అధికారులు శక్తివంచన లేకుండా ప్రయత్నం చేశారు గనుకనే ఆంధ్రప్రదేశ్‌లో ఎస్.సి., ఎస్.టి.లు, బడుగువర్గాలు ఇందిరమ్మను తమ ఆపద్బంధువుగా భావించి '78 శాసనసభ ఎన్నికల్లో రాష్ట్రంలో గెలిపించారు.

ఇందిరా కాంగ్రెస్ పార్టీ నుంచి తొలిసారి ముఖ్యమంత్రి అయిన మర్రి చెన్నారెడ్డికి శంకరన్ 'నక్సలైటు అధికారి'గా సహించలేని వాడయ్యాడు - వెట్టి చాకిరీ రద్దు ఉత్తర్వు మీద సంతకం చేయించినందుకు.

శాసనాలే విముక్తిని సాధించలేవనడానికి ఇవ్వాటికీ వెట్టిచాకిరీ మిగిలి ఉందని కె.ఆర్. వేణుగోపాల్ ఒప్పుకోలే దాఖలా.

ఎమర్జెన్సీలో ఇరవై సూత్రాల వెలుగులో రాడికల్స్ తెలంగాణ గ్రామాల్లో భూసంబంధాల అధ్యయనం చేశారు.

ఖమ్మం జిల్లా ఎల్లవరం, భద్రాచలం, ఇల్లెందు మొదలైన చోట్ల, ముఖ్యంగా ఏజెన్సీ ఏరియాలో ఆదివాసుల భూములు ఆదివాసేతరుల ఆక్రమణలో ఉన్న అంశాలను, గ్రామాల్లో పట్వారీలు తయారు చేసే ఖాస్రా నామా పద్ధతిలో విశ్లేషణాత్మక అధ్యయనంతో నమోదు చేసి 1/70 చట్టం కింద ఆదివాసులకు పట్టాలివ్వాలని ఉద్యమించారు రాడికల్స్. ఖమ్మం జిల్లాకు కొత్తగా కలెక్టర్‌గా వెళ్లిన సుబ్బారావు ఆ అధ్యయనంలోని, ప్రామాణికతను గుర్తించి 1/70 ప్రకారం ఆదివాసులకు పట్టాలిచ్చే ప్రయత్నం మొదలుపెట్టాడు. ఆదివాసేతర అగ్రకుల భూస్వాములు, వడ్డీ వ్యాపారులు చెన్నారెడ్డి దగ్గరికివచ్చి మొరపెట్టుకున్నారు. ముఖ్యమంత్రి ఆగమేఘాల మీద ఖమ్మం వెళ్లి అందరి ముందూ ఆయనను 'నక్సలైట్ కలెక్టర్' అని దూషించి బదిలీ చేశాడు. జగిత్యాల, సిరిసిల్లాలను 'కల్లోలిత ప్రాంతాలు'గా ప్రకటించాడు. శంకరన్ గానీ, ఆయన వలె చిత్తశుద్ధిగా పని చేయాలనుకున్న అధికారులు గానీ హతాశులయ్యారు. అది వేరే కథ.)

శంకరన్‌గారు దీర్ఘకాలికమైన సెలవు తీసుకుని ఆ సాయంత్రమే కావలికిపోతూ నన్ను కాజీపేట స్టేషన్‌లో కలుసుకొమ్మన్నారు. (ఆయనసలేదు. కానీ మాధవరావు గారే చెప్పంపారు.) ఆయన నెల్లూరు కలెక్టర్‌గా పనిచేసినపుడు 'దళితుల దేవుడు'గా పేరు తెచ్చుకొన్నారు. జవహర్ భారతి అభివృద్ధిలో భాగస్వామి అయి విశ్వోదయ శాశ్వత సభ్యుడయ్యాడు. విశ్వోదయ రెక్టార్ దొడ్ల రామచంద్రారెడ్డి, లెక్చరర్లు ఎం.జె. మాణిక్యరావు, మాధవరావు, కె.వి. రమణారెడ్డి ఆయన ప్రాణమిత్రులు. భవిష్యత్ కార్యక్రమం ఏం చేయాలని వాళ్లతో సంప్రదించాలని పోతున్నాడు. కాజీపేట స్టేషన్‌లో కలిసినపుడు ఈ విషయాలు చెప్పి 'ఏం చేయమంటారు?' అన్నాడు. 'మా సంఘాలలోకి రండి' అన్నాను. నవ్వాడు.

ఆ తర్వాత ఆయన త్రిపుర ప్రధాన కార్యదర్శిగా వెళ్లాడని తెలిసింది. త్రిపుర నుంచి తిరిగి వచ్చాక చాలకాలానికి ఎపుడో కలిసినపుడు రెండు విషయాలు చెప్పారు.

ఒకటి : నృపేన్ చక్రవర్తి నిరాడంబరత్వం. సుదీర్ఘ కాలం ముఖ్యమంత్రిగా పనిచేసి ప్రభుత్వ క్వార్టర్ నుంచి వెళ్లిపోయేప్పుడు (ఆయన కూడ అవివాహితుడే) కేవలం రెండు సూటుకేసులు (అవి కూడా పుస్తకాలే) తీసుకొని పోయాడని. పదవీ విరమణ చేసిననాడు తనను భోజనానికి పిలిచి స్వయంగా వండి పెట్టాడని.

(శంకరన్‌గారిని పంజగుట్ట అపార్ట్‌మెంట్‌లో ఎపుడు కలిసినా 'కూర్చోండి. మంచి కాఫీ చేసి ఇస్తాను' అని ఫిల్టర్ కాఫీ చేసి ఇచ్చేవారు.)

రెండవది : త్రిపుర ప్రధాన కార్యదర్శిగా వారాంతంలో గానీ నెలకోసారి గానీ అడవికి వెళ్లి ఆదివాసులతో దినమూ రాత్రీ గడుపుతుండే వాడట. అటువంటి సందర్భాల్లో 'మీకేం కావాలి?' అని అడిగితే 'ఏమీ వద్దు మీరు ప్రధాన కార్యదర్శిగా అడవిలోకి రెవెన్యూ, పోలీసు, అటవీ శాఖాధికారులను రాకుండా చేస్తే చాలు' అనే వాళ్లని చెప్పాడు.

1987లో శంకరన్‌తో పాటు ఆరుగురు ఐ.ఎ.ఎస్. అధికారులను తూర్పు గోదావరి జిల్లాలో పీపుల్స్ వార్ దళం కిడ్నాప్ చేసినపుడు నేను జైల్లో ఉన్నాను. అసహాయమైన ఆందోళన చెందాను. 'ఉదయం'కు ఆ తర్వాత ఇచ్చిన ఇంటర్వ్యూలో కొండపల్లి సీతారామయ్య 'అవకాశం వస్తే రాజీవ్ గాంధీనయినా కిడ్నాప్ చేస్తాం' అని సమర్థించుకుంటూనే 'శంకరన్ గారికి ఏమైనా హాని తలపెట్టారేమోనని ఆందోళన చెందాను. కొత్త పిల్లలుగదా, అధికారులందరినీ ఒకేరకంగా చూస్తారేమోనని' అన్నారు.

జైల్లో ఉన్న కామ్రేడ్ వడ్కాపురం చంద్రమౌళిని, మరికొందరిని విడిపించుకోవడానికి ఈ కిడ్నాప్ చేసారు. ప్రభుత్వం తరపున యుగంధర్ వెళ్లి కన్నబిరాన్ గారిని మధ్యవర్తిత్వం వహించమన్నారు. ఈ ప్రయత్నాలు జరుగుతుండగానే రాష్ట్రంలో టి.డి.పి. ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టడానికి కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ హోంమంత్రి బూటాసింగ్ గోదావరి జిల్లా అడవులను బాంబింగ్ చేస్తానని ప్రకటించాడు. కిడ్నాప్ చేసినప్పటికీ వెంటనే మహిళా ఐ.ఎ.ఎస్. అధికారులను వదిలిపెట్టి వాళ్లతో తమ డిమాండ్లు బయటికి పంపించిన దళం అప్పటిదాకా అధికారులందరితో ఎంతో మర్యాదగా వ్యవహరిస్తున్నది. శంకరన్‌గారితో అటవీ భూముల పంపకాలలో 1/70 అమలు గురించి మాట్లాడినప్పుడు - నాకన్న ఈ పిల్లలకే ఈ

సమస్యలు క్షుణ్ణంగా తెలుసునని నా కర్థమయింది. వాళ్లు నన్ను 18వ బ్రూమైర్ - ఫ్రెంచ్ విప్లవం పాఠం చెప్పమని కూడా అడిగారు' అని చెప్పాడు తర్వాత శత్రుఘ్న ఇంట్లో కలసినపుడు. కానీ ఆ బాంబింగు ప్రకటన వినగానే 'ఇంక అందరం కలిసే చద్దాం' అని వీళ్లను చెట్లకు కట్టేసారట. అపుడేమనిపించింది అని అడిగితే 'నా గురించి ఇ.పి.డబ్ల్యు.లో బాలగోపాల్ ఏమని రాస్తాడో' నని అనుకున్నానన్నారు. బాలగోపాల్‌కు అప్పటికింకా శంకరన్ వలె రాజ్యాంగం మీద విశ్వాసం కుదరలేదు.

తనను కిడ్నాప్ చేసిన, ఆ కిడ్నాప్ వల్ల విడుదలయిన ఒక్కొక్క కామ్రేడ్ ఎన్‌కౌంటరవుతుంటే తనకేదో ఆత్మీయ గాయమయినట్లు శంకరన్‌గారు జ్ఞాపకాలతో బాధపడుతుండేవారు.

2

1989 నుంచి నేను హైదరాబాద్‌లో ఉంటూ ఎక్కువగానే శంకరన్‌గారిని కలుస్తూ ఉన్నప్పటికీ, అటువంటి సందర్భాలన్నీ విప్లవోద్యమంలో, ప్రజాసంఘాల్లో పని చేస్తున్న వారికి సమస్యలేర్పడినపుడో, లేదా, మా సాహిత్యం ఇవ్వడానికో అయినప్పటికీ చెప్పవలసిన సందర్భాలు ముఖ్యంగా రెండు. ఒకటి - గద్దర్ మీద హత్యా ప్రయత్నం.

1997 ఏప్రిల్ 6న గద్దర్ ఇంటి వద్ద పోలీసుల ప్రోత్సాహం, ప్రమేయంతో ఆయన మీద దాడి, కాల్పులు జరిగి మొదట గాంధీ ఆసుపత్రికి, ఆ తర్వాత నిమ్స్‌కు తరలించిన దగ్గర్నించీ చికిత్స జరిగి డిస్చార్జ్ చేసేంతవరకు కంటికి రెప్పలా గద్దర్‌ను చూసుకున్న వారిలో గద్దర్ సహచరి విమల తర్వాత చెప్పాల్సింది శంకరన్‌నే.

ఆయన అప్పటికే పదవీ విరమణ చేసి ఉన్నాడు. పైగా ఆయన ఉండే పంజగుట్ట అపార్ట్‌మెంట్స్‌కు నిమ్స్ ఎక్కువ దూరం కాదు. ఆయన దినమూ రాత్రీ ఎక్కువ కాలం అక్కడే కనిపెట్టుకొని ఉన్నాడు.

ఆయన శస్త్ర చికిత్స మొదలు వైద్య విషయంలో తీసుకోవాల్సిన నిర్ణయాలన్నీ కూడ నిమ్స్ శంకరన్, రాజగోపాలన్ గార్ల పైననే ఉంచింది. శంకరన్‌గారి సేవా భావాన్ని నేను ప్రత్యక్షంగా చూసిన సందర్భం అది.

రెండవది : చర్చలు. ప్రభుత్వంతో నక్సలైట్ల చర్చలు. మా ఇద్దరి మధ్యన సంప్రదింపులు, రాజకీయ విశ్వాసాల చర్చలు కూడ ఎక్కువగా జరిగి, ఒక్కొక్కసారి సుదీర్ఘమైన ఆవేశపూరితమయిన సంభాషణ, సంవాదం జరిగిన సందర్భం కూడ.

1997లో కన్సర్న్‌డ్ సిటిజెన్స్ కమిటీ (తెలుగులో వలె అది ఆయన పౌరస్పందన వేదిక అనుకోలేదు. కన్సర్న్ - పట్టింపు ఉన్న పౌరుల కమిటీ అని వినయంగా అనుకున్నాడు.) ఏర్పడి ప్రభుత్వానికి నక్సలైట్లకు చర్చలు జరగాలని ప్రతిపాదన ప్రారంభించిన దగ్గర్నించీ ప్రకటనల్లో వాడుతున్న భాష గురించి, ప్రాథమ్యాల గురించి మాకు చర్చ జరుగుతూనే ఉండేది. ఈ చర్చ నేను ఎక్కువగా హరగోపాల్, శంకరన్‌ల తోనే చేస్తుండే వాణ్ని. కలలోనైనా 'రాజ్యం హింస' అనే మాట ముందు ఉండాలన్నది నా వాదన. ప్రభుత్వాలకీ, నక్సలైట్లకూ ఇద్దరికీ ప్రజలే కదా ప్రకటిత లక్ష్యం అన్న సమదృష్టి పట్ల నా అభ్యంతరం.

అయినా సరే తమ ఆకాంక్షలు, ప్రతిపాదనలు నా ద్వారా విప్లవోద్యమ నాయకత్వానికి చేరాలనుకున్నప్పుడు శంకరన్‌గారు ఓపికగా వినేవారు.

ఏమైతేనేం 1999 నాటికే చంద్రబాబు నాయుడు ప్రభుత్వాన్ని, పీపుల్స్‌వార్‌ను కూడ చర్చలకు ఒప్పించారు. తన సహచరులతో పాటు శంకరన్‌గారు పీపుల్స్‌వార్ అగ్రనాయకులు శ్యాం, మహేష్‌లను అడవిలో కలిసి రెండు రోజులు గడిపి సాకల్యంగా చర్చించారు. మళ్లా చంద్రబాబునాయుడును కలిసారు.

అయినా 99 డిసెంబర్ 1న శ్యాం, మహేష్‌లతో పాటు ఉత్తర తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి మురళిని కూడా బెంగళూరులో అరెస్టు చేసినపుడు చర్చలు జరపడానికి కాదు, కొయ్యూరు అడవులకు తెచ్చి పశులకాపరి లక్ష్మి రాజ్యంతో కలిపి 'ఎన్‌కౌంటర్' చేయడానికి చంద్రబాబు ప్రభుత్వం కేంద్రంలో అద్వానీని సంప్రదించి నిర్ణయం అమలు చేసింది.

పీపుల్స్‌వార్ రాష్ట్రమంత్రి మాధవరెడ్డిని చంపి ప్రతీకారం తీర్చుకున్నది.

అయినా సిసిసి చర్చల ప్రతిపాదన ప్రయత్నం మానలేదు.

2002 జనవరిలో హైదరాబాద్‌లో ఏ.ఐ.ఎల్.ఆర్.సి. మహాసభలు జరిగిన సందర్భంగా జనవరి 16న ఇటు ప్రభుత్వానికీ, అటు పీపుల్స్‌వార్‌కూ ఆరేసి సూచనలు చేస్తూ శంకరన్ కన్వీనర్‌గా సిసిసి చర్చల ప్రతిపాదన చేసింది. 21న పీపుల్స్‌వార్ కేంద్ర కమిటీ తరఫున ప్రకాశ్, రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఆ ప్రతిపాదనను అంగీకరిస్తూ ఏకపక్షంగానే ఆరు నెలల పాటు కాల్పుల విరమణ ప్రకటన చేసారు. అప్పటికి పార్టీ మీద నిషేధం, తలల మీద వెలలు, ఎన్‌కౌంటర్‌లు, కోవర్టుల హత్యలు, రాజ్యహింస నిర్బంధం తీవ్రంగా ఉన్నవి. పీపుల్స్‌వార్ ఏకపక్షంగా మార్చ్ 11 వరకు కాల్పుల విరమణను చిత్తశుద్ధిగా పాటించింది. మార్చ్ 11న వరంగల్ జిల్లా గహనాటవి తుపాకుల గూడెంలో పోలీసులు ఎన్‌కౌంటర్ పేరుతో 11 మంది పీపుల్స్‌వార్ దళ సభ్యులను చంపేశారు.

పార్టీ కాల్పుల విరమణ నిర్ణయాన్ని రద్దు చేసుకొని ప్రతిఘటన దాడులు చేస్తామని ప్రకటించింది.

వాస్తవానికి 2000 ఫిబ్రవరి 19న నల్లగొండలో ఆజం అలీని మాజీ నక్సలైట్లు హత్య చేసిన దగ్గరి నుంచీ నేను హైదరాబాద్‌లో ఉన్న సందర్భాలు చాలా తక్కువ.

2002 ఏ.ఐ.ఎల్.ఆర్.సి. మహాసభల తర్వాత 2002 ఏప్రిల్ 9న చెన్నైలో ఏ.ఐ.ఎల్.ఆర్.సి. కార్యవర్గ సమావేశంలో పాల్గొని గుజరాత్ మారణకాండపై నిజనిరూపణ కమిటీలో అహ్మదాబాద్ వెళ్తూ హైదరాబాద్‌కు వచ్చాను. శంకరన్, పొత్తూరి, హరగోపాల్ గార్లు మళ్లా చర్చల ప్రతిపాదనతో వచ్చారు.

తెలంగాణ నుంచి, బడుగువర్గాల నుంచి వచ్చిన హోంమంత్రి, డిజిపిలు ఉన్న కాలంలోనే చర్చలు సాధ్యం కాకపోతే ఇంకెప్పుడూ చర్చలు సాధ్యం కావని కూడా అన్నారు. కాని పోలీసుల్లో ఉన్నతాధికారులు, కొందరు శాసనసభ్యులు, ల్యాండ్ మాఫియాలు మాజీ నక్సలైట్లను ముందుంచి చేస్తున్న దోపిడీ గురించి వివరించి ఇవి ఈ ఇద్దరికి తెలియకుండా జరుగుతున్నాయా అని అడిగాను.

ఏమైనా మళ్లా మే 31న నన్ను, గద్దర్‌ను చర్చలకు విధి విధానాలు నిర్ణయించే ప్రతినిధులుగా ప్రకటిస్తూ జూన్ 1 నుంచి ఆరు నెలల పాటు ఏకపక్ష కాల్పుల విరమణను పార్టీ ప్రకటించింది.

జూన్ 5, 9, 20 తేదీల్లో చర్చలకు విధి విధానాలు నిర్ణయించడానికి మేమిద్దరం ప్రభుత్వ ప్రతినిధులైన కె.విజయరామారావు, తమ్మినేని సీతారాంలతో విజయరామారావు గారి చేంబర్‌లో కలిసేవాళ్లం. టి.డి.పి. ప్రభుత్వం ఈసారి కూడ కాల్పుల విరమణ ప్రకటించలేదు. నిషేధం ఎత్తివేయలేదు. ఉద్దేశపూర్వకంగానే పోలీసులు జూన్ 5, 9, 20 తేదీల్లో 'ఎన్‌కౌంటర్లు' చేసేవాళ్లు. మేం నిరసన తెలుపుతూ నినాదాలిస్తూ ప్లెకార్డులు పెట్టుకొని సచివాలయానికి చర్చలకు పోయేవాళ్లం.

జూన్ 1న ప్రెస్ కాన్ఫరెన్స్ మొదలు ఈ ప్రతి సందర్భంలోనూ మేం కనీసం శంకరన్‌గారినైనా మన చర్చలకు మధ్యవర్తిగా, సాక్షిగా నియమించాలని కోరాం. ఆయన మన చర్చలు, నిర్ణయాలు నమోదు చేయాలని కోరాం. కాని ప్రభుత్వం అంగీకరించలేదు.

జూన్ 20న విధి విధానాలపై అంగీకారం కుదిరి, జూలై 20న పార్టీ నాయకులే చర్చలకు వస్తామని ప్రకటించారు. వచ్చే వాళ్లెవరో ఇద్దరు ముగ్గురు వారి తలలపై వెలలు రద్దు చేసే విషయం మాత్రం ప్రభుత్వం పరిశీలిస్తానన్నది.

జూన్ 5న మొదటిసారి కూర్చున్నపుడు రామకృష్ణ ప్రతిపాదనలు రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల వలె ఉన్నాయని ప్రశంసించిన విజయరామారావు గారు చంద్రబాబు జూన్ 9న అద్వానీని కలిసి కలాం అధ్యక్ష అభ్యర్థిత్వాన్ని అంగీకరించి, గుజరాత్ మారణకాండ గురించి మాట్లాడనని అంగీకరించి వచ్చిన తర్వాత ఇంక తుపాకులు వదిలి పెడితేనే చర్చలు అని వల్లించడం మొదలుపెట్టారు.

జూన్ 30న వరంగల్ ములుగు అడవుల్లో పీపుల్స్‌వార్ దళంపై పోలీసు కాల్పులు, ఎన్‌కౌంటర్ హత్యలు, జూలై 2న కరీంనగర్ అడవుల్లో ఉత్తర తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు రజిత ఎన్‌కౌంటర్‌తో పార్టీ జూన్ 19న మళ్లీ కాల్పుల విరమణ వెనక్కు తీసుకొని ప్రతిఘటనా దాడులకు పూనుకొంటానని ప్రకటించింది.

అట్లా టి.డి.పి. ప్రభుత్వంతో పీపుల్స్‌వార్ చర్చల ప్రయత్నాలు విషాదంగానూ, ప్రహసనంగానూ ముగిసాయి.

కాని 1997 నుంచి శంకరన్‌గారు కన్వీనర్‌గా సిసిసి పట్టువిడవకుండా శాంతి - చర్చల కోసం చేసిన ప్రయత్నాలు, చంద్రబాబు నాయుడు విధ్వంసన పరిపాలన, అలిపిరి సంఘటనలో దాని వ్యక్తీకరణ ముందస్తు ఎన్నికలకు దారితీసి చంద్రబాబు భాషలోనే 2004 ఎన్నికలు ఆయన పాలనపై రెఫరెండమ్ అయినాయి. అది మూడు అంశాలపై తీర్పు. 1. ప్రపంచబ్యాంక్ అభివృద్ధి నమూనా (చంద్రబాబు కొనసాగిస్తానన్నపుడు మిగతా అన్ని పార్టీలు వ్యతిరేకిస్తున్నామన్నాయి) 2. నక్సలైట్లతో బేషరతు చర్చలు (జరపాలని అన్ని పార్టీలనగా చంద్రబాబు ఒక్కడే అది కేవలం శాంతి భద్రతల సమస్యగానే చూస్తానన్నాడు) 3. ప్రత్యేక తెలంగాణ (కోరుతున్న తెలంగాణ రాష్ట్ర సమితితో కాంగ్రెస్ పొత్తు పెట్టుకున్నది గానీ ఆ విషయంలో స్పష్టమైన వాగ్దానం ఏమీ చేయలేదు. అప్పటికి సిపిఐ, సిపిఎం, టిడిపితో పాటు వ్యతిరేకమే. బిజెపి ఒక్కటే స్పష్టంగా బలపరిచింది.)

కనుక ఎన్నికలయిపోగానే హోంమంత్రి అయిన జానారెడ్డి గాలింపు చర్యలు, ఎన్‌కౌంటర్లు నిలిపివేసి చర్చలకు సంసిద్ధత తెలిపాడు.

జూన్ 13న పీపుల్స్‌వార్ మూడు నెలల కాల్పుల విరమణకు సిద్ధమని ప్రకటిస్తూ ప్రభుత్వం కూడ తన సంసిద్ధత తెలపాలన్నది. పత్రికల్లో వచ్చిన ఆ ప్రకటన తీసుకొని ఎనిమిది మంది రచయితలం హోంమంత్రిని, ముఖ్యమంత్రిని కలిసాం. ఆ సాయంత్రమే ప్రభుత్వం కూడ మూడు నెలల కొరకు కాల్పుల విరమణ ప్రకటించింది. ('శాంతికోసం' డిసెంబర్ 2006లో శాంతి చర్చల గురించి సిసిసి రాసినట్లుగా మొదట ప్రభుత్వం కాదు, పార్టీయే కాల్పుల విరమణ ప్రకటన చేసింది.) ఒక మధ్యవర్తుల కమిటీ ఉండాలని, పర్యవేక్షక కమిటీ ఉండాలని పార్టీ పేర్లు కూడా సూచించింది.

ఎస్.ఆర్. శంకరన్ గారిని ప్రభుత్వం అధికారికంగా మధ్యవర్తిగా వ్యవహరించమని కోరింది. పీపుల్స్‌వార్ కూడ ఎస్.ఆర్. శంకరన్, కన్నబిరాన్, పొత్తూరి, హరగోపాల్‌ల పేర్లను మధ్యవర్తులుగా సూచించింది.

పీపుల్స్‌వార్ సూచించిన నాలుగు పేర్లు కూడ బ్రాహ్మణులవేనని బయట మేధావులు, ప్రజాస్వామ్యవాదులు ప్రెస్ కాన్ఫరెన్స్‌లు పెట్టి కూడ అసమ్మతి తెలిపారు. అప్పటిదాకా శంకరన్‌గారు దళితుడు కాదని పార్టీకి తెలియక పోవడమే శంకరన్‌గారికున్న దళిత ఇమేజ్‌కు ఉచితమయిన కాంప్లిమెంట్.

చర్చలలో భూసంస్కరణలు, అజెండాలో ప్రధానాంశంగా చర్చించబడాలి. ఇదే శంకరన్‌గారి ఆకాంక్ష. ప్రజల, విప్లవ పార్టీల ఆకాంక్ష కూడా అదే.

విప్లవ పార్టీల నాయకత్వంలో ప్రజలు భూములను స్వాధీనం చేసుకోవడం, నిర్బంధం వల్ల, పోలీసు క్యాంపుల వల్ల అవి సాగు చేయకుండా బీడు పడి ఉండడం సిసిసి కి, ముఖ్యంగా శంకరన్‌గారికి చాలా ఆందోళన కలిగించింది. అందువల్ల జాతీయోత్పత్తి దెబ్బతింటున్నదని భావించారు.

జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థలో ఈ విషయంలో చర్చలు కూడా నిర్వహించి, అటువంటి భూములు ఎస్.సి. కార్పొరేషన్ కొని అయినా భూమిలేని దళితులకు పట్టా చేయించాలని లేదా స్వాధీనం చేసుకున్న వాళ్లు భూమిలేని దళితులయితే, ఆ భూములు ప్రభుత్వానివయితే వాళ్ల పేర క్రమబద్ధీకరణ చేయాలని కూడ ప్రతిపాదించారు. చంద్రబాబుతో చర్చల కాలంలోనే ఆయన సూచనపై అటువంటి భూమి ఎంత ఉన్నదో కూడ శంకరన్‌గారు ఒక ఉజ్జాయింపు అధ్యయనం చేసారు. 2003 కాంగ్రెస్ ప్రభుత్వంతో చర్చలకు ముందు 'వార్త'లో భూ సంస్కరణల గురించి వ్యాసాలు కూడ రాసారు. శంకరన్ గారి దృష్టిలో 2004 అక్టోబర్ చర్చల కాలానికి ఇరవై ఇరవై అయిదు లక్షల ఎకరాల మిగులు భూమి ఉన్నది. (ఆదివాసుల భూములను ఆదివాసేతరులు చేసిన దురాక్రమణ గురించి కె.ఆర్. వేణుగోపాల్ గారు రాసారు.)

భూ సంస్కరణలు చిత్తశుద్ధితో చేస్తే నక్సలైటు సమస్య

ఉండదని పశ్చిమ బెంగాల్‌లో ఆపరేషన్ బర్గా (కౌలుదార్లకు భూమి మీద హక్కు ఇచ్చే చట్టం) వల్ల నక్సల్బరీ పోరాటం సెట్ బ్యాక్ అయిన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో వలె మళ్లా నక్సలైటు ఉద్యమం తలఎత్త లేదని ఆయన అభిప్రాయం. ఆయనను శాంతి చర్చల ప్రయత్నానికి పురికొల్పిన ప్రధాన అంశం అదే.

విప్లవ పార్టీలకు భూసంస్కరణలు ఒక ఆర్థిక కార్యక్రమం మాత్రమే. నూతన ప్రజాస్వామిక విప్లవం సమగ్రమైన రాజకీయ, సామాజిక, సాంస్కృతిక కార్యక్రమం అయితే ప్రభుత్వంతో చర్చలకు ఆర్థిక కార్యక్రమం మాత్రమే ప్రాతిపదిక కాగలుగుతుంది కనుక, దానితో పాటు రూల్ ఆఫ్ లా ను ఆచరిస్తే చాలుననేదే చర్చల అజెండా అయింది. విస్తృతంగా చర్చలు ఈ రెండు అంశాల మీదనే జరిగాయి.

చర్చలకు శంకరన్‌గారే ఉభయుల ఏకగ్రీవ అంగీకారంతో అధ్యక్షత వహించారు. కె.ఆర్. వేణుగోపాల్ అధ్యక్షతన శంకరన్ మొదలయిన ముప్పై మందితో భూమి కమిషన్ వేయాలని రెండు విప్లవ పార్టీలు సూచించాయి. ఎంత మిగులు భూమి ఉంది, విప్లవ పార్టీల నాయకత్వంలో స్వాధీనం చేసుకున్న భూమి ఎంత న్యాయబద్ధమయింది, ఎట్లా పంచాలి (ప్రతి దళిత కుటుంబానికి ఇంటి మహిళ పేరు మీద మూడు ఎకరాల చొప్పున పట్టా చేయించాలన్నది ప్రతిపాదన) అనే అన్ని విషయాలు భూమి కమిషన్‌దే ఆఖరి మాటగా అంగీకరిస్తామని కూడా చెప్పాయి.

ఈ వివరణ ఎందుకంటే విప్లవ పార్టీలు శంకరన్‌గారి మీద, కమిటీలోని సభ్యుల మీద ఉంచిన విశ్వాసం అటువంటిది. శంకరన్‌గారి విశ్వసనీయత అటువంటిది.

అయితే ఈ పని - భూసంస్కరణలు గానీ, అవి అమలు చేసే శాంతి వాతావరణం కల్పించే రూల్ ఆఫ్ లా గానీ ఈ ప్రభుత్వాలు అమలు చేయవు అనే అవగాహన కూడా అంతే స్పష్టమైంది.

భూసంస్కరణలు అమలు చేయక పోవడమే కాదు, ప్రపంచ బ్యాంక్ అభివృద్ధి నమూనా కూడా 2004 అక్టోబర్ మంత్రివర్గ సమావేశంలోనే ఆమోదించి తుపాకులు వదిలితేనే రెండో విడత చర్చలు అని వై.ఎస్.ఆర్. ప్రభుత్వం అడ్డగాలేసింది.

భూసంస్కరణల విషయంలో ఎస్.సి. కమిషన్ భూములు కానీ, దళితులకు పట్టా చేయించడం విషయం గానీ, తమ పట్టా చూపుతున్న భూస్వాములకు నష్టపరిహారం ఇవ్వడం గానీ పీపుల్స్‌వార్ ఆమోదించలేదు. పోరాడి సాధించుకున్న భూములు - ఇస్తే తీసుకునేవి కావనేదే ఆ పార్టీ అవగాహన. ప్రభుత్వం చేయవలసిందల్లా ఆ హక్కును గుర్తించడమే.

2004 అక్టోబర్ 20న చర్చలు ముగిసిన తర్వాత చాలసార్లు నేను శంకరన్ గారిని కలిసి సుదీర్ఘమైన చర్చలు చేసాను.

ఆయన దృష్టిలో కాల్పుల విరమణ ఒప్పందం అంటే - గ్రామాల్లో తుపాకులు పట్టుకొని తిరగకూడదనే కాదు, పెట్టిన మందుపాతరలన్నీ తొలగించాలని కూడ. మొదటి విడత చర్చలు అయిపోయి కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగుతుండగానే పోలీసులు పనిగట్టుకొని మందుపాతరలు (నిజమైనవీ, అబద్ధమైనవీ) తవ్వితీయడం మొదలుపెట్టారు. కాల్పుల విరమణ ఒప్పందమంటే పార్టీయే, తానుగా ఆ మందుపాతరలు తవ్వి తీసేసి ఉండాల్సిందని ఆయన అభిప్రాయం. మందుపాతరలు పేల్చకపోవడం కదా కాల్పుల విరమణ అంటే అన్నది నా వాదన. ఎంత చర్చించీ మేం ఒకర్నొకరం ఒప్పించలేకపోయాం.

అట్లాగే కాల్పుల విరమణ కాలంలో పార్టీ ఆయుధ సేకరణ చేస్తున్నదని కూడ ఆయన అనుమానం, అభ్యంతరం.

ఆయుధాలు వాడకపోవడమే కదా కాల్పుల విరమణ కాలంలో ఒప్పందం అన్నది నా వాదన.

క్యాడర్ రిక్రూట్‌మెంట్ గురించి కానీ, పోలీసు భాషలోని ఎక్స్టార్షన్ (బలవంతపు వసూళ్లు) గురించి కానీ ఆయన పెద్దగా మాట్లాడే వాడు కాదు. మొదటిది తప్పు కాదనే భావించేవాడు.

అయితే ఈ కాలమంతా కోవర్టు ఆపరేషన్ ప్రయత్నాల గురించి, పర్యవేక్షక కమిటీ కూడ ఉన్నందునేమో ఆయన ఎక్కువగా మాట్లాడలేదు.

రెండవ విడత చర్చలకు పిలవకపోవడం, భూ సంస్కరణలు చేపట్టకపోవడం, 2005 జనవరి నుంచి మళ్లీ ఎన్‌కౌంటర్లు ప్రారంభించడంతో శంకరన్‌గారు చాల నిరాశకు గురయ్యారు.

విప్లవ పార్టీలు కూడా జనవరి 16, 2005న కాల్పుల విరమణ ఒప్పందాన్ని వెనక్కు తీసుకొని ప్రతిఘటనా దాడులకు పూనుకుంటామన్నాయి.

ప్రతిఘటనా దాడులను కూడా శంకరన్ గారు హర్షించలేదు.

భూసంస్కరణలు అమలు చేయకపోవడానికీ, సామ్రాజ్యవాద ప్రపంచీకరణనే అభివృద్ధి నమూనాగా ఎంచుకోవడానికీ - రాజ్య హింస అమలవుతుందని, దానికి ప్రతిఘటన తప్పదని శంకరన్ గారికి తెలియదని కాదు.

రాజ్యాంగం ప్రకారం భూసంస్కరణలు సాధ్యమే. అదే శాంతికి మూలం కనుక, ప్రభుత్వం అది చేస్తుందని ఆశించాడు గనుక అందుకే పబ్లిక్ సర్వెంట్ గానూ, శాంతి దూతగానూ ప్రయత్నించాడు గనుక అది జరగనపుడు తీవ్రమైన నిరాశకు గురయ్యాడు. ఈ ప్రభుత్వాలు చేయలేవని అనుకోలేక పోయాడు.

తానెంతో ఉత్తమమయిన నమూనాగా భావించిన బర్గా ఆపరేషన్ సామ్రాజ్యవాద ప్రపంచీకరణలో భాగంగా నందిగ్రామ్, సింగూర్, లాల్‌గఢ్‌లలో సామ్రాజ్యవాద భూస్వామ్యం ముందు వెలవెలబోతే ఆయన నైరాశ్యం పెరిగింది.

ఛత్తీస్‌ఘడ్‌లో మావోయిస్టు ఉద్యమం చలన యుద్ధ స్థాయికి వెళ్లి ప్రధాని దృష్టిలో దేశ భద్రతకు అత్యంత ప్రమాదకారిగా మారిన తర్వాత ఈ ఉద్యమాన్ని ఎదుర్కోవడానికి ఏం చేయాలో ప్రణాళికా సంఘం ఒక ఉప సంఘాన్ని వేసింది. ఆ ఉపసంఘం నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో భూసంస్కరణలు చేయాలని సూచించింది. ఇంకా ఎన్నో సంస్కరణలు సూచించింది. అందులో శంకరన్, బాలగోపాల్ మొదలయిన వారు సభ్యులు.

ఆదివాసులకు అడవి మీద హక్కు గురించి వచ్చిన చట్టాల్లో ఇప్పటికి అన్నిటి కన్న ఉత్తమమైనదిగా భావించే పెసా చట్టాన్ని శంకరన్ గారే రచించారంటారు.

సాల్వాజుడుం గురించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులు, ఆదివాసులకు జల్ జంగల్ జమీన్‌పై ఉండాల్సిన హక్కు గురించి

శంకరన్ వంటి వాళ్లు చేసిన అధ్యయనాలు, సూచనలు, కృషి అంతా ఒకవైపు దుమ్ము కొట్టుకునో, శ్మశానభస్మంలో పోసిన పన్నీరుగానో మిగిలిపోతే మరొక వైపు ప్రభుత్వాలు - కేంద్రం కావచ్చు, రాష్ట్రాలు కావచ్చు, కాషాయం నుంచి ఎరుపు దాకా, మూడేడు రంగుల ఏ ఎన్నికల పార్టీలయినా కావచ్చు గ్రీన్‌హంట్ ఆపరేషన్ పేరుతో తమ ప్రజల మీద తామే యుద్ధం చేస్తున్నాయి. ఎందుకు? బహుళజాతి కంపెనీలకు, బడా కంపెనీలకు వేలాది, లక్షలాది ఎకరాల భూమి కట్టబెట్టడానికి.

కొమురం భీం నాయకత్వంలో ఆదిలాబాద్‌లో ఆదివాసీ విప్లవం తర్వాత హేమండార్ఫ్ చేసిన సూచనలకు నైజాం తల ఒగ్గినంతగా కూడ ఈ నాటి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి పెట్టలేదంటేనే శంకరన్ వంటి వారి కృషి ఎంత అడవి గాచిన వెన్నెల అయిపోయిందోనని ఆవేదన కలుగుతుంది.

రాజ్యాంగ స్ఫూర్తితో ఆయన వెట్టిచాకిరీ రద్దు చేయించ లేకపోయాడు. (తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం విద్రోహానికి గురికాక ముందు అది సాధించగలిగింది.)

గోదాములలో మగ్గుతున్న, పందికొక్కులు తినిపోతున్న, కుళ్లిపోతున్న ధాన్య రాశులను ఆకలి గొన్నవారికి సుప్రీంకోర్టు ఆకాంక్షతో ఆదేశాలతో కూడ ఇప్పించలేకపోయాడు.

తానుగా అధికారిగా వెట్టి నుంచి ఎందరినో విముక్తం చేసాడు. ఎన్నో భూములు పంచాడు. ఇళ్ల పట్టాలు ఇచ్చాడు. వేంపెంట బాధితులకు ఇళ్లు ఇప్పించాడు. ఇంకెందరికో ఆశ్రయం కల్పించాడు.

వేలాదిమందికి గుప్తదానం చేసాడు. ఆకలి తీర్చాడు. తానవి పీడితుల, పేదల హక్కు గానే భావించి చేసాడు. మదర్ థెరెసా వలె కారుణ్య దృష్టితోనో, మానవతా దృష్టితోనో చేయలేదు. మార్క్సిజం చదువుకున్న ప్రజాస్వామ్య వాదిగానే చేసాడు. కాని ప్రభుత్వాలకు వర్గ ప్రయోజనం ఉంటుందని, అవి పీడిత ప్రజల హక్కుల గురించి తన వలె నిస్వార్థంగా ఆలోచించి ఆచరించజాలవని ఊహించలేకపోయాడు. బాబా సాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగ రచన ముగించిన తర్వాత ఈ రాజ్యాంగం రాజకీయ స్వాతంత్ర్యంతో పాటు ఆర్థిక, సామాజిక స్వాతంత్ర్యాన్ని ఇవ్వలేకపోతే ఈ రాజ్యాంగాన్ని ధ్వంసం చేయడంలో నేను ముందుంటానన్నాడు. ఆ తర్వాత రాజ్యాంగం మీద ప్రమాణం చేసే న్యాయశాఖామంత్రి అయ్యాడు. మౌలిక విషయాలు అలా ఉంచి శారద చట్టం విషయంలోనే తానాశించిన న్యాయాన్ని సాధించలేక పదవికి రాజీనామా చేసాడు.

రాజ్యాంగ రచనలో జాతీయోద్యమ ఆకాంక్షలు ప్రతిఫలించి ఉపోద్ఘాతం, ఆదేశిక సూత్రాలు, ప్రాథమిక హక్కులు పొందుపరిచి ఉండవచ్చు గానీ ఆదేశిక సూత్రాలే ప్రాథమిక హక్కులు కాలేకపోయినవి. లౌకిక రాజ్యాంగం రాముణ్ని, కృష్ణుణ్ని సెక్యులర్ దేవుళ్లుగా గుర్తించిన ఫలితం పర్యవసానాన్ని అయోధ్య హిందూత్వ తీర్పులో చూస్తున్నాం. ఆస్తి హక్కు కొన్నాళ్లు ప్రాథమిక హక్కుగా కొనసాగి భూస్వాముల ప్రయోజనాల్ని కాపాడితే, ఇపుడు ప్రభుత్వం ఒక ఏజెంట్‌గా భూముల్ని సెజ్‌లకు, కంపెనీలకు సేకరించే పనికి పూనుకున్నది. ప్రజాస్వామ్యం వారసత్వ పాలనకు ఆమోదంగా మారింది. ప్రజలు తమకు తాము ఇచ్చుకున్న రాజ్యాంగం సాక్షిగా ప్రజల సార్వభౌమత్వాన్ని సామ్రాజ్యవాదానికి దళారీలు దాసోహం చేస్తున్నారు.

రాడికల్ ఉద్యమానికి రాజ్యాంగ ప్రయోగంలోని ప్రయత్నాలను, వైఫల్యాలను ఈ సమాజానికి కొండను అద్దంలో చూపినట్లు చూపడానికి శంకరన్‌గారిని మించిన ఆదర్శం ఎవరుంటారు!

శంకరన్ గారు సరిగ్గా బాలగోపాల్ మరణించిన ఒక సంవత్సరానికి మరణించారు. ఆయన గురించి బాలగోపాల్ ఏం రాసి ఉండేవాడో. ఆజాద్ ఏం రాసి ఉండేవాడో.

2009 ఆగస్ట్‌లో ఢిల్లీలో మావోయిస్టులతో ప్రభుత్వం చర్చలు జరపాలనే ఒక శాంతి ప్రయత్నం మొదలయినపుడు అందులో బాలగోపాల్ పాల్గొన్నాడు. అప్పటి నుంచీ ఢిల్లీలోను, దేశవ్యాప్తంగాను గ్రీన్‌హంట్ ఆపరేషన్ నిలిపి వేయాలని, మావోయిస్టులతో చర్చలు జరపాలని ప్రజాస్వామ్య వాదులు, శాంతి కాముకులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటువంటి ప్రయత్నాలు ఒక పద్ధతిగా, స్థిరంగా, వీలయినంత నిరపేక్షంగా, నిష్పక్షపాతంగా, నిర్దిష్టమైన డాక్యుమెంటేషన్‌తో జరపగలిగే శంకరన్ వంటి వాళ్లు దేశంలో ఎవరయినా ఉన్నారా అని వెతుకులాటగానే ఉంది. ఆయన మరణ వార్త తెలిసిన దగ్గర్నించీ అంతిమ యాత్ర దాకా వచ్చినవాళ్ల స్పందన చూస్తే పరస్పర విరుద్ధ శక్తులను ఆకర్షించిన ఈ అయస్కాంత శక్తి భూమి మీద అన్ని ఖనిజాల వలెనే అరుదయిపోతుందా అనిపించింది.

ఇంత చెప్పి ఐ.ఎ.ఎస్. పబ్లిక్ సర్వెంట్‌గా గానీ, సిసిసి కన్వీనర్‌గా గానీ ఆయన వ్యక్తికంగా, వ్యక్తి ధోరణిలో వ్యవహరించ లేదని చెప్పకపోతే ఆయనకు అపచారం చేయడమే అవుతుంది. జిల్లా కలెక్టర్‌గా ఉంటే జిల్లాలో తనవంటి పబ్లిక్ సర్వెంట్‌లను, సామాజిక కార్యకర్తలను ఆయన రూపొందించాడు. రాష్ట్ర స్థాయి కార్యదర్శిగా ఉన్నా, కేంద్రంలో గ్రామీణ అభివృద్ధి కార్యదర్శిగా ఉన్నా రాష్ట్రంలోనూ, దేశంలోనూ తనవంటి సామాజిక కార్యకర్తలను పాలనా రంగంలోనూ, బయటా కూడగట్టాడు.

సిసిసి ఇరవై ఆరు మందితో ఏర్పడింది. విభిన్న జీవన రంగాల నుంచి, జీవనశైలుల నుంచి వచ్చిన ప్రజాస్వామ్య వాదులు, వారిలో అందరిని కాకున్నా చాల ఎక్కువమందిని సంప్రదించకుండా ఆయన ఏ నిర్ణయమూ తీసుకోలేదు. ప్రభుత్వం దగ్గరికి ఒక్కడుగా ఎప్పుడు వెళ్లలేదు. అడవికి ఆరుగురు ఐ.ఎ.ఎస్. అధికారులను వెంట బెట్టుకొని అధ్యయనానికి వెళ్లినట్లే పీపుల్స్ వార్‌తో చర్చల గురించి కూడా అంత నిర్బంధ కాలంలోనూ ఒక్కడుగా వెళ్లలేదు. మావోయిస్టు పార్టీతో చర్చలు జరపడానికి శాంతి కాలంలోనూ ఒక్కడుగా వెళ్లలేదు.

ఆయన కీహోల్ మారల్స్ (ఎవరో రహస్యంగా మనను కనిపెడుతున్నారన్నట్లుగా మన ప్రవర్తన పారదర్శకంగా ఉండాలి) పాటించాడు జీవితమంతా. నిబద్ధత, నిజాయితీ, పారదర్శకత ఆయన నిసర్గ సంస్కృతి.

మనిషి ఒంటరిగా పుట్టి, నలుగురిలో జీవించి, 'పోయేటప్పుడు వెంబడి రాదు పూచీపుల్లయినా' అన్నట్లు ఒంటరిగా వెళ్లిపోతాడు - అనే తాత్విక సత్యాన్ని ఆయన ఒంటబట్టించుకున్నాడు. బుద్ధి తెలిసిన నాటి నుంచీ నలుగురి కష్టాలు పట్టించుకోకుండా ఉన్నరోజు లేదు. వెళ్లిపోయే నాడు కూడ తన కష్టం ఎదురుగా ఉన్న వారికి కూడా చెప్పింది లేదు. ఎవరినీ ఏ కష్టమూ పెట్టింది లేదు. ప్రాణ త్యాగాలకు సిద్ధపడిన విప్లవకారుల తర్వాత ఇంత గౌరవాభిమానాలకింకెవ్వరు పాత్రులవుతారు!

●

శతవర్ధంతి సందర్భం

ప్రపంచ నవలా సాహిత్యంలోనే అత్యుత్తమంగా
యుద్ధ నేపథ్యంలో మానవ జీవితాలను విస్తృతంగా వ్యాఖ్యానించిన

తోల్‌స్తాయ్ నవల 'యుద్ధం - శాంతి'

- ఎన్.పి. యస్. నాగభూషణాచార్యులు

యుద్ధం కథాంశంగా గల నవలలంటే అందరికీ ఆసక్తిగానే ఉంటుంది. వివిధ క్లిష్ట పరిస్థితుల్ని ఎదుర్కొని పోరాడే సాహసవీరుల విజయగాథలు, ఉగ్గబెట్టే ఉత్కంఠతతో ఊహించని విషాదం, వివిధ రకాల ఆయుధాలు, వాటిని పనిచేయించడంలో చూపించే మెలకువలు, కఠిన పరిస్థితుల్లో సామాన్యులు కూడా తెగువను ప్రదర్శించడం, యోధులుగా పేరొందినవాళ్లే హఠాత్తుగా కుప్పకూలడం, శత్రువుల వ్యూహ ప్రతివ్యూహాలు - ఇలాంటి కథనాలు ఏ వయసు పాఠకుల్నయినా ఇట్టే ఆకర్షిస్తాయి! వీటికి తోడు అంతస్సూత్రంగా ఓ ప్రేమకథా జతకలిస్తే.... ఇక చెప్పేదేముంది? విపరీత పాఠకాదరణ లభిస్తుంది. వీటన్నిటితోపాటు చారిత్రక అంశాలు నేపథ్యంగా సాగితే, అందమైన అమ్మాయి మంచి ఆహార్యంతో పాటు తళుకుబెళుకులతో మన మనస్సును ఇట్టే దోచుకున్నట్టే, ఆ నవలా పాఠకుల హృదయాల్లో పదికాలాలపాటు తిష్ఠవేసుకుని ఉంటుంది! ఇలాంటి మెలకువలు పాటించినపుడు ఒక సాదాసీదా రచయిత కూడా ఉత్తమ రచయితగా కీర్తించబడతాడు.

కానీ అందుకు పూర్తి విరుద్ధంగా, యుద్ధాలనూ చరిత్రనూ కూడా ఒక తాత్త్విక దృష్టితో వ్యాఖ్యానిస్తూ, క్లిష్టపరిస్థితుల్ని ఎదుర్కొన్న యోధుల్ని కూడా సాధారణ వ్యక్తులుగా చూడడం, కథాకథనంలోగానీ, వర్ణనల్లోగానీ తళుకుబెళుకుల్ని ప్రదర్శించకపోవడం, దేశభక్తిని రగులుకొల్పుతూ పాఠకుల్ని ఉద్రేకపరిచే సంఘటనల్ని కూడా కేవలం ఒక సాక్షిలాగా వర్ణించడం, ఆకర్షణీయమైన ప్రేమ సన్నివేశాలను కూడా సన్నివేశ మాత్రంగా చూడడం, వీటన్నిటికీ తోడు అది ఏకనాయకాశ్రితంగాక, బహునాయకాశ్రితం కావడం - ఇలా నవలను నడిపిస్తే అది కేవలం నీరసాన్ని మాత్రమే కలిగించడంగాక, పాఠకుల కోపాగ్నికీ గురవుతుంది. వీటన్నిటికీ తోడు వందలాది పాత్రలతో, వేలాది సంఘటనలతో, ఓ బృహన్నతంగా అవతరిస్తే ఇక చెప్పేదేముంది? వచ్చినంతవేగంగా చెత్తబుట్టలోకి చేరుకుంటుంది! అయితే ఆ నవల అత్యంత పాఠకాదరణతోపాటు, ప్రపంచ నవలా చరిత్రలోనే ఒక విప్లవాన్ని సృష్టించిందంటే ఆ రచయిత ఒక సాధారణ రచయిత అయివుండడు. అత్యంత అరుదైన, అసాధారణ బహుముఖ ప్రజ్ఞాశాలి అయి వుంటాడు. ఆ రచయిత మరి ఎవరో కాదు. ప్రసిద్ధ రష్యన్ మహారచయిత టాల్‌స్టాయ్! మరి ఆ నవల ప్రపంచ నవలా సాహిత్యంలోనే అత్యుత్తమ నవలలు నాలుగైదింటిలో మొదటి నవలగా విమర్శక లోకంచే ఏకగ్రీవ ప్రశంసలు గన్న "యుద్ధం - శాంతి" (War and Peace)!

"మానవ జీవితాన్ని గురించీ, ఆ కాలపు రష్యాదేశాన్ని గురించీ సమగ్రమైన చిత్రమే ఈ నవల, ఆనాటి చరిత్ర, మానవ జీవన సమరం ఈ నవల ప్రతిబింబిస్తుంది. ఆనాటి ప్రజల సుఖదుఃఖాలు, మంచి చెడ్డలు, వీటన్నిటి సామూహిక చిత్రమే "యుద్ధం - శాంతి" అని నాటి ప్రముఖ రష్యన్ సాహిత్య విమర్శకుడు 'స్టర్కోవ్' ప్రస్తుతించాడు.

ఇప్పుడు యుద్ధం - శాంతి నవల గురించి, దాంట్లోని కథాంశాల గురించి, నవల చివర్లో చరిత్ర పట్ల టాల్‌స్టాయ్ వ్యక్తం చేసిన భావాల గురించి సంగ్రహంగా చెప్పుకునే ముందు, టాల్‌స్టాయ్ జీవిత విశేషాలు, ఆయన ఇతర నవలలు, కథల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం.

ముందుగా ఒక విషయం తెలుసుకోవాలి. "టాల్‌స్టాయ్" అనే ఉచ్చారణ ఇంగ్లిషు ఉచ్చారణననుసరించి తెలుగులోకి ప్రవేశించింది గానీ, రచయిత మాతృభాష అయిన రష్యన్‌లోని ఉచ్చారణ "తొల్‌స్తోయ్" అని మాత్రమే. పూర్తి పేరు "లేవ్ నికొలయెవిచ్ తొల్‌స్తోయ్"! అందుచేత ఈ వ్యాసంలో తదుపరి ఆయన్ను అసలైనా ఉచ్చారణతో "తొల్‌స్తోయ్" అనే పేర్కొనడం జరుగుతుంది.

తొల్‌స్తోయ్ 1828, సెప్టెంబరు 9న మాస్కోకి 160 కి.మీ. దూరంలో గల 'తులా' రాష్ట్రంలోని "యాస్నాయా పొల్యానా" అనే కుగ్రామంలో తన జమీలోనే జన్మించాడు. తల్లిదండ్రులు చిన్నప్పుడే చనిపోవడం వల్ల బంధువుల చేతుల్లో పెరిగాడు. చిన్నప్పుడు ట్యూటర్ల వద్ద చదువుకుని, 16వ ఏట "కజాన్" విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్య కోసం చేరాడు గానీ, అక్కడి చదువు నచ్చక త్వరలోనే తిరిగొచ్చి స్వయంకృషితో విజ్ఞాన సముపార్జనకావించాడు. 1851లో ప్రకృతి సౌందర్యానికి ఆటపట్టయిన కాకసస్ ప్రాంతానికి వెళ్లి, అక్కడి సైన్యంలో పనిచేస్తున్న "నికోలాయ్" అనే సోదరుని వద్ద కొన్నాళ్లుండి, తర్వాత తనూ సైన్యంలో చేరాడు. 'క్రిమియా' యుద్ధంలో పాల్గొన్నాడు. యుద్ధానంతరం సైన్యం నుండి విరమించాడు. సైన్యంలో పనిచేస్తున్నపుడే ఖాళీ సమయాల్లో కథలు రాయడం మొదలెట్టాడు. అతడి మొదటి కథ "శైశవం" (1852)ను నాటి ప్రసిద్ధ పత్రిక "సొవ్రెమెన్నిక్" ప్రకటించగానే, నాటి సాహితీపరులంతా రష్యన్‌సాహితీ వినీలాకాశంలో -నూత్నతార ఉదయించిందని గ్రహించారు. సైనిక జీవితానంతరం 1856లో నాటి దేశరాజధానుల్లో ఒకటీ (మరొటి మాస్కో), నాటి సంస్కృతీ కేంద్రమూ అయిన 'సెంట్ పీటర్స్ బర్గ్' చేరగానే, అక్కడగల వివిధ సాహిత్య గ్రూపులు ఆయన్ను ఆదరంతో ఆహ్వానించాయి. వారిలో నాటి హేమాహేమీలయిన గొంచరొవ్, తుర్గేనెవ్, ఓస్ట్రోవ్‌స్కీ, నెక్రసోవ్, చెర్నిషేవ్‌స్కీ వంటి రచయితలూ, కవులూ ఉండడం గమనార్హం! వారితో జరిగిన సాహిత్య చర్చల్లో ఆయన ఉత్సాహంతో పాల్గొన్నాడు. భౌతిక వాదంపై గల ఆసక్తితో 1857లో ఒకసారీ; విద్యాసంబంధమైన నూతన విషయాలు అధ్యయనం చేసేందుకు 1860లో రెండోసారీ పలు పాశ్చాత్య దేశాలు పర్యటించాడు. వచ్చినతర్వాత స్వయంగా విద్యా సంబంధమైన పత్రికనొకదాన్ని స్థాపించి, అందులో ఆధునిక బోధనా పద్ధతులు,

తన ప్రతిపాదనలపై చర్చలు ప్రకటించాడు. ఆపై తన జమీలోని రైతాంగం, పిల్లలకు ఒక పాఠశాల నెలకొల్పి తన ప్రతిపాదనలకు అనుగుణమైన బోధనా పద్ధతుల్ని అనుసరించడమేగాక, స్వంతంగా పాఠ్యగ్రంథాలనూ రచించాడు. ఆ పాఠ్య గ్రంథాలూ బహుళ జనాదరణ పొందాయి. ఆయన సూచించిన బోధనా పద్ధతులు నేటి నూతన పద్ధతులకనుగుణంగా ఉండడం విశేషం! విద్యా స్వేచ్ఛ గురించి ఆయన చేసిన ప్రతిపాదనలు నేటికీ అనుసరణీయాలు!

1862లో "సోన్యా" (సోఫ్యా) అనే మధ్యతరగతి స్త్రీని పెళ్లాడాడు. ఆపై 15 సంవత్సరాల పాటు నవలా రచనలో తన దృష్టిని కేంద్రీకరించాడు. ఆపై ఆయన దృష్టి "అరాచక క్రైస్తవం" వైపు ప్రసరించింది. క్రీస్తు బోధనలకు విరుద్ధంగా మతాచార్యులు సాగిస్తున్న స్వార్థపూరిత విధానాల్ని, మూఢాచారాల్ని ఖండిస్తూ పలు గ్రంథాలు రచించాడు. ఆపై తన దృష్టిని సంఘసంస్కరణల వైపు, నీతి వైపు, కళల వైపు సారించాడు. దాంతో ఆయన జీవన సరళి పూర్తిగా మారిపోయింది. అంతకుముందు జమీందారీ ఫాయాకు అనుగుణంగా జీవించేవాడు. ఇప్పుడు తను నమ్మిన సిద్ధాంతాలకనుగుణంగా ఆడంబరాల్ని పూర్తిగా త్యజించి, సామాన్య రైతు దుస్తుల్ని ధరించడం, శాఖాహారాన్ని స్వీకరించడం, ధూమపాన మద్యపానాల్ని త్యజించడం, తన పనులు తనే చేసుకోవడం సాగించాడు. ఇంద్రియ నిగ్రహాన్ని పాటించసాగాడు. తన విరామ సమయాలను సేవా కార్యక్రమాలకు కేటాయించసాగాడు. సమాజంలో స్త్రీలకు జరుగుతున్న అన్యాయాల్ని ఖండిస్తూ వారిని చైతన్య పరచడానికి పూనుకున్నాడు. ఆయన ప్రముఖ వ్యక్తి అయినందున, పలు సంస్థలూ సంఘాలూ ఆయన పలుకుబడిని ఉపయోగించుకునేందుకు తమ సమావేశాలకు ఆయన్ను ఆహ్వానిస్తూండేవి. దాంతో ఆయన బోధనలు రష్యాకే పరిమితంగాక, ప్రపంచమంతటా వ్యాపించాయి. ఆయనొక విఖ్యాత రచయితగానే కాకుండా, ప్రసిద్ధ బోధకుడిగానూ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపుపొందాడు. దాంతో ఆయన్ను చుడ్డానికీ, ఆయనతో మాట్లాడ్డానికీ నిత్యం వందలాది జనం ఆయన నివాసం "యాస్నాయా పోల్యానా"కు వస్తూండేవారు. ఈ తతంగమంతా ఆ గ్రామంలో ఒక నిత్య తిరునాళ్లలా సాగుతుండేది. ఇదంతా ఆయన భార్యకు గిట్టేదికాదు. వచ్చిన వారిని ఆమె ఈసడిస్తూండేది. ఇద్దరి మధ్యా తరచు ఘర్షణలు సాగుతూండేవి. ఆమెకు గల డబ్బు యావ ఉన్న సంపదతో తీరిందికాదు. భర్త రాసిన పుస్తకాల కాపీరైటు పొంది, వాటిని తనే ప్రచురించేది. ఆమెతో సామరస్యం కోసం ఆయన ఎంతో ప్రయత్నించాడు. అయినా ఆమె ప్రవర్తన మారింది కాదు. జీవితం చివరిదశలో ఆమెతో ఘర్షణలు నివారించడం కోసం తన రచనల ప్రచురణను నిలిపివేశాడు కూడా. అవి ఆయన మరణానంతరంగానీ ప్రచురణకు నోచుకోలేదు!

అంత్యకాలంలో భార్యతో ఘర్షణలు శృతిమించడంతో గృహ వాతావరణాన్ని మరింత చెడగొట్టడం ఇష్టం లేక మనస్తాపంతో తన కుటుంబ వైద్యునితోను, చిన్నకూతురు అలెక్సాండ్రాతో కలసి వెళ్లిపోయాడాయన. చివరికి అనాథలా న్యూమోనియా వ్యాధితో ఓ మారుమూల రైల్వే జంక్షన్ 'ఆస్టోపోవో'లో అత్యంత విషాదకరంగా 1910, నవంబరు 20న మరణించాడు. ఆయన చనిపోయిన కొన్నిరోజులగ్గాని ఆ విషయం ప్రపంచానికి తెలియరాలేదు.

తొల్‌స్తొయ్ జీవించిన కాలం 19వ శతాబ్దం రష్యన్ సాహిత్య చరిత్రలో సువర్ణ శతాబ్దంగా ప్రసిద్ధికెక్కింది. ఆ కాలంలో తొల్‌స్తొయ్‌తో పాటు, లేర్మొంతొవ్, తుర్గెనెవ్, గోగొల్, చేహోవ్, దొస్తొయేవ్‌స్కి, కుప్రిన్ వంటి మహామహులైన సాహిత్యకారులు జీవించారు. వీరంతా కేవలం రష్యన్ సాహిత్యానికే గాక, ప్రపంచసాహిత్యంలోనే అత్యుత్తమ రచనలు చేశారు. వీరిలో తొల్‌స్తొయ్‌ది అత్యున్నత స్థానం!

తొల్‌స్తొయ్ తాను జీవించిన 80 సంవత్సరాలకు పైగా నిండు జీవితంలో దాదాపు 60 సంవత్సరాల పాటు సాహిత్య సృజన చేసి మానవ జీవితంలోని దాదాపు అన్ని పార్శ్వాలనూ స్పృశించాడు. కథ రాసినా, నవల రాసినా, వ్యాసం రాసినా ప్రతి ఒక్కటీ ప్రపంచ సాహిత్యానికి దిశానిర్దేశం చేసేవే. తన రచనలన్నిటా పెత్తందారీ విధానాల్ని అధిక్షేపించాడు. ధనికుల ఆడంబర జీవితాన్ని ఎద్దేవాచేశాడు. జార్ నిరంకుశ పాలనలోని లోపాల్ని ఎత్తి చూపాడు. ధనికుల సంపద అన్యాయార్జితమన్నాడు. భూ స్వామ్య విధానాన్ని తూర్పార పట్టాడు. ప్రభుత్వోద్యోగుల అలసత్వాన్ని లంచగొండి విధానాల్నీ ఖండించాడు. సైనికులు చేసేవి హత్యలేనన్నాడు. స్త్రీలపై అణచివేతను ఎత్తిచూపాడు. వేశ్యలపట్ల సానుభూతి చూపించాడు. అణగారిన వర్గాల ఆక్రందనల్ని ఆర్ద్రంగాని చిత్రించాడు. రైతాంగం దుస్థితిని కళ్లకు కట్టేట్టుగా చూపించాడు. స్వేచ్ఛకూ, మానవహక్కులకూ అండగా నిలబడ్డాడు. ఇంతెందుకు, నేడు నడుస్తున్న పలు హక్కుల ఉద్యమాలకు బీజావాపన ఈయన రచనల్లో కనిపిస్తున్నదంటే, ఆయన కాలానికి ఎంత ముందున్నాడో అర్థం చేసుకోవచ్చు. ఇంకా చెప్పాలంటే ఆచరణతో కూడిన తన నైతిక నిష్ఠ ద్వారా ఎందరో రాజనీతిజ్ఞులకు ఆయన ఆదర్శప్రాయుడైన నమూనాగా నిలిచాడు.

ప్రపంచంలోని ప్రముఖులెందరో ఆయన్ను కీర్తించారు. "తొల్‌స్తొయ్ పట్ల నా వైఖరి ఆయనకు ఎంతో రుణపడిఉన్న ఆరాధకుడిలాంటి"దని గాంధీజీ కొనియాడాడు. గాంధీ దక్షిణాఫ్రికాలో ఉన్నప్పుడు జోహన్నెస్‌బర్గ్‌లో తాను నెలకొల్పిన ఆశ్రమానికి 'తొల్‌స్తొయ్ ఆశ్రమం'గా పేరుపెట్టుకోవడం గమనార్హం! తొల్‌స్తొయ్ సాధించిందాన్ని గురించి చెప్పడానికి సాధారణ వాక్యాలు చాలవని ప్రముఖ రష్యన్ విమర్శకుడు "లియోనెద్ లిమనోవ్" పేర్కొన్నాడు. హెర్క్యులిస్ వీరోచిత కృత్యంలా తొల్‌స్తొయ్ కృషి మనకు కనిపిస్తుందంటాడాయన. రష్యన్ మేధావులపైన మధ్య తరగతి ప్రజలపైనా తొల్‌స్తొయ్ రచనల ప్రభావాన్ని గమనించిన మహోపాధ్యాయుడు లెనిన్, తన విప్లవ భావాలకు అనుగుణంగా ఉండటంలో తొల్‌స్తొయ్ కొన్ని వైరుధ్యాలున్నప్పటికీ, ఆయన్ను రష్యన్ విప్లవ దర్పణంగా అభివర్ణించడమేగాక, ప్రపంచ సాహిత్యానికి తొల్‌స్తొయ్ అత్యుత్తమ చేర్పులు చేర్చాడని, రష్యన్ జీవితపు నిరుపమానమైన చిత్రాలు చిత్రించాడని, ప్రపంచ సాహిత్యంలోనే ఆయన అత్యుత్తమ కళాకారుడనీ కొనియాడాడు. ఇక శ్రామిక వర్గ రచయిత గోర్కీ అయితే తొల్‌స్తొయ్‌ని ఆకాశానికెత్తేశాడు. ఆయన అనంత వైవిధ్యపూరితుడని అభివర్ణించడమేగాక, "ప్రపంచమంతా, భూఖండమంతా ఆయనకేసి చూస్తోంది. ప్రతి చోటు నుంచీ, చైనా నుంచీ, ఇండియా నుంచీ, అమెరికా నుంచీ జీవనాడులు ఆయన్ను

పెనవేసుకుని ఉన్నాయి. ఆయన ఆత్మ శాశ్వతంగా అందరికీ చెందుతుంది" అని గోర్కీ రాశాడు. "రష్యన్ ప్రజల గురించి ఇతర రచయితలంతా ఎంత చెప్పారో, దాదాపు అంతా ఆయన మనకు చెప్పాడు" అని గోర్కీ తాల్‌స్తాయ్‌కి నివాళులర్పించాడు.

ఇప్పుడు తాల్‌స్తాయ్ ఇతర రచనల గురించి రేఖామాత్రంగా తెలుసుకుని అనంతరం వ్యాసాంశమైన యుద్ధం - శాంతి నవల గురించి తెలుసుకుందాం. మొదట ఆయన కథల గురించి తెలుసుకుందాం. తాల్‌స్తాయ్ నవలా రచయితగా ఎంత ప్రసిద్ధుడో, కథారచయితగానూ అంత ప్రసిద్ధుడే. ఆయన కథా రచయితగానే తన సాహితీ ప్రస్థానాన్ని మొదలిడటం గమనార్హం! ఆయన రాసిన మొదటి కథ 'శైశవం' (1852)తో పాటు, "బాల్యం" (1856), "యవ్వనం" (1857) అనే కథలు ఆయన ఆత్మకథలే. సైన్యంలోని అనుభవాలు ఆధారంగా "దాడి", "కొట్టేసిన అడవి" రాశాడు. యుద్ధానుభవాలతో "సెవస్తపోల్ ఘటనలు" కథా సంపుటి ప్రకటించాడు. యూరప్ పర్యటనలు ఆధారంగా "లూసర్న్" వంటి కథలు రాశాడు. 1855-63 మధ్య నైతిక సమస్యలపై "బిలియర్డ్ మార్కర్ జ్ఞాపకాలు", "ఇద్దరు హుస్సార్లు", "ఆల్బర్ట్", "మూడు మరణాలు" వంటివి రాశాడు. ఆయనలో పరివర్తన కలిగిన తర్వాత తన ఆలోచనలు ప్రచారం చెయ్యడానికి చిన్నకథలే ఉత్తమ సాధనాలని గ్రహించి, వాటిపై దృష్టి సారించాడు. విద్యావంతుల సమస్యపై "పిచ్చివానినోట్ పుస్తకం" వంటివి, లైంగిక సంబంధాలపై "దయ్యం" వంటివి రాశాడు. ఈ కథ కూడా ఆయన ఆత్మకథేనని కొందరు విమర్శకులు చెప్పారు. (ఈ కథ తెలుగులో "దయ్యం పట్టిన మనిషి", "పెనుభూతం" వంటి పేర్లతో అనువదించబడింది). 'మానవసేవే దైవసేవ' అనే నీతిని తెలియజెప్పే "తీర్థయాత్ర", చెయ్యని నేరానికి శిక్ష అనుభవించిన కరుణ రసపూరితమైన కథ "నిలకడమీద నిజం", ఇరుగుపొరుగువారి చిన్న చిన్న కలహాలు ఎంతటి వైషమ్యాలకు దారి తీస్తాయో చెప్పే "ఇరుగుపొరుగూ", సైనిక జీవితంలోని వికృతధోరణులు నిరసిస్తూ మానవతను చాటి చెప్పే అద్భుత కథ "విందు తర్వాత", అంతులేని ఆశ యొక్క పరిణామాన్ని తెలియజెప్పే "ఎంత భూమి కావాలి".... ఇలా చెప్పుకుంటూ పోతే ఒక చాంతాడంత లిస్టు తయారవుతుంది. తాల్‌స్తాయ్ రాసిన ప్రతి కథలోనూ ఒక నీతి తప్పనిసరిగా ఉంటుంది. అంతమాత్రం చేత ఆ కథ ఒక మామూలు నీతికథగా మిగిలిపోక, గొప్ప కళాసృష్టిగా వెలుగులు విరజిమ్ముతుంది. కథకు తగిన వాతావరణాన్ని కల్పించడంలో, పాత్రకు తగిన మనస్తత్వాన్ని చిత్రించడంలో తాల్‌స్తాయ్ అఖండ ప్రతిభావ్యుత్పత్తులు ప్రదర్శిస్తాడు. వాస్తవికతకూ, మనోవిశ్లేషణకూ ఆయన పెట్టింది పేరు. ఈ విషయం ఆయన నవలలకే గాక, కథలకూ వర్తిస్తుంది. నీతి, లోకరీతి మధ్య జరిగే సంఘర్షణలో లోకరీతిపై నీతి విజయం సాధించడాన్ని ఆయన కథలు హృద్యంగా చెబుతాయి. రైతాంగ సమస్యల్ని వారి ఆశల్ని బాధల్నీ తెలియజెప్పే అద్భుత కథలు కూడా ఎన్నో రాశాడాయన. వాటిలో "ముసలివాడు", "మూడు ప్రశ్నలు" వంటివున్నాయి.

ఇప్పుడు తాల్‌స్తాయ్ ఇతర నవలల్ని గురించి క్లుప్తంగా తెలుసుకుని, ఆపై వ్యాసాంశంలోకి వెడదాం. తాల్‌స్తాయ్ కొన్ని నవలికలనూ రాసినప్పటికీ, ప్రధానంగా నాలుగు నవలలు రాశాడు. ఆయన రాసిన మొదటి నవల "కొసక్కులు" (1863). ఆయన తన సైనిక జీవితం తొలిదశలో ఓ కొసక్ గ్రామంలో ఉన్నాడు. కాకసస్ పర్వత ప్రాంతంలోని రమణీయ ప్రకృతి, దాన్ననుసరిస్తూ జీవించే కొసక్కులూ, వారి స్వేచ్ఛా పిపాస, సౌందర్యం, సాహస ప్రవృత్తి ఆయన్ను సమ్మోహనం చేశాయి. తనకు 'కాకసస్' ఒక జీవిత పాఠశాల అని ఆయన ఒకచోట రాసుకున్నాడు. కొసక్కు జాతి ప్రజలు ప్రపంచ జాతుల చరిత్రలోనే ఒక ప్రత్యేకతను కలిగి ఉన్నారు.[సా.సూ.(1)] ఒక నాగరిక మాస్కోకు చెందిన రష్యన్ ధనిక యువకుడు కొసక్కు ప్రాంతానికి వచ్చి, వారి జీవనసరళికి ఆకర్షించబడి, అక్కడి అమ్మాయిని ప్రేమించి పెళ్లాడి అక్కడే వాళ్ళలో ఒకడిగా జీవించాలనుకుంటాడు. కానీ, నాగరికులవల్ల తమ జాతి జనులకు కల్గిన ముప్పును గ్రహించి ఆ యువతి అతన్ని తిరస్కరించడంతో అతనక్కడినుంచి వెళ్లిపోవడం ఇందులోని కథ.[సా.సూ.(2)]. తాల్‌స్తాయ్ సృజనాత్మక కృషిలో ఈ నవల స్థానాన్ని వివరిస్తూ ప్రసిద్ధ రచయిత రోమారోలా ఇలా రాశాడు. "'కొసక్కులు' తాల్‌స్తాయ్ ఉత్తమ లాలిత్యభరిత నవల. ఆ యవయౌవన గీతం. కాకసస్‌కి చెందిన కావ్యం. తాల్‌స్తాయ్ మేధ తొలిసారిగా పుష్పించిన సాటిలేని మేటి కృతి ఇది." ఈయన రాసిన రెండో నవల "యుద్ధం - శాంతి". మూడోది మరో విఖ్యాత నవల "-న్నా కెరెనినా". ప్రపంచ నవలా సాహిత్యంలోనే ఈ రెండు నవలలూ అత్యుత్తమ నవలలో మొదటి రెండు నవలలుగా విమర్శక ప్రముఖులు కీర్తించారు. సమాజం స్త్రీల పట్ల చూపుతున్న వివక్షను ఎత్తిచూపిన మొదటి నవలగా ఇది చరిత్రలో నిలిచిపోయింది. సమాజంలో తప్పుచెయ్యని మానవులెవరూ ఉండరూ. కొన్ని తప్పులకు దారుణమైన శిక్షలు ఉంటాయి. న్యాయవ్యవస్థ కొందర్ని శిక్షిస్తే, సమాజం మరికొందర్ని శిక్షిస్తుంది. కొందరు పెద్ద మనుషులుగా చెలామణీ అయ్యేవాళ్లు ఎన్ని తప్పులు చేసినా శిక్షపడకుండా తప్పించుకుంటూ ఉంటారు. అలాగే ఒకే తప్పు చేసిన స్త్రీల పట్ల ఒక రకంగా, పురుషుల పట్ల మరోరకంగా ఈ సమాజం స్పందిస్తూ ద్వంద్వ నీతిని అమలు చేస్తుంది. స్త్రీల పట్ల చూపించే ఈ వివక్షను అద్భుత నైపుణ్యంతో, గొప్ప కళాత్మక వైభవంతో ఎత్తిచూపింది ఈ నవల. మన భారతేతిహాసం ద్రౌపదిలా, ప్రపంచ నవలా సాహిత్యంలో -న్నా కెరెనినా ఒక మరిచిపోలేని, మరువరాని అద్భుతపాత్ర. దాన్ని ఆయన నిర్వహించిన తీరు అనితర సాధ్యం. ఈ నవలలో ఆయన సమకాలికుడైన మరో విశ్వవిఖ్యాత రష్యన్ రచయిత దొస్తాయేవ్‌స్కీ అపారమైన మనస్తత్వ విశ్లేషణనీ, కళాత్మకవర్ణనలో అనిదంపూర్వమైన వాస్తవాన్నీ దర్శించాడు. ఇక ఆయన నాలుగో నవల "నవజీవనం". తాల్‌స్తాయ్ పరిణత వయసులో (71వ ఏట) రాసిన విలక్షణ నవల ఇది. తాల్‌స్తాయ్ ఆదర్శాలు ఇందులో పూర్తిగా ప్రతిబింబించాయని చెప్పుకోవచ్చు. అంతేగాక ప్రపంచ మానవ హక్కుల ఉద్యమాలకి ఇదొక ప్రేరణగా, పాఠ్యగ్రంథంలా పనిచేసిందని చెప్పవచ్చు. సమాజాన్ని నిశితంగా పరిశీలించడంలో, అందులోని లోపాలను హేతుబద్ధంగా విమర్శించడంలో రచయిత నిబద్ధతకు ఈ నవల నిదర్శనంగా కనిపిస్తుంది. సమాజం పట్టించుకోని పలు చీకటి కోణాలలో జైళ్ల వ్యవస్థ కూడా ఒకటి. సమాజం దృష్టిని అటువైపుగా తొలిసారి ప్రసరింజేసింది

ఈ నవల.పా సూ (3)

ఇక ఇప్పుడు ప్రస్తుత వ్యాసాంశమైన "యుద్ధం - శాంతి" నవలను పరిశీలిద్దాం. కథాంశంలోకి వెళ్లేముందు ఈ నవలా వైశిష్ట్యాన్ని గురించి, ఇందులోని పాత్రల గురించి కొన్ని విశేషాలు తెలుసుకుందాం.

పాశ్చాత్య సాహిత్యంలో మన మహాభారతాన్ని పోలిన విధంగా విస్తృతి, వైవిధ్యం, బహుళ పాత్రలు కలిగింది ఈ నవల. ఒక వైపు యుద్ధం, మరోవైపు శాంతి - ఈ రెంటి మధ్య అనేక ఉత్తమ కుటుంబాలు, వాటి మాన మర్యాదలు ఏ విధంగా ఊగిసలాడాయో మనకు తెలుస్తుంది. యుద్ధం కారణంగా పరస్పర మానవ సంబంధాల విచ్ఛిన్నం, సమ్మేళనంలాంటి విషయాలు తెలుస్తాయి. జీవితంలో ఎంత పోరాటం సలిపినా, నవలలోని ప్రధాన పాత్రలు సాధారణ జీవితంలోనే పర్యవసించడం గమనించవచ్చు. మహాభారతం చదివినప్పటిలాగానే వివిధ సంఘర్షణలతో కూడిన ఈ కావ్యాన్ని చదివినప్పుడు మనస్సు ఒక విధమైన శాంతి సహితమైన ఆనందం కలుగుతుందనీ, ఈ కావ్యంలోని రమణీయత ఇదేనని విమర్శకులు చెప్పారు. 1805-12 సం॥ల మధ్య రష్యాతో నెపోలియన్ సాగించిన వివిధ యుద్ధాలు, చివరికి రష్యాపై దండయాత్రకు తెగబడి ఓడిపోయి పారిపోవడం నేపథ్యంగా సాగిన ఈ నవలను విస్తృత మానవజీవిత వ్యాఖ్యానంగా భావిస్తున్నారు. యుద్ధం నేపథ్యంగా సాగిన ఈ నవలలో ప్రధానంగా నాలుగు ఉన్నత కుటుంబాలలోనిపా సూ (4) వ్యక్తుల మధ్య గల సంబంధాలను చిత్రించడానికి పూనుకున్నప్పటికీ, తాననుకున్న లక్ష్యాన్ని నెరవేర్చడానికి దరిదాపు 500 పైగా పాత్రలను ప్రవేశపెట్టడమేగాక, ప్రతి పాత్రకూ స్పష్టమైన వ్యక్తిత్వాన్నివ్వడం విశేషం.

ఈ నవలలోని ప్రధాన పాత్రలన్నిటినీ రచయిత తనపరిచితులనుండే ఎన్నుకొన్నాడని విమర్శకులు చెబుతారు. కౌంట్‌రోస్టోవ్ తన తాతగారనీ, నికోలస్ తన తండ్రిగారనీ, మేరియా రాకుమారి తన తల్లి అనీ అంటారు. ఇక నవలా నాయకులైన ఆండ్రూ రాకుమారుడు, పీటర్‌లయితే తనను దృష్టిలో ఉంచుకునే సృష్టించాడని చెబుతారు. పరస్పర వైరుధ్యం గల ఈ రెండు పాత్రలనూ చిత్రించడం ద్వారా రచయిత తనను తానే అర్థం చేసుకునే ప్రయత్నం చేశాడంటారు. ఆండ్రూ రాకుమారుడు ఉత్సాహం, అందం, నిజాయితీ గలవాడు. ఒక ధీరోదాత్త నాయకునిలా అతని పాత్ర నవల అంతా ఒకే విధంగా తీర్చిదిద్దబడి ఆకర్షణీయంగా కనిపిస్తుంది. నవల చివరిభాగంలో అతని విషాదాంత మరణం పాఠకులకు తీరని దుఃఖాన్ని కలిగిస్తుంది. ఆండ్రూ మరణోదంతం గొప్ప కరుణరసపూరిత కావ్యం. దీంతో సరిపోల్చగల దృశ్యం మరో ప్రసిద్ధ రష్యన్ విశ్వవిఖ్యాత రచయిత తుర్గేనెవ్ రచించిన ప్రసిద్ధ నవల "తండ్రులూ కొడుకులూ" లోని కథానాయకుడు బజారోవ్ మరణ దృశ్యమే.పా సూ (5) అయితే పీటర్ మంచివాడేగానీ, అనిశ్చితుడు. మంచి చేద్దామనుకుని పర్యవసానాలు ఆలోచించకుండా అతను చేసేపనులు ఒక వెర్రివాణ్ణి తలపింపజేస్తాయి. ఇద్దరూ నటాషాను ప్రేమిస్తారు. అప్పుడప్పుడే యవ్వనం సంతరించుకుంటున్న ఆమె మనస్సు పూర్తిగా వికసించీ వికసించని స్థితిలో అల్లరిచిల్లరతనంతో వ్యవహరిస్తుంటుంది. ఇంత విస్తృతి గల ఈ నవల చివరలో రచయిత కొంత అశ్రద్ధ కనబరిచాడని కొందరు విమర్శకులు చెప్పినప్పటికీ, నవలను ఆసాంతం శ్రద్ధగా పరిశీలిస్తే ఆ అభిప్రాయం సరైందిగా కనిపించదు. నవల అంతా ఒకే విధమైన పనితనంతో చెక్కిన అద్భుతశిల్పంగా మనకు కనిపిస్తుంది. నవలాంతంలో ఆండ్రూ రాకుమారుని కొడుకు నికోలింకా తన తండ్రి గురించి వ్యక్తం చేసిన భావాలు నవలకు ఒక గొప్ప ఆకర్షణీయమైన ముగింపు నిచ్చాయి. కొన్ని వందల చరిత్ర భూగోళానికి సంబంధించిన గ్రంథాలు చదివి, దాదాపు 6 సం॥లకు పైగా అమితంగా శ్రమించి రాసిన ఈ బృహన్నవలను పాఠకులు కొంత శ్రమ పడి చదివితే గొప్ప మానసిక ఆనందాన్నీ, ప్రశాంతతనూ, ప్రపంచంలోనే ఒక మహోన్నతమైన ఉత్తమ కళఖండాన్ని దర్శించిన అనుభూతినే పొందుతారు.

ఇక చూడండి ఈ నవలలోని ప్రధాన కథను. తెలుగు అనువాదం 3 భాగాలుగా ప్రచురితమైంది. చూడండి:

1వ భాగము:

పీటర్, ఆండ్రూ రాకుమారుడు, ఇద్దరూ మిత్రులు. విదేశాల నుంచి తిరిగొచ్చాక పీటర్స్‌బర్గ్ పట్టణంలో మొదటిసారిగా వారు 'అన్నాపాల్ లోవ్‌నా' అనే అంతఃపుర సంబంధాలు గల స్త్రీ ఇంట్లో జరిగిన టీ పార్టీలో కలుసుకున్నారు. ఆండ్రూ పీటర్‌ని తనింటికి భోజనానికి ఆహ్వానించాడు. ఆండ్రూ తాను యుద్ధరంగానికి వెడుతూ, తన భార్య అయిన లీసాను మారుమూలకు గ్రామంలో ఉంటున్న తన తండ్రీ, చెల్లెళ్ల వద్దా ఉంచి వెడుతున్నందున, పట్టణ జీవితానికి అలవాటు పడ్డ ఆమె, భర్త తనను విడిచి వెడుతున్నందుకు పీటర్‌కు ఫిర్యాదు చేసింది. పెళ్లాడటం వల్ల చాలా కష్టాలున్నాయని మిత్రుడితో చెప్పాడు ఆండ్రు. "నువ్వు ఒక స్త్రీతో ముడిపెట్టుకున్నావు అంటే, ఆజన్మాంతం బానిసవేనన్నమాట! నీలో అంతర్నిహితమైన మూల శక్తులు ఎండిపోతాయి. సమాజంలో సీతాకోక చిలుకల్లా తిరిగే స్త్రీలను చూస్తే, వారిలో ఏదో గొప్పదనం ఉందని నీవు భ్రమించవచ్చుగానీ, నిజానికి వారిలో ఏదీలేదు" అన్నాడు ఆండ్రూ. మిత్రుడి మీద పీటర్‌కు ఎంతో భక్తిశ్రద్ధలున్నాయి. అలాంటివాడే ఇలా వాపోవడం అతడికి ఆశ్చర్యాన్ని కలిగించింది. "నీవంటే నాకెంతో ఇష్టం. కారణం నీవో సజీవ వ్యక్తివి. కారగిన్ల బ్రేసిల్ రాకుమారుని కుటుంబల పొత్తు మాత్రం వదులుకో. ఆ భ్రష్ట జీవితం నీకు తగింది కాదు" అని సలహా యిచ్చాడు ఆండ్రు. విదేశాల నుంచి తిరిగొచ్చింతర్వాత పీటర్‌కు పీటర్స్‌బర్గ్ సమాజీయులతో పరిచయం పెంచుకుని భవిష్యత్తులో ఏంచేయాలో నిర్ణయించుకునేందుకు కొంత డబ్బు ఇచ్చి అతని తండ్రి బేసిల్ రాకుమారుని ఇంట్లో ఉంచాడు. బేసిల్ కొడుకు భ్రష్టులు. ఆ విషయమే ఆండ్రూ చెప్పాడు. అలాగేనని ఆండ్రూకు వాగ్దానం చేసిన పీటర్, ఆ ఇంటి నుండి వచ్చింతర్వాత, బేసిల్ రెండో కొడుకు ఆనెటోవ్ ఇంట్లో జూదగాళ్లంతా సమావేశమవుతారని తెలిసి అక్కడికి వెళ్లకుండా ఉండలేకపోయాడు. ఆనెటోవ్ ఇంటికెళ్లి తెగతాగి, జూదగాడయిన 'డొలొహోవ్'తో పాటు ఆనెటోవ్ తనూ కలిసి ఒక ఎలుగుబంటి పిల్లను రోడ్డుపై లాక్కెడుతూ, అడ్డొచ్చిన ఒక పోలీసు అధికారి వీపుకు ఆ పిల్లను కట్టి కాలువలో పడేశారు. ఎలాగో ఆ అధికారి ప్రాణాలు దక్కించుకోగా, పీటర్‌ను నగర బహిష్కారం విధించే, డొలొహోవ్ సైన్యంలోని పదవిని తగ్గించారు. కాగా ఆనెటోవ్‌ను తండ్రి ఆదుకున్నాడు.

ఆస్తి పోగొట్టుకున్న డ్రౌబెట్‌స్కాయ్ రాకుమారి అయిన 'అన్నా మైఖెలోవ్‌నా' తన కొడుకు బోరిస్‌కు సైన్యంలో ఉద్యోగం కోసం బేసిల్‌ను ఆశ్రయించింది. ఆయన చక్రవర్తికి సిఫారసు చెయ్యగా, బోరిస్‌కు సేనాదళంలో సబ్‌లెఫ్టినెంట్ ఉద్యోగం వచ్చింది. అయితే కొడుకు ఉద్యోగంలో చేరేందుకు దుస్తులకైనా డబ్బు లేదు. అందుకోసం ఆమె మాస్కో వెళ్లి కౌంట్ రోస్టోవ్ భార్యకు తన పేదరికం బాధలు వెళ్లబోసుకుంది. కౌంటెస్‌కు అన్నా సన్నిహితురాలు. అదీగాక బోరిస్ వాళ్లింట్లోనే ఎక్కువ ఉంటాడు. సహాయం కోసం కౌంట్ బేజ్కోవ్ నడుగుదామని ఆ ఇంటికెళ్ళిందావిడ. అయితే అమిత ధనవంతుడయిన బేజ్కోవ్ జబ్బుగా ఉండి ఇవాళో రేపో అన్నట్లున్నాడు. పీటర్ బేజ్కోవ్ జారపుత్రుడు. బేజ్కోవ్ బంధువయిన బేసిల్ రాకుమారుడు మరికొందరితో కలిసి కుట్రపన్ని బేజ్కోవ్ ఆస్తి కాజేద్దామని పథకం వేశాడుగానీ, అన్నా మైఖెలోవ్‌నా ఆ పథకాన్ని వమ్ము చేసింది. బేజ్కోవ్‌కు వివాహం కాలేదు. కానీ అక్రమ సంబంధాల వల్ల చాలామంది పిల్లలున్నారు. వారిలో పీటర్ అంటే అతడికి ఇష్టం. అతడి పేరనే అతడు తన ఆస్తిని రాశాడు. అన్నా చాకచక్యం వల్ల పీటర్ వారసుడయ్యాడు. ఈ విషయంలో అన్నా ఎంతో సహాయపడింది. కానీ ఆమె సమస్య తీరలేదు. అయితే తమ కుటుంబం అప్పుల ఊబిలో చిక్కుకున్నప్పటికీ, కౌంటెస్‌రోస్టోవ్ తన భర్తనడిగి డబ్బుతీసుకుని అన్నాకిచ్చింది. బోరిస్‌కు బట్టలుకొనేందుకు తనకానుకగా!

ఆండ్రూ రాకుమారుడు తన భార్య లీసాను తీసుకుని తన తండ్రి ఉండే 'లిస్సీ-గోరీ'కి వెళ్లాడు. తండ్రి నికోలస్ బోల్‌కోన్‌స్కీ రాకుమారుడు, చెల్లి మేరియారాకుమారి ఆండ్రూ భార్యతో సహా రావడం చూచి ఎంతో సంతోషించారు. మేరియాకు అన్న అంటే ఎంతో ప్రేమ గౌరవం. అయితే ఆండ్రూ, లీసాల మధ్య అసంతోషాన్ని గమనించిన ఆమె, వదినెను అర్థం చేసుకోమని అన్నను కోరింది. "ఇతర్ల కష్టాలను మనం అర్థం చేసుకోవడమంటే - మనం వాళ్లను క్షమించడమన్నమాట. గర్భిణియైన ఆమె భర్తకు దూరమై మారుమూల గ్రామంలో ఒంటరిగా జీవించడం ఎంతకష్టమో ఆలోచించు" అన్నది అన్నతో ఆమె. ఆమె తర్కాన్ని అంగీకరించని ఆండ్రూ, "నువ్వు మాత్రం గ్రామంలో ఉండటం లేదా? ఈ జీవితం నీకు దుర్భరంగా ఉందా?" అని ప్రశ్నించాడు. "దయగా ఉండు ఆండ్రూ. లీసాపట్ల కఠినంగా ఉండకు" అందామె. "నేనామెను ఏమన్నాను మేరియా? నీవెందుకలా మాట్లాడుతున్నావు?" అర్థంగాక అడిగాడు ఆండ్రూ. తానెప్పుడు ఆమెనేమీ అనలేదని, ఇక ముందు కూడా అనననని, అయితే ఇద్దరం కూడా సుఖంగా లేమని అంగీకరించాడు ఆండ్రూ. తను కనగానే చనిపోతానని లీసా భయపడుతున్నట్లు మేరియా చెప్పేసరికి, ఆండ్రూ ఎంతో విచారించాడు. యుద్ధరంగానికి వెళ్లేముందు తండ్రి దగ్గర శలవు తీసుకోబోతూ, లీసా భయం గురించి చెప్పి, కనే సమయంలో మాస్కో నుంచి డాక్టర్‌ని పిలిపించేట్లు వాగ్దానం తీసుకున్నాడు.

మూడో రాజ్యకూటమిలో ఉన్న తన మిత్ర రాజ్యం ఆస్ట్రియాపై ఫ్రాన్స్ చక్రవర్తి నెపోలియన్ దాడి చెయ్యడంతో 1805 అక్టోబర్‌లో తన మిత్రునికి సహాయం చెయ్యడం కోసం రష్యన్ సైన్యం ఆస్ట్రియాకు తరలి వెళ్లింది, చీఫ్ కమాండర్ కొటొజోవ్ ఆధ్వర్యంలో. 'బ్రానా'లో ప్రస్తుతం కొటొజోవ్ విడిది చేసి ఉన్నాడు. రష్యన్ సేన పురోగమనం మందంగా సాగుతూండటం గురించి ఆస్ట్రియా సుప్రీం వార్ కౌన్సిల్ సభ్యుడు కొటొజోవ్‌తో మంతనాలు సాగించేప్పుడు అక్కడే ఉన్నాడు ఆండ్రూ, కొటొజోవ్‌కు సహాయసేనాధిపతిగా. నెపోలియన్ దళాలతో రష్యన్ దళాలు పలుసార్లు ధైర్య సాహసాలతో పోరాడినప్పటికీ, నిజానికి రష్యన్లది పలాయనమే. అయితే ఒకచిన్నదాడిలో రష్యన్లకు విజయం లభించడంతో, ఆ విజయవార్తను ఆస్ట్రియన్ రాజుకు అందించమని కొటొజోవ్ ఆండ్రూను పంపించాడు. ఈ దాడిలో ఆండ్రూ చేతిని రాసుకుంటూ తుపాకీ గుండు దూసుకుపోయింది కూడా. అయితే ఆండ్రూను ఆస్ట్రియన్ చక్రవర్తి అంతగా ఆదరంతో స్వీకరించకపోవడంతో, అసంతృప్తి చెందడతడు.

ఇంతలో రష్యన్ సేనకు ప్రమాదం ముంచుకొచ్చే పరిస్థితి ఏర్పడింది. ఫ్రెంచి సైన్యం 1,50,000 మంది వియన్నా వంతెనదాటి, రష్యా నుంచి వచ్చే కొత్త దళాలతో పోరాడుతున్నారు. అది ముగిశాక మిగిలిన వారు కొటొజోవ్ పై దాడిచేస్తే అతనికి తీవ్ర అవమానం తప్పదు. అంచేత వారు రాకముందే కొటొజోవ్ తన దళాలతో కొత్త దళాలను కలవాలి. ఇది జరగాలంటే అతన్ని మధ్యలో ఫ్రెంచి దళాలు అడ్డగించకుండా ఉండాలి. ఇదంతా సజావుగా సాగడం కోసం రహదారిని ఆక్రమించి ఫ్రెంచి సేనల్ని నిలువరించడం కోసం అడ్డదారిలో బెగ్రేషియన్ రాకుమారుని అధ్వర్యంలో 4000 మంది పురోగామి దళాలను పంపాడు కొటొజోవ్. తనను బేగ్రేషియన్ వద్ద పనిచేసేందుకు అనుమతించమని ఆండ్రూ కోరగా, "నాకు మంచి ఆఫీసర్లు కావాలి. రేవు సాయంత్రం అతని సేనలో పదోవంతు తిరిగొచ్చినా భగవంతుడు మేలు చేసినట్లే" అన్నాడు కొటొజోవ్. దాంతో ఆండ్రూ తనకు తెలీకుండానే కొటొజోవ్ గుడ్డి కంటివంకా, కణతలపై గల గాయం మచ్చ వంకా చూశాడు. అవి టర్కిష్ యుద్ధం గుర్తులు! "అవును. ఇంతమంది మృత్యువును గురించి ఇంత చల్లగా మాట్లాడే హక్కు ఇతనికి ఉంది" అనుకున్నాడు ఆండ్రూ. చివరికి అనుమతి సంపాదించి బేగ్రేషియన్ ఉన్న 'గ్రంత్'కు చేరాడు ఆండ్రూ. ఫ్రెంచ్ సేనానాయకుని రాజీ అనే తప్పిదం వల్ల బెగ్రేషియన్ కులాసాగా ఉన్నాడు. ఇది తెలిసి మండిపడుతూ నెపోలియన్ స్వయంగా అక్కడికి వచ్చాడు. ఆండ్రూ కొటొజోవ్‌కు ప్రియతమ సహాయ సేనాధిపతి అని తెలిసిన బెగ్రేషియన్, ఆండ్రూను సాదరంగా ఆహ్వానించాడు. ఆండ్రూ సమరభూమిని పరిశీలిస్తూండగానే యుద్ధం ప్రారంభమైంది. ఆ సంకుల సమరంలో కొద్దిపాటి రష్యన్ సైన్యం అపార ఫ్రెంచి సేనను వీరోచితంగా నిలువరించింది. ఒక పోరాటంలో కౌంట్‌రోస్టోవ్ పెద్దకొడుకు నికోలస్ చేతికి గాయమైంది. యుద్ధానికి ముందు బూట్లు తొడుక్కోకుండా ఉన్నందుకు చివాట్లు తిన్న ఫిరంగిదళం కెప్టెన్ 'టుషైన్' యొక్క అపార ధైర్యసాహసాల వల్లనే ఫ్రెంచ్ సైన్యం నిలవరించబడింది. ఇంతలో కొటొజోవ్ తన దళాలతో వచ్చి బెగ్రేషియన్‌ని కలుసుకున్నాడు.

యుద్ధరంగంలో పరిస్థితి ఇలా ఉండగా, మాస్కోలో నడమంత్రపు సిరి దక్కిన పీటర్‌ను తన ప్రభావంలోనే ఉంచుకునేందుకు బేసిల్ రాకుమారుడు అతని ఆస్తి వ్యవహారాలు

చేజిక్కించుకోవడమేగాక, తన తళుకుబెళుకుల అందాల కూతురు హెలెన్‌ను పీటర్‌కిచ్చి వివాహం చేశాడు. ఆమెను వివాహం చేసుకుంటే అది తన నాశనానికే దారితీస్తుందని అనుకుంటూనే, పీటర్ అందుకంగీకరించాడు. ఆపై బేసిల్ తన అల్లరిచిల్లరి రెండో కొడుకు ఆనెటోల్‌కు శ్రీమంతురాలైన ఆండ్రూ చెల్లెలు మేరియాతో వివాహం జరపాలనుకుని, కొడుకుతో సహా 'లిస్సీగోరీ'కి వెళ్లాడు. ఆండ్రూ తండ్రికి ఈ వివాహం ఇష్టం లేదుకానీ, ఆండ్రూ భార్య లీసాకు మాత్రం ఇష్టమే. ఆనెటోల్ అందం మేరియాను ఆకర్షించిందిగానీ, ఆనెటోల్ అసభ్యకర వర్తన కళ్లారా చూడటంతో బేసిల్ ఎత్తుగడ ఫలించక తిరుగుమోహం పట్టాల్సివచ్చింది.

యుద్ధంలో గాయం అనంతరం నికోలస్‌కు ప్రమోషన్ లభించింది. మరోపక్క బోరిస్ కూడా ప్రమోషన్ కోసం ఆండ్రూ సహాయం అర్థించాడు. ఆండ్రూ అందుకంగీకరించి, కొటొజోవ్ వల్ల పనిజరగదని, చక్రవర్తి వద్ద పనిచేసే "డోల్ గొరొకోవ్"ని కలుసుకోవాలనీ చెప్పి, అక్కడికి వెళ్లారు. ఆ రోజు జరిగిన యుద్ధ సమావేశంలో కొటొజోవ్‌లాంటి వృద్ధుల మాటలకు విరుద్ధంగా నెపోలియన్‌ను ప్రతిఘటించాలని తీర్మానించారు. దాంతో మర్నాడే సేనాదళాలు కదలడం వల్ల ఆండ్రూ ప్రయత్నం ఫలించలేదు.

నవంబరు 17న నెపోలియన్‌కూ, జార్‌కూ ఒక సమావేశం జరపడం కోసం ఫ్రెంచ్ రాయబారి వచ్చాడు గానీ, దాన్ని నిరాకరించాడు జార్. 18, 19 తేదీలలో రష్యన్ సేనలు వేగంగా పురోగమించాయి. మొదట ఫ్రెంచివారు కొద్ది యుద్ధం చేసి వెనక్కు తగ్గారు. అయితే 19నాడు ఒక అసాధారణ సంచలనం ఆరంభమై 25 దాకా ఉంది. ఆరోజే 'ఆస్టర్ లిడ్జ్' మహా సమరం ఆరంభమైంది. ఇదే 'ముగ్గురు చక్రవర్తుల యుద్ధంగా' చరిత్ర ప్రసిద్ధికెక్కింది. దీంతో 3వ రాజ్య కూటమి విచ్ఛిన్నమయింది.

19వ తేదీ రాత్రి సేనాధిపతుల సమావేశం జరిగింది. సేనల త్వరితగతి పురోగమనాన్ని ఆకాంక్షించేవారికి విరోథర్ నాయకుడు. అతను ఉత్సాహవంతుడు. అతను తన పథకాన్ని చదువుతూ పోయాడు. మిల్లు చక్రాలు ఆగిన వెంటనే మిల్లర్ కళ్లు తెరిచినట్లు, అప్పటికే నిద్రపోయిన కొటొజోవ్ తన ఒంటి కంటిని తెరిచాడు. ఈయన పక్షానికి చెందిన 'లాంగరెన్' కొన్ని అభ్యంతరాలు వ్యక్తం చేసినా లాభం లేకపోయింది. ఆండ్రూకూ కొన్ని అభ్యంతరాలున్నాయి గానీ, అతనికి మాట్లాడే అవకాశం లేకుండా పోయింది. "ఇరుపక్షాల వాదనల్లో ఏది నిజం? కొటొజోవ్ తన అభిప్రాయాలను చక్రవర్తితో ఎందుకు చెప్పడు? వేల ప్రాణాలు ఇలా వ్యక్తిగత ప్రయోజనాలకు బలికావలసిందేనా? అవును. నేను రేపు చంపబడవచ్చు" అనుకున్నాడు ఆండ్రూ. తన వారంతా గుర్తొచ్చారు. రేపు అంతా ముగిసిపోతుంది. నేను ఏమిటో, ఎందుకోనమో రేపు చూపించాల్సి ఉంది'' అనుకున్నాడతడు. విరోథర్ పథకాన్ననుసరించి రష్యన్ సేనలు వేగంగా పురోగమించాయి. మంచు దట్టంగా ఉండటం వల్ల శత్రుసేనల జాడలు రష్యన్లకు తెలియలేదు. రష్యన్ల సేనలో అధికభాగం 'ప్రెటజన్' మిట్టదిగి, నీటి మడుగు వైపు వెడుతోంది. ప్రధాన స్థావరమైన ప్రిటజన్ మిట్ట బలహీనమవడాన్ని నెపోలియన్ గమనించిదానిపై దాడికి ఆజ్ఞనిచ్చాడు. మిట్టమీదున్న కొటొజోవ్ పథకానికి విరుద్ధంగా మెల్లగా పోతున్నాడు. అయితే జార్ ఆజ్ఞ మేరకు వేగంగా వెళ్ళాల్సివచ్చింది. ఇంతలో హఠాత్తుగా ఫ్రెంచిసేనలు మిట్టమీద దాడి చెయ్యడంతో ఊహించని రష్యన్ దళాలు నివ్వెరపోయాయి. "ఇదే క్షణం! నేను నా ప్రతిభను చూపించాల్సిన అదును ఇదే!" అనుకున్నాడు ఆండ్రూ. కొటొజోవ్‌తో దళాన్ని అదుపు చేయాలని చెప్పాడు కానీ, ఇంతలో దట్టమైన పొగ కమ్మి వేసింది. ఒక భయంతో కుంగిన కంఠం "అంతా అయిపోయింది" అని అనగానే, ఆ మాటే ఉత్తర్వులాగా భావించి రష్యన్ సేనలు చెల్లాచెదురై పరిగెత్త సాగాయి. వారిని అదుపు చెయ్యాలని చూడడం వెర్రి తనమే. దాన్నితట్టుకు నిలబడలేకపోయాడు ఆండ్రూ. వెనక్కు మళ్లకపోతే బందీ అవుతాడని కొటొజోవ్‌ని నెస్‌విట్‌స్కీ కేకేశాడు గానీ, కొటొజోవ్ కదలకుండా నిలబడి, నెత్తురు కారుతున్న చెక్కిలిని జేబురుమాలుతో ఒత్తుకోసాగాడు. ఆయన దగ్గరకెళ్ళి, "దెబ్బతగిలిందా?" అని ఆండ్రూ అడిగేసరికి, "దెబ్బ తగిలింది ఇక్కడ కాదు, అక్కడ!" అంటూ కొటొజోవ్ దూరంగా పరుగులు తీస్తున్న సైనికుల్ని చూపాడు. "వారిని ఆపండి" అని ఆయన అరిచాడుగానీ, వినిపించుకునేదెవరు? గందరగోళంలో ఉన్న వాహినిని చీల్చుకువెడుతున్న కొటొజోవ్‌ను కలవడానికి ఆండ్రూ ప్రయత్నించాడు. ఇంతలో ఫ్రెంచివారు కొటొజోవ్‌ని గుర్తించి ఆయనపైకి గుళ్ల వర్షం కురిపించగా పలువురు సైనికులు మరణించారు. పతాకం కిందికి జారింది. కొటొజోవ్ బాధతో మూలిగాడు. దాంతో ఆండ్రూ రాకుమారుడు బాధతోను, సిగ్గుతోను కన్నీళ్లు పెట్టుకుని గుర్రాన్ని ముందుకు దూకించి, పతాకాన్ని పట్టుకుని, రమ్మని సైనికుల్ని పిలిచాడు. మళ్లీ తుపాకులు మోగగా, మరికొందరు కూలారు. "హుర్రా" అంటూ పతాకాన్ని అతికష్టం మీద పైకెత్తుతూ, ఆండ్రూ ముందుకురికాడు. ఒక సార్జెంటు దాన్నందుకున్నాడుగానీ, గుండుతగిలి అతనూ పడిపోతుంటే, ఆండ్రూ దాన్ని లాక్కుని ముందుకు నడిచాడు. మరల జరిగిన కాల్పుల్లో తలకు పెద్ద దెబ్బ తగిలి పడిపోయాడు. ఆ సాయంకాలానికి రష్యన్ల పరాజయం పరిపూర్తయింది!

యుద్ధరంగాన్ని పరిశీలించడానికొచ్చిన నెపోలియన్ ఆండ్రూను చూసి "అద్భుతమైన మరణం!" అన్నాడు. అయితే అతను మూలగడంతో బతికున్నాడని గ్రహించి, అంబులెన్స్ దగ్గరకు చేర్పించాడు. ఆ తర్వాత ఆండ్రూ స్పృహతప్పాడు. డోలీలో ఉండగానే అతను సంధిలో పడిపోయాడు. అతను ఇక జీవించే ఆశలేదని భావించిన డాక్టర్ స్థానికులకు అప్పగించాడు. 'ఆస్టర్‌లిడ్జ్' పరాజయం వార్తలు రష్యన్‌లు నమ్మలేదు. కొటొజోవ్ పట్ల అయిష్టం, బెగ్రేషియన్ పట్ల గౌరవం కలిగింది అందరికీ. ఆండ్రూ గురించి ఎవరూ చెప్పుకోలేదుగానీ, అతని అకాల మరణానికి అతని బంధువులు మాత్రం వాపోయారు. అయితే ఈవార్తను 'లీసా'కు తెలియనీయలేదు. 1806 మార్చి 9న మంత్రసానిని పిలిచారు. డాక్టర్‌కి కబురెళ్లింది. వాకిట్లో బండిచప్పుడైతే, డాక్టర్ వచ్చాడనుకున్నారుగానీ అనుకోని విధంగా ఆండ్రూ వచ్చాడు! అతని రాక అందరికీ అమిత సంతోషాన్ని కలిగించింది. అతను తనతో డాక్టర్‌ని తీసుకొచ్చాడు. భర్తను చూసి లీసా కళ్లు తళతళలాడాయి. ఆ కళ్లు "నేను అందర్నీ ప్రేమిస్తున్నాను. నేనెవరికీ హానీ చెయ్యలేదు. నన్నెందుకు శిక్షించాలి?" అని

చెబుతున్నట్లుగా ఉన్నాయి. "నా చిన్నారి హృదయమా!" అని అతడామెను పిలిచాడు. అంతకు ముందెప్పుడు అతడలా పిలవలేదు. మరికొద్ది నిమిషాలకు లీసా కొడుకుని కని, మరణించింది. ఆమె ముఖం "నీవు నాకు ఏంచేశావు?" అని ప్రశ్నిస్తున్నట్లుగా ఉంది.

నికోలస్ తనదళం కెప్టెన్ 'డెనిసోవ్'తో పాటు సెలవుపై ఇంటికి రాగా, అంతా అతనికి ఒక వీరునికి వలె ఘనస్వాగతం పలికారు. కౌంట్‌రోస్టోవ్ పెద్దవిందు ఏర్పాటు చేశాడు. పీటర్ విషయానికొస్తే, అతని భార్య హెలెన్ అవినీతి వర్తన సమాజంలో అందరికీ తెలిసింది. 'డొలొహోవ్'తో ఆమె తిరుగుళ్ళని గమనించిన పీటర్, అతణ్ణి ద్వంద్వ యుద్ధానికి ఆహ్వానించి, గాయపరిచాడు. డొలొహోవ్‌కు సహాయకుడిగా వెళ్లిన నికోలస్ అతనితో స్నేహంగా ఉన్నాడు. నికోలస్ ప్రేమించిన సోనియాను డొలొహోవ్ పెళ్ళికి ప్రతిపాదించగా, ఆమె తిరస్కరించింది. ఆపై డొలొహోవ్ దళానికి తిరిగి వెడుతూ, నికోలస్‌ని విందుకు పిలిచాడు. జూదరిగా పేరొందిన డొలొహోవ్‌తో పేకాడి పెద్ద మొత్తంలో 43,000 రూబుల్ని పోగొట్టుకున్న నికోలస్, ఆ డబ్బు చెల్లించేందుకు అసలే అప్పుల్లో ఉన్న తండ్రిని తప్పనిసరై అడిగాడు. నికోలస్‌తో వచ్చిన డెనిసోవ్ నటాషాకు పెళ్లి ప్రతిపాదన చేశాడు. అంతకుముందే బోరిస్‌కు మొదటి ముద్దిచ్చిన నటాషా తిరస్కరించేసరికి, కన్నీళ్లతో అతను వీడ్కోలు చెప్పాడు.

డొలొహోవ్‌తో ద్వంద్వ యుద్ధం చేసిన పీటర్‌తో హెలెన్ తగాదా పడింది. ఇక తాను ఆమెతో కలిసి ఉండడం కల్ల అని పీటర్ స్పష్టం చేసేసరికి, సగం ఆస్తి కోరింది. హెలెన్ అలాగే ఇచ్చి పీటర్ ఆమెకు దూరమయ్యాడు. ఈ బాధతో దూరంగా వెళ్లిపోయిన అతణ్ణి క్రీస్తు స్వచ్ఛంద మతానికి చెందిన 'బస్‌డియోవ్' అనేవాడు కలుసుకుని, తమ మతంలో చేరమని ఆహ్వానించాడు. పీటర్ అంగీకరించి వారు పెట్టిన ఎన్నో మతపరమైన పరీక్షలు ఎదుర్కొని, తన కాలాన్ని, ధనాన్ని ఆ మత ప్రచారానికి వెచ్చించసాగాడు.

మళ్లీ యుద్ధం వచ్చింది. ఈసారి ఆండ్రూ తండ్రి వృద్ధ 'నికోలస్ బోల్‌కోన్‌స్కీ'ని రష్యన్ సైన్యాధిపతుల్లో ఒకనిగా నియమించారు. ఆయన తనకప్పగించిన మూడు రాష్ట్రాల బాధ్యతలూ చూడసాగాడు. ఆండ్రూ కొడుకు నికోలింకా బాధ్యతలు మేరియా చూస్తోంది. భార్య స్మృతులతో విషాదంలో మునిగిన ఆండ్రూ రాకుమారుడు తన స్వంత 'బొగోషరోవా' ఎస్టేట్‌లో విరాగిగా ఉండసాగాడు. ఆస్టర్ లిడ్జ్ సమరం తర్వాత మిలటరీ జీవితం నుండి దూరంగా ఉండసాగాడు. ఈ సమయంలోనే పీటర్ అతన్ని కలుసుకోవడానికి వచ్చాడు.

పీటర్ కొత్త మతంలో చేరాక, తన ఎస్టేట్‌లలోని బానిసలకు మేలు చెయ్యడంలో కొత్త సోదరుల సూచనలు తీసుకొని తన రైతులను బానిసత్వం నుంచి విముక్తి చేయించాలనుకున్నాననీ, ఈలోగా వారికీ, స్త్రీలకు పిల్లలకూ తక్కువ పని ఇవ్వాలని, ఆసుపత్రులు, సత్రాలు, బళ్లూ కట్టించాలనీ మేనేజర్లకు పురమాయించాడు. వారు అతన్ని మోసం చేస్తూ ఏవో కట్టడాలు చూపించారు. అయితే వాటి నిర్మాణ శ్రమలో జనానికి బాధలే తప్ప, సుఖాలు కలగడం లేదని పీటర్ గ్రహించలేకపోయాడు. అతడు తన ఎస్టేట్లు సందర్శిస్తూ ఆండ్రూ దగ్గరకొచ్చి, తాను సాగిస్తున్న అభివృద్ధి పనుల గురించి అతడికి ఉద్వేగంగా వివరించాడు. తోటివారిపై ప్రేమ, ఆత్మత్యాగం ఉండాలని పీటర్ చెప్పగా; ఆండ్రూ ఇలా అన్నాడు "ఏ మనిషి బతుకు ఆ మనిషిది. నేను నీకు పూర్తిగా విరుద్ధం. నేను సౌఖ్యం కోసం, కీర్తి కోసం బతికాను. కీర్తి కూడా ఒకరకంగా తోటివాణ్ణి ప్రేమించడమే. అంటే తోటివాడికి సేవ చేసి, దాని ద్వారా అతని ప్రశంసలు పొందడమే. అంటే నేనూ ఒక విధంగా ఇతరుల కోసం బతికాననుకోవచ్చు. ఇప్పుడు నాకోసం జీవించడం మొదలెట్టాక, నీ మనస్సుకు హాయి చిక్కింది" అన్నాడు. పీటర్ ఆస్తిక భావాలను ఖండిస్తూ వాటితో పాటు అతని సిద్ధాంతాలను కూడా కాదని ఆండ్రూ మాట్లాడాడు గానీ, నిజానికి అతడు స్వార్థపరుడుకాడు. భార్య చనిపోయి విషాదంలో ఉన్నాడు. ఆమెపట్ల తాను చేశాననుకుంటున్న అపరాధభావంతో కుంగిపోతున్నాడు.

ఇటు యుద్ధరంగంలో అనేక తిరోగమనాలు పురోగమనాలు, చిన్న చిన్న పోరాటాల తర్వాత రష్యన్ సేనలు కడకు 'బార్టెన్‌స్టిన్'లో కేంద్రీకరించబడ్డాయి. మంచు విపరీతంగా కురుస్తుండడంతో ఆహారం సప్లైలు రావడం కష్టమై సైనికదళాలు కరువులో, అనారోగ్యంతో తీవ్రంగా కుదేలవుతున్నాయి. గెనుసుగడ్డలు తినకూడదని చెప్పినా, సైనికులు వాటినే తింటున్నారు. డెనిసోవ్ దళం ఏప్రిల్ నెలంతా ఓ జర్మన్ గ్రామం దగ్గర కాంప్ చేసి, ఈ గెడ్డలనే తింటున్నారు. ఒకరోజు డెనిసోవ్ తమదికాని ఓ ఆహార సప్లైవాన్‌ను బలవంతంగా దారి మళ్లించుకునివచ్చాడు. "ఇది దోపిడీ" అని దాని వెంట ఉన్న ఆఫీసర్లు చెప్పినా, "నేను సంజాయిషీ చెప్పుకుంటాను. నీ వాళ్ళు చనిపోవడానికి నేనంగీకరించను" అన్నాడు డెనిసోవ్. అయితే దీనివల్ల అతన్ని ప్రధాన కార్యాలయానికి హాజరై సంజాయిషీ చెప్పుకోమని తాఖీదు వచ్చింది. అంతకుముందే అతడు కాల్పుల్లో గాయపడి ఆస్పత్రిపాలయ్యాడు. దాంతో ఆ దళంలోని నికోలస్ రోస్టోవ్ తనకు తెలిసిన వాళ్ల ద్వారా చక్రవర్తికి డెనిసోవ్ తరవున విజ్ఞప్తి చెయ్యడానికి 'టిల్‌సిట్' బయలుదేరాడు. జూన్ 13న అలెగ్జాండర్ (జార్), నెపోలియన్‌లు అక్కడ కలుసుకుని సంధి చేసుకున్నారు. అక్కడ పై పదవి సంపాదించిన బోరిస్ ఉన్నాడు గానీ, అతడు సహాయం చెయ్యడని నికోలస్‌కు అర్థమైంది. మరొక జనరల్ ద్వారా నికోలస్ విజ్ఞప్తి పత్రాన్ని చక్రవర్తికి అందజేశాడు.

2వ భాగము:

1808లో జార్ అలెగ్జాండర్‌తో నెపోలియన్ మరోసారి సంభాషించడానికి 'ఎర్‌ఫర్ట్' విచ్చేశాడు. 1809లో ఇద్దరికీ గాఢమైత్రి ఏర్పడింది. నెపోలియన్ ఈసారి ఆస్ట్రియాపై యుద్ధం ప్రకటించగానే జార్ తన దళాల్లో ఒకదాన్ని ఆస్ట్రియాపైకి దండయాత్రకు పంపించాడు. ఈ విధంగా మిత్రులు శత్రువులుగాను, శత్రువులు మిత్రులుగాను మారారు.

ఇక ఆండ్రూ విషయానికొస్తే, అతడు పీటర్‌లా పట్టుదల లేనివాడు కాడు. మిత్రుడు చెయ్యలేని పనులనతడు ఆడంబరం లేకుండ ఆచరణలో పెట్టాడు. ఒక పని తలపెట్టాడంటే అతడు దాన్ని సాధించి తీరేదాకా వదిలిపెట్టడు. తన ఎస్టేట్లలో ఒకదాంట్లో అతడు రైతుల్ని స్వతంత్రుల్ని చేశాడు. రైతు విముక్తి సంఘటనల్లో ఇదొక తొలి సంఘటన! రైతాంగం పిల్లలకు చదువుకోవడానికి అవకాశాలు కల్పించాడు. అతడు తన తీరిక సమయాల్లో గత యుద్ధాల్లో జరిగిన నష్టాన్ని గురించి, సైనిక వ్యవస్థ నియమావళిలో తీసుకురావలసిన

సంస్కరణల గురించి ఆలోచించసాగాడు. అతడు తన కుమారుని సంరక్షకునిగా తన బాధ్యతలను నిర్వర్తించడానికి జిల్లా మార్షల్ అయిన కౌంట్ రోస్టోవ్ ఉండే 'ఆట్రెడ్నో' భవనానికి వెళ్లాడు. భవనం సమీపించే సరికి దారిలో చెట్ల పొదల్నుంచి కిలకిలలాడుతున్న ఆడపిల్లల గుంపు అతని బండిని చూసేందుకు పరుగెత్తుకొచ్చింది. వారిలో ఒక చలాకీ పిల్ల నటాషా అతన్నాకర్షించింది. అతిథ్యం ఇవ్వడంలో ఆసక్తి చూపే కౌంట్‌రోస్టోవ్ అతన్ని ఆ రోజు ఉండిపొమ్మన్నాడు. ఆ రాత్రి ఆ పిల్ల గురించే ఆలోచిస్తూ నిద్రరాక గది కిటికీ తెరిచాడు. పండువెన్నెల్లో కిటికీపక్కనే తిరుగుతూ తిరిగి ఆ పిల్లలు కనిపించారు. మిగిలిన పిల్లలు నిద్రపోదాం రమ్మంటున్నా, ఆ పిల్ల వెన్నెల రాత్రిని ఆస్వాదిద్దామంటున్న మాటల్ని గమనించి, "వీళ్ళకు నా సంగతి ఏంపడుతుంది?" అనుకున్నాడు. వచ్చేప్పుడు అతను దారిలో ఆకుల చాందినీ పరుచుకున్న ఒక వృక్షాన్ని చూశాడు. లోగడ ఒకసారి ఆ దారిన వెళ్లినప్పుడు ఆ ముసలి వృక్షం మోడులా కనిపించింది. ఇప్పుడది ఎంతలా మారిపోయింది! పునరుజ్జీవనంలోని ఆనందమంతా అతని హృదయంలోకి పరుగులు తీస్తూ వచ్చింది. వెన్నెల రాత్రి తనను మరపించిన అమ్మాయి జ్ఞాపకానికి వచ్చింది. "లేదు నా జీవితం 31కే ముగిసిపోతుందా? నన్ను గురించి నేను తెలుసుకున్నది చాలదు. ఇతర్లకూ తెలియాలి!" అనుకున్నాడు ఆండ్రూ రాకుమారుడు.

ఇంటికి రాగానే, త్వరలోనే పీటర్స్ బర్గ్ వెళ్లాలనుకున్నాడు. తన ప్రయాణం కోసం సాకు కోసం ఆలోచిస్తే, ఎన్నో కనిపించాయి. ప్రతిదీ అవసరంగానే కనిపించింది. ఒక నెల కిందట తన గ్రామం ఒదిలిపెట్టడం అసంభవమనుకున్నాడు. తన అనుభవమంతా వృథా అయిపోతుందని, దాన్నుపయోగించుకోకపోతే ఎందుకూ పనికిరాననీ అనుకున్నాడు. తను మళ్లీ ఉపయోగపడతాననీ, సుఖపడతాననీ, ప్రేమించగలననీ అనుకున్నాడు. చిత్రపటంలోని లీసా తన వంక అనురాగంతో కూడిన ఆశ్చర్యంతో చూస్తున్నట్లనిపించిందతనికి.

1809 ఆగష్టు 8 ఆండ్రూ పీటర్స్‌బర్గ్ వచ్చాడు. ఆ రోజుల్లో 'స్పెరాన్‌స్కీ' ఉచ్ఛ దశలో ఉన్నాడు. సంస్కరణల పట్ల అభిలాష చూపిస్తున్నాడు. తను రాసిన "మిలటరీ న్యాయసిద్ధాంతాన్ని" పరిశీలింపజేయడానికి జార్‌కు మిలటరీ సలహాదారు అయిన 'అరక్షేవ్'ను కలుసుకున్నాడు గానీ, అతను ప్రతికూలంగా ఉన్నాడు. దాంతో తనకు తెలిసిన 'కౌచుబే' ద్వారా స్పెరాన్ స్కీని కలుసుకున్నాడు. ఆండ్రూ తన రైతుల్ని విముక్తి చేసిన సంగతి విన్నానని స్పెరాన్‌స్కీ ఆదరంగా మాట్లాడాడు. ఓ వారం తరువాత, ఆండ్రూ రాకుమారుడు మిలటరీ న్యాయచట్ట పునర్నిర్మాణ కమిటీలో సభ్యునిగా నియమించబడ్డాడు. లెజిస్లేటివ్ కమీషన్‌లో ఒక శాఖకు అధ్యక్షునిగా కూడా నియోగింపబడ్డాడు. దాంతో కొత్తగా సివిల్‌లా; దాంతో పాటు 'జస్టీనియన్' 'నెపోలియన్'లు ఏర్పరచిన చట్టాలు కూడా చదివి, "వ్యక్తులు - హక్కులు" అనే శాఖకు పనిచేయసాగాడు.

ఇక పీటర్ విషయానికి వస్తే, హెలెన్ పశ్చాత్తాపంతో ఉత్తరం రాసే సరికి, మామగారి ప్రోద్బలంతో పీటర్ మనసు మార్చుకుని ఆమెతో కలిసి ఉంటున్నా, అది కేవలం ఆత్మ గతమేననుకున్నాడు. తిరిగి హెలెన్ తన పూర్వ ప్రకారం విందులు వినోదాలతో అవినీతికి తెర తీసింది. ఆమె చుట్టూ రాయబారులు, రాకుమారులూ ఎందరో చేరేవారు. ఆమె ఇచ్చే పార్టీ ఒక వెర్రివాళ్ళ స్వర్గంలా అతనికి అనిపించేది. ఆమె మాటల్ని అంతా ఎంతో శ్రద్ధతో మెప్పుదలతో ఆలకించేవారు. ఆమెకంత తెలివితేటలు లేవని పీటర్‌కి తెలుసు. భార్య సమాజీయులతో తనకేం పట్టనట్లు అనాసక్తంగా ఉండేవాడతను. ఈ విధంగా ప్రపంచం దృష్టిలో అతనొక పెద్దమనిషిగా, ఆకర్షణీయమైన భార్య విషయాలు పట్టించుకోని ఒక వెర్రి భర్తగా పరిగణింపబడసాగాడు!

కౌంట్‌రోస్టోవ్ విషయానికొస్తే, అప్పుల్లో మునిగిపోతున్నా, ఆయన విందులు, వినోదాలు ఏమాత్రం తగ్గలేదు. అయితే తన పెద్ద కూతురు 'వేరా'ను తన అంతస్తులోని వారెవరో ప్రతిపాదించనందున, ఒక పేద సైనికాధికారి 'బెర్గ్'కిచ్చి పెళ్లి చెయ్యాల్సివచ్చింది. పైకి ఎలా వెళ్ళాలో తెలిసిన 'బెర్గ్' మామగారి నుంచి నిర్మోహమాటంగా కట్నం గుంజాడు. ఇక ఆయన 16 సంవత్సరాల రెండో కూతురు 'నటాషా' గురించి ఇంతకు ముందే ప్రస్తావించబడింది కదా! ఆమె చంచల హృదయం ఆమెకు తొలి ముద్దిచ్చిన బోరిస్ ఇప్పుడు స్వార్థపరుడై ఉద్యోగంలో పై హోదా కోసం అర్రులు చాస్తూ, హెలెన్ మోజులో పడ్డాడు. తర్వాత నూత్నయవ్వనాన్ని సంతరించుకున్న నటాషాను చూసి, మళ్లీ ఆ ఇంటికి రాకపోకలు సాగిస్తూండేసరికి, ఆమె తల్లి కూతుర్ని మందలించి, అతణ్ణి చివాట్లు పెట్టింది. దాంతో అతను ఆ ఇంటికి రావడం మానేశాడు.

పాదసూచికలు :-

1. కొసక్కుల గురించి తెలుగులోనే ముగ్గురు రష్యన్ రచయితలు రాసిన నవలలు అనువాదాలు వెలువడ్డాయి. అందులో ఒకటి తాల్‌స్తోయ్ "కొసక్కులు"కాగా, రెండోది గొగోల్ నవల "తారాస్ బుల్బా", మూడోది మైఖేల్ షోలహోవ్ నవల "తిఖీడాన్". 'తారాస్ బుల్బా'పై నా పరిచయ వ్యాసం (1) జులై (2) ఆగష్టు, 2009, ప్రజా సాహితి సంచికలలో రెండు భాగాలు చూడండి.
2. "కొసకులు" తాల్‌స్తోయ్ నవల పరిచయ వ్యాసం ఆంధ్ర ప్రభ, సాహితీగవాక్షం శీర్షికన (1) 23-11-2008, (2) 30-11-2008 రెండు సంచికలలో చూడండి.
3. "నవజీవనం" నవలపై నా పరిచయ వ్యాసం ప్రజా సాహితి, (1) జనవరి, (2) ఫిబ్రవరి, (3) మార్చి-2010, సంచికలలో చూడండి.
4. "యుద్ధం-శాంతి" నవలలోని నాలుగు ఉన్నత కుటుంబాలు ఇవి: (2) 'బెస్కోవ్'ల కుటుంబం. కౌంటకిరిల్ బెస్కోవ్ ఒక గొప్ప శ్రీమంతుడు. ఇతని జార పుత్రుడు పీటర్ బెషోవ్. (2) "బోల్‌కోన్స్కీ'ల కుటుంబం. ఆండ్రూ బోల్‌కోన్స్కీ రాకుమారుడు. అతని భార్య ఎలిజబెత్. 'లీసా' అని పిలవబడుతుంది. 'నికోలస్' ఆండ్రూ తండ్రి. 'మేరియా - ఆండ్రూ చెల్లెలు. 'నికోలింకా' - ఆండ్రూ కుమారుడు. (3) రోస్టోవ్‌ల కుటుంబం. కౌంటెస్ నటాషా. కౌంట్ ఇల్యారోస్టోవ్ - నటాషా తండ్రి. నటాలియా నటాషా తల్లి. నికోలస్ - నటాషా అన్న. పేటియా - నటాషా తమ్ముడు. సోనియా - రోస్టోవ్‌ల ఇంట్లో అనాథ వారి దూరపు బంధువు. (4) కార్‌గిన్ల కుంటుంబం - బేసిల్ కార్‌గైన్ - రాకుమారుడు. హెలెన్ - అతని కుమార్తె. ఆనెటోవ్ - బేసిల్ జారపుత్రుడు.
5. తుర్గేనెవ్ ప్రసిద్ధ నవల "తండ్రులూ కొడుకులూ" పరిచయ వ్యాసం - 'అరుణతార' - 'జనవరి - ఫిబ్రవరి' - 2009 సంచిక చూడండి.

(ఇంకా ఉంది...)

అవగాహన

అస్తిత్వవాదాలు- ఆధునికత - విముక్తి

- పాణి

గుర్తింపు, అనుభవం, అనుభవ ప్రత్యేకత.. అనేవి ఉన్నది అనే విషయాన్ని తెలియజేస్తాయి. కులాలు, ప్రాంతాలు, మతమైనారిటీలు, జండర్ తదితర భౌతిక వాస్తవికతల గురించిన చర్చ ఇది. ఇవి వాదాల నుంచి పుట్టలేదు. కాబట్టి ఆ వాదాలను, వాటి సమర్థకులను దృష్టిలో పెట్టుకొని వాదించడం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదు. ఈ భౌతిక వాస్తవికతలను సామాజిక శాస్త్ర పద్ధతిలో ఎలా వివరించగలం అనేది అసలు సమస్య. దీన్ని స్వీకరించడం వల్లే వారి అభిప్రాయాలతో సంభాషించడానికి వీలవుతుంది. అలాంటి ప్రయత్నం కొంత జరిగినా మరింత ఆలోచించాల్సి ఉన్నది.

మన సమాజంలో అనేక కారణాల వల్ల గుర్తింపుకు నోచుకోని అణచివేతల నుంచి అస్తిత్వవాదాలు ముందుకు వచ్చాయి. గుర్తింపు అంటే ఏమిటి? అనే ప్రశ్నకు ఎన్ని వివరణలు ఇచ్చుకున్నా అనుభవానికి గుర్తింపు ఉండాలనేదే ముఖ్యం. వాస్తవికత పలుకోణాల్లో, పలు నియమాలతో కొనసాగేది కాబట్టి వేర్వేరు అనుభవాలు కలుగుతాయి. ఆ ప్రత్యేకతలను పట్టించుకోవాలనే ఆకాంక్ష రకరకాల అస్తిత్వ వాదాలుగా రూపొందింది.

అనుభవాల్లో ప్రత్యేకతల గురించి మాట్లాడటం మొదలు పెట్టగానే -భిన్న సమూహాల్లో కూడా ప్రతి వ్యక్తికి వేర్వేరు అనుభవాలు ఉంటాయిగదా? అనే ప్రశ్న ఎదురవుతుంది. ఇక్కడ మాట్లాడుతున్నది అది కాదు.ప్రతి వ్యక్తి అనుభవానికి సమాజంలోనే కారణాలుండవచ్చుగాని, ఒక్కో సామాజిక వ్యవస్థ వల్ల ఒక్కో సామాజిక బృందానికి కలిగే అనుభవాల గురించి.

ఈ అనుభవాలను వాటికి కారణమైన సాంఘిక వ్యవస్థలను ఎలా చూడాలి? గుర్తింపు పొందని ఈ అనుభవాలకు ప్రాధాన్యత ఎందుకు ఇవ్వాలి? ఈ సామాజిక బృందాలు ఏం కోరుకుంటున్నాయి? వాటిని ఎలా అర్థం చేసుకోవాలి? అవి ఎవరితో ఘర్షిస్తున్నాయి? అనేవి ముఖ్యమైన ప్రశ్నలు.

అంటే - అస్తిత్వవాదాలకు సంబంధించిన చర్చ పూర్తిగా సిద్ధాంతపరమైనది. అది తగినంత జరగకపోవడానికి ఇతరేతర కారణాలు ఎన్ని ఉన్నా సిద్ధాంత సమస్యగా గుర్తించకపోవడం ముఖ్యం. దీని వల్ల అస్తిత్వవాద సమర్థకులు ఎవరిని లక్ష్యంగా పెట్టుకున్నారో వారితో అవసరమైన చర్చ చేయలేకపోయారు. ఇవతలి వైపు నుంచి కూడా అర్థవంతమైన చర్చకు ప్రాతిపదిక రూపొందలేదు. తాము జీవిస్తున్న కాలం విసురుతున్న సవాళ్లు, ఎదురవుతున్న సంక్షోభాలు చరిత్ర పరివర్తనలో ఆ యుగానికి సంబంధించినవనే ఎరుక తగినంత లేకపోవడం వల్ల ఇలాంటి సమస్యలు తలెత్తుతుంటాయి. అస్తిత్వాల ఆకాంక్షలు సమాజగతిలో ఎందుకు, ఎలా ముందుకు వచ్చాయి? వాటికి పరిష్కారమేమిటి? అనే ప్రశ్నలతో నిమిత్తం లేని ప్రయాణం ప్రమాదభరితం.

అస్తిత్వాల సమస్య మన సాంఘిక ప్రపంచానికి సంబంధించింది. సమాజమనే మొత్తానికి సంబంధించింది. సాంఘిక ప్రపంచాన్ని పరిశీలించే మార్క్సిస్టు పద్ధతికి సంబంధించిన సమస్య ఇది.సమాజం మౌలికంగా మారడమంటే సాంఘిక వ్యవస్థలు ఇప్పుడున్న స్థితిలో, ఈ అర్థంలో ఉండడానికి వీల్లేదు. అంటే ఇది సాంఘిక వ్యవస్థల గురించిన సిద్ధాంతం. పాండిత్య సంబంధమైనది కాదు. విప్లవాచరణకు సంబంధించినది. అందువల్ల అస్తిత్వాల గురించి, వాటి సమర్థకుల వాదనల గురించి మాట్లాడుకొనేటప్పుడు మార్క్సిస్టులుగా మనం వీటిని ఎలా అర్థం చేసుకుంటున్నాం? మార్క్సిజంలో వీటి గురించి ఇప్పటికే ఉన్న అవగాహన కంటే మెరుగ్గా ఆలోచించే అవకాశం లేదా? మార్క్సిస్టు ఆవరణలో ఇంకా ఏమైనా పరికరాలు ఉన్నాయా? అనే ప్రశ్నలు వేసుకోకపోతే సమస్య ఎన్నటికీ పరిష్కారం కాదు. మార్క్సిజం ఆధారంగా వీటిని ఇట్లా అర్థం చేసుకోవచ్చు అనే ప్రత్యేకమైన సిద్ధాంత ప్రయత్నం చేయకపోతే ఇతరేతర సిద్ధాంతాల ప్రాబల్యం పెరిగిపోతుంది. మార్క్సిజం అంటే ఫలానా అనే ఒక మాయా వాదాన్ని సృజించి (మనం మొదటి నుంచి చెప్తూ వచ్చిన వాటి నుంచే ఈ వాదాన్ని ఉత్పత్తి చేసినా ఆశ్చర్యపోనవసరం లేదు) దాని మీద పోరాటం చేసి ఆనందించేవాళ్ల సంఖ్య పెరిగిపోతుంది. అంతకంటే కూడా మార్క్సిజాన్ని సృజనాత్మకంగా తయారు చేయడం అనే పేరుతో ఏదేదో కలిపి ఆమోదం పొందేవాళ్లూ తయారువుతారు. దీని వల్ల సంప్రదాయ మార్క్సిజం అనే నింద మోయాల్సి వస్తుంది. వీటన్నిటికీ ఊతం ఇచ్చేవీ మార్క్సిస్టుల్లో ఏవైనా ఉంటే వాటినీ ప్రక్షాళన చేసుకొని అస్తిత్వాలను, సాంఘిక విముక్తిని శాస్త్రీయ సామాజిక సిద్ధాంతంగా మార్క్సిజం ద్వారా ఎలా వివరించవచ్చునో ప్రయత్నించాలి. లేకపోతే విప్లవ శిబిరం నుంచే సాంఘిక సమస్యల మీద మార్క్సిస్టు వ్యతిరేక ఆలోచనల ప్రమాదం వచ్చిపడుతుంది.

దీని వల్ల ఏ సమస్య ముందుకు వచ్చినా, ఏ కొత్త ప్రయత్నం ప్రారంభించినా పరస్పర భిన్నమైన, వ్యతిరేకమైన వాదనలు జరుగుతాయి. ఆ వాదనల సామంజస్యాన్ని అంగీకరించడమా లేక తిరస్కరించడమా అనే సంవాదంతో ముగిసిపోతుంది. విషయం అట్లా ఎన్నటికీ తేలదు.

సామాజిక నిర్మాణాలను చారిత్రకంగా అర్థం చేసుకోవడానికి మార్క్స్ ఒక మంచి పద్ధతిని ప్రవేశపెట్టాడు. సామాజిక ఉత్పత్తి సంబంధాల మొత్తం స్ట్రక్చర్. దీని నుంచి వర్గాలు పుడతాయి. ఇవికాక ఉత్పత్తేతర సామాజిక సంబంధాలు కూడా ఉంటాయి. వీటి నుంచి అనేక సాంఘిక వ్యవస్థలు పుడతాయి. వీటికి స్ట్రక్చర్‌తో సంబంధం ఉంటుందిగాని వాటికొక చరిత్ర ఉంటుంది. ఇవి కూడా

భౌతిక పునాదిలో భాగామే. ఉత్పత్తి సంబంధాల్లో మార్పు జరిగినా, జరుగుతున్నా సాంఘిక వ్యవస్థలు పూర్వ చారిత్రక మూలాల వల్ల నిలిచే ఉంటాయి. కొత్తగా ఏర్పడ్డ ఉత్పత్తి సంబంధాల మీద మనుగడ సాధిస్తాయి. కొత్త ఉత్పత్తి సంబంధాలు నిర్మించుకున్న నూతన సాంఘిక వ్యవస్థల ఆధారంగా కూడా అవి నిరంతరం వ్యక్తమవుతుంటాయి. ఈ పద్ధతి ఆధారంగా కులం తదితర అస్తిత్వాల గురించి ఆలోచించవచ్చు.

***

ఒక సామాజిక సమూహం తనను తాను ఎలా గుర్తించుకుంటుంది, ఇతరులు ఎలా గుర్తిస్తారు అనేది అస్తిత్వ స్పృహలో కీలకం. ఇది సహజంగానే ఇతరులను ఆ సమూహం ఎలా గుర్తిస్తుంది? అనే ప్రశ్నకు దారితీస్తుంది. పీడిత సమూహాలైనా, పీడక సమూహాలైనా వాటివాటి అస్తిత్వాల ఆధారంగానే పరస్పరం గుర్తిస్తాయి, గుర్తింపు పొందుతాయి. పీడిత అస్తిత్వం ఉన్న సమూహాలు తమ వలెనే ఇతర అస్తిత్వాలు అణచివేతకు, వివక్షకు గురయ్యేవనే దృష్టి ఉన్నా అస్తిత్వం వల్లనే ఆ రెంటి మధ్య తేడా వ్యక్తమవుతుంటుంది. ఇది కేవలం తేడానే కాదు, వైవిధ్యంగానే ఉండదు. వైరుధ్యంగా పని చేస్తుంటుంది. తన వలెనే ఇతరులను సాంఘిక అస్తిత్వం మీదే గుర్తించే క్రమంలో ఈ వైరుధ్యం తీవ్ర వైమనస్యానికి దారి తీస్తుందని కూడా మన అనుభవంలోకి వచ్చింది.

అస్తిత్వంలోకి సొంత గుర్తింపు, తనకు మాత్రమే ఉన్న అనుభవం, తనకే ఉన్న ప్రత్యేకత అనేవి తానే పొందవలసిన ప్రయోజనం దాకా విస్తరిస్తాయి. సాంఘిక ప్రపంచంలోని వైవిధ్యం వల్ల, అంతరాల వల్ల భిన్న ప్రయోజనాలు ఉంటాయి. అస్తిత్వంలోని ప్రత్యేకతే భిన్న ప్రయోజనాలకు కారణం అవుతుంది. ఈ ప్రయోజనాలు పొందవలసినవే అయినా వాటి మధ్య వైరుధ్యాలకు, పోటీకి పరిష్కారం ఏమైనా ఉంటుందా? అనేదానికి అస్తిత్వ స్పృహలో సమాధానం కనపడటం లేదు. ఇది ఆచరణాత్మక సమస్యగా తీవ్ర రూపం దాల్చింది. ఆచరణలో ఐక్యత సంగతి అలా ఉంచినా- పీడిత అస్తిత్వాల మధ్య ఐక్యతను సాధించే సిద్ధాంత ప్రాతిపదిక ఏదైనా ఉంటుందా? అనే ఆలోచన అస్తిత్వవాద శిబిరంలో లేకపోవడానికి కారణం ఏమిటి? ఐక్యత అనేది అస్తిత్వ స్పృహను మౌలికంగా విభేదించేది అంశమా? ఇవి చాలా గంభీరమైన ప్రశ్నలు. కమ్యూనిస్టులు చెప్పే శ్రామిక వర్గ ఐక్యతను వ్యతిరేకించినంత తేలిక కాదు ఇది. మార్క్సిస్టులు కూడా ఇన్నేసి అస్తిత్వాల ప్రత్యేకతల మధ్య. అవసరాల మధ్య, వాటి వైరుధ్యాల మధ్య..వీటిని పరిగణనలోకి తీసుకుంటూనే .. శ్రామిక వర్గ ఐక్యత సాధించడం పెద్ద సవాలే. అయితే మార్క్సిజంలో దీనికి ఒక స్పష్టమైన సిద్ధాంత ఆధారం ఉన్నది. ఉత్పత్తి సాధనాల మీద యాజమాన్యం అనే ప్రాతిపదిక మీద అశేష పీడితులను కలపడం సాధ్యమే. ఈ వర్గ ఐక్యతను విమర్శించడం సులభమేగాని ఇదొక బలమైన సిద్ధాంత పునాదిని అందిస్తుంది. అస్తిత్వాల ప్రాతిపదిక మీద భిన్న సాంఘిక సమూహాల ఐక్యతకు ఇప్పటికైతే ఏ సిద్ధాంత ఆధారం లేదు. తెలుగులో ఇంత వరకు స్వీయ అస్తిత్వాల గురించి, ప్రయోజనాల గురించి ఎలుగెత్తే క్రమంలో ఇతర అస్తిత్వాలతో తగాదాలు మాత్రమే చూస్తున్నాం. ఇవి పైకి చిలువలు పలువలుగా కనిపించినా అస్తిత్వాలకు సంబంధించిన లోతైన సిద్ధాంత సమస్య ఇది.

ఒక్కో కులం తన సాంఘిక అస్తిత్వంలోని ప్రత్యేకత రీత్యా, దాని ప్రయోజనాల కోసం ఆందోళనలు ముందుకు తెచ్చాయి. గత ఆరవై డెబై ఏళ్లుగా దళితులు, వెనకబడిన కులాలు చేసిన పోరాటాలు, ముందుకు తెచ్చిన నినాదాలు అన్నీ చారిత్రకంగా వలసవాదం వల్ల వచ్చిన ఆధునికతలో తమకు న్యాయమైన వాటా కావాలనే. తర తరాలుగా అగ్రకులాలు బూర్జువా ఆధునికత ఫలాలను నాలుగు చేతులా అనుభవిస్తున్నారనీ, ఆధునికత ప్రకటించుకున్నా వాగ్దానాలు తమ దాకా రాలేదన్నదే దళితుల విమర్శ. కాబట్టి దళితులు ఈ ఆధునికతను వ్యతిరేకించడం లేదని, అందులో చోటు కోసం ప్రయత్నిస్తున్నారని, బూర్జువా ఆధునిక వ్యవస్థ తమ ప్రయోజనాలను తీర్చేలాగా దానిపై ఒత్తిడి తెస్తున్నారని అర్థం చేసుకోకపోతే అస్తిత్వ ఉద్యమాల పట్ల సరైన వైఖరి ఎన్నటికీ సాధ్యంకాదు. ఈ ఆకాంక్షను గుర్తించాలంటే ఆధునికత మీద సరైన వైఖరి అవసరం.

తమ సాంఘికత్వానికి, అనుభవాలకు గుర్తింపు, గౌరవం, చోటు దక్కాలని కోరుకొనే క్రమంలో అస్తిత్వ స్పృహ గడచిన చరిత్ర పట్ల, సంస్కృతీ సాహిత్యాలపట్ల కొత్త చూపును అందించింది. ఇందులో గుర్తింపు, వాటా మొదలైనవాటితోపాటు సాంఘిక విముక్తి భావన కూడా ఉంది. ఇది చాలా ముఖ్యమైన చర్చనీయాంశం. దీంతోపాటు దళితుల విముక్తి-విప్లవం గురించి కూడా ఒక చిన్న పాయ అస్తిత్వవాదంలో నడుస్తూ ఉంటుంది. ఇది విప్లవానికి చేరువగా ఉన్నట్టున్నా సారాంశంలో అస్తిత్వ వాదమే. మన దగ్గర నలభైఏళ్లుగా అస్తిత్వ వాదాల ప్రతినిధులు, వ్యాఖ్యాతలు కమ్యూనిస్టు విప్లవోద్యమ ప్రభావంతో వచ్చినవాళ్లు కాబట్టి దళితుల విముక్తి ఆర్థిక - రాజకీయ విముక్తి వగైరా చర్చ నడుస్తున్నది గాని అస్తిత్వవాదాలు ప్రధానంగా మనదేశ సాంఘిక వ్యవస్థల వల్ల తమకు ఆధునిక ఫలాలు అందకపోవడం మీద, ఆధునికతలోని అపసవ్య ధోరణుల మీద విమర్శగా వచ్చినవే. ఈ మాట ఎవరైనా అంటే సహజంగానే విప్లవం మీద, వర్గం మీద, సోషలిస్టు ఆధునికత మీద ఆ వాదాల సమర్థకులకు కోపం వస్తుంది. బూర్జువా ఆధునికతను అధిగమించి సోషలిస్టు ఆధునికతలోకి చేసే ప్రయాణం మీద దళితవాదులకు అనుమానం. ఆర్థిక విముక్తిని మాట వరసక్కూడా వ్యతిరేకించకపోవచ్చుగాని అస్తిత్వవాద దృష్టి కోణం వల్ల బూర్జువా వ్యవస్థలో సాంఘిక గుర్తింపు, వనరుల్లో, రాజకీయాధికారంలో వాటా కోరుతున్నారు. సాంఘిక అణచివేత రద్దయ్యాక కూడా ఈ సమాజంలో మరికొన్ని సమస్యలు ఉంటాయని, వాటిని సాధించుకోడానికి ఇంకా ముందుకు వెళ్లి ఆలోచించాల్సి ఉంటుందనీ అనుకోవడం లేదు.

గుర్తింపు, వాటా, ఆత్మగౌరవం సాధించే క్రమమే సాంఘిక విముక్తి అనీ, లేదా ఈ క్రమం సాంఘిక విముక్తి దిశగా తీసికెళుతుందనేది అస్తిత్వవాద సమర్థకుల భావన. ఈ ఆలోచనలు కలగడానికి, వాటి గురించి ఎలుగెత్తి మాట్లాడడానికి, ఉద్యమం చేయడానికి ఈ బూర్జువా ఆధునికతే అవకాశం కలిగించిన మాట వాస్తవం. అయితే బూర్జువా వ్యవస్థకు కులంతో ఎలా వ్యవహరించాలో

తెలును. ఆధునికతా ఫలాలను భౌగోళిక, సామాజిక మారుమూలలన్నిటికీ సరఫరా చేయడంలో అది తలమునకలై ఉన్నది. ఈ ఆధునికతా చట్రంలో ఇమడని ఆదివాసులను అట్లా బైట ఉంచడం వల్ల ఎంత సమస్యాత్మకం'గా మారిపోయారో దాని అనుభవంలో ఉన్నదే. ఇక దళితుల విషయంలో దానికి ఏ అభ్యంతరం లేదు. అయితే బలీయమైన కులవ్యవస్థ ప్రభావం ఆధునిక రాజ్యం మీద, మొత్తంగా బూర్జువా ఆధునికత మీద బాగా ఉన్నది. కానీ అగ్రకులాల వలె దళితులను తన పరిధిలోకి రానీయకుండా అది వెలివేయదు. అట్లాగే- రాజ్యం వర్సెస్ ప్రజలు అనే వైరుధ్యం ఉండేదే అయినా అన్ని సమూహాలూ రాజ్యం పట్ల ఒకే వైఖరి తీసుకుంటాయనడానికి ఆధారాలు ఏమీ లేవు. ముఖ్యంగా సాంఘిక అస్తిత్వ స్పృహతో ఉన్న సమూహాలు తమ ఆకాంక్షలకు అనుగుణమైనే వైఖరే తీసుకుంటాయి.

అయితే అస్తిత్వవాద సమర్థకులు రాజ్యాన్ని, ఇతర ఆధునిక వ్యవస్థలను మనువాద వ్యవస్థలని అంటూ ఉంటారు. మన రాజ్యం మనుస్మృతి మీద ఆధారపడి నడిచేది కాదు. ఆధునిక రాజ్యాంగం మీద, హేతుబద్ధత మీద ఆధారపడి నడుస్తుంది. వర్గ ప్రయోజనాలు సరేసరి. దాని నిర్వాహకుల్లో ప్రాచీన విలువలు, ధోరణులు ఉండవచ్చు, మనువాద విలువలను ప్రకటించుకోవచ్చు. అంత వరకే.

ఇది మనువాద రాజ్యం అయ్యేటట్లయితే అస్తిత్వవాదుల డిమాండ్‌కు అర్థమే ఉండదు. రాజ్యంలోని మనువాద వ్యక్తీకరణలకు వ్యతిరేకంగా పోరాటాలు చాలా అవసరమేగాని, అది మనువాద రాజ్యమైతే దాని మీద తెస్తున్న ఒత్తిడికి పునాది ఏమిటి? అనే ప్రశ్న ఎదురవుతుంది. దళితులు ఆధునికతలో చోటు కోరుకోవడం అంటే -ఆధునిక రాజ్యానికి ఉన్న ప్రాతినిధ్య స్వభావం ప్రకారం తమకూ అందులో ప్రాతినిధ్యం ఉండాలనే. బూర్జువా ఆధునికత ప్రవేశపెట్టిన ఏ సాంఘిక సాంస్కృతిక వ్యవస్థల్లో తమ అస్తిత్వానికి, అనుభవానికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలనే. బూర్జువా వ్యవస్థ మీద తీవ్ర విమర్శగా దీన్ని భావించవచ్చు. దళితులకు ఈ అవకాశాలు ఇవ్వడం పట్ల బూర్జువా వర్గానికి అభ్యంతరం లేదు. పెట్టుబడి మానవులందరినీ వేతన కూలీలుగా గుర్తించడం లాంటిదే కాదిది. ఒక కార్పొరేట్ వ్యక్తిని ఎంత సమాదరించగలదో నరబలిని ప్రోత్సహించే కులపెద్దతో కూడా అట్లే ఉంటుంది... ఆ సాంఘిక వ్యవస్థ తనకు ఆటంకం కానంత వరకు. వలస కాలంలో మొదలైన కొత్త ఉత్పత్తి సంబంధాలు అతి ప్రాచీన సాంఘిక వ్యవస్థలను తన అవసరం మేరకు నిలిపి ఉంచాయనుకుంటే ఈ విషయాన్ని అర్థం చేసుకోవడం తేలికే.

అందువల్ల సాంఘిక విముక్తి అనే అతిపెద్ద ఆశయాన్ని బూర్జువా వ్యవస్థ పొరపాటున కూడా నెత్తికెత్తు కోదు. దానికి వేర్వేరు సాంఘిక అస్తిత్వాల్లో అసమానత, వివక్ష, పీడన నిలిచి ఉండడం సమస్య కాదు, అవసరం కూడా. తమ సాంఘిక అస్తిత్వం ఆధారంగా అమలవుతున్న అణచివేతను, వివక్షను వ్యతిరేకిస్తూ ఆత్మగౌరవం కోసం నినదించే క్రమంలో తమ గుర్తింపును నిలబెట్టుకోవాలనే ప్రయత్నం కూడా అస్తిత్వవాదుల్లో ఉన్నది. బూర్జువా ఆధునికతలో వీటన్నిటికీ ఎంతో కొంత చోటు దొరుకుతుంది. దీని మీద విమర్శ పెట్టే విప్లవం పట్ల, సోషలిస్టు ఆధునికతపట్ల వారికి అనుమానం. ఇవి ప్రాచీనమైన సాంఘిక అస్తిత్వాలను రద్దుచేస్తాయనే ఆందోళన కలగుతుంది. మార్క్సిజం మీద అస్తిత్వవాదులకు ఇంకా చాలా కారణాలవల్ల అనుమానాలు, వ్యతిరేకతలు ఉండవచ్చుగాని ఇదీ ఒకటి.

అయితే సమసమాజం అనేది అన్ని సాంఘిక అస్తిత్వాలను రద్దు చేసేది కాదు, వాటిలోని అసమానతలను, అణచివేతను మాత్రమే రద్దు చేస్తుంది. ముఖ్యంగా అణచివేత పునాది మీద నిర్మాణమైన అస్తిత్వాలు రద్దు కావాలనుకుంటుంది. అణచివేతను తొలగిస్తే దాని కోసమే పుట్టిన సాంఘిక అస్తిత్వాలు కొనసాగలేవు. అణచివేత, వివక్ష రద్దయిపోయాక కూడా అస్తిత్వాలు పూర్తిగా కనుమరుగైపోవు. సాంస్కృతిక ప్రత్యేకతలుగా మిగిలే ఉంటాయి. అట్లా ఉండడం ఎవరికీ అభ్యంతరం ఉండనవసరం లేదు. అసలు అస్తిత్వాల్లోని వైవిధ్యం సమసమాజ స్పృహలో కీలకం. అనేక సాంస్కృతిక వైవిధ్యాలు అసమానతలు లేకుండా కలిసి ఉండడమే సమానత్వానికి గీటురాయి. సాంఘిక అస్తిత్వాల మధ్య అసమానత తొలగిపోయి గొప్ప సాంస్కృతిక వైవిధ్యంగా మార్పులకు లోనవుతూ ఉండగలిగినంత కాలం ఉండి కొత్త రూపాలను ఆశ్రయిస్తాయి. అట్లా మిగిలి ఉండే అవకాశం కూడా లేనప్పుడు క్రమంగా అంతరించిపోతాయి.

కాబట్టి సాంఘిక విముక్తి అనే స్పృహ కలగడానికి బూర్జువా ఆధునికతే కారణమైనా, దానికి సంబంధించిన క్రమం ఇక్కడే మొదలైనా ఇక్కడే పూర్తి అయ్యేదికాదు. ఆధునికతకు బూర్జువా వ్యవస్థ విధించిన పరిమితి వల్ల ఆ కర్తవ్యం పరిపూర్తికాదు. బూర్జువా ఆధునికతలో వాటా న్యాయమైనదీ, అత్యవసరమైనదీ.

***

వేర్వేరు సాంఘిక అస్తిత్వాలు ఉన్నాయా? లేదా? అనే విచికిత్స బహుశా ఇప్పుడు ఎవరికీ ఉండకపోవచ్చు. కానీ మార్క్సిజాన్ని ఒక శక్తివంతమైన సామాజిక సిద్ధాంతంగా గుర్తిస్తూ కూడా అస్తిత్వాల దగ్గరికి వచ్చేసరికి ఇబ్బంది పడిపోవడం ఇవాళ అతి పెద్ద సమస్య. మార్క్సిస్టులకు ఈ ఇబ్బంది ఉండనవసరం లేదు.

ఈ ఇబ్బంది ఏమిటి? ఇది ఎక్కడి నుంచి జనించింది? ఈ ఇబ్బంది వల్ల అస్తిత్వవాద సమర్థకులు మార్క్సిస్టుల ఆచరణపై విమర్శపెట్టడం ద్వారా ఈ సమస్యను వినిపించాలనీ, పరిష్కరించాలనీ అనుకుంటుంటారు. ఇది ఏ ఫలితాలూ సాధించదు. నిజానికి ఆ తలం నుంచి చూస్తే మార్క్సిస్టుల వర్గపోరాటంలో దీనికి సంబంధించిన ఆచరణ, అనుభవం గణనీయంగా కనిపిస్తాయి. ముఖ్యంగా 1960లలో మొదలైన విప్లవోద్యమం సామాజిక రంగంలో చాలా ప్రభావం చూపింది. అట్టడుగు శ్రేణులు అనేక సాంఘిక సాంస్కృతిక బంధనాలు తెంపుకుంటూ ఉద్యమంలోకి వచ్చాయి. ఆ మేరకు కమ్యూనిస్టు ఉద్యమంలోకి అంతక ముందుకంటే భిన్నంగా కింది సామాజిక శ్రేణులనుంచి నాయకత్వం వచ్చింది. ఉద్యమ చరిత్రలోని ఈ వాస్తవాన్ని తిరస్కరించడం అస్తిత్వవాద సమర్థకులకు సాధ్యం కాదు. అసలు అస్తిత్వాలు, సాంఘిక విముక్తి అనే సమస్యను ఈ తలంలో చర్చించడం వల్ల విషయం ఎన్నటికీ తేలదు.

అదే సమయంలో ఉద్యమంలోకి వచ్చినవన్నీ సిద్ధాంతం నుంచి

వచ్చినవని భ్రమ పడనవసరం లేదు. ఏవి సిద్ధాంతం నుంచి.. దానికి సంబంధించిన ఆచరణగా ఉద్యమంలోకి వచ్చాయి? ఏవి చారిత్రక కారణాల వల్ల ఇతరేతర మార్గాల్లో వచ్చాయి? అనే ప్రశ్న వేసుకొని నిగ్గు తేల్చుకోవడం కష్టమే అయినా తప్పించుకోలేనిది. సమాజాన్ని మార్చే ప్రయత్నంలోకి ఇట్లా చాలా వచ్చి పోగవుతుంటాయి. వ్యవస్థల్లో, చరిత్ర అవధిలో జీవించి, చరించే మానవులు (సమాజాన్ని మార్చే శక్తులు) వాటి నుంచి చాలా అంశాలను ఉద్యమాల్లోకి తీసుకొని వస్తుంటారు. మామూలు స్థాయిలో ఉండే పరిశీలన, వివేకం, మానవీయ దృష్టి వల్ల వ్యక్తులు, సమూహాలు వాస్తవికతతో వ్యవహరించే క్రమంలో (చాలా వరకు నాయకత్వ శక్తులు) ఉద్యమాల్లోకి తెచ్చేవి ఒక క్రమంలో ఉద్యమ అవగాహనగా మారుతాయి. కాబట్టి వాటి ప్రాధాన్యతను, పాత్రను తక్కువ చేయడానికి లేదు. అదే సమయంలో సిద్ధాంతానికి అవి సరి సమానం అనుకోవడం కుదరదు.

ఈ విషయంలోనే కమ్యూనిస్టు ఉద్యమాలకు ఎక్కువ సవాళ్లు ఎదురవుతుంటాయి. మిగతా ఉద్యమాలు ఏవీ కమ్యూనిస్టు ఉద్యమాలు ఎదుర్కొన్నన్ని ప్రశ్నలు ఎదుర్కోకపోవచ్చు. ఒకవేళ ఎదురైనా అవి ఆ ఉద్యమ లక్ష్యాల ఉచితానుచితాలకు, వాటి సాధనలోని సాదకబాధకాలకు పరిమితమైనవే. కమ్యూనిస్టు ఉద్యమాలు ఎదుర్కొనే ప్రశ్నలు మొత్తంగా సమాజ మౌలిక పరివర్తనకు సంబంధించినవి. సమాజం మారుతుందా? ఇట్లాగే మారుతుందా? ఈ మార్పులో ఏవేవి భాగమవుతాయి? ఇవి ఎట్లా పరివర్తన చెందుతాయి? అనే విచికిత్స కమ్యూనిస్టు ఉద్యమాల గురించి మాట్లాడుకొనేటప్పుడే ఎదురవుతుంది. అంటే మార్పుకు సంబంధించిన సిద్ధాంత విశ్లేషణ గురించన్నమాట. మానవ చరిత్ర పరివర్తనకు సంబంధించిన ఆచరణాత్మక దృష్టి ఉండడమేగాక కచ్చితత్వం మార్క్సిజానికి జీవధాతువు. మార్క్సిజానికి ఎదురయ్యే ప్రశ్నలన్నీ దాని కచ్చితత్వాన్ని ప్రశ్నించేవే. అంటే - ఒక సామాజిక సిద్ధాంతంగా మార్క్సిజంలోని శాస్త్రీయతకు సంబంధించిన విషయమిది. ఈ ప్రశ్నలకు మార్క్సిజం సమాధానం చెప్పగలుగుతుందని నిరూపించడమే మార్క్సిస్టుల నిరంతర కర్తవ్యం. దీన్ని భావజాలం ఆధారంగా కాకుండా సిద్ధాంతం వైపు నుంచి వివరించాల్సి ఉంటుంది.

***

కులం రూపొందినప్పుటి ఉత్పత్తి సంబంధాలు మారుతూ వచ్చినా కులం నిలిచే ఉండడం వాస్తవం. చారిత్రకంగా ఎన్నడో తయారై, అనేక మార్పులకు లోనవుతూ. కొత్త ఉత్పత్తి సంబంధాల ద్వారా కూడా కొనసాగుతూ, పదేపదే పునరుత్పత్తి అవుతూ వచ్చింది. ఒక్క కుల సంబంధాలే కాదు, స్త్రీ పురుష సంబంధాలు కూడా ఇట్లా మారుతూ వచ్చాయి.

భారతదేశంలో ఉత్పత్తి సంబంధాలంటే కుల సంబంధాలే అనే సూత్రీకరణ అస్తిత్వవాదులు వినిపిస్తుంటారు. కులమంటే భారతదేశంలో వర్గమనే వాళ్లూ ఉన్నారు. వలసపాలన తర్వాత కూడా కుల ఆధారిత సమాజంలో ఏ మార్పులు రాలేదనీ, అసలు మన సామాజాన్ని దృఢంగా కుల వ్యవస్థ నిలిపి ఉంచిందనే వాదన ఉన్నది. స్త్రీవాదులైతే - ఉత్పత్తి సంబంధాలు ఏర్పడాలన్నా కూడా పునరుత్పత్తి సంబంధాలు ఉండాలి గదా? అంటారు. ఇలాంటి ప్రాతిపదికల మీద అస్తిత్వవాదాలు రూపొందాయి. ఈ స్థూల అభిప్రాయాలను మార్క్సిస్టు పద్ధతిలో పరిశీలించ వలసి ఉన్నది.

కులం పుట్టినప్పుడు ఉన్న ఉత్పత్తి సంబంధాలే నేటికీ ఉన్నాయని ఈ వాదనల సారాంశం. తెలిసిగాని, తెలియకగాని ఈ నిర్ధారణకు రాకుండా వాళ్ల మిగితా వాదనలేవీ చేయడానికి ఆస్కారం లేదు. కాని ఈ నిర్ధారణ నిజం కాదు. కుల వ్యవస్థ నేటికీ తనదైన పాత్ర నిర్వహించడం వాస్తవమే. అయితే కాల గతిలో కుల సంబంధాలు ఏ మార్పుకూ లోను కాలేదనడం అచారిత్రకం. స్త్రీ పురుష సంబంధాల్లో కూడా మార్పులు రాకపోలేదు. కుల సంబంధాల్లోని అణచివేతను, వెలిని తీవ్రంగా పట్టించుకోడానికి అవి పుట్టినప్పటి నుంచి సుస్థిరంగా ఉన్నాయని భావించనవసరం లేదు. చరిత్రలో ఏ మార్పుకూ లోను కాని సంబంధాలు అంటూ ఏవీ ఉండవు. పరివర్తనా గుణాన్ని తిరస్కరించి సాగించే పరిశోధన పూర్తిగా అశాస్త్రీయం. కాబట్టి చరిత్రలో ఈ అస్తిత్వాలకు కారణమైన సంబంధాల్లో (యుగ స్వభావానికి అనుగణంగా) జరిగిన మార్పులు ఏమిటి? దానికి కారణం ఏమిటి? వాటిని ఎలా చూడాలి అనేది ముఖ్యం.

మొదట స్త్రీ - పురుష సంబంధాల్లో ఏమైనా మార్పులు వచ్చాయా? అని చూద్దాం. పారిశ్రామిక విప్లవానికి ముందు ఇల్లు ఒక ముఖ్యమైన ఉత్పత్తి స్థావరంగా ఉండేది. ఫ్యాక్టరీ ఉత్పత్తి మొదలయ్యాక గృహం నుంచి ఉత్పత్తి బైటికి వెళ్లిపోయింది. అప్పటిదాకా ఇల్లు ఉత్పత్తి, పునరుత్పత్తి కేంద్రంగా ఉన్న స్థితిలో ఇదొక ముఖ్యమైన మార్పు. ఇంటికి అంతక ముందు ఉన్న ఆర్థిక స్థానాన్ని పెట్టుబడిదారీ ఉత్పత్తి తీసేసింది. లేదా ఇల్లు ఉత్పత్తి స్థావరంగా ఔచిత్యం కోల్పోయింది. ఇక - కుటుంబంలో స్త్రీల శ్రమ ఉత్పాదకాలు పారిశ్రామిక ఉత్పత్తులకున్న మారకం విలువ పొందకపోవడం వల్ల ఆడవాళ్ల శ్రమ గణనలోకి రాకుండా పోయింది. పితృస్వామ్య భావజాలం వల్ల పునరుత్పత్తికి కనీస గుర్తింపు లేకుండా పోయింది. దీన్ని పెట్టుబడిదారీ విధానం కొనసాగించింది.

అయితే ఇల్లు ఉత్పత్తి కేంద్ర స్థానాన్ని సుమారుగా కోల్పోయాక స్త్రీ పురుష సంబంధాలకు, సాంఘిక సాంస్కృతిక అవసరాలకు పరిమితమైపోయింది. దీంతో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కరిగిపోయింది. పాత కుటుంబంలో స్త్రీ పోషించిన సంక్లిష్ట పాత్రలో ఉన్న బరువు తీరిపోయింది. స్త్రీల శ్రమ ఏదో ఒక మేరకు పారిశ్రామిక ఉత్పత్తిలో భాగమైంది. ఈ మార్పులు కుటుంబంలో స్త్రీల స్థానాన్ని మార్చకపోయినా మొత్తంగా సమాజంలో గృహం, కుటుంబం పాత్ర మారిపోయింది.

ఇదంతా ఎందుకంటే - కొత్త ఉత్పత్తి సంబంధాలు ముందుకు వచ్చినప్పుడల్లా సమాజంలోని ఇతర సామాజిక సంబంధాలు పరివర్తనకు గురవుతూ వచ్చాయని అర్థం చేసుకోడానికే. యూరప్‌లో వలె మన దేశంలో మార్పులు జరగకపోయినా వలసవాదమనే చారిత్రక వాస్తవం వల్ల ఆ చట్రంలో, దాని అర్థంలో ఇక్కడ జరిగిన మార్పులను పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది. అట్లాగే కుల వ్యవస్థలో కూడా మార్పులు వచ్చాయి. పాత రోజుల్లో మన ఆర్థిక వ్యవస్థ సాంఘిక

వ్యవస్థ అండదండలతో కొనసాగింది. ఏవి ఆర్థిక సంబంధాలో, ఏవి సాంఘిక సంబంధాలో వేరు చేయలేనంతగా అవి కలగలిసి పోయాయి. కుల వ్యవస్థ సాంఘిక సంబంధాలను నిరంతరం పునరుత్పత్తి చేయడమేగాక ఆర్థిక సంబంధాలను కూడా కొనసాగించేలాగా ఉండేది. వలసవాదం ఈ స్థితిలో మార్పు తెచ్చింది. కులం ఆర్థిక కార్యకలాపాల కేంద్రంగా కూడా అక్కడక్కడా కనిపించవచ్చుగాని ఒక క్రమంలో కులం ప్రధానంగా పునర్పుత్తి పాత్రకు పరిమితమైపోయింది.

బ్రిటీష్ పాలన వల్ల వచ్చిన కొత్త ఉత్పత్తి సంబంధాలు తనకు అవసరమైన కొత్త సాంఘిక వ్యవస్థలను కూడా నిర్మించుకున్నది. అయితే ఈ మార్పు అంత రాడికల్‌గా జరగలేదు కాబట్టి అక్కడక్కడా కులం ఆర్థిక సంబంధాల వాహికగా కనిపించినట్టే కొత్త సాంఘిక వ్యవస్థల్లో కూడా అది కనిపిస్తుంటుంది.

వలసవాదం వల్ల కుటుంబంలో, కుల వ్యవస్థలో ఈ ముఖ్యమైన, స్థూల మార్పులు జరిగాయని గుర్తించడం వల్ల ఆ అస్తిత్వాలను సక్రమంగా అర్థం చేసుకోగలం. వాటికి తగిన ప్రాధాన్యత ఇవ్వడానికి అవసరమైన పద్ధతి రూపొందించుకోవచ్చు. ఉత్పత్తి శక్తుల అభివృద్ధి-ఉత్పత్తి సంబంధాల్లో మార్పు అనే పరిశీలనా పద్ధతి వల్ల చారిత్రక భౌతికవాదం మాత్రమే స్త్రీ పురుష సంబంధాల్లో, కుల సంబంధాల్లో వచ్చిన మార్పులుకు శాస్త్రీయమైన వివరణ ఇవ్వగలుగుతుంది. చరిత్రకు సంబంధించిన దీర్ఘకాల గమనాన్ని విశ్లేషించే పద్ధతిని ఆశ్రయించకుండా కులం గురించి, జండర్ గురించి చర్చించడం కుదరదు. మార్క్సిజం బలం ఎక్కడ ఉంటుందంటే -చరిత్ర దీర్ఘ కాలావధిలో ఉనికిలో ఉంటూ, పరిణామానికి లోనయ్యే ప్రతి అంశాన్నీ ఉత్పత్తి శక్తులు... ఉత్పత్తి సంబంధాలు అనే పరిశీలనా చట్రం ద్వారా వివరించడమే.

మార్క్సిజంలోని ఆచరణాత్మ దృష్టిని గుర్తించినంతగా దానిలోని శాస్త్రీయ కచ్చితత్వాన్ని పరిగణలోకి తీసుకోకుండా చర్చించే ధోరణి తెలుగులో చాలా ఎక్కువ. దీని వల్ల చాలా సమస్యలు తలెత్తుతుంటాయి. అందువల్లే చారిత్రక భౌతికవాదంలోని శాస్త్రీయ పద్ధతిని, హేతుబద్ధతను ఎదుర్కొని ప్రతివాదాలు చేసిన అస్తిత్వవాదులు మనకు కనిపించరు.

పైన చెప్పిన మార్క్స్ పద్ధతి ప్రకారం సామాజిక ఉత్పత్తి సంబంధాల నుంచి పెట్టుబడిదారులు కార్మికుల నుంచి శ్రమశక్తిని కొని, వస్తు ఉత్పత్తి చేసి, అదనపు విలువను దోపిడీ ఎలా చేస్తాడు? అనే విషయాన్ని సోదాహరణంగా వివరిస్తుంది. ఉత్పత్తి శక్తుల అభివృద్ధి ఉత్పత్తి సంబంధాల్లో మార్పును అనివార్యం చేస్తుందని, పాత సమాజంతో తెగతెంపులు చేసుకొని సమాజం ఏర్పడ్డమంటే కొత్త సంబంధాలు రూపొందడమే అనీ మార్క్సిజం చెప్తుంది. స్ట్రక్చర్ ఆధారంగా ఉత్పత్తి దాయకమైన సామాజిక సంబంధాలను, అందులోని దోపిడీనీ, దానికి వ్యతిరేకంగా జరిగే మార్పును విశ్లేషించినట్టే నేరుగా ఇతర సామాజిక సంబంధాలను కూడా మార్క్సిజం వివరిస్తుంది. ఇంకో రకంగా చెప్పాలంటే-వర్గ సంబంధాల వలె వర్గేతర సంబంధాలను కూడా వాటి భౌతిక పునాది మీద నుంచి మార్క్సిస్టు పరిశీలనా చట్రంలో వివరించడానికి సంపూర్ణంగా అవకాశం ఉన్నది.

అదనపు విలువ దోపిడీ రద్దయితే మిగతా అన్నీ రద్దుకావడానికి అనుకూల వాతావరణం ఏర్పడవచ్చు గాని (సమాజంలో జరిగే ప్రతి చిన్న మార్పు ఇతర మార్పు క్రమాలకు దోహదపడుతుంది. వర్గ దోపిడీ రద్దు కూడా, తప్పక రద్దు కావలసిన ఇతర సమస్యలను ప్రభావితం చేస్తుంది. (వేగం చేస్తుంది) ఇదే సిద్ధాంత విశ్లేషణ అని సంతృప్తి పడడానికి లేదు. అదనపు విలువ దోపిడీ రద్దు శాస్త్రీయ సంవిధానంతో ఎట్లా నిరూపణ అయిందో సాంఘిక అణచివేత రద్దు గురించి కూడా అట్లా నిరూపించవలసి ఉంటుంది.

అస్తిత్వవాదుల సమర్థకుల్లో కొందరైనా మార్క్సిస్టు వర్గ సిద్ధాంతం ద్వారా కులాన్ని వివరించలేమంటూనే కులాన్ని వర్గానికి ప్రత్యామ్నాయమనో, కులమే వర్గమనో అంటుంటారు. ఇట్లా ఎన్నటికీ కుల సమస్య అర్థం కాదు. మార్క్సిజానికి వ్యతిరేకమైన ప్రవచనాలు చెప్పడం తప్ప సాధించేదేమీ ఉండదు. కులాన్ని అర్థం చేసుకోడానికి మార్క్సిజానికి ఇంకేదైనా కలపాల్సి ఉంటుందని, అంబేద్కర్ ఆలోచనలను కలిపితే సరిపోతుందనే వారు కూడా ఉన్నారు. అప్పుడు తయారయ్యే దాన్ని దళిత మార్క్సిజమని వ్యవహరిస్తున్నారు.

ఈ ఆలోచనలన్నీ కుల సమస్యకు ఏదో ఒకరకమైన సిద్ధాంత విశ్లేషణ తప్పదనే ఎరుకను సూచిస్తున్నాయి . ఒక క్రమంలో-కుల సామాజిక సంబంధాలను ఉత్పత్తి సంబంధాల్లో భాగంగా, కులాన్ని వర్గంలో భాగంగా చూసే పద్ధతి మార్క్సిస్టుల్లో రూపొందింది. సాంఘిక సాంస్కృతిక జీవితంలో కులం ప్రాబల్యం కనిపించేదే కాబట్టి దాన్ని మొదటి నుంచి ఉపరితల అంశంగా గుర్తించేవారు. కులం గురించిన చర్చ తీవ్రవయ్యాక మార్క్సిస్టులు మరింత లోతుగా పరిశీలించి కుల వ్యవస్థ పునాదికి సంబంధించింది కూడా అనే నిర్ధారణకు వచ్చారు. కుల వ్యవస్థలో అట్టడుగు దళిత కులాలు-వర్గము ఒక్కటే అనే భావన కూడా కలిగింది. కులమే వర్గమని కాకపోయినా అట్టడుగు కులాలకు ఉత్పత్తి సాధనాల మీద ఏ రకంగానూ యాజమాన్యం లేదు కాబట్టి ఆ స్థాయిలో కులం-వర్గం ఒకటే అని గుర్తించవచ్చనే అభిప్రాయం ఉన్నది. ఇది సమస్యపట్ల శ్రద్ధను తెలియజేస్తుందిగాని ఇందులో కొన్ని చిక్కులు ఉన్నాయి. ఇది మార్క్సిజంలోని కచ్చితత్వాన్ని దెబ్బతీస్తుంది.

సామాజిక జీవితంలో ప్రబలంగా ఉన్న అన్నిటినీ పునాది ద్వారానే విశ్లేషించాలనుకోనవసరం లేదు. పునాది ద్వారా నేరుగా వివరించలేని అంశాలు కూడా ఉంటాయి. అయితే ఒక యుగావధిలోని సామాజిక విషయాలన్నిటికీ ఉత్పత్తి సంబంధాలు తప్పక పరిమితి విధిస్తాయి. అదే సమయంలో ఉత్పత్తి సంబంధాలు మారినా గతం నుంచి మార్పులకు లోనవుతూ కొనసాగే ఉత్పత్తేతర సామాజిక సంబంధాలు కూడా ఉంటాయి. పాత రోజుల్లో కులం ఆనాటి ఉత్పత్తి సంబంధాల ప్రమేయంగా ఉండేది. అప్పుడైనా కులం ఆనాటి ఉత్పత్తి విధానంలో పునాదితో ఎలాంటి సంబంధంలో ఉండేది, ఉపరితలంతో ఎలాంటి సంబంధాల్లో ఉండేది అనేది చాలా ముఖ్యం. కుల సాంఘిక వ్యవస్థ ఎలా పుట్టింది? ఎలా పునరుత్పత్తి అవుతూ వచ్చింది?ఎలా మారుతూ వచ్చింది? అనే వాటిని అర్థం చేసుకోడానికి ఉత్పత్తి సంబంధాలు ఉపయోగపడుతాయి.

దీనర్థం - ఉత్పత్త్యేతర సామాజిక సంబంధాలు కూడా ఉంటాయి, సామాజిక నిర్మాణంలో వీటి పాత్ర కీలకమైనది. వాస్తవికతను ఉత్పత్తి సంబంధాల ద్వారానేగాక ఉత్పత్త్యేతర సంబంధాల ద్వారా కూడా వివరించవచ్చు. సమాజం అనే మొత్తానికి ఉత్పత్తి సంబంధాలు కేంద్రం అనే మౌలిక విషయంలో ఏమరపాటు లేకుండా ఈ పరిశీలన చేయవచ్చు. మరో మాటలో చెప్పాలంటే ఉత్పత్తితో ముడిబడి ఉన్న వర్గ సంబంధాలు, వర్గేతర సంబంధాలు, వాటి నుంచి పుట్టే సాంఘిక వ్యవస్థలు, క్రమాలు కలిసి సమాజం అవుతుంది. కులాన్ని వర్గేతర సామాజిక సంబంధాల నుంచి పుట్టిన సాంఘిక వ్యవస్థగా భావించినప్పుడే కాలక్రమంలో ఉత్పత్తి సంబంధాల్లో మార్పు జరిగినా కులం నిలిచి ఉండటాన్ని, పరిణామం చెందుతూ నిరంతరం పునరుత్పత్తి అవుతూ కొనసాగడాన్ని వివరించడానికి వీలవుతుంది. పాత ఉత్పత్తి సంబంధాలు అక్కడక్కడా మిగిలి ఉన్నట్టే పాత సాంఘిక వ్యవస్థలు కూడా ఉత్పత్తి సంబంధాలుగా కనిపించవచ్చు. కులం అట్లా కనిపించేందుకు అవకాశం ఉంది. అయినంత మాత్రాన నేరుగా ఉత్పత్తి సంబంధాల్లో నిర్ధారించడం వల్ల కులం, జండర్ లాంటి అనేకానేక అస్తిత్వాల్లాగే వర్గం కూడా ఒక అస్తిత్వమవుతుంది. అంటే- మార్క్స్ పద్ధతిని అంగీకరించేవారు, దాని మీద విమర్శ ఉన్నవారు కూడా ఒకే ప్రాతిపదిక మీద నుంచి మాట్లాడుతున్నట్టవుతుంది. మొత్తం సమాజంలో కులం ఒక పెద్ద దృగ్విషయం కాబట్టి, అదలా ఉన్నదంటే తప్పక ఉత్పత్తి సంబంధాల్లో ఉండి ఉంటుందని, దాన్ని అక్కడి నుంచే చూడాలనే నిర్ధారణకు ఇద్దరూ వచ్చినట్టే. ఈ చర్చ అస్తిత్వవాదులకు అవసరం లేకపోయినా, మార్క్సిస్టులు పరిష్కరించుకోవలసిన తప్పని సరి సమస్య. వర్గం నేరుగా ఉత్పత్తి సంబంధాల ఆధారంగా జరిగిన విభజన. ఈ స్పష్టత వర్గానికి జరిగే అపచారాన్ని నివారించడానికి కాదు. కులమనే సాంఘిక వ్యవస్థను దాని భౌతిక అస్తిత్వం నుంచి అర్థం చేసుకోడానికి కూడా అవసరం.

కులవ్యవస్థలో అట్టడుగు స్థాయిలోకి వెళ్లే కొద్దీ కులం - వర్గం ఒకటే అవుతుందని అనడం ఉత్పత్తి సాధనాల మీద యాజమాన్యం వైపు నుంచి చూస్తే నిజమే అనిపిస్తుంది. కానీ కులం అనే ఐడెంటిటీ సాంఘిక వ్యవస్థకు సంబంధించింది. కులంతో వ్యవహరించేటప్పుడు ఎట్టి పరిస్థితిల్లో కూడా అది ఒక సాంఘిక గుర్తింపు అనే విషయాన్ని విస్మరించడానికి లేదు. అది ఎంత విస్మరణకు గురైతే అంతగా కులాన్ని తక్కువ చేసి చూసినట్టే. పైగా మార్క్సిజానికి సంబంధించిన శాస్త్రీయ కచ్చితత్వం నుంచి పక్కకు జరిగినట్టవుతుంది. లేనిపోని సిద్ధాంత సమస్యలు సృష్టించడం తప్ప పరిష్కారాలేవీ దొరకవు.

అంటరానితనం అనే సాంఘిక అస్తిత్వం ఉన్నందు వల్ల, ఆ ప్రాతిపదిక నుంచి దళిత కులాలను వర్గానికి సరిసమానం అనడం కుదరదు. అంటరానితనం అనే ప్రత్యేకమైన అస్తిత్వంలో ఉన్న అంటరానితనం, సామాజిక హోదా లేకపోవడం మొదలైన వాటికి సాంఘిక విముక్తే పరిష్కారం. వలస పాలనకు పూర్వం దళితులు ప్రధానంగా సాంఘిక లక్షణం గల శ్రమ రూపాల్లో పాలు పంచుకొనేవారు. అందులో ఎక్కువ సేవా సంబంధమైనవి. వలసపాలన వల్ల తొలిసారిగా అక్షరజ్ఞానానికి దగ్గరైన దళిత కులాలల్లో వ్యక్తులుగా, చిన్న బృందాలుగా ఒక పరివర్తన ప్రక్రియలో భాగమయ్యారు. అధికారమార్పిడి తర్వాత ఇది కొంచెం వేగం పుంజుకుంది. ఇప్పుడది సామాజిక సంపదలో, అధికారంలో జనాభా దామాషా ప్రకారం వాటా కావాలని, ముఖ్యంగా సాంఘిక హోదా కావాలని డిమాండ్ చేసి సాధించుకోవడంగా విస్తృతమైంది.

అంటే ఆధునిక పూర్వ దశలో నుంచి చిన్న చిన్న కెరటాలుగా దళితులు ఆధునిక ప్రపంచంలోకి ప్రయాణిస్తున్నారు. పాత శ్రమరూపాల నుంచి కొత్త శ్రమరూపాలకు చేరువ అవుతున్నారు. కొత్త జ్ఞానం, కొత్త నైపుణ్యాలు అలవర్చుకోవడం వల్లనే ఈ పరివర్తన సాధ్యమైంది. అంటే- ఉత్పత్తి శక్తుల అభివృద్ధిని ఈ క్రమం సూచిస్తుంది. వలసపాలకులు, ఆ తర్వాత వచ్చిన పాలకులు చేపట్టిన చర్యల వల్ల చారిత్రకంగా తమ ముందున్న ఆధునిక ప్రపంచం వల్ల దళితులు ఆధునికతలో మెల్లమెల్లగా భాగమవుతూ వచ్చారు.

సాంఘిక అస్తిత్వంతో ఘర్షణ పడి, దాని బంధనాల్లోంచి దారి వెతుక్కుని అక్కడి నుంచి వర్గంగా పరివర్తన చెందే పార్శ్వాన్ని ఉత్పత్తి శక్తుల అభివృద్ధిలో భాగంగా గుర్తించవచ్చు. ఇది ప్రగతిదాయకం. ప్రగతి అనే భావన చారిత్రకమైనది. ఉత్పత్తి శక్తుల అభివృద్ధి వల్ల ఉత్పత్తి సంబంధాల్లో సంభవించే మార్పు. ఒక దీర్ఘకాలావధిలో జరిగిన ఈ మార్పును కూడా ప్రగతిగా భావించవచ్చు. ఆధునిక పూర్వ స్థితిలో ఉన్న దళితులు సాంఘిక అస్తిత్వంతో ఘర్షణ పడి, సాపేక్షంగా బైటపడి వర్గంగా పరివర్తన చెందడం ప్రగతిదాయకమే. అయితే సాంఘిక అస్తిత్వమే వర్గంగా మారడం లేదు. కొత్త ఉత్పత్తి సంబంధాల్లో వర్గంగా ఉనికిలోకి వచ్చారు. ఉదాహరణకు - దళితులు శారీరక, మేధో శ్రమ చేసే చిరు ఉద్యోగులుగా, కొత్త నైపుణ్యాలతో పనులు చేసేవారుగా, కార్మికులుగా (ఉత్పత్తి సాధనాల మీద యాజమాన్యం లేకపోవడం అనే కోణంలో) కొత్త ఉత్పత్తి సంబంధాల్లోకి వచ్చారు. (కొందరు దళిత మేధావులు ఏమంటారంటే-దళితులు ఇట్లా శ్రమ చేసేవారుగా కాకుండా పెట్టుబడిదారులుగా ఈ కొత్త ఉత్పత్తి సంబంధాల్లోకి ప్రవేశించాలని కోరుకుంటున్నారు.)

ఉత్పత్త్యేతర సామాజిక సంబంధాల్లో కూడా పైన చెప్పిన ప్రత్యేక అర్థంలో ప్రగతి ఉన్నది, అయితే సాంఘిక విముక్తి అనేదే కుల అస్తిత్వానికి పరిష్కారంగా ఉంటుంది. ఉత్పత్తి శక్తుల్లోని నిరంతరాయ అభివృద్ధి క్రమమే ప్రగతి. దీనికి ఉత్పత్తి సంబంధాలు అవరోధంగా మారినప్పుడు విప్లవాల యుగం ప్రారంభమవుతుంది. అది శ్రమశక్తిని సరుకుగా అమ్ముకోవడం, కొనుక్కోవడం అనే పరిస్థితిని మారుస్తుంది. ఇది వర్గ విముక్తి.

కుల అస్తిత్వం ప్రకారం ఉత్పత్త్యేతర సామాజిక సంబంధాల్లో సాంఘిక విముక్తిని, అదే సాంఘిక అస్తిత్వంలో నుంచి రూపొందే వర్గపార్శ్వ వల్ల -ఉత్పత్తి సంబంధాల మార్పు ద్వారా ప్రగతిని దళితులు సాధించాల్సి ఉంటుంది. సమాజమంతా ఉత్పత్తి సంబంధాల సమాహారమే అనుకోవడం వల్ల సాంఘిక సమస్యలను వివరించడంలో తలెత్తే ఇబ్బందిని అధిగమించడానికి ఈ పద్ధతి ఉపయోగపడుతుంది.

•

ప్రత్యుత్తరం

ఉద్యమాలకు క్రమ శిక్షణ అవసరం లేదా?

- రంగనాయకమ్మ

"దుఃఖం విలువ" అనే పేరుతో పాణి గారు నాకు రాసిన ("రంగనాయకమ్మ గారూ" అని ప్రారంభించి రాసిన) 'ప్రతి స్పందన' లేఖ చూశాను. (అరుణతార, జూలై - సెప్టెంబరు, 2010. జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలల సంచిక, అక్టోబరులో అయినా కాదు, నవంబరులో వచ్చింది!)

పాణి గారు, ఈ స్పందన లేఖ రాయడానికి కారణం, నేను 'ఆంధ్ర జ్యోతి'లో (జూలై 14, 2010), "ఒకే కలం, రెండు సిరాలు" పేరుతో రాసిన వ్యాసం. ఆ వ్యాసానికే ప్రతి స్పందన ఇది. ' అరుణ తార' పాఠకుల్లో కొందరైనా పాణి గారి స్పందనకు కారణమైన నా వ్యాసాన్ని చూసి ఉండకపోవచ్చు కాబట్టీ, చూసిన వాళ్ళయినా దాన్ని మరిచిపోయి ఉండవచ్చు కాబట్టీ, నా వ్యాసంలో విషయాన్ని ఒక సారి ఇక్కడ కొంచెం చెప్పాలి.

మావోయిస్టు పార్టీ నాయకుల్లో ఒకరైన ఆజాద్‌నీ, ఆయనతో ఉన్న జర్నలిస్టు హేమచంద్ర పాండేనీ, పోలీసులు, ఎన్‌కౌంటర్ పేరుతో క్రూరంగా హతమార్చిన సంగతి అందరికీ తెలుసు. ఆజాద్ అంత్యక్రియల తర్వాత, ఆయనకు నివాళి అర్పిస్తూ వచ్చిన ఒక వ్యాసం (ఆంధ్ర జ్యోతిలోనే) చూసి, నేను దాన్ని ఏమీ నమ్మలేకే, " ఒకే కలం..." వ్యాసం రాశాను.

విప్లవకారుల్ని వేటాడి హతమార్చే పాలక వర్గ ముఖ్యమంత్రి కర స్పర్శల్లో వెచ్చదనం అనుభవించే కలమే, విప్లవకారుల మరణాల కోసం విచారించడం వింతగా కనపడి, ' ఒక్క కలమే రెండు రకాలుగా రాస్తోందే' అని, ఆ వ్యాసం రాశాను.

అదే వ్యాసంలో ఇంకో రెండు మూడు విమర్శలు కూడా చేశాను. ఆజాద్ అంత్యక్రియల దగ్గిరికి వెళ్ళిన వారిలో చాలా మంది, ఆజాద్ తమకు అక్కడ తెలుసనీ, ఇక్కడ తెలుసనీ, చెప్పుకున్నట్టు పేపర్ల నిండా చూశాం కాబట్టి, దానికి నేను ఆశ్చర్యపోయి, " అక్కడ అందరూ ఎగబడి, 'నాకు అది తెలుసు, నాకు ఇది తెలుసు' అని చెప్పేసుకోవడం ఏమిటి; పోలీసులు ఆ వివరాలన్నీ చెప్పమంటే, దాని వల్ల, లోపల ఉన్న ఉద్యమకారులకు ప్రమాదం రాదా?" అని రాశాను. అంతే గాక, నిషేధిత మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ, ఆజాద్ ఎన్‌కౌంటర్‌ని ఖండిస్తూ చేసిన తీర్మానాన్ని, వరవరరావు గారికి పంపినట్టూ, ఆయనే దాన్ని బహిరంగంగా చదివినట్టూ, పత్రికల్లో చదివి, దాని మీద కూడా నా వ్యాఖ్యానాలు, ఆ " ఒకే కలం....." వ్యాసంలో రాశాను. ఒక నిషేధిత పార్టీ, తన వార్తల్ని పత్రికలకూ, టీవీలకూ పంపితే దానికి అర్థం ఉంది గానీ, బహిరంగంగా తిరిగే వ్యక్తికి పంపడమూ, అతడు దాన్ని ప్రకటించడమూ, ఎలా చేశారని నాకు ఆశ్చర్యం.

హేమచంద్ర పాండే విషయంలో ఏం జరిగింది? ఆజాద్ పక్కన ఉన్నందుకే ఆయనకి, పోలీసులు, మరణాన్ని శిక్షగా ఇచ్చారు. మరి, నిషేధిత పార్టీతో ఎంతో దగ్గిర సంబంధంలో ఉన్నట్టు ఆధారాలతో సహా కనపడుతోన్నా వరవరరావు గారి మీద పోలీసుల దృష్టి పడడం లేదంటే, ఆ వింతకి ఏదో ప్రత్యేక కారణం ఉండి ఉండదా? - ఇలాంటి ప్రశ్నలు ఎవరికైనా వచ్చాయో లేదో గానీ, నాకైతే వచ్చాయి. నా ప్రశ్నల్ని అడగడం నా హక్కు. - ఈ రకం వ్యాఖ్యానాల తోనే ఆ వ్యాసం రాశాను.

నా ప్రశ్నలకు సరైన జవాబులు ఉంటే, అవి తెలిసిన వాళ్ళు వాటిని చెప్పకోవాలి. లేకపోతే, మౌనం వహించి ఊరుకోవాలి. కానీ, పాణిగారు (ఈయన విరసానికి ప్రస్తుత కార్యదర్శి), నా మీద దండెత్తడమే, నా ప్రశ్నలకు జవాబులు చెప్పడం అనుకున్నారు.

అలాంటి ' అడ్డ దిడ్డం' ప్రశ్నలు నాకు ఎందుకు వస్తాయా - అని చాలా సార్లు ఆలోచించాను గానీ, ఎప్పుడూ జవాబు దొరకలేదు. ఇప్పుడు పాణి గారి వ్యాసంలో చాలా చక్కటి జవాబు దొరికింది. దాన్ని తర్వాత వివరంగా చూపిస్తాను గానీ, అందాకా కొంచెం చెపుతాను. నాకు ' పిచ్చెక్కిన స్థితి' వచ్చింది! అవును, అది నిజమే అనిపిస్తోంది. పాణి గారు బాగా కనిపెట్టారు.

పాణి గారికి, నా "ఒకే కలం..." వ్యాసం చదివినప్పుడు, నా "మనః స్థితి" పట్ల ఆయనకి మొదట కొంచెం "సందేహం" మాత్రమే కలిగింది. - ' ఈమె కేమన్నా కొంచెం మతి చెడి ఉంటుందా' అని, అప్పటికి అది కొంచెం సందేహమే. కానీ, నా మీద ఆయన "దుఃఖం విలువ" వ్యాసం మొదలు పెట్టి రాస్తూ ఉంటే, ఆ సందేహం ఇంతింతగా పెరిగి పూర్తిగా స్థిరపడి పోయింది. నేను "విపరీత మనః స్థితిలో" వున్నట్టు, నా గురించి ఆయన రూఢి చేసుకున్నారు.

రోగ నిర్ధారణలు చెయ్యడంలో ఆయనకి అంత వైద్యజ్ఞానం ఉండి ఉండాలి. అలా లేకపోతే, ఎదటి మనిషికి పిచ్చెక్కిందో లేదో ఆయన అయినా చెప్పలేరు కదా? నా జబ్బేమిటో నాకు తేల్చి చెప్పడం, నాకు చాలా సంతోషం కలిగించింది. నేను తొందరగా వైద్యం చేయించుకోవచ్చు కదా? వైద్యం కోసం కూడా వైద్య జ్ఞానం తెలిసిన పాణి గారినే సంప్రదించాలను కుంటున్నాను. తెలిసిన వాళ్ళే బాగా వైద్యం చెయ్యగలరు.

నా జబ్బేమిటో నాకు అస్పష్టం గానే తెలుస్తోంది గానీ, పాణి గారికైతే చాలా స్పష్టంగా తెలుస్తోంది. "ఉద్యమాల్లో ఉండేవాళ్ళ పట్ల సదా చిన్న చూపు" ఉంటుందట నాకు! నా జబ్బుని ఆయన బాగా కనిపెట్టారు!

నాకు ఉన్నది జబ్బు కాదేమో అని, నా గురించి నాకు మళ్ళీ కొంచెం సందేహం. ఉద్యమకారుల క్షేమం గురించి ఆలోచించడం జబ్బు కాదేమో, క్షేమం గురించే భయంతో అలా ఆలోచించానేమో అని సందేహం. ఇదంతా నా ' విపరీత మనః స్థితి' కాదేమో, దీన్ని ఒక

విషయం మీద రేగిన వివాదంగా అనుకోవాలేమో అనిపిస్తోంది ఇప్పుడు. కాస్సేపు ఇలా ఆలోచించి చూస్తాను.

ఎక్కడ ఏ వివాదం రేగినా, దానికి రెండు పక్షాలే ఉండవు. ఆ రెండు పక్షాల్నీ దూరం నించి గమనించే మూడో పక్షం కూడా ఉంటుంది. వివాదం ఏమిటో వాళ్ళకి వివరంగా తెలిస్తే, ఇది నా జబ్బో, లేదా ఎవరి జబ్బో, ఎవరి జబ్బూ కాని వివాదమో, వాళ్ళకి తెలుస్తుంది. ఇది జబ్బో కాదో చివరికి వాళ్ళే ఆలోచిస్తారు.

నా వ్యాసంలో వ్యాఖ్యానాల్నీ, లేదా నా సందేహాల్నీ, పాణి గారు, నా 'ఎదురు దాడి'గా, నా 'కుతర్కం'గా, జమ కట్టేసుకున్నారు కాబట్టి, ఇక ఆయనకి చెప్పి ప్రయోజనం ఉండదు. అది పూర్తిగా టైమూ, శ్రమా, వేస్టు. చెప్తే దూరంగా నిలబడ్డ వాళ్ళకే చెప్పాలి.

నాకు చాలా 'తర్క సామర్ధ్యం' వుందనీ, దానితో నేను బోలెడు పేజీలు రాసెయ్యగలననీ, ఆయన నన్ను చాలా అపార్థం చేసుకున్నారు. అంతే కాదు, ఆయన అసలు 'తర్కం' అనే దాన్నే అపార్థం చేసుకున్నారు. 'సరైన తర్కం' తో చెప్పుకుంటే, చెప్పుకోవలసింది చాలా తొందరగా అయిపోతుంది. దాన్ని రాసినా, ఎన్నో పేజీలు అక్కర్లేదు. తర్కం లేకుండా చెప్పుకుంటేనే దానికిక ముగింపు ఉండదు. 2 + 3 = ఎంత? అని అడిగితే, '5' అనే జవాబుతో, అది క్షణంలో అయిపోతుంది. పేజీల్ని ఇంకా పెంచాలన్నా సాధ్యం కాదు. కానీ అదే లెక్కకి, సరైన తర్కానికి వెళ్ళకుండా, అంటే 5 అనకుండా, 3, 7, 9, 6, 11, 16, 37 - ఇలా తర్కం లేకుండా చెప్పుకుంటూ పోతే, దానికి అంతం ఉండదు. అది ఎప్పటికీ ముగియదు, సాగుతూనే ఉంటుంది. దాన్ని రాయాలంటే, ఎన్ని పేజీలైనా చాలవు. సరైన తర్కాన్ని పట్టుకుంటేనే అది చప్పున ఆగుతుంది. నాకు మంచి తర్క సామర్థ్యం ఉందని ఆయన అన్నదంతా నిజం కాదు. ఏదో అభిమానంతో అలా అన్నారు. అయినా నేనూ ప్రయత్నిస్తాను. దూరంగా నించున్న వాళ్ళని ఎంతో సేపు నించో బెట్టకుండా నా జవాబులన్నీ తొందర గానే ముగిస్తాను.

పాణి గారి దాడి కథ మొదలు పెట్టెయ్యనా?

పాణి దాడి - 1: ఆజాద్ అభిమానులూ, మిత్రులూ, సహచరులూ, ఆయన చావు వార్త విని మీరన్నట్టు ఎగబడి వచ్చారు.

దూరంగా వున్న పాఠకులకు నా వివరణ: "మీరన్నట్టు" అన్నారు. "ఎగబడి" అనే మాట నేను అందరూ వచ్చి నందుకు అనలేదు. (నా వ్యాసంలో చూడండి.) ఏ మరణం దగ్గిరకైనా అనేక మంది పరిగెత్తుకు వస్తారు. ఉద్యమ కారుడికి దుర్మార్గంగా జరిగిన మరణం దగ్గిరికి అనేక లక్షల మంది రావాలి. అలా వస్తేనే, ప్రజల ధోరణి ప్రభుత్వానికి తెలుస్తుంది. నేను 'ఎగబడి' అన్నది, అక్కడికి జనం రావడం గురించి కాదు, "అజాద్ నాకు అలా తెలుసు, ఇలా తెలుసు; అక్కడ తెలుసు, ఇక్కడ తెలుసు" అని ఎగబడి చెప్పడం గురించి. కానీ, పాణి గారి వ్యాసం నిండా సాగింది, జనం అక్కడికి రావడం గురించే అలా అన్నానని. ఒక సారి మళ్ళీ చూడండి నా వ్యాసం. ఒక సందర్భం కోసం అన్న మాటని ఇంకో సందర్భానికి మారిస్తే, దాని అర్థమే మారిపోతుంది. 'ఎగబడి చెప్పారు' అనే దాన్ని, 'ఎగబడి వచ్చారు' అని మారిస్తే, ఏం జరుగుతుంది? చెప్పిన అర్థమే పోతుంది. పాణి గారి చాతుర్యంతో అదే జరిగింది.

ఇక్కడ ఒక మాట చెప్పాలి. నా వ్యాసం వచ్చిన రోజున, నాకు బాగా తెలిసిన విరసం ఆయనే ఒకాయన, నాకు ఫోను చేసి, " మీరు రాసింది చూశాను. ఆ రోజు నేనూ చాలా విషయాలు 'మాట్లాడాను. అవును, నిజమే. అది మంచిది కాదు. అలాంటి విషయాలు బైటికి రానివ్వకూడదు. నిజమే" అని మళ్ళీ మళ్ళీ అన్నారు.

ఇదంతా నేను కల్పించి రాశానంటారు. " అది ఆమె కల్పన కాదు. ఆమెతో అలా అన్నది నేనే. ఆమె చెప్పింది మంచి మాటే కాబట్టి, అది చదవగానే నిజమే అనిపించింది నాకు. ఆ మాటే చెప్పాను. ఆమె మాటల్లో తప్పేముంది?" అని ఆ మనిషి చెప్పగలిగితేనే నేను రాసింది నిజమో, కల్పనో, దూరంగా నించున్న వాళ్ళందరికీ తెలుస్తుంది.

పాణి దాడి - 2: ఒక మనిషి చనిపోయినప్పుడు, నలుగురూ కూడడం, దుఃఖించడం, అనే మామూలు విషయం మీకు తెలుసు గానీ, అది మీ వ్యక్తిత్వంలో, సంస్కారంలో భాగం కాలేదు. అందుకే అంత క్రూరంగా అవమానించారు.

నా వివరణ: నేను ఎవర్ని అవమానించాను? ఆ మనిషి పేరు చెప్పండి, తెలుసుకుంటాను. నా వ్యక్తిత్వం, నా సంస్కారం, పాణి గారికి ఎంత బాగా తెలిశాయో! చాలా ఆశ్చర్యం! దుఃఖం అనేది నాకు తెలుసట గానీ, అది నా వ్యక్తిత్వంలో, నా సంస్కారంలో భాగం కాలేదట! ఎవరికైనా అర్థమైందా ఇది? నా కైతే అర్థం కాలేదు. నా సంస్కారం బాగా లేదని ఆయన అంటున్నాడని అర్థమైంది గానీ, ఆ బాగా లేంది ఏమిటో అర్థం కాలేదు. మరణించిన ఆజాద్, సాధారణ వ్యక్తి కాదు. అజ్ఞాత జీవితం గడిపిన నిషేధిత పార్టీ ఉద్యమ కారుడు. ఆయన అంత్యక్రియల సమయంలో మాట్లాడిన వాళ్ళందరూ, ఆయన తమకు ఎంత సన్నిహితంగా, ఏ యే కాలాల్లో, ఎక్కడెక్కడ తెలుసో చెప్పుకుంటే, దాని వల్ల, ఆ పార్టీ వారికీ, సానుభూతి పరులకూ, ఇబ్బందులు రావా - అని నేను అనడం, నా సంస్కారంలో లోపం ఎలా అయిందో నాకు అర్థం కాలేదు. అర్థం అయిన వాళ్ళెవరైనా చెప్పండి; అదైనా నాకు అర్థమైతే తెలుసుకుంటాను.

పాణి దాడి - 3 : మీరు విప్లవం పట్ల ప్రేమనూ, బాధ్యతనూ ప్రదర్శించడం నిజంగా, ఆందోళన కలిగిస్తోంది. మీరెప్పుడు ఇలా మారిపోయారు?

నా వివరణ: అంటే, నేను కమ్యూనిస్టు విప్లవం పట్ల నిన్నటి దాకా ప్రేమా, బాధ్యతా లేని మనిషిని! ఇప్పుడే మారాను! అది ఆందోళన, పాణికి! - ఎవరైనా విప్లవం వేపు మారితే, ఈయనకి ఆందోళన ఎందుకు, సంతోషం కలగాలి గానీ.

నాకు విప్లవం పట్ల, ప్రేమా, బాధ్యతా లేదని అనుకున్న మీకు, వెనకటి కాలంలోనే చాలా సందర్భాల్లో చాలా ఆందోళనలు కలగవలసిందే. 1974లో, మీ సంస్థ వారు నన్ను, " విరసం ఎలా ఉంది? ఎలా ఉండాలి?" అని అడిగినప్పుడే, ' అయ్యో, ఈమెని అడిగారేమిటి?' అని ఆందోళన కలగ వలసింది. 1985లో, పోలీసులు, సారంగ పాణినీ, ఇంకో ఇద్దర్నీ, ఎన్‌కౌంటర్లు చేసినప్పుడు, మీ సంస్థ వారు, "పోలీసు దౌర్జన్యాల" మీద వరంగల్ లోనూ, హైదరాబాదు లోనూ పెట్టిన మీటింగుల్లో మాట్లాడడానికి నన్ను కూడా పిల్చినప్పుడు, " అయ్యో, ఈమెని పిల్చారేమిటి" అని ఆ రోజుల్లోనే మీకు ఆందోళన

కలగవలసింది. నేను ఆ రెండు ఊళ్ళకీ వచ్చి మీ సభ మీటింగుల్లో మాట్లాడినప్పుడూ, హైదరాబాదు మీటింగులో సారంగపాణి గురించి, అతను ఎవరో నాకు తెలియక పోయినా, అతన్ని ఎంత క్రూరంగా చంపారో తల్చుకుంటూ మాట్లాడుతూ మైక్ ముందు నేను భోరున ఏడుస్తూ ఉంటే, వేదిక మీద వున్న జార్జి ఫెర్నాండెజ్‌కి నా భాష తెలీక కంగారుపడి, 'ఏమిటేమిట'ని అడిగి తెల్లబోయి చూస్తూండగా నేనిక మాట్లాడలేక మైక్ ముందు నించి వెళ్ళిపోయి కింద కూర్చుని ఇంకా ఏడుస్తూ ఉన్నప్పుడు, "ఈమె నాటకాలాడుతోంది, ఈమెని పిల్చారెందుకు మన వాళ్ళు?" అని అప్పుడు మరీ ఆందోళన రావలసింది మీకు. ఇంకా వినండి! కొన్నేళ్ళ కిందట, హైదరాబాదులో, మీ సంస్థ వారి 'అవగాహన' సభ లోనే, ఉపన్యాసాలు రాని నేను, 'కాపిటల్' మీద రెండు గంటల సేపు ఆపకుండా మాట్లాడుతూ వుంటే, మీ సభ వారందరూ ఎంతో ఆసక్తితో నిశ్శబ్దంగా వింటూ వుంటే, అప్పుడు రావలసింది మీకు "అయ్యో ఈమె నించి వినేదేమిటి?" అనే ఆందోళన. ఆ సభలో, నా పక్కనే ఉన్న వ్యక్తి వేణుగోపాల్ గారే అని నాకు గుర్తు. చిట్ట చివర్లో ఆయన, "ఇప్పుడు కంప్యూటర్లు వచ్చేశాయి కదా? ఇంకా శ్రమ దోపిడీ ఉందంటారా?" అనే రకం ప్రశ్న (ఇవే మాటలు కావు), అడిగితే, నేను వెంటనే, "సూదికీ, కంప్యూటర్‌కీ, వాటి పాత్రల్లో ఏమీ తేడా ఉండదు. సూది ఒక పనిముట్టు అయినట్టు, కంప్యూటర్ కూడా ఒక పనిముట్టు. శ్రమలు చేసేది మనుషులే గానీ పనిముట్లు కావు. పని చేసేది సూది కాదు; పని చేసేది కత్తెర కాదు; అలాగే, పని చేసేది కంప్యూటర్ కాదు" అని నేను చెప్పిన మాటలు మీ వాళ్ళందరూ సంతోషంగా వింటూ ఉంటే, "అయ్యో, ఈమెని వింటున్నారే?" అని అప్పుడు రావలసింది మీకు అసలైన ఆందోళన. ఇంకా వింటారా? వింటే, ఆ ఆందోళనలన్నీ ఇప్పుడు పట్టుకుంటాయి మిమ్మల్ని. 2005లో, ప్రభుత్వం, విరసాన్ని నిషేధించి, తర్వాత ఆ నిషేధాన్ని రద్దు చేయడానికి, ఏర్పడిన 'విచారణ కమిటీ' ముందు మీ సంస్థ వారు, మీ సంస్థ కోసం ఎలాంటి వారు వచ్చి మాట్లాడారో ఆ కమిటీకి వివరించడానికి, "........., రంగనాయకమ్మ .... వంటి ప్రఖ్యాత మేధావులూ, సాహిత్యకారులూ, అందరూ ఏదో ఒక సమయంలో విరసం వేదిక మీద ప్రసంగించారు" అని చెప్పినప్పుడు, "అయ్యో, ఈమెని, మేధావి అన్నారే మన వాళ్ళు" అని అప్పుడే రావలసింది మీకు పెద్ద ఆందోళన. ఇలాగే, మీకు ఆందోళన కలిగించే ఘట్టాలు వెనకటి రోజుల్లో చాలా ఉన్నాయి. వాటన్నిటినీ వదులుకున్నారెందుకు? మీరు, మీ సంస్థ వారితో పోరాడ లేదా - అని సందేహం వచ్చింది నాకు. విప్లవం పట్ల ప్రేమా, బాధ్యతా లేని రంగనాయకమ్మ వంటి వారితో గతంలో సంబంధాలు పెట్టుకున్నందుకు పశ్చాత్తాపం ప్రకటించమని మీ సంస్థ వారికి ఇప్పటికైనా చెప్పండి. కార్యదర్శి మీరే కదా? విప్లవం పట్ల ప్రేమా బాధ్యతా వున్న మీరు, ఈ విషయాన్ని అశ్రద్ధ చెయ్యకండి! మీ సంస్థ ద్వారా, గత చర్యలకు పశ్చాత్తాపాలు ప్రకటించండి! ఇప్పటికే చాలా ఆలస్యం చేశారు.

ఇక్కడ నాకు మళ్ళీ ఇంకో ప్రశ్న వస్తోంది. ఏమిటంటే, ఒక మనిషి ఎవరైనా, కమ్యూనిస్టు విప్లవం పట్ల ద్వేషం గానూ, బాధ్యతా రహితంగా ఉండే మనిషి, తర్వాత కాలంలో ఆ విప్లవం పట్ల ప్రేమ గానూ బాధ్యత గానూ వుండాలని తెలుసుకుంటే, ఆ మనిషి అలా మారడం చూస్తే, ఆ ఉద్యమ కారుల్లో ఎవ్వరికైనా సంతోషమే కలుగుతుంది కదా? పాణి గారికి ఆందోళన ఎందుకు కలిగింది? - నా మనః స్తితి లాగే ఆయన మనః స్తితికి కూడా ఏమైనా అయిందా? అయ్యో, చాలా చప్పున శ్రద్ధ తీసుకోవలసిన సంగతి ఇది. విరసం వారూ, అరుణ తార పత్రిక వారూ, పాణి గారి ఆరోగ్యం గురించి వెంటనే పట్టించుకోవాలి. మా లాంటి వాళ్ళ ఆరోగ్యాలు ఎలా ఏడ్చినా కొంపలు మునగవు. విప్లవాల పట్ల గొప్ప ప్రేమా, గొప్ప బాధ్యతా గల విప్లవ కారుడి ఆరోగ్యం కొంచెం పాడైతే, ముఖ్యంగా మనః స్తితి పాడైతే, అది మీ సంఘానికీ, మీ పత్రిక్కీ, క్షేమం కాదు గదా? ఆలోచించండి తొందరగా. ఆలోచించేదేముంది? పాణి గార్కి తొందరగా టెస్టులు చేయించాలి సుమా!

పాణి దాడి - 4: ఉద్యమాల్లో ఉండే వారి పట్ల సదా మీకు చిన్న చూపు ఉంది.

నా వివరణ: ఇది అంతా నిజం కాదు గానీ, కొంత నిజం వుంది. ఎందుకంటే, ఉద్యమాల్లో వున్న వాళ్ళల్లో అందరూ విప్లవకారులు కారు. అసలు, 'ఉద్యమాలు'గా కనపడ్డవన్నీ, మంచి ఉద్యమాలు కావు. మీకు తెలీదేమో గానీ పాణి గారూ, విప్లవ పదాలు తెగ వల్లిస్తూ, నిజ జీవితాల్లో ఫ్యూడల్ మూర్ఖుల్లాగా, బానిస యజమానుల్లాగా, ప్రవర్తించే వాళ్ళు కూడా ఉద్యమాల్లో వుంటారండీ. పోలీసు వాళ్ళు పంపే గూఢచారుల సంగతి కాదు నేను అనేది; వాళ్ళ ఇష్టంతో వాళ్ళు చేరే వాళ్ళ సంగతే! కబుర్లు గొప్పగా చెపుతూ, చేతల్లో చెత్తగా వుంటారే, అలాంటి వాళ్ళంటే నాకు చిన్న చూపే. అంతే కాదు, ఒక వేపు పాలక పక్షం తోనూ, ఇంకో వేపు విప్లవ పక్షం తోనూ లౌక్యంగా ప్రవర్తించే వాళ్ళంటే, అలాంటి వాళ్ళని నోళ్ళు మూసుకుని సమర్థించే వాళ్ళంటే, నాకు మరీ చిన్న చూపు లెండి పాణి గారూ! నాకే కాదు, అలాంటి కిలాడీ వాళ్ళంటే, చాలా మందికి చిన్న చూపే లెండి. ఏం, అలాంటి వాళ్ళంటే మీకు చిన్న చూపు వుండదా? అయ్యో, మీ కెందుకు వుండదు లెండి, మీ కసలే విప్లవం అంటే ప్రేమా, బాధ్యతా. కిలాడీ వాళ్ళని మీ రసలే భరించలేరు.

పాణి దాడి - 5: మీకు తెలియనిది ఏమిటంటే, శరీరాన్ని శత్రువులకు అప్పగించి, ఏళ్ళ తరబడి జైళ్ళల్లో ఉండేందుకు సిద్ధపడి, ఉద్యమాన్ని కాపాడుతున్న వాళ్ళే ఉద్యమం లోపలా బైటా చాలా చాలా ఎక్కువ.

నా వివరణ: నాకు తెలియని మంచి విషయాలు ఎవరు చెప్పినా నేర్చుకుంటాను. తెలియని మంచి విషయం తెలిస్తే సంతోషిస్తాను. కానీ, మీరు చెప్పే ఈ 'తెలియని' విషయంలో, మంచేదీ కనపడడం లేదు నాకు. జైళ్ళు నింపడం సంగతీ, శత్రువుకి శరీరాలు అప్పజెప్పడం సంగతీ, ఎందుకు వచ్చింది ఇక్కడ? - ఆజాద్ అంత్యక్రియల దగ్గిర ఉద్యమకారులకు ప్రమాదాలు తెచ్చిపెట్టే మాటలు చెప్పారేమిటని నేను అన్నాను కదా? దానికి జవాబు అన్నమాట ఇది! అంటే, "పోలీసులు

ఏం చేసినా మాకేం లక్ష్యం లేదు; మా ఉద్యమకారులు శరీరాల్ని ధైర్యంగా శత్రువుకి అప్పజెప్పెయ్యగలరు. ఎన్నెన్ని ఏళ్ళయినా జైళ్ళల్లో ఉండగలరు" - అని చెప్పుకోవడం అన్నమాట ఇది! శత్రువుకి చిక్కే పరిస్థితీ, జైళ్ళల్లో పడి వుండే పరిస్థితీ, తెచ్చుకోకుండా, ఎప్పుడూ తగినన్ని జాగ్రత్తలు తీసుకోవాలనే టెక్ క్రమశిక్షణ నిబంధనలు ఎందుకు ఉంటాయి పాణి గారూ? ఉద్యమకారులంతా జైళ్ళల్లో ఎన్నేళ్ళయినా పడి ఉండడానికి దారితీసే, క్రమశిక్షణ లేని నడకలు నడిస్తే, ఆ రకపు అరాచకపు ఉద్యమకారుల వల్ల, జైళ్ళన్నీ నిండి కిట కిట లాడతాయి గానీ, బైట జరగాల్సిన ఉద్యమాలైతే, జనం బోసిపోయి, వెల వెల పోతాయి. అక్కడ జైళ్ళు నిండే కొద్దీ, ఇక్కడ ఉద్యమాలు ఖాళీ అవుతాయి.

ఉద్యమకారుల ప్రధాన బాధ్యత, ఉద్యమాలు చెయ్యడమే గానీ, జైళ్ళు నింపడం కాదు. ఉద్యమకారులు, ఉద్యమాల్ని బలపరిచే క్రమ శిక్షణకు దీక్షగా కట్టుబడడమే మంచి లక్షణం. కానీ పాణి గారు, క్రమ శిక్షణా రాహిత్యాన్ని వెనకేసుకొస్తూ, 'మీకేం భయం లేదు, మా వాళ్ళు వీరులు. జైళ్ళని నింపేస్తారు. శరీరాలు అప్పజెప్పేస్తారు' అని చెప్పుకొచ్చారు. అయితే ఆయన, అంత కన్నా ఒక అరాచకత్వాన్ని ఇంకో గొప్ప సంగతిగా చెప్పుకోవచ్చు. అది మరిచిపోయినట్టున్నారు. "నాకు బైట ఉంటేనే ప్రాణ భయం. నన్ను జైల్లో దాచి రక్షించండి" అని జైలునే రక్షణ స్థలంగా ఎంచుకున్న ఉద్యమకారులు కూడా మీ దగ్గిర ఉన్నారు. అలాంటి చేష్టల్ని కూడా వీరత్వాలుగా చెప్పుకోవడం మరిచి పోయారెందుకు?

"ఉద్యమాల్లో కొన్ని జాగ్రత్తలు పాటించాలి, నిజమే" అని చెప్పుకుని, జాగ్రత్తలు పడితే సరిపోయే దానికి, ఏదో పెద్ద నింద వచ్చి మీ మీద పడ్డట్టు, దానికా ఇన్ని గొప్ప వాదాలు?

పాణి దాడి - 6: ఒక అజ్ఞాత ఉద్యమకారుడు, మనకు తెలిసి వుండడం, వాళ్ళ నించి మనకు ఉత్తరాలు గట్రా రావడం, రాజ్యాంగం ప్రకారం నేరం కాదనే చిన్న విషయం, రాజ్యాంగం గురించి నిత్య ప్రబోధకురాలైన మీకు తెలియక పోవడం ఆశ్చర్యకరం.

నా వివరణ: అంటే, పాణిగారి అర్థం - 'బైట ఉన్న వాళ్ళకి అజ్ఞాత ఉద్యమకారులు తెలిసి వుండరా, ఉండకూడదా! మావోయిస్టు పార్టీ నించి వరవరరావుకి ఉత్తరాలు రాకూడదా; అది రాజ్యాంగం ప్రకారం నేరం కాదనే చిన్న విషయం మీకు తెలీదా?' అని. నాకు తెలిసింది, అది రాజ్యాంగం ప్రకారం పెద్ద నేరం. ఎందుకంటే, ఉద్యమకారులు, అజ్ఞాత ఉద్యమకారులుగా ఉన్నారంటే, ఆ ఉద్యమమే రాజ్యాంగ చట్టాలకు విరుద్ధం. అందుకే ఆ ఉద్యమకారులు అజ్ఞాతంలో వుండడం. నిషేధంలో ఉన్న పార్టీతో సంబంధాలూ, ఉత్తరాలూ, రాజ్యాంగం ప్రకారం నేరం కాకపోతే, ఆ పార్టీ మీద, లేదా ఆ ఉద్యమం మీద, నిషేధం ఎందుకు? - రాజ్యాంగంలో ఏ మూల అయినా, "ఇది నేరం కాదు" అని చెప్పే చట్టం ఏదైనా ఉన్నా, పోలీసులు చక్కగా, ధర్మబద్ధంగా ఆ చట్టం ప్రకారమే నడుస్తారా? అలా నడుస్తారని ఉద్యమకారుడైన పాణి గారు గాఢంగా విశ్వసిస్తున్నారు. నిషేధిత సంఘాలతో సంబంధాలు వున్న సానుభూతిపరుల ఇళ్ళ మీద పోలీసులు దాడులు ఎందుకు చేస్తారో, అక్కడి కాయితాలన్నీ ఎందుకు పట్టుకుంటారో, లేదా ఆ కాయితాల సాక్ష్యాల్ని వాళ్ళే ఎందుకు తెచ్చి పెడతారో, పాణి గారు ఒక సారి చెప్తే తెలుసుకుంటాను. నిషేధిత పార్టీలతో సంబంధాలు, రాజ్యాంగం ప్రకారం కూడా నేరం కాదని చెప్పే పాణి గారు, ఆ పార్టీల నించి బైటికి వచ్చే ఉత్తరాల్ని పోలీసులే జాగ్రత్తగా తెచ్చి బైటి ఉద్యమకారులకు అందిస్తారని అనలేదు, ఇంకా నయమే!

పాణి దాడి - 7: కీర్తి కోసమే చావు దగ్గిరికి పోతారని మీరన్న తర్వాత ఇక విప్లవంతో మనుషులకు ఉన్న ఏ రకమైన సంబంధాన్నయినా, ఏ మాటనైనా, అంత కంటే భిన్నంగా, సజావుగా మీరు ఎలా చూస్తారు? లోకంలోని అన్నిటి మీదా తీర్పులు ప్రకటించే మీ వంటి విద్వన్మణికి నిజంగా ఇది తెలియక మాట్లాడుతున్నారా?

నా వివరణ: పైకి తేటతెల్లంగా కనపడే మంచి చెడ్డలు మాట్లాడడానికి, విద్వన్మణుల దాకా అక్కర లేదు. ఎంత అమాయకులైనా చాలు, మూర్ఖులు తప్ప! 'చావు దగ్గిరికి పోవడం కీర్తి కోసమే' అని నేను అనలేదు. ఆ ప్రత్యేక సందర్భం, ఉద్యమకారుడి మరణం. ఆయనతో తమకు ఎంతెంతో దగ్గిర సంబంధాలు వున్నట్టు ఎగబడి చెప్పుకోవడాన్నే, కీర్తి కోసం - అని నేను అన్నాను. ఉద్యమంలో అయినా, బైట అయినా, ఎక్కడ ఉన్నా, మనుషుల సంబంధాలూ, మాటల సంబంధాలూ, అనేక రకాలు.

వాటికి, సహజత్వాలూ, అసహజత్వాలూ కూడా ఉంటాయి. అవి అర్థమైన వాళ్ళకు అర్థమవుతాయి. దేన్ని గురించైనా ఒక మనిషి, "ఇది బాగా లేదు, అది బాగా ఉంది" అని ఒక అభిప్రాయం వ్యక్తం చేస్తే, దాన్ని పరిశీలించి, అది అవునో కాదో తేల్చి వదిలెయ్యాలి గానీ, "నువ్వు విద్వన్మణివా? అన్నిటి మీదా తీర్పులు చెపుతావా?" అంటే, అది వాళ్ళ దౌర్జన్యాన్నే, లేదా అజ్ఞానాన్నే బైటపెడుతుంది.

పాణి దాడి - 8: విప్లవంతో సంబంధం ఉన్న వాళ్ళని ప్రభుత్వం ఊరికే బెదిరించి వదిలేస్తోందా, ఇంకేమైనా చేస్తోందా?

నా వివరణ: పాణి గారి ఈ ప్రశ్న ఎందుకంటే, వరవరరావు గారు, తనకు పోలీసుల నించి బెదిరింపులు వస్తున్నాయని చెప్పుకున్న దాని మీద, నేను, "ఎందుకా చెప్పుకోవడం? ఒక విప్లవ పార్టీతో దగ్గిర సంబంధాలు ఉన్న మనిషిగా, ఆ పార్టీ పంపే కాయితాలు అందుకునే మనిషిగా ఉన్నప్పుడు, మరి బెదిరింపులు వస్తే వస్తాయి. అవి వచ్చినప్పుడల్లా ప్రభుత్వం ఏం చెయ్యాలని ఆశిస్తున్నారు?" అని, నా "ఒకే కలం ...." వ్యాసంలో రాశాను కదా? ఆ సందర్భానికి సంబంధించిన ప్రశ్న అన్నమాట పాణి మాట్లాడేది. 'విప్లవంతో సంబంధం ఉన్న వాళ్ళని ప్రభుత్వం ఊరికే బెదిరించి వదిలేస్తుందా, ఇంకేమైనా చేస్తుందా?' అని పాణి అడగడంలో అర్థం, 'బెదిరించి వదిలెయ్యదు కదా, ఇంకా ఏదో చేస్తుంది కదా, మరి బెదిరింపుల గురించి చెప్పుకోకపోతే ఎలాగా?' అని. కానీ, ప్రభుత్వం అయినా, అందర్నీ ఒకే రకంగా ఏదో చేసెయ్యదు పాణి గారూ? ఆజాద్ లాంటి వాణ్ణి చేస్తుంది, హేమచంద్ర లాంటి వాణ్ణి చేస్తుంది. అంత ప్రమాదంగా కనపడని వాళ్ళనీ, ఒకే కలంతో రెండు రకాల రాతలు రాసే వాళ్ళనీ,

అబ్బే, ఏమీ చెయ్యదు. దీనికి చాలా రుజువులు ఉన్నాయి. ఒక సారెప్పుడో, ఒక అజ్ఞాత ఉద్యమ కారుడి పక్కన పట్టుబడ్డ వాళ్ళని ఏం చేసింది? అప్పుడు మీరు ఉన్నారు కదా? అలా పట్టుబడ్డ వారిలో ఒకాయన, వెంటనే తన మిత్రుడైన ముఖ్యమంత్రికి ఫోన్ చేస్తే, ఆయన్నీ, ఆయన పక్కన ఉన్న మిమ్మల్నీ కూడా స్వయంగా ముఖ్యమంత్రే సురక్షితంగా ఒక చోట పెట్టించి, వెంటనే బెయిల్ పిటీషన్ పెట్టుకోమనీ, "బెయిల్ పిటీషన్ దాఖలైతే వ్యతిరేకించబోమ"నీ, వారిని, "మళ్ళీ పోలీసు విచారణకు పిలిపించబోమ"నీ, ప్రేమగా చెప్పి, అభయ హస్తం ఇచ్చి మర్యాదగా వదిలించాడు. ఎంత క్రూర ప్రభుత్వం అయినా అందర్నీ ఒకేలా చెయ్యదనీ, ఉద్యమకారులుగా కనపడే వారిలోనే కొందరి మీద చాలా ప్రేమలు చూపిస్తుందనీ, రుజువు కావడం లేదూ? అందుకే నేను, వరవరరావు గారి విషయంలో, 'ప్రభుత్వం ఏమీ చెయ్యదు లెండి' అన్నాను. ప్రభుత్వం, కొందరు ఉద్యమకారుల్ని ఏమీ చెయ్యదని పాణి గారికి స్వంత అనుభవం ద్వారానే తెలుసు కదా? మరి ఎందుకీ దాడులు నా మీద?

పాణి దాడి - 9: మీరు పేర్లు తీసి కొందరి గురించి, వాళ్ళ అర్హతల గురించి, మాట్లాడారు గానీ ... అక్కడికి ఎగబడి వచ్చిన వాళ్ళందర్నీ వెక్కిరించడంలో మీ కెంత ఆనందం కలిగిందో మీ వ్యాసంలో అడుగడుగునా పాఠకులు ఊహించి ఉంటారు.

నా వివరణ: పాఠకులు ఏది చదివినా, ఆ చదివేటప్పుడు ఆలోచిస్తూ, చదివే దానిలో ఉన్న మంచి చెడ్డ లేమిటో, న్యాయా న్యాయాలేమిటో తెలుసుకుంటూ వుండాలని, నేను అనుకుంటాను. నేను రాసింది చదివి, నాలో దుర్మార్గాన్ని వాళ్ళు గ్రహిస్తే, అది నాకు ఇష్టమే. ఎవరిలోనైనా దుర్మార్గం ఉంటే, దాన్ని గ్రహించడమే జరగాలి. వాళ్ళు ఆలోచించడమే నాకు కావాలి. మొదట ఆలోచించడం వస్తే, నిజానిజాలు వాళ్ళే తెలుసుకుంటారు. నేను కొందరి గురించి పేర్లు తీసి రాశానన్నారే, అవును, రాశాను. మరి, పేర్లు చెప్పక పోతే, ఎవర్ని గురించి రాస్తున్నానో పాఠకులకు ఎలా తెలుస్తుంది? నా వ్యాసం, ఒక విమర్శ గానో, ఆలోచించవలసిన విషయం గానో గాక, ఎవరి మీదో దాడిగా మీకు కనిపించిందంటే, మీరెంత 'సెక్టేరియన్'గా (ముఠా వాదిగా) ఉన్నారో పాఠకులకు బాగానే తెలుస్తుంది. నా గురించి ఆలోచించే వాళ్ళు, మీ గురించి మాత్రం ఆలోచించరా? దూరంగా నించుని, రెండు పక్షాల మాటలూ వింటూ ఉన్న పాఠకుల మీదే నమ్మకం పెట్టుకోండి! రెండు పక్షాల్నీ వాళ్ళు అర్థం చేసుకోగలరు.

పాణి దాడి - 10: 'సరుకు విలువ' గురించీ, 'అదనపు విలువ' గురించీ తెలిసిన మీకు, 'కన్నీటి విలువ' కూడా తెలిసి ఉంటే బాగుండు...

నా వివరణ: నాకు 'దుఃఖం' తెలుసు గానీ, ఆ దుఃఖానికి 'కీర్తి'ని సంపాదించే విలువ ఉంటుందని తెలీదు. ఏ అంశానికైనా, ఏ భావానికైనా, పరస్పర విరుద్ధ లక్షణాలు ఉంటాయి. సహజం గానూ, అసహజం గానూ కూడా. సాధారణ వ్యక్తుల మరణం వల్ల కలిగే దుఃఖంలో, ఆ వ్యక్తి అదృశ్యమై పోవడం వల్ల కలిగే దుఃఖం మాత్రమే ఉంటుంది. కానీ, ఒక విప్లవకారుడి మరణం వల్ల, ఆ మనిషి అదృశ్యమై పోయిన దుఃఖమూ, సమాజానికి హాని జరిగిందనే దుఃఖమూ, రెండూ కలిసి వుంటాయి. అదంతా సహజం. అది కానిదంతా అసహజం. ఆజాద్ మరణం దగ్గిర అందరూ అసహజం గానే ప్రవర్తించారని నేను అనలేదు, అనుకోలేదు. నేను రాసిందంతా, క్రమ శిక్షణని దాటి ప్రవర్తించారే - అనే ఆశ్చర్యంతో.

పాణి గారి 'దాడి' అంశాల గురించి చెప్పాలంటే, ఇంకో వంద అంశాలు చెప్పొచ్చు. కానీ, ఎంత చెప్పినా ఒకటే; రంగనాయకమ్మకి విపరీత మనఃస్థితి! ఆమెకి విప్లవమా! ఆమె కెందుకూ అది? - ఇదీ పాణి ప్రేలాపన! ఇక పాఠకులకు వదిలేస్తాను.

ఉత్తరం...

అరుణతార, జూలై-సెప్టెంబరు 2010 సంచికలో, "దుఃఖం విలువ" అనే పేరుతో పాణిగారు రంగనాయకమ్మ గారికి రాసిన బహిరంగ లేఖ లాంటిది చదివాను. ఈ లేఖలో ఉన్న విషయాలలోని నిజానిజాలు గురించీ, విలువల గురించీ కాక, రాసిన విధానం గురించి మాత్రమే, అరుణతార సంపాదక వర్గాన్ని ప్రశ్నలు అడగడం ఈ లేఖ ఉద్దేశ్యం.

1. రంగనాయకమ్మ గారి "మనఃస్థితి" గురించి, వ్యక్తిగతంగా, అంత తక్కువ స్థాయిలో పాణిగారు రాస్తే, దాన్ని మీరు ఎలా ప్రచురించారు? వ్యక్తిగత దూషణలకి తావెందుకు ఇస్తున్నారు మీరు? 2. రంగనాయకమ్మ గారు తన వ్యాసంలో రాయని వాక్యాన్ని, "ఎగబడి వచ్చారు" అనే వాక్యాన్ని, పాణిగారు ప్రస్తావిస్తే, దాన్ని మీరు ఎలా అనుమతించారూ? అభిప్రాయాలు వేరూ, అబద్ధాలు వేరూ కదా? 3. "వ్యక్తిత్వం", "సంస్కారం" వంటి విషయాలను వ్యక్తిగతంగా ప్రశ్నించే మాటలను ఎలా సమ్మతిచ్చారు మీరు?

విప్లవ పత్రికలకు ఒక సరి అయిన పంథా ఉంటుందనే అనుకుంటున్నాను. ఆ పంథాలో, వ్యక్తిగత దూషణకి (అభిప్రాయాల మీద వ్యంగ్యం వేరూ, వ్యక్తిగత దూషణ వేరూ) చోటుండదనే అనుకుంటున్నాను. వ్యక్తిగత దూషణని తీసేసి, మిగిలినది మాత్రం ప్రచురించి ఉంటే, బాగుండేది.

- సావిత్రి

కథ

యోధ

- షంషేర్

అది రేచిని రైల్వే స్టేషన్. బెల్లంపల్లి తర్వాత వస్తుంది. అక్కడ ఒక పాడుబడిన పెద్ద బంగ్లా ఉంది. దాని ముందు ఒక రావి చెట్టు ఉంది. మరో పక్కన పెద్ద దర్శిని చెట్టు ఉంది. దూరం నుండి చూస్తే అది రైల్వే స్టేషన్ అని ఎవ్వరూ నమ్మరు.

ఆరోజు జనవరి 5

ఒక ఎర్రటి సాయం సంధ్య వేళ చీకట్లు ముసురుతుండగా రేచిని రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంపైన ట్రైన్ కోసం జనం కిక్కిరిసి ఉన్నారు. అంతా లొల్లి లొల్లిగా ఉంది.

స్టేషన్ బయట అనేక వాహనాలున్నాయి. ఎవరు ఎవరి కోసం ఎదురు చూస్తున్నారో చెప్పలేని పరిస్థితి. వాతావరణం చలి చలిగానే ఉంది. ఆ సమయంలో జనంతో కిక్కిరిసి ఉన్న ప్యాసింజర్ రైల్ వచ్చి ప్లాట్ ఫాంపై ఆగింది. దిగే వాళ్ళుదిగుతున్నారు. ఎక్కుతున్నారు. దిగిన ప్రయాణికులు స్టేషన్ దాటి వెళ్ళిపోతున్నారు.

రైలు దిగిన ఒక యువకుడు ప్లాట్ ఫాం దాటి, వాహనాల సముదాయం వైపు అడుగులు వేస్తూ వడి వడిగా వెళుతున్నాడు. చురుకైన ఆ యువకుడ్ని ఒకసారి చూస్తే మళ్ళీ మళ్ళీ చూడాలనిపించే స్పురద్రూపం, తెలివైన వాడు, నెమ్మదస్తుడు. అన్ని కలగలిసి అద్భుతంగా ఉండే ఆ యువకుడు వడి వడిగా నడుస్తూ స్టేషన్ దాటి బైటికి వచ్చి ముందుకే నడుస్తున్నాడు.

అలా నడుస్తున్న ఆ యువకుడిపై ఎప్పటి నుంచో కాచుకొని ఉన్న మూక విరుచుక పడింది.

ఆ యువకుడు మెరుపు వేగంతో విషయం అర్థం చేసుకొని ఆ మూకతో తలపడుతున్నాడు. ఆ యువకుని దెబ్బలతో ఒక్కొక్కని ముందు పళ్ళు విరిగి నెత్తురు చిమ్ముతుంటే అరుస్తున్నారు. మరొకనికి మెడలు విరిగాయి. దెబ్బలు తిన్న ఆ మూక రెచ్చిపోయి ఆ యువకుడ్ని బంధించింది.

స్టేషన్ బయట గలటా కావడంతో జనం గుమిగూడారు.

సాహసోపేతంగా ఆ మూకతో పోరాడిన ఆ యువకుడు చివరికి వాళ్ల చేతిలో బందీ అయ్యాడు. "విప్లవం వర్ధిల్లాలి"......... "నక్సలైట్లే దేశ భక్తులు" అంటూ కంఠ నరాలు తెగిపోయేలా నినాదాలు ఇచ్చాడు, పెనుగులాడుతూనే ఉన్నాడు.

ఆ నినాదాలతో గుమిగూడిన జనంలో కదలిక ప్రారంభమయ్యింది. ఎవరు ఎవరిని అరెస్టు చేసిందీ అర్థమైంది. సివిల్ డ్రెస్‌లో ఉన్న పోలీసులు లోపల దాచుకున్న ఆయుధాలను తీసి జనాన్ని అదిరించారు. "చలో.... చలో..... యాంసే చలో జావ్..." అంటున్నారు. ఆ యువకుడ్ని కాళ్ళు చేతులు కట్టి, నోట్లో గుడ్డలు కుక్కి, కళ్లకు గంతలు కట్టి జీపులో వేసుకొని వెళ్లిపోయారు. వెనుక మరో రెండు జీపులు అనుసరించాయి. జీపులో ఉన్న యువకుడు గింజుకుంటున్నాడు. అతడ్ని పోలీసులు బూటు కాళ్లతో తొక్కుతున్నారు. తుపాకీ బట్లతో గుద్దుతున్నారు.. "సాలె....సప్పుడు జెయకు, కదలకు బే కాల్చి పారేస్తాం......." అని బెదిరిస్తున్నారు.

వాహనాలు వేగంగా ప్రయాణిస్తూ, మలుపులు తిరుగుతూ ఒక బిల్డింగ్ ముందు నిలబడ్డాయి. ఆ యువకుడు పసిగట్టాడు. తనను చెల్లంపల్లి పోలీస్ హెడ్ క్వార్టర్‌కు తీసుకెళ్తారని. లోపలికి తీసికెళ్లాక కళ్ళు గంతలు విప్పివేసారు. గది తలుపులు మూసివేసారు. తెల్లటి సున్నం వేసిన ఆ గది ట్యూబ్ లైట్ల వెలుతురులో తెల్లగా మెరుస్తుంది. ఆ గదిలో ఓ మూల టేబుల్ వుంది. దానిపై పచ్చని మక్‌మల్ క్లాత్ పరచబడింది. టేబుల్ చుట్టూత నాలుగైదు కూర్చీలు ఉన్నాయి. టేబులెకు ఎదురుగా ఉన్న కుర్చీ ఆఫీసర్‌దని తెలుస్తోంది. దానికి వెనుకగోడపై గాంధీ బోసి నవ్వుల పోటో ఉంది. ఆ పోటోకు బంగారు మెరుపులున్న దండ.

గదిలో పైన నెమ్మదిగా సీలింగ్ ఫ్యాన్ తిరుగుతూనే ఉంది. కాసేపట్లో ఆ గదిలోకి తెల్ల బట్టలతో ఉన్న అధికారులు వచ్చి ఎప్పుడో తమకు నిర్ణయమైపోయినట్లు ఎవరి కుర్చీల్లో వారు కూర్చున్నారు. ప్రశాంతంగా అతని వైపు చూశారు.

చేతులు వెనుక విరిచి కట్టి ఉన్న ఆ యువకుడు గుండెల్నిండా ఊపిరి పీల్చుకున్నాడు. రెప్పార్పకుండా అలాగే అధికారులను చూస్తూ నిలబడ్డాడు. కొద్దిగా తలతిప్పి పక్కకు చూస్తే. నల్లటి చింత మెద్దులాంటి మనిషి నిలబడి ఉన్నాడు. అతని వెనుక క్రూరమైన చూపులుగల గుంపు ఉంది. వాళ్లు తోడేళ్ళ వలె కనిపిస్తున్నారు. వాళ్ళ చేతుల్లోని నల్లటి తుపాకులు చేతులకు మొలిచినట్లు ఉన్నాయి.

'ఓ గ్రేహౌండ్స్ మూకలు.........' అనుకున్నాడా యువకుడు.

గతంలో ఉన్న స్పెషల్ టాస్క్‌పోర్స్ (ఎస్.టి.ఎఫ్) అనే స్టెన్‌గన్ రాక్షస ముఠాకు తోడుగా, స్పెషల్ స్ట్రైకింగ్ పోర్స్ (ఎస్.ఎస్.ఎఫ్) అనే సాయుధ ముఠా ఒకటి తయారయింది. తెలుగు జాతి గౌరవమని, నక్సలైట్లే దేశభక్తులని నినాదాలిచ్చి అధికారంలో వచ్చిన ఎన్‌టిఆర్ హయాంలో గ్రేహౌండ్స్ అనే పేరుతో తర్ఫీదు మొదలైంది. ఆ యువకుడు ఇవన్నీ గుర్తు చేసుకుంటున్నాడు. గ్రేహౌండ్స్ బలగాల అధికారి స్టీపెన్ టేబులె ముందు కుర్చీలో ఉన్నాడు. అతను మరీ లావుగా లేడు. బక్కగా లేడు. కనుబొమ్మలు అతని క్రూరమైన కళ్ళమీదకు వంగి ఉన్నాయి. అతని సూటియైన ముక్కు పైకి వంపు తిరిగింది. చూడగానే అతను పొగరుబోతని, ఎవ్వరినీ లెక్క చేయడని తెలుస్తోంది. అప్పుడప్పుడు ముఖంపై లేని నవ్వును, ప్రసన్నతను పులుముకోగలడు.

తన ముందు నిలబడిన ఆ యువకుడిని చూడగానే గట్టి పిండమని స్టీపెన్‌కు అర్థమయ్యింది. దానితో అతను చికాకు

పడిపోయాడు. అప్పటిదాకా ఉన్న ప్రసన్నత చెదిరిపోయింది. ఆ యువకునికి గదిలోకి రాగానే మృత్యు కుహరంలోకి అడుగు పెట్టినట్లయింది. అతనికి తెలియకుండానే శరీరం మీది వెంట్రుకలు నిక్కబొడుచుకున్నాయి. అతను గది అంతా పరిశీలించే వరకు గ్రేహౌండ్స్ మూక, అధికారులు ఊరుకున్నారు.

"ఏం పేరు........." స్టీపెన్ మామూలుగా ఉంటూ అడిగాడు. చుట్టూ ఉన్న అధికారులు కూడా అట్లాగే చూశారు. యువకుడు స్టీపెన్ వైపు తదేకంగా చూసాడే తప్ప సమాధానం ఇవ్వలేదు. నేను ఎవ్వరినో........ నా గురించి వీళ్ళకు ఖచ్చితంగా అంత తెలుసు అని మనసులో..... అనుకున్నాడు.

"సమయాన్ని వృథా చేయకు.......... మా ఓపికను పరీక్షించకు .... నీ గురించి మాకు అంత తెలుసు....." కుర్చీలో అసహనంగా కదులుతు ఒక అధికారి అన్నాడు. టేబుల్‌పై ఉన్న పేపర్లు ఫ్యాన్ గాలికి రెపరెపలాడుతున్నాయి.

"మీకు తెలిస్తే నన్నెందుకు అడగడం?" ఎదురు జవాబు ఇచ్చాడు ఆ యువకుడు.

స్టీపెన్ అతనికి కొర కొర చూపులతో చూస్తున్నాడు. ఒక కాగితం మీద ఏదో రాసి.... "మర్యాదాగా చెప్పు......"

"మీకు మర్యాదగా చెప్పాల్సింది ఏమీ లేదు....నన్ను పట్టించిన వాడు మీకు అన్ని చెప్పే ఉంటాడు..." నిదానంగా బెదురు లేకుండా సమాధానం చెప్పాడు.

"చెప్పరా? లంజ కొడుకా........నీ పేరేంటి?"

"........."

"వాడి పంచాంగం విప్పండి?....." అంటు స్టీపెన్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ షాషా వైపు చూసాడు.

"అలా వాడు దారికి రాడు సార్......" అంటు షాషా ఫైల్‌లోని కాగితాలు తీసి వినిపించసాగాడు.

"అతని పేరు మడావి జంగు. పార్టీలో అతనిని రఘు అని పిలుస్తారు. స్వంత ఊరు ఇచ్చోడ మండలంలో గల రాజంపేట.. రఘు ఆదిలాబాద్ జిల్లా కమిటీ మెంబర్. జిల్లాలో ఉన్న అనేక మంది మెరికలాంటి మిలటరీ కమాండర్లలో వీడొకడు. ఎత్తుగడలు వేయడంలో దిట్ట...... మనమీద చేసిన అనేక దాడులలో వీడే ప్రధాన పాత్ర పోషించాడు.." చెప్పడం ఆపి స్టీపెన్ మొహం వైపు, చుట్టు ఉన్న అధికారుల వైపు చూసాడు సర్కిల్ షాషా.

అధికారులు ఒకరి ముఖం ఒకరు ముఖం చూసుకోసాగారు. అందరూ స్టీపెన్ వైపు చూడసాగారు. ప్రమోషన్ గ్యారంటీ అన్నట్టుగా ఆ చూపులు ఉన్నాయి. స్టీపెన్ చూపులు రఘుపై కేంద్రీకరించి ఉన్నాయి. మొద్దు మొహంలోకి కోపం లావాల ఎగజిమ్మింది. క్రూరంగా నవ్వాడు.

కామ్రేడ్ రఘు ఎర్రగా ఉంటాడు. పొట్టిగా, చక్కగా, చురుగ్గా ఉంటాడు. బాకులాంటి యోధుడు. అతని ముఖం కాంతివంతంగా వుంటుంది. మెరిసే అతని ముఖానికి తెల్లని పలు వరుస వుంది. అది ఎనలేని కాంతి తెచ్చి పెట్టేది. ఎంతో కలుపు గోలుపు తనం, నవ్వుతూ మాట్లాడుతాడు. చిరు నవ్వు చిందుతూ పలకరిస్తాడు.

రఘు అక్షరం రాని ఆదివాసీ. దళంలో వచ్చిన తర్వాత చదువను, రాయను నేర్చుకున్నాడు. తెలుగులో ఉన్న పార్టీ సాహిత్యాన్ని అవపోసన పట్టాడు. లోకం జ్ఞానం కంటే సాహసం ఎక్కువగా ఉంది.

తోడేళ్ల మూక ముందు బందీగా రఘు నిలబడి ఉన్నాడు. సర్కిల్ షాషా అతని గురించి వివరిస్తున్నంత సేపు అతని ముందు కోరలు చాచి గుర్రుమంటూ చూస్తున్న తోడేళ్ళ వైపు నిర్లక్ష్యంగా, నిరాశక్తిగా, రెప్పార్పకుండా అలాగే చూస్తూ నిలబడ్డాడు.

"మిస్టర్ రఘు.. చెప్తావా, ఎముకలు సున్నం చేయమంటావా...?"

స్టీపెన్ పై అధికారి కావచ్చు, కోపంగా మాట్లాడుతూ లేచి రఘు వద్దకు వచ్చి చెంప చెళ్లుమనిపించి, నోటికొచ్చిన బూతులు కూస్తున్నాడు.

"ఈ మొద్దు లంజ కొడుకులు ఇలా వింటారా......." రేచుల సబ్ ఇన్‌స్పెక్టర్ బూటు కాళ్లతో రఘును తన్నుతూ పక్కన ఉన్న మూకను ఉసిగొల్పాడు.

"పెటె...పెటె.....పటె.......పటెమని లాఠీలతో రాడులతో రఘును కొడుతున్నారు. ఒళ్ళు మరిచి బాదుతున్నారు. పదిమంది పైన బడి నిరాయుధుడ్ని నేలపై పడే దాకా హింసిస్తున్నారు. ఆ దెబ్బలకు రఘు నెత్తురుతో తడిసి ముద్దయి నేల మీద పడిపోయాడు. బాధగా అరుస్తున్నాడు. నోటినుండి కారుతున్న నెత్తురును నాలుకతో తుడుచుకుంటున్నాడు. పళ్ళు బిగువున బాధను దిగమింగుతూ రఘు స్పృహ తప్పి పడిపోయాడు. తోడేళ్ళ మూక నవ్వుతున్నది. పైన సీలింగ్ ఫ్యాన్ తిరుగుతూనే వుంది. స్టీఫెన్ బాటల్‌తో నీళ్లు తీసుకొని రఘు ముఖానికి కొట్టాడు. మరో అధికారి బూటు కాళ్ళతో రఘు కదిలించాడు. కొద్ది సేపయ్యాక రఘు స్పృహ నుండి కోలుకున్నాడు. ఆ మూక అతనిని లేపి నిలబెట్టింది. "నీళ్ళు.............తాగుతావా........?" మరో అధికారి బాటిలెతో నీళ్ళు తాగించాడు.

"మాములు ట్రీటమెంటే నీకిస్తున్నది. మర్యాదగా చెప్పు. లేకుంటే..." అని బెదిరిస్తూ గ్రేహౌండ్స్ కోతి ముఖం అధికారి అన్నాడు. అతని కళ్ళు క్రూరంగా మెరుస్తున్నాయి.

రఘు ఏమి మాట్లాడలేదు. నిశ్శబ్దంగా, ఎటువంటి ఆందోళన లేకుండా "మీకు చాతనయినంత చేసుకోండి" అన్నట్టుగా తల ఊపాడు. పిడికిళ్ళు బిగించి నుంచున్నాడు.

ఆ సమయంలో రఘుకు తన గెరిల్లా సహచరుడు అమరుడు బాలన్న చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి. శత్రువు చిత్రహింసలను కసి కొద్దీ ఎలాభరించాడో, శత్రువుకు దొరికినప్పుడు ఎలా సమాధానం చెప్పాలో, పళ్ళు ఎలా బిగపట్టుకోవాలో తన అనుభవం నుంచి నేర్పించాడు. ఒక మనిషి ఏ విధంగా జీవించాలి. ఏ విధంగా మరణించాలి... శత్రువు పిరికితనాన్ని అపహాస్యం చేస్తూ...... అతని మెదడులో నిక్షిప్తమైనవి గుర్తువస్తున్నాయి.

రఘు కళ్ళు నిప్పుల్లా జ్వలించాయి.

రేచుల మూకల నుండి ఒక అధికారి "చూడరా రఘూ.. మమ్మల్ని అనవసరంగా నీ పగవాళ్లగా చూడకు. నీకు తెలిసిందంతా చెప్పెయ్. నీవు హాయిగా బతకచ్చు. నీకు కావాల్సినంత సహాయం చేస్తాం...." అన్నాడు.

"మీ కుట్రలు నాకు తెలుసు... నాకే కాదు మా సహచరులందరికి తెలుసు........ నన్ను మోసం చేయలేరు......." ప్రతి వాక్యం జాగ్రత్తగా

మాట్లాడాడు రఘు. తాను చదివిన రక్తాక్షరాలు నవలలోని ఫ్యూజిక్ జీవితాన్ని మననం చేసుకుంటున్నాడు. కొయ్యూరు అమరవీరుల జీవితాల్ని నెమరు వేసుకుంటున్నాడు.

"ఇందులో మోసం, కుట్ర ఏముంది? అనవసరంగా కష్టాలు నెత్తిమీదికి తెచ్చుకుంటావేం?"

"............"

"రాస్కెల్...మాట్లాడుడు...." అసహనంతో ఒక అధికారి బూటు కాలుతో వెనుక నుండి ఒక తన్ను తన్నాడు. ముందుకు తూలుతూ నిలదొక్కున్నాడు రఘు రెక్కలు విరిచికట్టి పక్షిలా ఉన్నాడప్పుడు.

"దళాలు ఎక్కడున్నయో చెప్పు? నీ ఎ.పి.టి ఎక్కడుందో చెప్పు?"

".............."

"చంద్రన్న, ఆనంద్ ఎక్కడున్నరో చెప్పు? నీ ప్లాటూన్ ఎక్కడుందో చెప్పు? మర్యాదగా చెప్పకపోయావో........"

రఘు కన్నార్పకుండా దృఢంగా నిలబడ్డాడు.

అసహనం చచ్చిన సర్కిల్ షాషా "మర్యాదగా చెప్పు... నీకు రోజులు దగ్గర పడ్డాయ్.. మా తడాఖా చూపించాల్సి వస్తది. బుక్కెడు నెత్తురు కక్కి కుక్క చావు చస్తావ్. నిన్ను అంత తేలిగ్గా చంపం. ముక్కలు కోసి........ చిత్ర హింసలతో చంపుతాం"అన్నాడు. "అన్యాయంగా మట్టిపాలు కాకు, ఏమంటావ్" ఎస్.ఐ. రఘుని చేత్తో కొట్టి చెప్పాడు. రఘు ఆవేశంతో అందుకున్నాడు..

"కమ్యూనిస్టు చిత్ర హింసలకు బెదిరి శత్రువు ముందు తలవంచడు. ప్రాణం మీద తీపితో తోటి సహచరులకు ద్రోహం చేయడు. డబ్బులకు మా ఆదర్శాలను అమ్ముకోము" అన్నాడు శత్రువుపై నిప్పులు చెరుగుతూ.

"అంతేనా బద్మాష్ ? చూస్తారేం కానియ్యండి" స్టీఫెన్ ఆర్డరిచ్చాడు.

వెంటనే వేట కుక్కలు రెక్కలు విరిచికట్టివున్న రఘు మీద పడ్డాయి. అమాంతం ఎత్తి బోర్ల బొక్కల పడుకోబెట్టారు. అతని మోకాళ్ళ వెనకల రోకలి బండను పెట్టి చెరో వైపున నిలుచున్నాడు. ఒకడు అతని వీపుపైన కూర్చున్నాడు. మరో ఇద్దరు పాదాలు పట్టుకొని అదుముతు ఒత్తుతున్నారు. గెరిల్లా రఘు ఒక్కసారిగా నాభి నుంచి పెళ్లున కేకపెట్టాడు.

"చెప్తావా?" రేచుల అధికారి మొరిగాడు.

"చెప్పను...చెప్పను..." ఒక్కో మాట కూడగట్టుకుంటూ అంటు రఘు అరిచాడు. కాళ్ళు విరిగిపోతున్నట్లుగా, కడుపులో నుండి, గుండెలో నుండి నరాలు గుంజుకొస్తూ నొప్పి నెత్తిలోకి పాకింది. కణతల దగ్గర నరాలు చిట్టి పోయేంత కొట్టుకుంటున్నాయ్. నొప్పి అదుపు చేసుకోడానికి పెదవుల్ని బిగపట్టి తల విదిలిస్తున్నాడు. ఇప్పుడు పోలీసులు అతని శరీరంపై కూర్చున్నారు. రఘు కళ్ళు తిరిగాయ్. స్పృహ తప్పి పడిపోయాడు. నేలకు కరుచుకుపోయాడు.

"సాలెగాడు నకరాలు చెస్తుండు" గ్రేహౌండ్స్ ఎస్.ఐ. కృష్ణ బ్లేడ్లతో రఘు చెంపలపై గీరాడు. ఇంకో అధికారి చాకుతో పిక్కలపై గీరాడు. నెత్తురు జల జల ఉప్పొంగింది. "కారం చల్లండిరా....... నాకొడుకు ఎట్లా మాట్లాడడో చూద్దాం..." అన్నాడొకడు.

గీరిన గాయాలలో కారం పొడి కుక్కారు. మరికొందరు ముఖం మీద నీళ్లు చల్లారు.

"ఆ మూతి మీసాలు ఎందుకు? పీకి పారేయ్యండి.........? ఒక అధికారి ఆర్డర్. కటింగ్ ప్లేర్‌తో మీసాలు పీకెస్తున్నారు.

గది గోడలు విరిగిపడేలా 'అబ్బా!........ఆం....అబ్బా అని రఘు అరిచాడు.

"ఏం రా........చెప్పు అనవసరంగా ఎందుకు చస్తావ్? సాలె..... గొండుకా దమాక్ గాండ్‌మే రహిత....." స్టీఫెన్ కోపంగా మాట్లాడుతున్నాడు.

రఘు మాట్లాడలేదు. కళ్ళు తెరిచి చూస్తున్నాడు. చివరిగా హిందీలో అన్న మాటలకు సుర్రున కోపం వచ్చింది. నేలపై పడి ఉన్న రఘు చుట్టూ ఉన్న మూకను నిరసనగా చూశాడు. గాయాలలో కూరిన కారం మంటలేస్తోంది.

కొందరు పట్టుకొని రఘును నిలబెట్టారు. అతని ముఖంపై చల్లిన నీరు కారుతుండడంతో నాలుకతో నాక్కున్నాడు.

"ఒక్క...ఒక్క రహస్యం చెప్పు. వదిలి పెడుతా. బ్రతికిపోతావ్...." అన్నాడు సర్కిలె షాషా.

"................"

"మాట్లాడువ్ బే... ఒక్క మాట చెప్పుబే..."

శరీరం కుంగిపోతోంది. మాట్లాడలేక పోతున్నాడు. లేని ఓపికను కూడగట్టుకొని......... "నాకు నా అమర వీరులు ఆదర్శం. ఈ విప్లవం ఆగదు. మీరో పిరికి పందలు. నేను ఎన్నటికీ లొంగను" అన్నాడు. నోటి పళ్ల నుండి కారుతున్న నెత్తుటి చారల నాలుకతో తుడుచు కుంటూ.

పొద్దు వాపోతోంది. గదిలోని లైట్లు ఈ దార్మార్గాన్ని చూడలేక చిన్న బుచ్చుకున్నాయ్. ఆ గది నాలుగు గోడలు గజగజలాడు తున్నాయ్.

"పోని మీ ఆయుధాల డంపన్నా చెప్పు....."

"............"

"చలో మారో సాలెకు......" అధికారి ఆర్డర్........ఉగ్రుడై భయంకరంగా, కఠోరంగా అన్నాడు.

అంతే రఘు కట్లు విప్పి ఆ గచ్చుపై వెల్లికిల పడకోబెట్టారు. అర చేతులకు మేకులు కొట్టారు. గోర్లల్లో సూదులు గుచ్చారు. మరికొందరు వెంట్రుకలు లాకుతున్నారు. బాధపడే స్థితి ఉడిగి చాలా సేపు అయ్యింది. అక్కడంతా నెత్తురు మడుగయ్యింది. ఒంటి మీదున్న బట్టలు శరీరానికి అతుక్కున్నాయి అట్టలాగా. కొట్టి కొట్టి అలసి పోతున్నారు. మంచి నీళ్ల లాగా బ్రాందీ అమితంగా తాగుతున్నారు., బ్రాందీ వాసన ఆ గదిలో వెదజల్లుతోంది.

రఘు శరీరమంతా చిత్ర హింసలతో మెలికలు తిరుగుతోంది. గుండెనాడి సరిగ్గా ఆడుతున్నట్టుగా లేదు. నెత్తురు ముద్దలాగా పడి ఉన్నాడు. ప్రాణాలు కను కొనుకుల్లో కొట్టుకుంటున్నాయ్.

"ఈ గోండు లంజకొడుకులు అంతా ఇంతే...... వెళ్దాం, పదండి రేపు చూసుకుందాం వీడి సంగతి......." అని రఘును ఎత్తుకెళ్ళి ఓ మూక లాకప్‌లో పడవేసి, అక్కడి నుండి నిష్క్రమించారు.

2

గదిలో రఘు ఏకాంతంగా నిశీధి ఒడిలో నెత్తుటి ముద్దలా పడి ఉన్నాడు. డొక్కలో మోకాళ్లు నెట్టుకొని చలికి వణుకుతూ అపస్మారకానికి గురయ్యాడు. ఎప్పటికో మెలుకువ వచ్చింది. రాత్రి చాలా పొద్దు పొయ్యింది. గదిలో ఉన్న లైట్ల వెలుతురులో లాకప్ గది చువ్వలు కనిపిస్తున్నాయ్. స్టేషన్ అంతా నిశ్శబ్దంగా ఉంది. శరీరాన్ని కదిలించడానికి ప్రయత్నించాడు. కదలడం లేదు. ఒళ్ళంతా నొప్పిగా వుంది. శరీర భాగాల్లో భరించరానంతా నొప్పి ప్రహహిస్తోంది. రఘుకు లీలాగా ఏవో గుర్తుకు వస్తున్నాయ్.

.... చివరి సారిగా తన జిల్లా కార్యదర్శి లలితక్క "ఎన్‌కౌంటర్లను ఆలింగనం చేసుకుందాం కామ్రేడ్......" అంటూ చేతులు కలిపి విడిపోయింది. ఆ తర్వాత నిజంగానే శత్రువు చేతిలో అమరురాలైంది. ఇప్పుడు నేను కూడా;... అవును నేను కూడ....... లలితక్కను తలుచుకుంటంటే, ఆమె కళ్లల్లోని చురుకుదనమే గుర్తుకువస్తోంది. గలగల నవ్వే ఆమె నవ్వుల్లోను, కళ్లల్లోను, మాటల్లోనూ చాలా పదునుండేది. ఆమె మాటలు జ్ఞప్తికి వస్తున్నాయ్.

'ఎక్కడా ప్రజా ఉద్యమాలు సరళ రేఖలో నడవలేదు. ప్రజా యుద్ధంలో ప్రజల చైతన్యం ఎగుడు దిగుడు లేకుండా సాఫీగా ఎదగదు. దోపిడీదారుల నుంచి అధికారాన్ని పేదలు చేజిక్కించుకోగానే సరిపోదు. వర్గ దృక్పథంలో, విలువలలో సమగ్రమైన మార్పు రావడానికి చాలా సమయం పడుతుంది. వర్గ దృక్పథం అనేది ఒక భూమి సంబంధాలకే పరిమితం కాదు. అది సమాజంలోని అన్ని విషయాలకు వర్తిస్తుంది. అన్ని సామాజిక సంబంధాలకు, విలువలకు వర్తిస్తుంది. ముఖ్యంగా భూమిలాంటి వాటి విషయంలో వర్గ దృక్పథం ఏర్పడినంత సులువుగా ఇతర విషయాల్లో ఏర్పడదు. జీవితమే పోరాటానికి ప్రారంభ బిందువు అని కార్మిక వర్గతత్వం శాస్త్రం బోధిస్తుంది. జీవితానుభవంలో కొన్ని విలువలను తిరస్కరించినా అన్నీ పోవడానికి చాలా పోరాట అనుభవం, రాజకీయ పరిణతి అవసరం అవుతాయి. అట్టడుగు వర్గాలలో పుట్టిన వారిలో వర్గ కసి పెల్లుబికినంత వేగంగా విశాల ప్రజాస్వామిక దృక్పథం ఏర్పడదు. అది పోరాట క్రమంలోనే వస్తుంది. అందుకే ప్రజల మౌలిక సమస్యల్ని లేవ దీసే, సామాజిక ఉద్యమం ఏదైనా మన జీవితాల్ని అనేక విధాల కుదుపు వేసి మనల్ని రకరకాల మానసిక, సామాజిక ఇబ్బందులకు గురి చేస్తుంది. ఇందులో రాజ్య నిర్బంధం ఒక్కటి. అణచివేత ద్వారా ప్రపంచంలోని ఏ రాజకీయ సమస్యను పరిష్కరించలేదు. పరిష్కరించలేరు కూడ. ఇది ప్రజా యుద్ధం తేల్చేసిన ప్రశ్న. ఎత్తుగడల రీత్యా చూసినప్పుడు ఆంధ్రప్రదేశ్‌లోని పోలీసులు నిజమైన పులులే. ఆంధ్రప్రదేశ్‌లో పోలీస్‌బలగాల అణచివేత దేశం మొత్తానికి పాఠాలు నేర్పుతున్నది. వీళ్లంతా ప్రజా యుద్ధ నిర్మూలనకు తీవ్ర స్థాయిలో అణచివేత కొనసాగిస్తూ, మరో వైపు సంస్కరణలు కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగానే లొంగుబాట్లను ఒక క్యాంపెయిన్ లాగా కొనసాగిస్తున్నారు.

అయితే శత్రువు బయటికి కనపడుతున్నంత శక్తివంతుడు కాదు. ప్రజల ప్రతిఘటనకు శత్రువు మనో నిబ్బరం దెబ్బతింటుంది....'

ఇవే ఆమె చివరి మాటలు

ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి లలితక్క (ఎల్లంకి అరుణ) సిర్పూర్ దళ ఏరియాలో అవుర్‌గూడ అడవుల్లో శత్రువుతో జరిగిన పోరాటంలో మరో ఇద్దరు మహిళ కామ్రేడ్స్ పాటుగా అమరురాలైంది.

ఆదిలాబాద్ జిల్లా ఉద్యమ కెరటమై ఎగసిన అరుణతార రాలిపోయింది.

గాలి రివ్వున లాకప్ గదిలోకి దూసుక రావడంతో చలి పెరిగింది. చలికి వణుకుతూ.... ఆ గదిలోని ఒకయిమూలకు పాకుతూ వెళ్ళి దగ్గరకు ముడుచుకొని చుట్ట చుట్టుకొని పోయాడు రఘు. అతని ఆలోచన ఎక్కడో తెగిపోయింది. గుర్తుకు రావడం లేదు. అంతా కలగాపులగంగా ఉంది. స్పృహ తప్పిపోవడానికి ముందు శత్రువు అన్న చివరి మాటలు గోండుకా దమక్ గాండ్‌మే రహెత..... గోండుగా దమక్ గాండ్‌మే రహెత..... గుర్తుకొచ్చిన కొద్దీ ఆ స్థితిలో కూడా కసి రగిలిపోతోంది.

గోసికి కొరకాని గోండు.... ఇవ్వళ్ల దోపిడోల్ల గొంతులు కోసేందుకు సాయుధమౌతున్నాడు. తప్పిన జీవిత పొరల్లో నుండి వెలవడుతున్న విషాదాలు ఆలోచనలు ఎన్నెన్నో.....వర్గ పోరాటం ఇవ్వళ్ల ఆదివాసీకి ఎన్నో గుణపాఠాల్ని అందిస్తోంది.

తన తెగకు ఈ పోరాటం ఎప్పుడు అలవాటయ్యింది? భూస్వాములు, వ్యాపారులు, రెవిన్యూ, అటవీ అధికారుల అణచివేత, మాముళ్ళ్, లంచాలు ఆదివాసులను అతలాకుతం చేశాయి.

బ్రిటిషోడు భారత దేశానికి వ్యాపారం పేరుతో వచ్చి ఇక్కడి సంపదలపై కన్ను వేసిండు. బ్రిటీష్ రెవిన్యూ విధానం ఫలితంగా పుట్టుకొచ్చిన కొత్త ఆర్థిక సంబందాలు అడవులలో సమస్యలు సృష్టించాయి. 1860ల నుండి భారత దేశంలో గిరిజన తిరుగుబాట్లు జరుగుతూనే వున్నాయి. 1940లలో కొమురం భీం నాయకత్వంలో జోడెన్ ఘట్ బాబేజర్రిల కేంద్రంగా జరిగిన సాయుధ సమరం..... మర తుపాకులున్న నైజాం సైన్యాలను - కొమురం భీం నాయకత్వంలో ఆదివాసులు గడ గడలాడించారు.

ఆ మననమే రఘుకు శక్తిని అందిస్తోంది.

అడవిలోకి మొదట తెల్ల బట్టల వాళ్లు వచ్చారు. వారి వెనుక పోలీసులు వచ్చారు. ముందు వచ్చిన తెల్ల బట్టలు వ్యాపారులు అడవిని నరక్కోడానికి, అడవి భూములను అక్రమించడానికి వచ్చారు. వెనుక వచ్చిన పోలీసులు ఆ తెల్ల బట్టల వాళ్లను ఆదివాసుల నుండి కాపాడడానికి వచ్చారు.

అట్లా ..... ఆదిలాబాద్ అడవులలోని ఆదివాసుల జీవితాలలో చీకట్లు ఆలుముకున్నాయ్.

ఆ అడవిలో... ఆ ఆదివాసీ కడుపులో పుట్టినోడు....... కష్టాల కొంపులో పుట్టినోడే.... వాడికి ఎలాంటి హక్కులులేవు.

ఆదివాసులకు అడవిపై అధికారం లేదు. పుల్లలేరిన, కట్టెలేరినా, జానెడు కడుపు కోసం మూరెడు భూమి కావాలని అడవి నరికినా ఫారెస్టు అధికారులు. కాళ్ళు, చేతులు నరికిండ్రు. అరెస్టు చేసి చిత్ర హింసలు పెట్టిండ్రు. ఇండ్లు తగులబెట్టిండ్లు. అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపిండ్రు. కేసుమీద కేసు పెట్టి గోండోన్ని కాల్చుక తిన్నారు.

ఈ దోపిడిపై ఆదివాసులు తిరగబడ్డప్పుడల్లా ఈ ప్రాంతాలకు

రోడ్లు వచ్చాయ్. అవి ఎండలో నిగనగలాడుతుంటాయ్. ఇవి అభివృద్ధి కోసమని ప్రభుత్వం అంటుంది.

సంస్కరణల పేరుతో ఐ.టి.డి.ఎ. ద్వారా అభివృద్ధి చేసిందేమీ లేదు. సహకార సంస్థలు చేసిన సహకారం ఏమీలేదు. అలాంటి పరిస్థితిల్లో ఆదివాసుల జీవితాల్లోకి పొరకల సార్లు వచ్చారు - కార్తీక పున్నమి వెన్నెల విరజిమ్మినట్టుగా.

తను మొదట చూసిన సారు ఎవరు? రఘు గుర్తు చేసుకో బోయాడు. ఒకరా, ఇద్దరా.. ఎందరు వచ్చి ప్రాణాలిచ్చారు? పక్కకు తిరగబోయాడు. శరీరం పచ్చి పుండులా తయారై నొప్పి పెడుతోంది. కొద్ది క్షణాల తర్వాత అలాగే సర్దుకొని పడుకున్నాడు. ఒక మెరుపు మెరిసింది మెదడులో. శ్యామన్న (నల్ల ఆదిరెడ్డి) గుర్తుకు వచ్చాడు. ఆదిలాబాదుతో చిరకాల సంబంధం ఉన్న కామ్రేడతను. చివరి సారిగా కలిసింది ఎప్పుడు? తన అమరత్వానికి ముందు..... 1999 ఫిబ్రవరిలో ఆదిలాబాద్‌కు వచ్చాడు. నవ్వుకుంటూ బీడీలు తాగుకుంటు ప్రజా యుద్ధాన్ని ఆదివాసులలో అభివృద్ధి చేయడానికి ఎన్నో...... ఎన్నెన్నో ముచ్చట్లు అర్ధరాత్రి వరకు విసుగులేకుండ చెప్పాడు. శామన్నే తనకు తెలిసిన మొదటి పొరకల సారు. కండ్లల్లో వత్తులేసుకుని, కాలుకు బలపం కట్టుకొని ఆదివాసులు పోసే కలో గంజి తాగి, గూడెం గూడెం తిరిగాడు. గోండోడి గుండెల్లోని పోరాట తత్వానికి పదును పెట్టి, ప్రజా యుద్ధం వైపు అడుగులు వేయించడానికి అహర్నిశలు కష్టపడ్డాడు. అతని మార్గంలో అలుపెరగని పోరాట యోధుడు ఆనందన్న గైడ్ చేస్తునే వున్నాడు.

ఆనందన్న గుర్తుకొచ్చేసరికి రఘుకు వెయ్యి ఏనుగుల బలం వచ్చింది. ఆనందన్న నవ్వుతూ సత్యానికి కట్టుబడి వుండడంలో కష్టాలు వుంటాయి అనేవాడు. ఇంకా.. ఈ విజయాన్ని సాధించాలంటే ప్రజల్లో మన కృషి ఉండాలి. మావోయిస్టు సూత్రాలకు కట్టుబడి వుండాలి. మావో నుండి రెండు అంశాల్ని నేర్చుకోవాలి.

ఒకటి - సరియైన ఓరియంటేషన్‌తో నిలదొక్కుకొని వుండడం.

రెండు - దానికి నిర్దిష్ట రూపాన్ని ఇవ్వటం అనేవాడు.

వీటిని అర్థం చేసుకుంటే ప్రజా బాహుళ్యంపై ఆధారపడాలి. వీటిని ఆచరణలో పెట్టడానికి, వాటికి వివరణలు ఇవ్వాలి. మెజారిటీ వాటిని ఆమోదించాలి. అమలు జరపాలి. కామ్రేడ్ మావో కష్టాలకు కెరటాల్ల ఎదురు ఈదండి - అంతిమ విజయం మనదే అన్నాడని గుర్తు చేసేవాడు. వీడ్కోలు చెప్పుతూ ఆనందన్న చెప్పిన మాటలు రఘు చెవిలో ప్రతి ధ్వనించాయి. గజ్జల గంగారం, పులి మధునయ్య, ఈటే శంకర్, మల్కాపురం భాస్కర్, సూర్యం, లలితక్క ఎందరెందరో వీర వనితలు - వీర యోధులు ఆదివాసీ గుండెలకు విప్లవ రాజకీయాలు బోధించారు.

పోరాటమనేది ఆదివాసుల జీవితాలలో భాగమయ్యింది.

ఫారెస్టు అధికారులను తరిమికొట్టడంలో, అడవి భూమిని నరికించడంలో, షావుకార్ల దొంగ లెక్కలు బయపెట్టి, దోపిడిని కంట్రోల్‌చేయడంలో, కాంట్రాక్టులను ఎదిరించి, సంఘటితంగా కూలీ రేట్లను పెంచుకోవడంలో పొరకల పార్టీ ఆదివాసులకు అండగా నిలిచింది మహిళ సంఘాలు పెట్టి ఆదావాసీ మహిళలను సంఘటిత పర్చింది. అయిదవ, ఆరవ షెడ్యులె గూర్చి చెప్పి భూర్య కమీషన్ సిఫారస్సుల అమలు పేరుతో చేస్తున్న మోసాన్ని ఎండగట్టారు. ఈ అడవులపై సర్వ అధికారాలు ఆదివాసులకే అని నినదించింది. దోపిడి ప్రభుత్వానికి సవాలెగా ఆదివాసీ గ్రామాలలో గ్రామ రాజ్య కమిటీల అధికారం కొనసాగించారు.

1981 ఏప్రిలె 20 ఇంద్రవెల్లిలో గిరిజన రైతు కూలీ సంఘం సభ పెట్టుకుందామని జమ కూడితే, ఉవ్వెత్తున లేస్తున్న ఆదివాసీ రైతాంగ పోరాటాలను అణచివేయడానికి ప్రభుత్వ కుట్ర చేసింది. ఇంద్రవెల్లిలో సభను నిషేధిస్తూ 144వ సెక్షన్‌ను విధించారు పోలీసులు. సభ జరుపుకోవడం ఆదివాసులు హక్కుగా భావించారు. ఎర్రజెండాల ఊరేగింపులతో తుడుం మోతలతో ఆదివాసులంతా ఇంద్రవెల్లి వీధుల్లోకి దూసుకొచ్చారు. పోలీసులు ప్రదర్శనపై విచ్చల విడిగా కాల్పులు చేశారు. ఆ కాల్పుల్లో అరవయ్యి మంది ఆదివాసులు మృతి చెందారు. కోపం కట్టలు తెంచుకున్న ఆదివాసులు, కాల్పుల మధ్యనే పోలీసులపై తిరగబడ్డారు. గొండు మహిళ ఇస్రూబయ్ తన చేతిలోని కొడవలితో ఒక పోలీస్ పొట్ట చీరి చంపి వేసింది. ఆమె తీవ్రంగా బుల్లెట్ గాయాలతో పడిపోయింది. ఈ సంఘటన మరో జలియన్ వాలాబాగ్‌గా ఉద్యమ చరిత్రలో నిలిచిపోయింది.

ఆలోచనలతో, శత్రువు చిత్ర హింసలతో నెత్తుటి గాయాలతో అలసి పోయి రఘు మత్తు కమ్ముకస్తుంటే, నిద్రలోకి జారుకున్నాడు. అట్లా పదే పదే మెలకువ రావడం, ఏవేవో ఆలోచనలు, జ్ఞాపకాలు చుట్టుముట్టడం, తిరిగి మగతో, నిద్రో తెలియని స్థితిలోకి జారిపోవడం..

3

తూర్పు రేఖలు విచ్చుకున్నాయ్. లాకప్ గదికి పైన ఉన్న వెంటిలేటర్ గుండా కిరణాలు వచ్చి పడ్డాయ్. గది చుట్టు నిశ్శబ్దం తాండవిస్తోంది. గదిలో ఓ మూలకు ముడుచుక పడుకున్న రఘుకు మెళుకువ వచ్చింది. ఆకాశం ఎత్తు ఆశలు నేల కూలీ సత్తువ లేని కాళ్లతో ఈడ్చుకుంటు వస్తున్న దృశ్యమేదో గోచరమవుతోంది. రాత్రి అనుభవించిన చిత్ర హింసలతో శరీరం పచ్చి పుండయ్యింది. ఒళ్ళంతా వాపుతో పోట్లు పొడుస్తుంది. జ్వరం అవహించింది. భగ్గున ఒళ్ళు మండుతుంది. ఓపిక బొత్తిగాలేదు. లేస్తే శోష వచ్చి పడిపోతాను అనిపించింది. కాళ్లకు, చేతులకు బేడీ భారమనిపించాయి.

రాత్రంతా చేసిన ఆలోచనలు తిరిగి గుర్తుకొచ్చాయి. తను తాను ఉత్సాహ పరుచుకున్నాడు. కాళ్ల కదిలిస్తే సంకెళ్ల చప్పుడు.

రాత్రి నుండి దాహంతో నాలుగు పిడుచుక కట్టుకపోతోంది. ఏం చేయాలి? తను ఇక్కడి నుంచే ప్రారంభించాలి. ఇదేఇక్కడ చేయగలిగిన ప్రతిఘటన అనుకొని గట్టిగా అరిచాడు. లాకప్ గది ప్రతి ధ్వనించింది. గచ్చుపై బూట్ల నాడాల టక టక చప్పుళ్లతో స్టేషన్ సెంట్రీ - తుపాకులతో వచ్చి లాకప్ ముందు నిలబడ్డాడు. దర్వాజకున్న తాళాన్ని లాగి చూస్తూ "ఏం అరుస్తున్నావ్......?" అన్నాడు.

"దాహం వేస్తుంది, నీళ్లు కావాలి" అని అడిగాడు.

స్టేషన్ సెంట్రి మాట్లాడకుండా వెళ్లి ఒక పెద్ద స్టీల్ గ్లాస్‌లో నీళ్ల తెచ్చి లాకప్ గది చువ్వల సందుల్లో నుండి అందించాడు. ఉన్న సంకెళ్లన్న చేతులతో రఘు అందుకొని గట గట తాగాడు.

గ్లాస్ తిరిగి ఇస్తూ "మరికొన్ని ఇస్తావా?" అన్నాడు.

జవాన్ మరో గ్లాస్ అందించాడు. "ఏం కేసు నీది....?" అని మాములుగానే అడిగాడు. బహుశా అతను తెల్లవారే సమయంలో సెంట్రీ డ్యూటీ ఎక్కినట్టున్నాడు.

సెంట్రీని పరిశీలనగా చూస్తు రఘు "నక్సలైటె..." అన్నాడు.

"ఎక్కడ దొరికావ్? ఎప్పుడు.....?"

"రేచిని రైల్వే స్టేషన్‌లో.... నిన్న సాయంత్రం...."

రఘు వైపు సెంట్రీ అలాగే చూస్తూ కొద్ది క్షణాలుండి అక్కడి నుండి వెళ్ళిపోయాడు. బహుశా అతని శరీరం మీద తడి ఆరని గాయాలే ఆ సెంట్రీ జవాన్‌కు సమాధానం చెప్పాయ్ కావచ్చు.

లాకప్ గది కంపు వాసన వేస్తోంది. ఆ గదిలోనే ఖైదీలు ఒక మూలకు మూత్ర విసర్జన చేసి వుండడంతో ఒంటి మీద ఉన్న బట్టల నెత్తురు వాసన కలిసి ఒక లాంటి వెగటు వేస్తోంది. ఆ వాసనను భరించలేక పోతున్నాడు రఘు. తల తిరిగినట్టు అవుతోంది. ఆ లాకప్ గదికి ఎదుట ఉన్న ఆఫీసు గదిలో సీలింగ్ ఫ్యాన్ తిరిగడంతో అప్పుడప్పుడు చల్లగా గాలి లాకప్ గదిలోకి దూసుకొస్తోంది. పైగా చలి కాలం కావడంతో గదంతా చల్లగా వుంది. నేలపై పాకుకుంటూ ఆ గదిలో రాత్రి నిదురపోయిన మూలకు పోయి ఒదిగిపడుకున్నాడు.

కొద్ది రోజుల ముందు ఉత్తర తెలంగాణ పార్టీ ప్లీనం తర్వాత జిల్లా కమిటీ సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి చంద్రన్న వచ్చాడు. చలికాలం వెచ్చని ఎండలో పొద్దటి మంచు పూర్తిగా కరగకముందు పచ్చటి అడవులో గుట్టపై ఉన్నారు. అటు వైపు ఇటువైపు లొద్దులు. లొద్దుల్లో వాగులు, గుట్టలున్నాయ్. గుట్టలు కొన్ని చోట్ల దట్టంగా చెట్లతోను, తీగలతోనూ నిండి ఉన్నాయి. అలాంటి అద్భుత వాతావరణంలో మా సమావేశం ప్రారంభమయ్యింది.

రాష్ట్ర కార్యదర్శి ఉత్తర తెలంగాణ ఉద్యమ స్థితి కండ్లకు కట్టినట్టుగా అర్థంచేయించాడు.

శత్రు నిర్బంధం చర్చకు వచ్చింది. చంద్రన్న "ఇవ్వాళ భారత విప్లవోద్యమానికి గుండెకాయ అయిన ఉత్తర తెలంగాణ విప్లవోద్యమంపై శత్రువు అన్ని వైపుల నుండి దాడి చేనస్తున్నాడు. గతం నుండి కూడ విప్లవోద్యమం ఎలా అలలు అలలుగా పురోగమిస్తున్నాదో అలా శత్రువు నిర్బంధం అంతకంతకు పెరుగుతున్నది. అయితే మనం తీసుకున్న ఎత్తుగడలో లోపభూయిష్టంగా ఉన్నందువల్ల కొన్ని ఎదురు దెబ్బలు తిన్నం. అయితే ఈ యుద్ధంలో మనం పూర్తిగా ఓడిపోలేదు. కాబట్టి ఎత్తుగడలను మార్చుకుందాం."

"ఎలా మార్చుకుందాం? తప్పెక్కడ జరిగింది?" అని తను ప్రశ్నించాడు.

"ఈరోజు శత్రువు మనపై రుద్దుతున్న ఈ యుద్ధాన్ని మనం కోరుకున్నది కాదు. శత్రువు ఈ యుద్ధంలో సత్వరవిజయాన్ని సాధించాలనుకుంటున్నాడు. దీనికి విరుద్ధంగా మనం వుండాలి. శత్రువు ఆటలు కొనసాగించనీయకుండా ఈ యుద్ధాన్ని సాగతీస్తూ దీర్ఘకాలం కొనసాగించాలి. కొన్ని సందర్భాలలో విప్లవ పోరాటంలో అనుకూలమైన పరిస్థితికంటే కష్టాలు అనేక రెట్లు అధికంగా ఉంటాయ్. అప్పుడు కూడా కష్టసమాయాల్లో మనం సాధించుకున్న విజయాలు మరిచిపో కూడదు. మనకున్న మంచి భవిష్యత్ చూసుకొని ధైర్యం పొందాలి.

స్టేషన్‌లో బూట్ల చప్పుళ్లు టక టక వినవస్తున్నాయ్. అంతకంతకు దూరమవుతున్నాయి, దగ్గర అవుతున్నాయ్. ఉన్నట్టుండి కుక్కలు మెరిగినట్టే మెరుగుతున్నారు. ఏవో అదిలింపులు.

మెకాళ్లపై అంబాడుతూ లాకప్ గది దర్వాజ వద్దకు వచ్చి బయటి చూసాడు రఘు. లావుగా ఉన్న బట్టలతను కన్పిస్తున్నాడు. అతను మెరుగుతున్నట్టుగా "ఆ దొంగ లంజలను ఇటు లోపలికి రమ్మను. ఆ ముండలు అక్కడ నిలబడి వచ్చి పోయేటోల్లకు లైన్ ఎద్దామని చూస్తున్నారు, ఇటు లోపలికి పంపియ్ ఆ లంజలను" అన్నాడు కసిగా.

అతని షర్టుకు మూడు పట్టీలు కన్పిస్తున్నాయ్. బహుశ జమేదారి కావచ్చు. ఆ జమేదారి మూతిపై గుబురు మీసాలున్నాయి.

వరండాలో సెంట్రీ ఉన్నట్టున్నాడు. స్టేషన్ కంపౌండ్‌లో నిలుచోని ఉన్న మహిళల్ని జమేదారి ఉన్న గదిలోకి పంపించాడు. ముగ్గురు నాలుగురు ఆడవాళ్లు జమేదార్ ముందుకు వచ్చి నిలుచున్నారు. సెల్ చువ్వలకు అతుక్కుపోయి చూశాడు రఘు. ఒక్కరిద్దరి ముఖాలు కనిపించాయి. ఆ మహిళల్లో కొందరు పంజాబు డ్రెస్సుల్లో ఉన్నారు. చున్నీలు మెడలపై కప్పుకున్నారు. కొందరు మాసి న చీరలతో రేగిన జుట్టతో క నిపిన్తున్నారు. వాళ్లముఖాలు క ళహీనంగా క నిపిస్తున్నాయి.

జమేదార్ మీసాన్ని మెలేస్తూ మహిళల ముఖాల్లోకి చూస్తూ "రాత్రి ఎంత మందికి లైన్ ఏసింద్రు" అన్నాడు.

"........"

"మాట్లాడండి లంజల్లారా" కోపంగా అన్నాడు. ఆ ముఖం చూస్తే భయం కలిగేలా ఉంది. "లంజలం కాబట్టే లంజకొడుకులు పట్టుకున్నారు.." అంది ఒక మహిళ. ఆమె ఇటువంటి వ్యవహారాలలో ఆరితేరినట్టుగా ఉంది. ఇలాంటి విషయాలలో పోలీసోల్ల వ్యవహారాలు తెలియంది ఎవరికి? - అన్నట్టుగా ఉంది ఆమె ధోరణి.

ఉండబట్టలేక వరండాల్లో ఉన్న జమేదార్ వైపు చూస్తూ "ఎక్కడ దొరికింద్రు సార్" అని అడిగాడు సెంట్రీ.

"రాత్రి టాకీస్ కాడ. వచ్చిపోయేటోల్లకు లైన్ ఎస్తున్నారు"

"బలే దొరుకబట్టింద్రు సార్" నవ్వుతూ సెంట్రీ.

జమేదార్ సెంట్రీ వైపు చూస్తూ "నీకెందుకోయ్ వ్యవహారం. ఏంది చోద్యం చూస్తున్నావ్, చల్ అవతలికి నడువ్" ముఖాన్ని సీరియస్‌గా పెట్టి అన్నాడు.

సెంట్రీ బయటకు పోయి నిలుచున్నాడు.

"ఏం సంగతి" జమేదార్, వాళ్లను అడిగాడు.

"ఏంటిది సార్ " ఇందాక మాట్లాడిన మహిళ.

"ఎంత సంపాయించింద్రు" వ్యంగ్యంగా నవ్వుతూ జమేదార్ అడిగాడు.

"సంపాయించుడు ఎక్కడ సార్? పొట్ట తిప్పల కోసం జెర్రిపోతుల ఆట అన్నట్టు.. కడుపు తిప్పలు కోసం సార్" రెండవ మహిళ అంది.

"కడుపు తిప్పల కోసమని అందరికి లైన్ ఏసుకుంట - చెడగొడుతున్నారు. బాగా బలసి ంది మీ‍కు"

"..........."

"ఎందుకు సార్ అట్ల మాట్లాడుతారు. మానం అమ్ముకొని

మా కడుపు కోసం మా తిప్పల మేం పడుతున్నాం. మీకెందుకు సార్ కడుపు మంట" పంజాబు డ్రెస్సు వేసుకున్న మహిళ లేని నవ్వును ముఖంపై తెచ్చి పెట్టుకుంటూ అంది.

"ఛీ....! లంజ నోరుముయ్. మాకు కడుపు మంటా? ఈ సమాజాన్ని చెడగొడుతున్నారే మీరు లంజల్లారా" జమేదార్ కోపంగా ఎగురుతూ లాఠీ చేతిలో తిప్పుకుంటూ అన్నాడు.

"......"

"అసలు సంగతి చెప్పండి సార్, సంగతి తెలువందేవరికి" ఇందాక మాట్లాడిన మహిళ.

జమేదారి కోపాన్ని కొంచెం తగ్గించుకొని, ఇంత నవ్వు అతికించుకొన్నాడు. ఆ మహిళల్లో ఒకామె కొన్ని డబ్బులు తీసి జమేదారి చేతిలో పెట్టింది. పొద్దున్నే లాభసాటి బేరం తగిలిందను కున్నాడు జమేదారు. మిగితావాళ్లు కూడా బట్టల్లోంచి డబ్బులు తీసి టేబుల్ మీద పెట్టారు. ఆ తర్వాత జమేదారి ముందు నుండి వెళ్లిపోయారు. జమేదారు సిగరెటె డబ్బ నుండి ఒక సిగిరెటె తీసి వెలిగించి గట్టిగా గుండెల్నిండా దమ్ములాగి పొగ వదులుతూ "అరేయ్ సెంట్రీ దో చాయ్ బోలోరే జల్దీ ఆనా జనేకా హై.." అన్నాడు.

పతితుల్లారా, దళితుల్లారా, దగాపడ్డ చెల్లెల్లారా ఎడవకండేవ కండి.. వస్తున్నాయ్ వస్తున్నాయ్ జగన్నాథ రథ చక్రాలు .. భారంగా శ్రీశ్రీకవిత్వాన్ని గుర్తుచేసుకున్నాడు రఘు.

అక్కడ మౌనం రాజ్యమేలుతోంది. సీలింగ్ ఫ్యాన్ల శబ్దం మాత్రమే వినిపిస్తోంది. సెంట్రీ రెండు చాయ్ గ్లాసులల్లో పట్టుకొని జమేదారి వద్దకు వచ్చాడు. చెరొకటి తాగిన తర్వాత ఖాళీ గ్లాసులను వరండా బయట పెట్టి వచ్చాడు సెంట్రీ. ఆ తర్వాత జమేదార్, సెంట్రీ లాకప్ ముందుకు వచ్చి ఆగిపోయారు. లాకప్ చువ్వల మధ్య నుండి అలాగే చూస్తుండి పోయాడు రఘు. జమేదార్ సెంట్రీని "కోన్ హై?" అడిగాడు.

"రాత్రి పట్టుకొచ్చిండ్రట"

"ఏం పేరు బాబూ?" సౌమ్యంగా అడిగాడు జమేదార్.

"రఘు"

"నక్సలైట రఘు" జమేదార్ సెంట్రీ ముఖంలోకి చూస్తూ "ఇన్ మషుర్ నక్సలైహై. ఇసే ఫైలే ఇన్‌కా నాం సునే తే ఆఫీరోంక గాండ్ గాబరాతే"

"అట్లన సార్" తెలియని విషయం తెలుసున్నట్టుగా సెంట్రీ ముఖం పెట్టి అడిగాడు.

"ఓ కుత్తొంకో పకడేతో నహి చోడ్‌తే ఆజ్ ఫైసల కర్‌తే పేపర్ మే ఆతే ఓ సాలోంకో ప్రమోన్ ప్రమోషన్ మార్‌తే" జమేదార్ సెంట్రీకి చెప్తుతునే ఉన్నాడు. ఏమనుకున్నాడో ఏమో కాని ఆ జమేదార్ అక్కడ నుండి వెళ్ళిపోతూ "ఒక చాయ్ తీసుకొచ్చి అతనికివ్వు" అంటూ వెళ్ళిపోయాడు. కొద్ది సేపటి తర్వాతసెంట్రీ జవాన్ పొగలు కుక్కుతున్న వేడి టీ గ్లాసు తెచ్చి రఘుకు ఇచ్చాడు. "ఇంకో గ్లాస్ అందుకో" సెంట్రతో రఘు అన్నాడు.

"ఫర్వాలేదు తాగు"

"లేదు.. ఒక గ్లాసు అందుకోండి, కొన్ని నీళ్లు కూడా కావాలి" జవాన్ వెళ్లి ఒక గ్లాసుతో నీళ్లు తెచ్చిచ్చాడు. రఘు నీళ్లుతాగి ఆ ఖాళీ గ్లాసులో సగం టీ పోసి ఇచ్చాడు.

"వద్దు వద్దు నీవే తాగు" అని కూడా, అతని కోరిక ను కాదనలేక పోయాడు. రఘు ముఖంలోకి కొంత బాధగా చూస్తూ టీ గ్లాసు అందుపుకున్నాడు జవాన్.

రఘుకు వేడి చాయ్ తాగడడం కష్టంగానే వుంది. దవడపన్ను ఒకటి విరిగిపోయింది. మిగితా పండ్లు కదిలిపోయి వాటి నుండి నెత్తురు చిమ్మింది. పండ్ల మధ్య పడి నాలుక నలిగిపోయింది. నొప్పి భరిస్తూనే నెమ్మది నెమ్మదిగా టీ తాగాడు.

"నీ పేరేంటి" జవాన్ను అడిగాడు.

"ధర్మరాజు"

"ఇంటిపేరు" నెమ్మదిగా టీ మింగుతూ

"తొడుసం"

"కొయ్‌తూర్" అని రఘు నవ్వుతు అన్నాడు.

బాధలో కూడ నవ్వుతూ మాట్లాడే సరికి జవాన్ ముఖంలో బాధ అలుముకుంది. " నీ పేరు" అని జవాన్ అడిగాడు.

"మాడావి జంగు. పార్టీలో రఘు అంటారు".

"ఏ వూరు"

"రాజంపేట"

'మా ఊరు మీ పక్కనే "

ఎప్పుడో తెగుపోయిన బంధం ముడిపడ్డట్టనిపించింది. వెతక బోయింది దొరికినట్టుగా ఇద్దరూ పీలయ్యారు. భాషలో ఏవో ఏవో మాట్లాడుకున్నారు. వాళ్ల మనుస్సులు మెత్తబడ్డాయ్.

"ఎప్పుడు వచ్చినావ్ ఈ ఉద్యోగంలోకి"

"1987లో ఈ ఉద్యోగం దొరికింది. అంతకయిముందు గోండులను దేకిందెవడు? అల్లంపల్లి సంఘటన తర్వాతనే ఆదివాసులంటేనే అదిరిపడింది ఈ ప్రభుత్వం. లేకుంటే గోండోడంటే ఎందుకు కొరకానోని కింద లెక్క" ధర్మరాజు అన్నాడు.

ఆదివాసీ ఆత్మ విశ్వాసంతో తలెత్తుకొని గతాన్ని గొప్పగా నెమరేసుకుంటూ పొరకల సార్ల అడుగు జాడల్లో నడిచిపోయారు. సోషల్ పదాడంబర నినాదాలతో 1985లో తెలుగుదేశం నేత ఎన్.టి. రామారావు అధికారంలోకి వచ్చి ఆదివాసీ ఉద్యమాలపై నిర్బంధం తీసుకొచ్చాడు. పార్టీ కమిటీ సభ్యుడు కామ్రేడ్ పులిమధునయ్య, అంకోలి రమేష్ అమరులైనారు. 1987లో కోనంపేట వద్ద జరిగిన ఎన్‌కౌంటర్లో జిల్లా కమిటీ సభ్యుడు. ఊట శంకర్‌తో మరొకరు నేలకొరిగారు. ఇలా పెద్ద ఎత్తున బూటకపు ఎన్‌కౌంటర్లు పేర రాజకీయ హత్యలకు శ్రీకారం చుట్టింది రామారావు ప్రభుత్వం.

ఆదిలాబాద్‌లో 1/70 అమలును నీరు కార్చిండు. విప్లవోద్యమంలో అండతో ఆదివాసులు వరుక్కున్న అటవి భూములలో ప్లాంటేషన్ పెట్టించింది రామారావు ప్రభుత్వం. అడవులలో, ఆదివాసీ గూడాలలో కార్పెట్ పోలీస్ క్యాంపుల వేసి ఆదివాసీ బతుకులను ఆగ మగం చేసారు. ఆ రోజుల్లో ఏ ఇంట్లో ఏ కన్న తల్లి పేగు తెగుతుందో, ఏ భార్య తన భర్తను కోల్పోతుందో, ఏ బిడ్డ తండ్రిని కోల్పోతుందో, ఏ యువకుడు తెల్లారితే కరెంట్ స్తంభాల శవమై ఊగుతాడో, ఎవరు ఎక్కడ మాయమై తెల్లారితే బూటకపు ఎన్‌కౌంటర్లలో దర్శనం మిస్తారో చెప్పలేని పరిస్థితి.

రాష్ట్రంలో ఆట, పాట మాట బంద్ అయిపోయాయి. ఈ నిర్బంధం మధ్యలో గెరిల్లా దళాలు, పార్టీ అత్యంత ధైర్యంగా ప్రజల మధ్య పనిచేస్తు, ప్రభుత్వ బలగాలపై మిలిటెంట్ ప్రతిఘటన దాడులు చేసాయ్. 1985లోనే కాగజ్‌నగర్ పట్టణంలో ఎస్.ఐ. లక్ష్మణ్ రావును అర్బన్ గెరిల్లా యోధులు ఖతం చేసారు. ప్రజా గెరిల్లాలు శత్రువుపై అల్లంపల్లి అడవుల్లో ఆగస్టు 18న మాటు కాసి దెబ్బ తీసారు. పది మంది పోలీసులు గెరిల్లాల చేతుల్లో మట్టి మట్టి కరిచారు. ఆ రోజుల్లో ఈ ఘటన రాష్ట్రంలోనే అత్యంత ప్రభావంవేసింది. ప్రజల్లో విప్లవోత్సాహాన్ని రేకెత్తించింది.

అల్లంపల్లి సంఘటన తర్వాత ఆదిలాబాద్ అడవులలో ఉన్న కార్పెట తరహాలో ఉన్న పోలీస్ క్యాంపులన్నీ ఎత్తివేసుకుంది సర్కార్. మరోవైపు ప్రభుత్వం ఆదివాసుల మనుస్సును దోచుకోవడానికి సంస్కరణల పర్వం ప్రారంభించింది. అభివృద్ధి పథకాలకు 110కోట్లు ప్రకటించింది, రామారావు ప్రభుత్వం. ఆదిలాబాద్ జిల్లాను ఆదర్శ జిల్లాగా ప్రకటించి, ఆదివాసులను విప్లవ మార్గం నుండి పక్క దారి పట్టించడానికి ప్రయత్నించింది. ఇంకోకవైపు అమాయకులైన ఆదివాసీ యువకులను బూటకపు ఎన్‌కౌంటర్లలో చంపివేసింది.

సర్కార్ సంస్కరణలలో ఆదివాసీ యువతకు పోలీస్, ఫారెస్టు డిపార్టుమెంట్లలో, ఉపాధ్యాయ వృత్తులలో ఉద్యోగాలు కల్పించింది. ధర్మరాజు లాంటి ఎందరో యువతి - యువకులకు అల్లంపల్లి ఘటన తర్వాత ఉపాధి దొరికింది.

"ఆదివాసులకు పార్టీ అండే లేకుంటే రాబందులు లెక్క పీక్కుతినేటోల్లు'" జవాన్ ధర్మరాజు ఆవేదనగా అన్నాడు.

"అందుకే మన పార్టీ ఆదిలాబాద్ ఆదివాసులలో మొదటగా ప్రజా యుద్ధ జ్వాలల్ని రగిల్చించింది" విప్లవోత్సాహంతో రఘు పలికిండు.

వరండా బయట మాటలు వినబడుతుండడంతో "సరే నేను వెళ్లొస్తా, పట్టుదల వదలద్దు" అంటు ధర్మరాజు వెళ్ళిపోయాడు. ఆ మాటలు అంటున్నప్పుడు జవాన్ ధర్మరాజు కళ్లల్లో నీళ్లురాయ్.

ఆరోజు డ్యూటీ నుంచి దిగిపోతూ చివరి సారిగా రఘు దగ్గరికి వయావచ్చాడు ధర్మరాజు. " పది గంటలకు పై అధికారులు వస్తారట.." అన్నాడు.

"ఫర్వాలేదు. వాడిని నిద్ర పోనియ్యను. మృత్యువును నవ్వుతూ ఆహ్వానిస్తా"

ధర్మరాజు వేగంగా వెళ్లిపోయాడు. రఘు మెల్లగా లాకప్ గదిలోని మూలకు వెళ్లిపోయాడు. కళ్లు మూసుకొని ఆలోచిస్తున్నాడు. అల్లంపల్లి నుండి రఘు ఇంకా తేరుకోలేకపోయాడు. గెరిల్లా నాయకుడు రామకృష్ణ వీరోచితంగా పోరాడుతూ వీర మరణం పొందాడు. రామకృష్ణ సౌమ్యుడు. అతడ్ని చూస్తే ఇతను ఎట్లా రాడికల్ అయ్యాడు? అనిపిస్తుంది. అది 1987 కాలం. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కుమ్మక్కై, పార్టీపై అప్రకటిత నిషేధాన్ని కొనసాగిస్తూ పార్టీని సమూలంగా నిర్మూలించేందుకు పెట్రేగిపోయి బూటకపు ఎన్‌కౌంటర్లకు దిగింది. యువకు మాయం , గ్రామాలపై దాడులు, స్త్రీలను చెరచడం, ఆదివాసీ గ్రామాలను కాల్చి వేయడం లాంటి ఫాసిస్టు చర్యలతో ప్రజల నుండి పార్టీని వేరు చెయ్యాలనే దుష్టపన్నాగం పన్నింది. కొద్ది రోజుల్లోనే జిల్లాలో 11 మంది గెరిల్లా వీరులను కాల్చిచంపింది. ఈ సందర్భంలో ప్రత్యేక కర్తవ్యంతో శత్రువు ప్రతిఘటించడానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక దళంలో కామ్రేడ్ రామకృష్ణ సభ్యుడు. పోలీసుల్ని మట్టు బెట్టడానికి అల్లంపల్లి అడవుల్లో ఎరవేసింది దళం . కామ్రేడ్ రామకృష్ణ శత్రువు తూటాలకు నేలకొరిగిండు. శత్రువు పరిస్థితి తెలుసుకోవడానికి కిల్లింగ్ గ్రౌండ్‌లోకి చొరబడ్డ కామ్రేడ్ సంతోష్ దూసుకొస్తున్న తూటాలను లెక్క చేయకుండా, చచ్చిపడి ఉన్న పోలీసుల శవాలను కవర్స్ ఉపయోగించుకుంటూ తన తుపాకితో శత్రువుపై నిప్పులు కురుపించాడు. కిల్లింగ్ గ్రౌండ్స్‌లో చిక్కుకున్న గెరిల్లా యోధుడు సంతోష్‌ను శత్రువు తూటాలు వీపును, మడమను చీల్చి వేసాయ్. రక్తం నెత్తుటి మడుగులో సంతోష్ పడిపోయాడు. అమరుడు రామకృష్ణ శవాన్ని అక్కడే వదిలేసి స్వాధీనం చేసుకున్న తుపాకుల్ని, గాయాపడ్డ కామ్రేడ్ సంతోష్‌ను దళం మోసుకొచ్చింది. తీవ్రమైన రక్త స్రావంతో పాలిపోతున్న సంతోష్ అందరినీ పలకరించాడు. అందరి చేతుల్ని తన చేతుల్లోకి తీసుకోవాలను కున్నాడు. సహచర గెరిల్లాలు గాయాల్ని శుభ్రం చేసి కట్లు కడుతున్నాడు.

శత్రువు గుండెల్లో గుబులు పుట్టించిన అల్లంపల్లి పార్టీ పోరాట పటిమను మహోన్నతంగా పెంచింది. ప్రజల్లో గొప్ప మనో ధైర్యాన్ని నింపింది. అల్లంపల్లి అంబుష్‌లో వీరోచితంగా పోరాడిన రామకృష్ణ సంతోష్‌లు కండ్లల్లో మెదిలారు.

కాని కడుపులో ఆకలి దహించి వేస్తోంది. తిండిలేక ఒక రోజు గడిచిపోయింది. ట్రైన్ ప్రయాణం కంటే ముందు మధ్యాహ్నం మిత్రుడు రాజేందర్‌తో కలిసి హెూటల్‌లో భోజనం చేసి విడిపోయారు. ఆ తర్వాత చాంద్‌పాషాతో కలిసి ట్రైన్‌లో ప్రయాణించి, తన దళం, ఎ.పి.టికి వెళ్తున్న క్రమంలో ద్రోహి పాషా పట్టించాడు. శత్రువు చేజిక్కి ఒక రోజు కావస్తుంది. ఆకలి కడుపులో కలుగుతున్న ఆలోచనల్లో కరువు పోరాటం గుర్తుకు వచ్చింది. ఆ రోజు దళంలో జరిగిన కరువు చర్చ అతని జ్ఞాపకాలలో శాశ్వతంగా నిలచిపోయింది. ప్రభుత్వం ఆదివాసులను సంస్కరణలను ఏంతో కాలం పక్కదారి పట్టించ లేకపోయింది. 1988-89లలో ఆదిలాబాద్ జిల్లాలో కరువు కరాళనృత్యం చేసింది. కరువు నుండి రైతాంగాన్ని ప్రభుత్వ సంస్కరణలు రక్షించలేకపోయాయి. ఆకలి భరించలేక ఆదివాసులు విషపు గడ్డలు, గును గింజల్ని తింటున్నారు. దళం ఏ గూడెం వచ్చినా దాదాలు కరువుతో, ఆకలితో సతమతం అవుతూ, దళానికి అన్నం పెట్టలేకపోయారు.

ప్రజలు ఏది తింటే దళం అది తిని ప్రజలతో కలిని ఆకలితో జీవించిన కాలమది.

అప్పుడే విప్లవోద్యమాల వెల్లువలో దళంలోకి తను అడుగు పెట్టాడు. కరువు గురించి దళం ప్రజల్లో చర్చకు పెట్టింది. ఆఖరికి కరువు దాడులే పరిష్కార రూపంగా ముందుకు వచ్చింది. అంతే సంచలనాత్మకంగా ప్రజలు కరువు దాడుల వెల్లువలు లేచాయి. 1989లో వేలాది మంది రైతాంగం వరుసగా ముప్పై దాడులు చేసి భూస్వాముల, షావుకార్ల ఇండ్ల నుండి బియ్యం లక్షలాది రూపాయాలు స్వాధీనం చేసుకొని పంచుకున్నారు. ఆదివాసుల కరువు వ్యతిరేక

దాడులు రాష్ట్ర ప్రజలను, దండకారణ్యం వ్యాప్తంగా ఆదివాసీ ప్రజానీకాన్ని ఎంతో ఉత్సాహపరిచాయ్.

ఆకలి దహిస్తుంటే ఇంక ఆలోచించ లేకపోయాడు రఘు. శత్రు నిర్బంధంలో తర్వాత ఏం జరుగుతోందో అనే ఆందోళన అతనికి లేదు. ఏం జరిగినా తాను సిద్ధమే. కానీ ఇప్పుడు ఆకలి శరీరాన్ని స్వాధీనం చేసుకుంటోంది. లాకప్ దర్వాజ వద్దకు వచ్చి నిలబడి బయట వరండా వైపు చూసాడు.

ఓ అంటూ గట్టిగా అరిచాడు రఘు. చిన్న గడ్డమున్న జమేందర్ వచ్చి లాకప్ ముందు నిలుచున్నాడు. రఘుతో మొదట్లో మాట్లాడిన జమేదార్ అతను. క్యా అని అడిగాడు.

"ఆకలి"

"తినలేదా?"

"యాల్లా" అంటూ హిందిలో పై అధికారులను బూతులు తిడుతూ వెళ్లిపోయాడు ఆ జమేదార్. ఎండిపోయిన పెదవులను నాలుకతో అద్దుకున్నాడు రఘు. బీటలు పారి ఉన్నాయ్ మీసాలు. నోటి మూలలకు బొబ్బలు వచ్చాయ్. అర్థ గంట తర్వాత ఆ ముస్లిం జమేదార్ అన్నం ప్యాకెట్‌తో ప్రత్యక్ష్యం అయ్యాడు. శత్రువు మరో గంటలో కాల్చేయవచ్చుగాని, అంత దాకా ఆకలితో ఎందుకు ఉండాలి? అనుకున్నాడు. జమేదార్ వెళ్లి ఒక లోటలో నీళ్లు తెచ్చి ఇచ్చాడు. లాకప్‌లో మూత్రాలు పోసే మూలకు వెళ్ళి కొంచెం నోరు పుక అన్నం ప్యాకెట్‌ను విప్పాడు రఘు. అన్నం నమలరావడం రాలేదు. అది చూసి ఆ జమేదార్‌కు బాధ కలిగింది.

జమేదార్ మళ్లీ వచ్చి నీళ్లు అందించాడు. వాళ్ల ఇద్దరి మధ్యన లాకప్ చువ్వలే అడ్డం. కానీ బాగా పరిచయం ఉన్న వాడిలా రఘు వైపు చూస్తూ, బయటి వరండాలోకి చూస్తూ "పట్టు విడవద్దు, లొంగవద్దు" అన్నాడు.

శత్రువు శిబిరంలో ఆ జమేదార్ నోటి నుండి వచ్చిన మాటలు రఘుకు ఆశ్చర్యం కలిగించాయి బైట ఎవరూ రాలేదు. ఇప్పట్లో ఎవరూ రాకపోవచ్చు. జమేదార్ తన కడుపులోని ఎతలన్నీ ఏకరువు పెట్టాడు. ధారాపాతంగా గుక్కతిప్పుకోకుండా చెప్పాడు. అతని కండ్లల్లో నీళ్లు ఊరుతున్నయి. "దరిద్రంలో మునిగి తేలే సంసారం మాది. ఎక్కడా ఏ ఉద్యోగం దొరకక ఈ ఉద్యోగంలో చేరినా. నా ప్రాణ తమ్ముడు చదివింది తక్కువయినవా అపారమైన తెలివి తేటలు కలవాడు. చెప్పితే చాలు, చప్పున ఆకలింపు చేసుకొనేవాడు. అలాంటి నా తమ్ముడు పార్టీలో కలిసాడు.." ఆ తర్వాత పూర్తి చేయలేక దస్తీతో కన్నీళ్లు తుడుచుకుంటున్నాడు.

రఘు ఉద్వేగంగా చూశాడు.

జమేదార్ ప్రేమ పూర్వకంగా "అన్నా వెళ్తొస్తా " అని వాచీని చూసుకొని వెళ్లిపోయాడు.

"బీడి ఉందా?" చంపుకోలేని బలహీనతతో అడిగాడు రఘు.

జమేదార్ జేబులో నుండి సిగరెట్ డబ్బా అగ్గిపెట్టే తీసి ఇస్తు "అందులో అయిదు సిగరెట్లున్నాయి." అని చెప్పి మళ్లి తానే చివరిగా "పదిగంటలకు పై అధికారులు వస్తారటా" జమేదార్ వెళ్లిపోయాడు. గదిలోని మూల స్థావరానికి వెళ్లి కూర్చొని ఒక సిగరెట తీసుకొని కుతి తీర తాగాడు. సిగరెటెను పూర్తి చేసి గదిలో అటు ఇటు తిరుగుతూ ఆలోచించసాగాడు.

బీడిలు, తాగి తాగి రఘు రోగిగా తయారయ్యాడని, మానేయమని చాలా మంది కామ్రేడ్లు చెప్పారు. పార్టీలో 93లో పొగ వ్యతిరేక పోరాటం ప్రారంభమైంది. అనేక మంది కామ్రేడ్లు బీడి వ్యతిరేక పోరాట చైతన్యంతో తమ వ్యసనాన్ని మానుకుంటామని ప్రకటించారు. బీడిలు వద్దు - రోగలు వద్దు, బీడిలు మానండి. ప్రజలకు బలంగా సేవ చేయండని రక రకాల పద్ధతుల్లో విద్య గరపడానికి పార్టీ కామ్రేడ్లు తీవ్రంగా కృషిచేసారు. గెరిల్లాల క్యాంపులల్లో బీడీ వ్యతిరేక చైతన్యాన్ని తీసుక వచ్చారు. ఎర్రక్షరాలతో నినాదాలు, పోస్టర్లు, కార్టూన్స్ వేసేవారు. పాటలు పాడుతూ క్యాంపులలో ఊరేగింపులు తీశారు. బీడిలు మానిన కామ్రేడ్స్‌ను ప్రోత్సాహిస్తూ వారి చేత ఉపన్యాలిప్పించి, ఆ తర్వాత స్టాలిన్, మావో బ్యాడీలను అందంగా తయారు చేసి బహుకరించే వారు. కొన్ని సందర్భాలలో అయితే రెడ్ స్టార్‌లను బహుమతిగా మిలటరీ క్యాపులకు బిగించే వారు.

తన లాంటి మొండిఘటాల మీద ఈ ఉద్యమ ప్రభావం సరిగా పడలేదు. అప్పుడు మానేసినా మళ్లీ మొదలైంది. సహచరులు "బీడీలు తాగి వీక్ అవుతున్నావ్" అని నచ్చచెప్పేవారు. ఇప్పుడు రోగం ముదిరిపోయింది. ఇప్పుడు అదే శత్రువుకు పట్టిచ్చింది. 99లో దండకారణ్యానికి మిలటరీ క్యాంపులో పాల్గొనడానికి విద్యార్థిగా వెళ్లాడు రఘు. ఎర్ర సైన్యం మిలటరీలో ఏలా పనిచేయలో, సైన్యం తర్ఫీదు ఏలా ఉండాలో, మిలటరీ రంగంపై నైపుణ్యం, పట్టు ఉన్న టీచర్లు అనేక నూతన విషయాలు బోధించారు. ఆ క్యాంపులోనే ఆరోగ్యం చెడిపోయి క్యాంపు హస్పిటల్‌లో అడ్మిట్ అయ్యాడు.

సహచరి రూప రఘు ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తుండడంతో లోలోపల బాధపడుతుండేది. నవంబర్‌లో పార్టీ ప్లీనంకు వెళ్లి జిల్లాకు తిరిగి వచ్చాక మళ్లి తిరగబెట్టింది. ఆ సమయంలో బాధ్యుడు కిరణ్ ఉంటే ఏదో రక ంగా ట్రీట్‌మెంట్ చేసేవాడు. అతడు ఆ సమయంలో జిల్లాలో లేడు. తన స్థితి చూసి కామ్రేడ్స్ ఏడ్చేవారు. బాలన్న అయితే ఏదో ఒకటి తినిపించాలని ప్రయత్నించేవాడు.

విప్లవోద్యమ అవసరాల రీత్యా బైటి జిల్లాలకు వెళ్లిన బాధ్యుడు కిరణ్ వచ్చి రఘు పరిస్థితి చూచి ఆందోళనపడ్డాడు. కిరణ్ చాలా సేపు ఆలోచించి వారం రోజుల్లో తన కమిటీ కామ్రేడ్స్‌తో చర్చించి నిర్ణయం తీసుకున్నాడు. రఘు ట్రీట్‌మెంట్ కోసం ప్లాన్ చేసాడు. బయట పట్టణంలో ఉన్న సానుభూతిపరుడయిన చాంద్‌షాషాను పిలుపించుకొని మాట్లాడి, తగు జాగ్రత్తలు చెప్పి పంపించాడు.

నవ్వుతూ కరచనలం చేసి, ఆలింగనం చేసుకొని చాంద్ షాషాతో సాగనపాడు. అదే చివరి వీడ్కోలు. రఘుకు ఆనాటి కిరణ్ ఆప్యాయతతో కూడిన ముఖమే కళ్లలో కదిలాడింది. మధ్యలో రాజేందర్ క లిని దగ్గరుండి ట్రీట్‌మెంట్‌కు అనేక జాగ్రత్తలు తీసుకొని పూర్తిచేసి బాధ్యతాయుతంగా తిరిగి పంపాడు. రాజేందర్ నా నుండి విడిపోవతు "బయట పరిస్థితులు ఏమి బాగాలేవు. ఎవ్వరిని నమ్మొద్దు" అని తన అభిప్రాయాన్ని చెప్పి మళ్లి తానే "విప్లవ పోరాటంలో ఎవరు ఎప్పుడు కలుస్తమో ఎప్పుడు విడిపోయామో"నని కండ్లల్లో నీళ్లు పెట్టుకున్నాడు.

రాజేందర్ ఒక మంచి కామ్రేడ్. విప్లవోద్యమం అతనికి ప్రాణం..

రాజేందర్ ఎంత జాగ్రత్తగా ఉండేవాడంటే చాంద్‌పాషాను కూడను నమ్మలేక పోయేవాడు. అతణ్ణి రూంలో నుండి బయటకు పోయేందుకు అనుమతినిచ్చేవాడు కాడు.

ప్లాటూన్‌తో ఏ.పి.టి దగ్గర పడడంతో చాంద్‌పాషాతో ప్రయాణ మయ్యాడు. చాంద్‌పాషా విషయంలో రాజేందర్ ఇచ్చిన సూచనలను ఖచ్చితంగా అమలు జరుపుతుండేవాడు. రాజేందర్ అనుమానించి నట్టు అతనే శత్రువుకు సమాచారం చేరవేసి ఉంటాడు. చాంద్‌పాషా శత్రువు ఏజంట్‌గా మారడం కిషన్‌కు తెలియదు. శత్రువు అనుసరిస్తున్న "తక్కువ తీవ్రత గల యుద్ధ వ్యూహం" ఎత్తుగడల మూలంగా శత్రువును అంతర్గత భూభాగంలోకి రప్పించి దెబ్బతీయాలనే పార్టీ ఆదేశాలతో పట్టణాల నుండి శక్తులన్నీ రిట్రీట్ అయ్యాయి. పట్టణాలలో ఉండే విప్లవ సానుభూతిపరులు ఎవరు ఎట్లా మారినారో చెప్పడం కష్టమైపోయింది. నిఘా వ్యవస్థలేదు. ఫలితంగా విశ్వాసాలపై ఆధారపడాల్సి వచ్చింది. దీని ఫలితం ఎట్లా ఉంటుందో అనుభవంలోకి వచ్చింది. ఆరోజు శత్రువు నన్ను ఏమైనా చేయవచ్చు. చాంద్‌పాషాను, వాడి మిత్రులను ప్రజా యుద్ధం వదిలిపెట్టదు. తప్పక ఎదో ఒకరోజు నా అరెస్టుకు కారణం అయిన ద్రోహిపై పార్టీ తప్పకప్రతీకారం తీసుకుంటుంది. అప్పుడు వాడి చావు కోడి ఈకతో సమానం, నా మరణం హిమలయాల కంటే ఉన్నతం అవుతుంది.

ద్రోహి చాంద్‌పాషాపై, వాణ్ని లోబరుచుకున్న శత్రువులపై కోపం దహించివేస్తోంది. ఇంక ఆలోచించడం సాధ్యం కావడంలేదు. ఆ గదిలో నేలపై ఉన్న సిగరెట్, అగ్గిపెట్టే పిలుస్తున్నాయి. పొగతాగడం అనే అలవాటే ఇక్కడిదాకా వచ్చింది. కోసంతో వాటిని విసిరి పారేశాడు. కళ్ల ముందు రూప ప్రత్యక్షమైంది.

4

మధ్యాహ్నం కావస్తోంది. నిర్మానుష్యంగా ఉన్న స్టేషన్లో కొంత సందడి మొదలైంది. రక్షణకు ఉన్న సెంట్రీలు అలర్ట్ అయినారు. లాకప్‌కు ఎదురుగా ఉన్న ఆఫీసర్ల గదిలో అలజడి మొదలైంది. ఆ తర్వాత తలుపులు మూసుకున్నాయి. అధికారులు లోపల సమవేశం అవుతున్నారు.

రాత్రి రఘును చిత్రహింసలకు గురి చేసి వెళ్లిపోయాక మళ్లీ ఇప్పుడు సమావేశమవుతున్నారు. స్టీఫెన్ టేబులె ముందు మరికొందరు కూర్చున్నారు. కొందరైతే ఆ కుర్చీలో పట్టనంతా లావుగా వుండడంతో, కుర్చీలలో కోసకు కూర్చున్నారు. కింది స్థాయి ఆఫీసర్లు ఆ టేబుల్ వద్ద నిలబడే ఉన్నారు.

ఎలుగుబంటి ముఖంగల అధికారి "స్టీఫెన్.. తొందరగా పూర్తి చేస్తే బాగుంటుంది" అంటు వాచీ వైపు చూస్తు.

అవును అన్నాడు డి.ఎస్పీ స్థాయి తోడేళ్ల అధికారి. అతను నిన్న రాత్రి ఈ గుంపులో లేకుండె. ఇప్పుడే వచ్చాడు. చూపులకు అతను భయంకరంగా క నిపిస్తాడు.

"ఏమన్నా చెప్పి సహకరిస్తే," ఒక ఎస్సై అన్నాడో లేదో మధ్యలో కలిపించుకొని "వాడు సహకరించినా పీల్చిపిప్పిచేయాలి. "ఎస్సై క్రిష్ణ అన్నాడు. ఇతను ఆదిలాబాద్‌లో ఎంతో మంది ప్రజల, విప్లవ కారుల రక్తం తాగి ప్రమోషన్ కోసం ఎదురు చూస్తున్నాడు. ఇప్పటికైనా ఆశ పండక పోదా అన్నట్టుగా అన్నాడు.

క్రిష్ణం ముఖం చూసి స్టీఫెన్ నవ్వాడు. స్టీఫెన్‌ను చూసి అన్ని తోడేళ్లు పళ్ళికిలించి నవ్వాయి. "వాడికి చాలా రహస్యాలు తెలుసు. వాటిని రాబట్టేలి. వాటి ఆధారంగా ఆపరేషన్స్ కొనసాగించాలి" మరొక ఎస్సై అన్నాడు.

"వాడు అన్ని విషయాలు చెప్తాడు అంటావా? వాడిది ఉక్కు గుండె" స్టీఫెన్ వ్యంగ్యంగా మూతి పెట్టి, పెదవి విరిచి మాట్లాడాడు.

"ఉక్కు గుండె నీరు కారిపోవాలే" డి.ఎస్పీ. భయంక రంగా అన్నాడు.

అందరు ఒక్కసారి మాట్లాడసాగారు. కొందరు కండ్లు మిటకరించి చూస్తున్నారు. కొందరేమో ఆపరేషన్ నిర్వహించడం లేటవుతుందని తొందరుపడుతున్నారు.

స్టీఫెన్ ఉన్నట్టుండి వికటహాట్టసంగా నవ్వుతూ "ఫర్వాలేదు అర్థం చేసుకున్నాను. మీ మానసిక స్థితి" అన్నాడు.

"..........."

టేబుల్ చుట్టు ఉన్న అధికారుల ముఖాలు చూస్తు స్టీఫెన్ "మాట్లాడండి" అన్నాడు.

"ఏదో ఒకటి మీరే తేల్చండి" ఎస్సై క్రిష్ణ అన్నాడు. రఘును పట్టుకోవడానికి ఆపరేషన్ నిర్వహించింది వీడే కాబట్టి అలాగే స్టీఫెన్‌తో ఎక్కువ చనువు కూడ వుంది.

"ఓ.కే అర్థమయ్యింది. పై నుండి క్లీయర్. ఆపరేషన్ సక్సెస్ అయ్యినందుకు క్రిష్ణకు అభినందనలు" అన్నాడు స్టీఫెన్.

అధికారులు అభినందన పూర్వకంగా చూస్తు "మన డిపార్ట్‌మెంట్‌కు మంచి పేరు తెచ్చావ్" అంటు క్రిష్ణను అభినందనగా చూశారు. క్రిష్ణ ఉబ్బితబ్బిబ్బు అయ్యాడు. అవార్డు - రివార్డో ఇప్పుడే ఇచ్చినంతగా సంతోష పడుతున్నాడు. క్రిష్ణముఖంలో కొంత మార్పు వచ్చింది. ఎవరిని ఎట్లా దారికి తెచ్చుకోల్నో అతడికి బాగా తెలుసు. స్టీఫెన్ మాట్లాడుతూ "ఆ ప్రాంతానికి, చుట్టుపక్క గూడాలలోకి అడవుల్లోకి గ్రేహౌండ్స్ బ్యాచీలను పంపించి కూంబింగ్ నిర్వహించాలి. రేపు తెల్లావారు జామున జరుగుతుంది". అన్నీ క్రిష్ణ పాషాలు చూసుకోవాలి. అక్కడికి మేము నైటె వస్తాం. మిగతా వాళ్లు బ్యాచీల వెంట వెళ్లి కూంబింగ్ చేయాలి. జాగ్రత్తగా వుండాలి. ఎందుకంటే ప్లాటూన్‌తో కదా మనకు ఎన్‌కౌంటర్ జరిగేది" అంటు నవ్వసాగాడు. పడి పడి నవ్వసాగాడు.

నవ్వుల్లో మునిగిపోయిన రూం సద్దుమణిగింది.

బైటికి వచ్చి వరండాలోని తోడేళ్ళ గుంపును దగ్గరును పిలుచుకొని లాకప్ తాళం తీయించి గెరిల్లా యోధుడు రఘును ఆఫీసర్ల గదిలోకి తీసుకపోయారు. తోడేళ్ల అధికారులు ఎవ్వరి కుర్చీలలో వాళ్లు కూర్చున్నారు. గది తలుపులు వేశారు. కొన్ని తోడేళ్లు గదిలోని ఒకయమూలకు నిలబడ్డాయి. అవి కోరలు చాచి ఉన్నాయి. వాటి కళ్ళు ఎర్రగా ఉన్నాయి. వాళ్ల బాసుల ముందు చేతులు కట్టుకుని నిల్చున్నాయి. ఆ తోడేళ్ళను ఆదేశిస్తే అతనిపై విరుచుకుపడి కండ కండ పీక్కు తినడానికి నాలుకలతో పెదవులను నాక్కుంటూ కోర కోర చూపులతో ఆ యోధున్ని చూస్తు నిలబడి ఉన్నాయి.

రఘు గదిలోకి ప్రవేశించగానే బ్రాందీ కంపు ముక్కు

పూటాలాలను ఎగురగొట్టేస్తుంది. తీక్షణంగా అందరిని పరిశీలించాడు. రాత్రి చిత్రహింసలు పెట్టిన మూకలే కన్పించాయి. ఒక్కడు మాత్రమే కొత్తగా కనిపించాడు. ఆ తోడేళ్ల కోర కోర చూపులు ఆ యోధుడ్ని ఏ మాత్రం భయపెట్టలేకపోయాయి. చేతులు హైండ్ కప్‌ల వైపు చూసుకున్నాడు. ఇప్పుడు రఘు మనస్సుకు ఇప్పుడు విచిత్రమైన ఉల్లాసంగా ఉంది. రాత్రి నుంచే దీన్ని సాధన చేస్తున్నాడు.

యోధుడి షర్టు గుండీ పోయి ఛాతీ కనిపిస్తోంది. సీలింగ్ ఫ్యాన్ తిరుగుతుండడంతో జుట్టు చిందర వందరగా గాలికి ఎగురుతోంది.

"నమస్తే రఘన్న రాత్రి లేను" వ్యంగ్యంగా అంటూ డి.ఎస్పీ లేచి రఘు వద్దకు వచ్చాడు. రఘు అతని ముఖంలోకి చూస్తూ అలాగే నిలబడిపోయాడు. వాడి ముఖం వికృతంగా వుంది. కళ్లు బయటికి పొడుచుకు వచ్చి చిన్న బల్బుల్లా ఎర్రగా వున్నాయి. ఒళ్లంతా కొవ్వుతో నిండి వుండి లావుగా వున్నాడు. చింతమొద్దులగా నల్లగా ఉన్నాడు. ముఖమంతా ఉబ్బి చూస్తే భయం కొల్పేలాగా ఉన్నాడు. టేబుల్ చుట్టు ఉన్న అధికారులను, ఈ డి.ఎస్పీని చూస్తూ ఆ యోధుడు పేలవంగా నవ్వాడు. ఆ తీరుకు అధికారులకు ముడ్డి కింద మంట పెట్టినట్టుగా వుంది. కోపంతో కొరకొరగా చూశారు.

"రాత్రాంతా ఏమి ఆలోచించావు మిస్టర్ రఘు?" స్టీఫెన్ లోతుగా రఘు ముఖంలోకి చూస్తూ అడిగాడు.

నిర్లక్ష్యంగా నవ్వాడు రఘు.

"ఏం మాట్లాడు" సర్కిల్ షాషా

"మాట్లాడాల్సింది ఏమి లేదు"

"పుచ్చిపోయిన మార్క్సిజాన్ని పట్టుకొని ఏమి విప్లవం తెస్తార్రోయ్" స్టీఫెన్ వెటకారంగా వెక్కిరిస్తూ అన్నాడు.

"మార్క్సిజం అనేది అజేయమైన సిద్ధాంతం. దానికి మరణం లేదు. అది పుచ్చిపోదు ఒకయిస్సైన్స్. విప్లవం అనివార్యం" అంతదాకా మౌనంగా ఉన్న రఘును ఈ మాట రెచ్చగొట్టింది.

"విప్లవం.. విప్లవం అనివార్యం?" డి.ఎస్పీ. అన్నాడు.

"గు కారంపొడి పోసి దంచుతే విప్లవం వస్తది విప్లవం" సర్కిల్ షాషా కోపంగా చేతిలో కర్రను ఊపుకుంటూ అన్నాడు.

"విప్లవం రాదు గిప్లవం రాదు ఎవడ్రా నీకు చెప్పింది" స్టీఫెన్ రఘును రెచ్చగొతున్నట్టుగా అన్నాడు.

రెండు చేతులకు ఉన్న సంకెళ్లను గట్టిగా పట్టుకుంటూ "దోపిడి వర్గాలున్నంత కాలం, మానవుల్లో రక్తం ఉన్నంతకాలం, తూర్పున సూర్యుడు ఉదయించినంత కాలం వరకు విప్లవం అజేయం. దాన్ని ఆవడం ఎవడి అబ్బ తరం కాదు'' మరింత ధృడంగా సమాధానమిచ్చాడు.

"ఈ లంజ కొడుకులంతా విప్లవానికి పుట్టినట్లయింది" ఎస్పై క్రిష్ణ కోపంతో ఊగిపోతూ, మళ్లీ తానే "భూమి మీద లేకుంటే చేస్తే అప్పుడు విప్లవం గడ్డై మొలస్తది"

"మానవ చరిత్ర తెలిసిన వాళ్లకు విప్లవాల సంగతి తెలుస్తుంది. చదువని బద్మాష్‌లకు తెలియదు. బానిస తిరుగుబాటు నాయకుడు స్పార్టకస్‌ను చంపితే తిరుగుబాట్లు ఆగినాయా? అని ఉధృతంగా పైకి లేచాయి. బానిస సమాజాన్నే తుడిచిపారేశాయి . మీరు ఎంత మందిని చంపినా, మహోన్నతమైన మానవులు బలిదానాలు చేస్తూ పోరాడుతూనే ఉంటారు. మీరు చంపిన ప్రతి వీరుడు చరిత్ర చెక్కిలిని ముద్దాడుతునే ఉంటారు."

"ఏమిట్రా లంజ కొడుకా. ఎమన్నావ్" సబ్‌ఇన్‌స్పెక్టర్ రెడ్డి కోపంతో రెచ్చిపోయాడు. అతని నల్లని శరీర ఛాయలకు తోడు, స్థూలకాయం గోగిపళ్లు ఈ కోపంతో మరీ వికృతంగా కనబడ్డాడు.

రెడ్డి కుర్చీలో నుండి లేచి రఘు ముందుకు వచ్చి "చెప్పు లంజకొడుకా.. దళాల్ని పట్టిస్తావా లేదా?" అని ప్రశ్నించాడు.

రఘు చూపులతో ఎస్పైకి కోపం నశలానికి ఎక్కింది. రఘును పెటిల్లున చెంపపొంటి పెట్టాడు. ఒడుపుగా ఆ దెబ్బను తప్పించు కోవడానికి కొంచెం కిందికి వంగాడు రఘు. ఎస్పై బ్యాలన్స్ తప్పిపోయి గోడకు గుద్దుకొని కిందపడ్డాడు.

ఆ అవమానంతో ఉగ్రుడైన ఎస్పై రెడ్డి రఘు తల వెంట్రుకలు ఎడమ చేతితో పట్టుకొని, కుడిచేతితో పెడిల్ పెడిల్ మని ముఖం మీద బాదాడు. ఆ దెబ్బలకు రఘు ముక్కు చితికి నెత్తురు కారింది. షర్టు తడిసిపోయింది.

"రెడ్డి ఆగు" స్టీఫెన్ అధికారపూర్వకంగా ఆదేశించాడు. దాంతో రెడ్డి ఆగిపోయాడు. తోడేళ్ల గుంపు ఓర చూపులతో కోరలు చాచి ఉన్నాయి. వాటి జూలు నిక్కపొడుచుకుని, తోకను మెలిసేస్తూ ఆ యోధుని మీద పడడానికి సిద్ధంగా ఉన్నాయి.

రఘు ముఖమంతా రక్తంతో ఎర్ర బారింది. కోపంతో ముఖమంతా ఎర్రబడ్డది. నెత్తుటి గావు పట్టిన వాడిలా అతని ముఖం ఉంది. భయం, బెదురు లేకుండా ఆ తోడేళ్ల గుంపును, వాటి అధికారులను చూశాడు.

"మీ అంత ధైర్యవంతులు ఈ ప్రపంచంలోనే లేరు. నిరాయుధుడి మీద 20 మందిపైన పడి, చేతులు కట్టేసి కొట్టడం కూడ గొప్పేనా? దమ్ముంటే ఈ బేడులు తీసి రండిరా నా తఢాఖ చూపిస్తా" అని అన్నాడతాను నిర్లక్ష్యంగా. కండరాలు తేలిన దేహం ఉబ్బికి, ఉద్వేగం విద్యుత్‌లా నర నరాలలో వెలిగి ముఖంలోకి వచ్చింది.

ఆ గుంపు పిరికిగా నవ్వుకుంది. యోధుని కండ్లల్లో మెరుస్తున్న విప్లవ జ్వాలల్ని చూచి గుండెలు బిగుసుకుపోయాయి. స్టీఫెన్ గొంతు పెంచి "ఏంరా చెప్పు, అనవసరంగా ఎందుకు చస్తావ్" అన్నాడు.

"చావు ఎప్పుడూ మాకు వెంట్రుక వాసి దూరంలో ఉంటుంది. దానికెప్పుడు మేం భయపడం. చావుకు భయపడేది మీరు. థూ యవ్వ" అంటు కోపంతో కాండ్రించి స్టీఫెన్ ముఖంపై ఉమ్మివేసాడు. నెత్తురు తెమడ కలగలిసి ఉన్న ఆ ఉమ్మి కుర్చీలో కూర్చున్న స్టీఫెన్‌పై పడింది.

అంతే పిడుగు పడ్డట్టు గట్టిగా అరిచాడు స్టీఫెన్. "చూస్తరేం.. లంజ కొడుకును.."

సర్కిలె షాషా తోడేళ్ల మూకను రఘు పైకి ఉసిగొల్పాడు.

అంతే.. రఘు కండలు ఉబ్బిపోయాయి. బూటుకాళ్ల కింద అతని శరీరం అణువణువు నలిగిపోయింది. రఘు డొక్కల్లో మోకాళ్లు పెట్టుకొని గుండ్రంగా చుట్టచుట్టుకు పోయాడు. గచ్చునేలంతా రక్తంతో తడిసిపోయింది. అతను నేలపై పడి విల విల

తన్నుకుంటున్నాడు. కళ్లు తెలిపోతున్నాయి. గోళ్లల్లో సూదులు గుచ్చుతున్నారు. అంతటితో ఆగక ఆతని ఒంటి మీద అక్కడక్కడా పెట్రోల్ చుక్కలు వేసి, అగ్గిపుల్ల గీసి మంటలు పెడుతున్నారు. ఒక్కొక్క అవయం ఉడికి మాడి, బొగ్గులాగా అయిపోతోంది. రఘు ప్రాణాలు లోపలెక్కడో కొట్టుకుంటున్నాయి. అతని ధైర్యాన్ని, లొంగని గుణాన్ని చూచి అసహనానికి, ఆవేశానికి గురైన పోలీసులు ఇంత చేసినా సంతృప్తి పడలేదు.

"ఆగండి ఆగండి" స్టీఫెన్ నిలువరించాడు. "వాడు ఇక్కడే చస్తే హక్కుల సంఘాలతో లొల్లి. కొస ప్రాణం ఉండనీయండి . మిగతాది అక్కడ" అన్నాడు.

5

సాయంత్రం చీకట్లు ముసురుతుండగా లాకప్ గదిలో రఘుకు స్పృహ వచ్చింది. చిత్రహింసల మూలంగా, గత రాత్రి కంటే ఎక్కువ నొప్పులు.. బాధ. గచ్చునేలపై పడి శరీరం భారంగా పడి ఉన్నాడు. దాహంతో గొంతు ఎండుకపోతోంది. లేచి కూర్చోవాలని అనుకున్నాడు. కాని లెవ్వలేక పోతున్నాడు. బలవంతంగా, కష్టంమీద గది గోడకు ఒరిగి కూర్చున్నాడు. పెదవులు నాకి చూసుకున్నాడు. పగిలిపోవడం వల్ల భగ్గుమన్నాయి.

తల తిరుగుతున్నట్లుంది. స్థిరంగా కూర్చోలేక పోయాడు. ఊపిరి గట్టిగా పీల్చలేక పోతున్నాడు. నోరంతా చేదుగా ఉంది. ఆ గదిలో మెల్లగా గచ్చుపై పాకుతూ మూలకున్న నీటి లోటను అందుకుఆన్నడు. పెట్రోల్‌తో మంట పెట్టిన చోట విపరీతమైన నొప్పిగా ఉంది. ఒళ్లంతా నొప్పులు.

శత్రువు పిరికి కండ్ల నిండా నవ్వుకున్న రోజది..

రెబ్బమల్లే అడవుల్లో మిలటరీ క్యాంపు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు జరిగియి. రేపు క్యాంపు మొదలవుతుందనగా ఉదయం పూట 20 మంది గెరిల్లాలు, ఆ అడవిలో గ్రామం పక్కన డంప్ చేసిన తిండి సామాన్లు తీసుకొని తిరిగి క్యాంపుకు వస్తున్నారు. దారిలో ఒక పెద్ద గుట్ట ఎక్కుతున్నారు ఆ గుట్టపైన ఆ దారి వెంట మార్గంలో శత్రువు అంబుష్ ఏర్పాటు చేసాడు. అది గమనించని గెరిల్లాలు ఆయాసంతో, ఎగపోస్తూ గుట్టపైకి ఎక్కుతున్నారు. శత్రువు ఒకేసారి భారి కాల్పులతో గెరిల్లాలపై విరుచుకపడ్డాడు. ఆ టెర్రయిన్ ఏలాంటిదంటే నిలదొక్కుకొని శత్రువుపై కాల్పులు జరుపడానికి చేసిన ప్రతిప్రయత్నం విఫలమవుతోంది. గుట్ట ఏటవాలుగా ఉండడంతో కిందికి జారిపోతున్నారు. శత్రువు తూటాలు తలలపై నుండి దూసుకపోతున్నాయ్.

అయినా గెరిల్లాలంతా వీలైన మేరకు శత్రువును ఎదుర్కొంటూ తప్పించుకుంటున్నారు. ఆ పోరులో జననాట్యమండలి కళాకారుడు కామ్రేడ్ దివాకర్ అమరుడైనాడు. మరొక మహిళా కామ్రేడ్ తన తుపాకి పోగొట్టుకుని రిట్రీట్ అయ్యింది.

తుపాకుల కాల్పులు మిలటరీ క్యాంపుకు వినబడ్డాయ్. పరిస్థితి అర్థంచేసుకున్న బాధ్యుడు కిరణ్ - క్యాంపులోని తిండి సామాన్లతో అర్థగంటలో సురక్షిత ప్రాంతానికి వెళ్లాలని మిగితా వారిని ఆదేశించాడు. ఆ క్యాంపు స్థలాన్ని కేమోప్లేజ్ చేయించారు. ఆ తర్వాత ఆర్డర్ గ్రూపు సమావేశం వేయించాడు. అందులో నిర్ణయం జరిగింది - శత్రువుపై అంబుష్ చేయాలని అందరం ఆమోదించారు. ప్లాన్ రూపొందించుకొని ఆంబుష్‌కి ఎంగేజ్ అయ్యారు. ఎక్కడోకాదు, రిట్రీట్ అయిన మిలటరీ క్యాంపులోనే.

శత్రువుపై ఆంబుష్ చేయాలని అన్ని ఏర్పాట్లూ చేసుకుని, ఎదురుచూస్తున్న క్రమంలో శత్రువు ఆంబుష్ నుండి తప్పించుకున్న గెరిల్లా సహచరులు ఒక్కొక్కరు క్యాంపుకు వస్తున్నారు. అలా వచ్చిన సహచర గెరిల్లాలను ఆలింగనం చేసుకుని సురక్షిత ప్రాంతానికి పంపించారు.

కామ్రేడ్స్ శత్రువును దెబ్బకు దెబ్బ తీస్తూ తప్పించుకొని రావడంతో ఎక్కడలేని సంతోషాన్ని కలిగింది. మరో వైపు దివాకర్‌ను కోల్పోయిన విషాదం చుట్టుముట్టింది. కామ్రేడ్ దివాకర్‌ను కోల్పోవడం అంటే ఎన్నటికీ నింపుకోలేని ఖాళీలోకి జారిపోవడమే. నవ్వుతూ, తుళ్లుతూ గెరిల్లా సహచరులను ఉత్సాహపర్చేందుకు, ఉల్లాస పర్చేందుకు విప్లవ గీతాలు అలపించి, విప్లవానికి పురికొల్పే కళాకారుడు, నాయకుడు దివాకర్ అమరత్వం గెరిల్లాలలో కసిని పెంచింది. క్యాంపులో ఆంబుష్ ఏర్పాటు చేసి, శత్రువు రాక కోసం ఎదురు చూస్తున్నారు. అది సెప్టెంబర్ మాసం, కాబట్టి, అడవంతా పచ్చగా ఉంది. వాగులు, వంకలు ఉప్పొంగుతూ ప్రవహిస్తున్నాయ్.

ఉదయం పదకొండు గంటల సమయంలో ఆంబుష్ సైట్‌కు ఎదురుగా, ఆరేడు వందల దూరంలో అడవిలో గొర్లను మేపుకుంటు కాపర్లు వస్తున్నారు. అవి ఆంబుష్ సైట్ నుండి గెరిల్లాలకు స్పష్టంగానే కనిపిస్తున్నాయి. ఈ మొత్తంలో రఘు ఉన్నాడు. కీలక మైన పాత్ర పోషించాడు. ఆంబుష్ పార్టీ కమాండర్ అతనే. శత్రువు ఆంబుష్ పార్టీపై దాడి చేస్తున్న క్రమంలో, ఫ్లాంక్ అటాక్ చేయటానికి, కిరణ్ నాయకత్వంలో కొంత మంది కామ్రేడ్స్ వీళ్లకు కుడి వైపు వంద గజాల దూరంలో ఆంబుష్ కూర్చున్నారు.

ఆంబుష్ సైట్ ముందు గొర్ల కాపరి కనిపించడంతో, అతనితో మాట్లాడుదామని రఘు ఆయుధాన్ని పట్టుకొని కవర్ నుండి వెళ్లి మాట్లాడబోయాడు. రఘుతో గొర్ల కాపరి "పోలీసోల్లు ఇటే వస్తున్నారు - ఇక్కడి నుండి పో" అన్నాడు. నేనే ఏదో మాట్లాడబోతుంటే అతను రఘును వారించి మళ్లీ మళ్లీ చెప్పాడు.

ఆ గొర్ల కాపరి సూచనను పాటిస్తూ "ఇక్కడి నుండి నీవు గొర్లను తోలుకొని వెళ్‌పో అన్నాడు రఘు. పరిస్థితిని అర్థం చేసుకున్నట్టుగా అతను వేగంగా గొర్లను అదిలిస్తూ ఆ ప్రాంతం నుండి వెళ్లిపోయాడు. రఘు నిలబడి ఉన్న ఎడమ చేతి వైపుకు తిరిగి చూస్తే ఏవో అస్పష్టమైన మాటలు వినిపిస్తున్నాయ్. అవి అంతకంతకు దగ్గర అవుతున్నాయ్. రెండు ఆకారాలు కలిపించాయి. వాళ్లు వేసుకున్న డ్రెస్సు అర్థమయ్యింది. శత్రువు వస్తున్నాడని అర్థమయ్యింది. వాడిని మరింతగా ఉచ్చుల్లో ఇరికించడానికి, వాడికి కనిపించేలా రఘు తన చేతిలో ఉన్న ఆయుధాన్ని కొంచెం పైకి పట్టాడు. ఎర ఫలించింది.

వేగంగా పరిగెత్తి ఆంబుష్‌లో ఉన్న గెరిల్లాను అలర్ట్ చేసాను. పోలీసులు రఘు వెంట పరుగెట్టుకుంటూ వచ్చారు. కానీ రఘు ఎటుపోయిందీ వారికి అర్థంకాలేదు. మొదట రఘు నిలబడిన చోటు

వద్ద ఆగి అటు ఇటు చూస్తున్నారు. ఆంబుష్ సైట్ నుండి రఘుకు ఇదంతా స్పష్టంగానే కనిపిస్తోంది. వాళ్లు ముప్పై మంది దాకా ఉండొచ్చు. వాళ్లంతా చీట డ్రెస్సు వేసుకొని, వీపున కిట్టుబ్యాగులతో, ఆయుధాలతో ఉన్నారు. గుంపుగా నిలబడి అటూ ఇటూ చూస్తున్నారు.

కాల్పులు జరుపుతే తాకేంత దూరంలోనే ఉన్నారు వాళ్లు. కానీ గెరిల్లాల లక్ష్యం అది కాదు. అంబుష్‌లో ఇరికించి రెండు వైపులా శత్రువుపై దాడి చేయాలనే.. అడ కత్తెరలో పోకయిచెక్కలా ఇరికించి దెబ్బ తీయాలనేదే గెరిల్లాల పతకం. శత్రువు సరిగ్గానే ముందుకు వస్తున్నాడు. పతకం అమలు జరుగాలంటే మళ్లీ శత్రువుకు ఎర వేయాల్సిందే. రఘు బాధ్యుని వైపు చూశాడు. అతడు కొన్ని మిలటరీ సంజ్ఞలు ఇచ్చాడు. వాటిని అర్థం చేసుకుని రఘు ఆంబుష్ సెట్ గెరిల్లాలకు సిగ్నలె ఇచ్చాడు - వాళ్ల కవర్ల వెనుకయనతికారు. శత్రువును గమనిస్తూ ఒక చిన్న విజిలె వేసాడు. అటు ఇటు చూసి గ్రేహౌండ్స్ భుజాలపై తుపాకులు పెట్టుకొని విజిలె శబ్దం వచ్చిన వైపు అడుగులు ముందుకు వేసారు. గుంపుగా వస్తున్నారు. వేగంగా గుంపుగా వస్తున్నారు. గుంపు వేగంగా ఆంబుష్ సైట్ వైపు వస్తున్నది.

ఆంబుష్‌లో గ్రేహౌండ్స్ మూక చిక్కుకుంది. మైన్స్ పేల్చడం, తుపాకులతో కాల్చడం ఒకేసారి జరగడంతో మిన్నంటిన ఆర్తనాదాలు. గ్రేహౌండ్స్ మూకయికాల్పులు ప్రారంభించి వేగంగా గెరిల్లా వైపు అటాక్ చేయడానికి కుడి వైపు అడ్వాన్స్ అయ్యారు. కాల్పులు చేస్తునే అడ్వాన్స్ అవుతున్నారు. కిరణ్ నాయకత్వంలోని ఫ్లాంక్ అటాక్ టీం - అడ్వాన్స్ అవుతున్న శత్రువుతో రఘు టీంకు జరుగుతున్న హెూరా హెూరి కాల్పులను గార్డు రక్షణలో ఉండి అంతా గమనిస్తూనే ఉన్నాడు.

"శత్రువు కాల్పులకు భయపడకండి కాల్చండి కాల్చండి" అని కాషన్స్ ఇస్తూ గెరిల్లాల్ని ప్రోత్సాహిస్తూనే ఉన్నాడు కిరణ్. "శత్రువును మరింత దగ్గరకు రానివ్వండి" అంటూ రన్నర్, ద్వారా, కాల్పుల మధ్యనే సమాచారం పంపించాడు. అప్పటికీ ఫ్లాంక్ అటాక్ టీం కాల్పులతో తన దాడిని ప్రారంభించనే లేదు. శత్రువు వేగంగా కాల్పులు జరుపుతూ - అరుస్తునే ఉన్నాడు. ప్రతిగా గెరిల్లాలు శత్రువుపై కాల్పులు జరుపుతునే ఉన్నారు. శత్రువు అడ్వాన్స్ అవుతునే ఉన్నాడు. గెరిల్లాలపైకి గెరిల్లాల ఫ్లాంక్ టీం నిర్ణయించుకున్న స్థలంలోకి రాగానే - శత్రువుపై గెరిల్లాలు ఒకేసారిగా రాపిడ్‌గా కాల్పులు ప్రారంభించారు. ఆ కాల్పులతో శత్రువు సర్‌ప్రైజెకు లోనయ్, దెబ్బలు తగిలి అరుస్తున్నారు. మిగతా వాళ్లు పారిపోతున్నారు. శత్రువు కమాండర్లు అరుస్తూ, తిడుతూ కూడదీసుకొని గెరిల్లాలపైకి ఉసిగొల్పుతున్నారు. పిరికిగా కమాండర్ కాషన్స్ వినకుండా పారిపోతున్నారు వాళ్లుప్రాణం మీది తీపితో

"రిట్రీటె రిట్రీటె" అంటు కిరణ్ గెరిల్లాలందరికి కాషన్ ఇచ్చాడు. అప్పుడు క్షేమంగా కాల్పులు చేస్తునే రిట్రీటె అయ్యారు.

జిల్లాలో కొటగాం, కొర్లొంక గ్రామాలు ఎన్నేన్నో. భూమయ్య, కిష్టగౌడ్‌ల అండతో ఫారెస్టు అధికారులను తరిమి కొట్టి ఆదివాసులు గ్రామాలను నిర్మించుకున్నారు. ఇప్పటికీ ఆ గ్రామాలు బుక్కెడు బువ్వ పెట్టిన ఇంత భూమి కల్పించి నీడ కల్పించి బతుకు బాట చూపించిన భూమయ్య కిష్టగౌడ్‌ల ఆదివాసుల స్మృతి పదాల్లో గుండెల్లో ఇప్పటికీ భద్రంగానే ఉన్నారు.

నక్సల్బరీ పోరాటం తర్వాత ఆదిలాబాద్‌లో పోరాట జ్వాలల్ని రగిలించడానికి (1967) మంగి అడవుల్లో ఆదివాసులచే ఆయుధాలు పట్టించడానికి కొల్లిపర రామనర్సింరావు, విప్లవ విద్యార్థులు చందు, రవీంద్ర రైతాంగ యోధులు భూమయ్య, కిష్టగౌడ్‌లు ఉద్యమానికి దారులు వేశారు. విప్లవకారులు తపాలాపూర్ గ్రామానికి వెళ్తే కుట్రతో, మోసంతో ఆ ఊరి భూస్వాములు పోలీసోల్లకు పట్టించారు. భూమయ్య, కిష్టగౌడ్‌ల ఊరి శిక్ష పడింది. ఎమర్జెన్సీ చీకటి రోజుల్లో ఇందిరమ్మ సర్కార్ వారిని ఉరి తీసింది.

రఘుకు జ్ఞాపకాలో, పలవరింతనో తెలియని విధంగా తన అంతచ్చేతనలో దాగి ఉన్న అనుభవాలు, వివరాలు, విన్నవీ, చదివినవీ. అతని రక్తమాంసాల్లో క లగలనిపోయినవన్నీ గాలి కెరటాల వలె స్పృశించి పోతున్నాయి. శరీరం స్వాధీనం లేక పోయినా అతని మేత పదిలంగా ఉంది. ఒక్కోసారిగా గతంలోని అత్యద్భుత విజయాలు, రోమాంచిత ఘటనలు ఈ స్థితిలో గొప్ప ఉత్తేజాన్ని ఇస్తున్నాయి. మృత్యువు ఆవరించి ఉన్నదనే ఎరుక తోపాటు అతనికి తన తోటి కామ్రేడ్లు ఒక్కొక్కరే తలపుకొస్తున్నారు. ఆ స్థితిలో ఎప్పటి నుంచి ఉన్నాడో.

చిమ్మచీకట్లు అలుముకున్నాయ్. స్టేషన్ గదిలో ఒక్కసారి బూట్లు చప్పుళ్లు. ఆ చప్పుళ్లు స్టేషన్ గది ముందుకు వచ్చి ఆగిపోయాయి. లాకప్ గది తాళం తీస్తున్నప్పుడు రఘు పూర్తిగా మేల్కొన్నాడు. అప్పటి దాకా అతని మనో జగత్తులో అతనికి గొప్ప ఆలంబనగా ఉన్నవన్నీ చెదిరిపోయాయి. దర్వాజ ఇప్పుడు అత్యంత వాస్తవికంగా కనిపిస్తోంది.

రఘు ముందు తోడేళ్ల గుంపు ప్రత్యక్షం అయింది. నిన్నటి నుంచి ఊహిస్తున్నదేగాక ఎదురు చూస్తున్న సన్నివేశం లాంటిది ఇది. జీవితం ఎంత విషాద భరితమైనది? రెండు రోజులుగా ఈ మృత్యు ఆగమనం కోసం నిరీక్షిస్తున్నట్టుంది? జీవితాన్ని తెగించి సొంతం చేసుకొని ప్రజలకు సేవ చేయాలనుకొనే గెరిల్లా శత్రు శిబిరంలో చేయగలిగింది మృత్యువును స్వాగతించడమే. రఘు రెండు రోజులుగా తనను తాను సిద్ధం చేసుకుంటున్నాడు. గదిలో నేలపై లేచి కూర్చోవడానికి ప్రయత్నించాడు. శరీరంలోని సమస్త అవయవాలు స్పర్శను కోల్పోయాయి. అవి అతనికి సహకరించడం లేదు.

"అరే లేరా"

"......" రఘు తల ఎత్తి చూశాడేగాని ఏమీ మాట్లాడలేక పోయాడు.

"చలో.. ఎత్తండి" అధికారి అదేశించాడు. ఇద్దరు అతని కళ్ల గంతలు కట్టారు, నోరు బిగదీసికట్టారు. మూటలాగా ఎత్తుకెళ్లి వ్యాన్‌లో పడవేసారు. అప్పడికే వ్యాన్‌లో ఉన్న పోలీసులు రఘును మెసల కుండా కాళ్లతో తొక్కిపట్టారు. వ్యాను ముందుకు కదిలాయి. రోద చేస్తూ మెయిన్ రోడ్డు ఎక్కాయి. వ్యాన్ వెళ్తున్న మలుపులు, పక్కన అప్పుడు వాహనాల చప్పుళ్లు.. రఘు ఊహిస్తున్నాడు.

ఎన్నో సార్లు ఈ బెల్లంపల్లి పట్టణంలో విప్లవోద్యమం అవసరాల కోసం శత్రువును దెబ్బతీయడానికి ఎత్తులు వేస్తూ కార్మికవర్గంతో భుజం భుజం కలిపి తిరిగాడు. సింగరేణి కార్మికవర్గాన్ని అణచడానికి

గనులపై సి.ఐ.ఎస్.ఎఫ్ సాయుధ క్యాంపులు పెట్టింది ప్రభుత్వం. ఆ దళాలను కార్మికుల సాయంతో రఘు నాయకత్వంలోని నగర గెరిల్లాలు ప్రతిదాడులు చేసి విజయం సాధించేవారు.

కన్నాల బస్తీ దగ్గర రైల్వే గేటె పడింది. ఎక్కడో అల్లంత దూరాన ట్రైన్ శబ్దం వినవచ్చింది. ఎక్కడ? అని రఘు ఆలోచించాడు. ఆ ప్రాంతాలన్నీ తిరిగినవే. తానే కాదు, విప్లవ నాయకుడు గజ్జెల గంగారంలాంటి వాళ్ల అడుగుజాడలను చరిత్ర అక్కడ పదిలంగా దాచి ఉంచింది. వారు నిర్మించిన ఉద్యమం అడుగంటిపోదు. అది అగ్ని కణాల్లా, ప్రచండ నిప్పుల్లా రగిలి రగిలి దోపిడి శక్తులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. మృత్యువు అంచుల మీద నిలిచి ఉన్న రఘు తన కన్నా ముందు ఒరిగిపోయిన వాళ్లందరినీ, వాళ్లతో తన అనుబంధాన్నీ తలపుకు తెచ్చుకుంటున్నాడు. గూడెంలో తన కన్నా ముందు ఉద్యమంలో రాలిపోయిన గోండీను గుర్తు చేసుకుంటున్నాడు. కన్నవారిని, తోడబుట్టిన వారిని తలచుకున్నాడు. శరీరం ఏ చలనం లేని ఆ స్థితిలో కూడా కళ్లలో నీళ్లు ఊరాయి. కానీ దిగులు లేదు, చింత లేదు, పశ్చాత్తాపం లేదు, బంధాలు తెగిపోతున్నందుకు, ఉద్యమానికి దూరమవుతున్నందుకు, నడుస్తున్న చరిత్రలో నేరుగా చోటు పోతున్నందుకు దిగులుగా ఉంది. అంతే.

చప్పుడు చేస్తూ ట్రైన్ వెళ్లిపోయింది. గేట్లు తెరుచుకున్నాయ్. వాహనాలు కదిలాయి. సరిగ్గా రఘు పసిగట్టినట్టు బుగ్గ ధర్మారావు పేట అడవుల వైపు .

ఆకాశంలో వెన్నెల విరబూస్తోంది. పిండారబోసినట్లుగా ఉంది. ఆ వెలుగుల్లో ధర్మారావుపేట అడివి అంచున గ్రేహౌండ్స్ దళాల వ్యాన్లు నిలిచిపోయాయి. అక్కడంతా ఓ కృతకమైన, అబద్ధమైన చిన్ని పాటి యుద్ధ సన్నివేశం తయారుగా ఉంది.

2004 జనవరి 7 లోకి కాలం మెల్లగా జారుతోంది.

రఘు ఇప్పటి దాకా తను, అమరవీరులు నడయాడిన స్థలాన్నే తలబోసుకున్నాడు. ఇప్పుడు కాలాన్ని కొలుస్తున్నాడు. ఉద్యమంలోకి వచ్చి ఎన్నేండ్లయింది? ఫరవాలేదు..తను పుట్టిన గోండీ రుణం తీర్చుకోగలిగినంత కాలం జీవించినల్లే. ఈ దేశ కార్మిక వర్గం రుణం తీర్చుకోగలిగినన్ని రోజులు ఉద్యమంలో పని చేసినట్లే. ఇక ఈ రోజు నా జ్ఞాపకాల్లో చివరి రోజు. రఘును వాహనం నుండి దించి నిలబెట్టారు. చేతులకు, కళ్లకు కట్లు , అంతకన్నా శరీరం చలనం లేకుండా.. కదిలిస్తే తీవ్రమైన నొప్పులు.. ఇక ఏం నొప్పులు..!

"అంతా రెడీఅయిందా?" ఒక గ్రేహౌండ్స్ అధికారి.

"ఆం రెడీ సార్" మరో అధికారి సమాధానం చెప్పాడు.

ధర్మారావుపేట అడవుల్లో - ఆ దారి పక్కన అయిదారు రోజుల నుండి ఆ అడవి అంచున గెరిల్లా ప్లాటూన్ మకాం వేసినట్టుగా, గ్రేహౌండ్స్ పోలీసులు దాడి చేస్తే గెరిల్లా తప్పుకున్నట్లు .. బ్యాగ్‌లు, వంట పాత్రలు చెల్లాచెదరైనట్లు..

"చలో లేక్ అవ్" పై అధికారి ఆదేశాలు.

రఘును మధ్యలో నిలబెట్టారు. ఆకాశంలో వెన్నెల జరుగబోయే ఘతుకాన్ని చూస్తునే ఉంది.

"ప్లాటూన్ కమాండర్ రఘు ఏం ఆలోచిస్తున్నావు" అధికారి స్టీఫెన్ వ్యంగ్యంగా నవ్వుతూ, పిస్టల్ చేతిలో తిప్పుకుంటూ అడిగాడు. "ఇంకా ప్రజల గురించేనా"

"అవును"

అధికారులంతా నవ్వుతూ "ఇప్పుడు ఏ ప్రజలు వచ్చి కాపాడుతారు." ఎవడో అధికారి నవ్వుతూ అడిగాడు.

" నన్ను చంపేస్తారు.. నేను చనిపోతాను. యింకా చాలా మంది ఉన్నారు. ప్రజలు కోటాను కోట్లు. ఇప్పుడు నన్ను రక్షించడానికి రాక పోవచ్చు. కానీ మీకు గోరి కట్టడానికి కెరటాల్లా వస్తారు. అందుకే జనం గురించి ఆలోచిస్తున్నా. "

రఘు చివరి మాటలు పూర్తి కాక ముందే తుపాకి పేలింది. అది రఘు గుండెల్లో దూసుక పోయింది. రఘు గొంతులో ఆ మాట అర్ధాంతరంగా ఆగిపోయింది. మరేదే ముద్దగా.. సగం సగంగా బైటికి వచ్చింది. "ప్రజా యుద్ధం వర్ధిల్లాలి.." అని. ఆదే అతని చివరి మాట. ఆ మాట ప్రకృతితో కలసిపోయింది. అతని శరీరంలోని అగ్గి ప్రభాతోదయంలో సంలీనమైపోయింది.



మార్క్సిజం లెనినిజం మావోయిజం

స్టడీ నోట్స్

న్యూ విస్టాస్ పబ్లికేషన్స్

వెల : రు. 50/-

ప్రతులకు :

మైత్రి బుక్ హౌజ్ విజయవాడ,

దిశ పుస్తక కేంద్రం, హైదరాబాద్,

నవోదయ పబ్లిషింగ్ హౌస్, కాచిగూడ, హైదరాబాద్

సహచర బుక్‌మార్క్, హైదరాబాద్,

కథ

ఒక తల్లి

- పి. చంద్

"టికెట్... టికెట్" అని అరుచుకుంటు బస్సు కండెక్టర్ కిక్కిరిసిన ప్రయాణికులను ఒడుపుగా తోసుకుంటు వచ్చిండు.

"ఏమమ్మా టికెట్" అన్నాడు ఒక స్త్రీని ఉద్దేశించి. ఆమె ప్రక్కన నిండు బట్ట కప్పి ఉన్న బాలుడు సగం ఆమె తొడ మీద మరో సగం సీట్లో కూచున్న పిల్లవాన్ని చూసి కండక్టర్" అబ్బాయికి ఆఫ్ టికెట్ తీసుకోవాలి" అన్నాడు.

ఆమె తలాడించింది.

"ఎక్కడికి"

"పోట్యాల" ఆమె బదులిచ్చి యాభై రుపాయల నోటు కండెక్టరుకు ఇచ్చింది. ఆ నోటును అందుకున్న కండెక్టర్ ఒడుపుగా రెండు చేతి వెళ్ళ సందులో పెట్టుకొని, చకచక 'టికెట్ ఇచ్చి, మిగత పైసలు ఆమె చెతిలో పెట్టి ముందుకు కదిలాడు.

"పిల్లవాని మీద ఈగలు ముసురుతున్నయి బిడ్డా... కొంగుతో విసురు" అంది పక్కనే కూచున్న ఆడమనిషి.

ఆ మాటలకు ఆమె ఉలిక్కి పడి కొంగుతో పిల్లవాని మీద ముసిరన ఈగలను విసిరింది. పిల్లవాణ్ని మరింత దగ్గరగా పొదివి పట్టుకుంది.

"ఏమైంది బిడ్డా... పిల్లవానికి జ్వరమా" అంది ఇందాకటి పెద్ద మనిషి. ఆమెకు అరువై ఏండ్లు పైబడి ఉంది. ముడుతలు పడిన మొఖం. ముగ్గు బట్టులాంటి తల. కష్టం సుఖం తెలిసిన పల్లెటూరి మనిషిలా ఉంది.

అవునన్నట్టుగా ఆమె తలాడించింది. దుఃఖం పొంగుకొస్తుంటే ఆమె బలవంతంగా అదిమి పట్టుకొంది.

ఆ వృద్దురాలు అది కనిపెట్టినట్టుంది.

"పిల్లగాండ్లకు ఏమన్న అయితే అంతే బిడ్డా తల్లి ప్రాణం తల్లడిల్లుతుంది..." అంటూ నిట్టూర్చి హాస్పిటల్‌కు తీస్కపోయి వస్తానవా బిడ్డా' అంది సానుభూతిగా.

ఆమె అవునన్నట్టుగా తలాడించింది.

పెద్ద మనిషి మాట పొడిగించింది "మా బిడ్డ కొడిక్కి వారం రోజుల నుండి జ్వరం వస్తాందంటే చూసిపోదామని వచ్చిన... వర్షాలు మొదలైనవి కదా ఎక్కడ చూసిన జ్వరాలే... ఇయ్యాల రెపు పిల్లగాండ్ల జ్వరాలు వస్తే తట్టుకోలేక పోతాండ్లు" అంటూ కష్టం సుఖం మాట్లాడసాగింది.

కాని ఆమెకు ఆ మాటల మీద మనసు పోవటం లేదు. యథాలాపంగా ఊ కొట్టింది కాని మనసులోని బాధ ఎక్కడో సుళ్ళు తిరుగుతోంది. రాజన్న మళ్ళీ వస్తానని ఎందుకు రాలేదు... అన్న ప్రశ్న ఆమె మనసును తొలుస్తోంది. ఎంత ఆపుకుందామన్నా ఆగని కన్నీళ్ళు ఉబికి వస్తున్నాయి. ఆ కన్నీళ్ళను దాచుకోవటానికి ప్రయత్నించింది.

ముసలమ్మ ఇంకా ఏదో చెపుతూనే ఉంది "కొడిక్కి జ్వరం తగ్గకపోయే సరికి నా బిడ్డ గాబరాపడ్తాంది. దానికేమో ఇద్దరు ఆడపిల్లలు తరువాత ఒక్కడే కొడుకు. వానికేమన్న అయితే దాని ప్రాణం ఎల్లిపోతాంది. దావాఖానాకు తీస్కనేపోతిమి... డాక్టర్ ఏంకాదని చెప్పనే చెప్పె... వాడుతున్న మందులు పనిచెయ్యాలా వద్దా... దాన్ని సముదాయించి వస్తామంటే... ఇంక రెండు రోజులు ఉండిపొమ్మంటాంది కాని ఇంటికాడ ముసలాయన ఒక్కడే ఉన్నాడు... ఆయనకు కండ్లు సరిగా కన్పిస్తలేవాయే..." అంటూ చెప్పసాగింది.

బస్సు ఏదో స్టేజి మీద ఆగింది. దిగేటోళ్ళు దిగిండ్లు.. ఎక్కెటోళ్ళు చాలా మందే ఉన్నారు. ఆ రూట్లో అదే ఆఖరి బస్సు కావటంతో బస్సు కిక్కిరిసి పోయింది.

ఎవరో తెల్లబట్టలు వెసుకున్నామే, తన లావాటి శరీరాన్ని తోసుకుంటూ వచ్చి 'ఆ పిల్లవాన్ని వొళ్ళో కూచోబెట్టుకోరాదమ్మ" అంది దబాయింపుగా..

ముసల్ది గయ్యిమని లేచింది. "ఇక్కడెక్కడ కూచొంటవమ్మా... పిల్లవాణికి ప్రాణం బాగాలేదు... ఇంకెక్కడికి జరుగమంటువు" అంది.

తెల్లబట్టలామె మారుమాట్లాడ లేదు.

బస్సు కదిలింది. సన్నటి తుంపుర్లు మొదలైనవి. మావురు కమ్మినట్టుగా మబ్బులు కమ్మినయి.

"మళ్ళీ కుండపోత వర్షం వచ్చెట్టుంది" అన్నారెవరో ప్రయాణికుడు.

"రెండు రోజులుగా ఆకాశానికి చిల్లులు పడ్డట్టుగా వర్షాలు కురిసినయా... ఇవ్వాళ పొద్దున కాస్త తెరిపి ఇచ్చిందో లేదో మళ్ళీ మొదలైంది" మరెవరో వంత పాడిండ్లు.

మే'లోనే కాదు జూనంత ఎండలు మండిపోయినయి. నీళ్ళు దొరకక జనం కటకటలాడిండ్లు. ఈసారి వర్షాలు ఒక నెల ఆలస్యంగా మొదలైనా అటు తరువాత వర్షాలు బాగానే పడ్డాయి. దాంతో రైతులు ఆలస్యంగానైనా హుషారుగా వ్యవసాయపనులు ఆరంభించిండ్లు.

బస్సులో ప్రయాణిస్తున్న రైతు ఒకరు. 'వర్షాలు రాకుంటెనో రాలేదంటిరి.. వస్తెనో ఇబ్బంది పడబడ్తిరి... వర్షాలు పడ్తెనే కదా అందిరి నోట్లో నాల్గు మెతుకులు పొయ్యేది" అన్నాడు.

బస్సులో ఎవరి లొల్లి వారిది.

కాని ఈ లొల్లి ఏదీ కూడా ఆమె మనసును తాక లేదు. ఆమె మనసులోని దుఃఖం పొటెత్తగా ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి.

- - -

"ఏం కాదు శాంత.. తగ్గిపొద్ది" అంటూ అతను సముదాయించినప్పుడు ఆయన గొంతులోని జీర, కళ్ళలోని తడిని ఆమె గమనించకపోలేదు.

భార్య పిల్లలను వదిలి విప్లవమే వృత్తిగా మారిపోయిన అతని మనసులో ఎక్కడో ఏమూలో దాగి ఉన్న కన్న ప్రేమ మనసు పొరల్లో మెలిపెడుతుంది. "నేను రాజన్నను పంపిస్తా.. పట్నం తీసుకుపోయి ఏదైనా పెద్దాసుపత్రిలో చూయిస్తే తగ్గిపోతుంది.. నువ్వేమి పికర్ పడకు" అంటూ అతను ఆమెను సముదాయించిండు కాని ఆ సముదాయింపు

అతనికి అతను చెప్పుకున్నటుగానే ఉంది.

అప్పటికి వారం రోజులుగా పిల్లవాని జ్వరం. అదే తగ్గిపోతుందని ఒకటి రెండు రోజులు చూసింది... స్థానిక డాక్టరుకు చూయించింది కాని తగ్గలేదు సరికదా మరింత హెచ్చింది. దాంతో ఆమె గాబరా చెంది ఆయన కోసం నాల్గురోజులుగా తెలిసి ఉన్న వారందరి ద్వారా కబురు చేసింది. ఏదో అపాయింట్‌మెంటుకుపోతు ఆయన వీలు చూసుకొని వచ్చిండు... కాని పిల్లవాని పరిస్థితి చూసిన తరువాత ఆయన కాళ్ళు చేతులు ఆడలేదు...

పిల్లవాణ్ని వోళ్ళోకి తీసుకొని చాలా సేపు అలాగే ఉండి పోయిండు.. రహస్య జీవితంలో అపాయింట్‌మెంటుకు సరైన సమయంలో చేరుకోకపోతే ఎదురయ్యే సమస్యలు ఎరిగి ఉన్నవాడు కావున... ఆయన పోలేక పోలేక పోయిండు. పోతు పోతు పిల్లవాణ్ని మరోసారి దగ్గరికి తీసుకొని "జాగ్రత్త... మళ్ళీ రెండు రోజుల్లో కలుస్తాను. ఈ లోపు రాజన్న వచ్చి హస్పిటల్‌కు తీస్కపోతడు. ఏంకాదు. తగ్గిపోతుంది అంటూ శాంతను దగ్గరకు తీసుకొని వోదార్చి... అతను చీకట్లో కల్సిపోయిండు.

కత్తుల బోనులాంటి సింగరేణి పారిశ్రామిక ప్రాంతంలో విప్లవ కార్మికోద్యమాన్ని నడిపించడం మామూలు విషయం కాదు. అటువంటి బృహత్త కర్తవ్యాన్ని భుజాన వేసుకున్నాడతను.

పల్లెటూర్లో బతుకు వెళ్ళక ఎన్నో ఆశలతో పొట్టచేతపట్టుకొని బొగ్గు బాయి కార్మికుడుగా వచ్చి చెరిండు. కాని బతుకు పెనం మీది నుండి పొయ్యిలో పడ్డట్టు అయిందని. ఊర్లల్లో భూస్వాములు బొగ్గుబాయిల్లో బాయి దొరల పెత్తనం పెద్దగా తేడా ఏమిలేదని అర్థం కావటానికి ఎక్కువ సమయం పట్టలేదు. జీవితంలో పారిపోతు పారిపోతు చివరి మజిలికి వచ్చి చేరాడు. ఇక పారిపోవటానికి ఏ దారిలేదు.. ఎక్కడో ఒక చోట నిలబడి పోరాడకుంటే బతుకు లేదనే చైతన్యం అతన్ని పోరాట యోధున్ని చేసింది. అక్కడి నుంచి అతను వెనక్కి చూడలేదు. భయం భయంగా బతికే కార్మికులను సంఘటిత పరిచి అగ్ని కణాలను చేసిండు. అన్ని రకాల అణిచివేతలకు వ్యతిరేకంగా పోరాడే యోధులను చెసిండు. దాంతో కాళ్ళ కింది మట్టి కండ్లల్లో పడ్డటైన ప్రభుత్వం ఇదంత చూస్తూ ఊరుకుంటుందా! ఊరుకోలేదు... విప్లవ కార్మికోద్యమాన్ని అణచటానికి దేశంలోని సకల సాయుధ బలగాలను దించి అప్రకటిత యుద్ధ వాతావరణాన్ని సృష్టించింది. అరెస్టు, చిత్రహింసలు, బూటకపు ఎన్‌కౌంటర్లతో నల్లనేలను నెత్తురు మడుగు చేసింది. ఉద్యమం కుప్పకూలిన ప్రతిసారి దాన్ని పునర్‌నిర్మించడంలో అతను అసమాన ధైర్య సాహసాలు ప్రదర్శించిన శ్రామిక వర్గయోధుడతను.. అయితేనేమి అతనో మనిషి.. కన్న తండ్రి...

మరునాడు చీకటితోనే రాజన్న వచ్చిండు. రాజన్న గంగారం గ్రామస్తుడు... పరుల బాధను తన బాధగా భావించే అతని మంచి తనమే అతన్ని గ్రామ సంఘ బాధ్యున్ని చేసింది.

"అక్కా మనం వెంటనే హాస్పిటల్‌కు పోవాలి... తొందరగా బయలుదేరుదాం" అన్నాడు. పిల్లవాని పరిస్థితి చూసిన తరువాత అతను కూడా కంగారుపడ్డాడు.

మంచంలో పడుకున్న పిల్లవాణ్ని శాంత ఎత్తుకోబోతుంటే రాజన్న అడ్డుపడి "అక్క పిల్లవాణ్ని నేను ఎత్తుకుంటా... ఒకటి రెండు రోజులు ఉండాల్సి వస్తుందేమో... బట్టలేమన్న తెచ్చుకో..." అంటూ పిల్లవాణ్ని భుజం మీద వెసుకున్నాడు.

శాంత బట్టలు సర్దుకొని వెంటనే బయలుదెరిండ్లు గవర్నమెంటు పెద్దాసుపత్రికి పోయేసరికి మధ్యాహ్నమైంది.

డాక్టరు వచ్చి పిల్లవాణ్ని పరిక్షించి "పిల్లవాడు బాగా నీరసంగా ఉన్నాడు.. ఇక్కడ కొన్ని మందులు ఇస్తారు కాని కొన్ని మందులు బయటివి రాసిస్తాను తెప్పించుకొండ్లి" అంటూ మందులు రాసి ఇచ్చిండు... సెలైన్ పెట్టిండు..

డాక్టర్ రాసిన చిట్టి పట్టుకొని పోయి రాజన్న బయట నుండి మందులు తెచ్చిండు. ఆ మందులు పడేసరికి సాయంత్రం వరకు పిల్లవానికి కాస్త తెరిపి ఇచ్చింది. అంతవరదాక మూసిన కండ్లు తెరువనివాడు కండ్లు తెరిచి చూడటం ఆమెకు కొంత ఊరట కల్గించింది.

సాయంత్రం వరకు హాస్పటల్లో ఆమెతోనే ఉన్న రాజన్న" అక్కా జ్వరం కాస్త తగ్గి మొఖం పట్టినట్టుంది. ఇక ఏం ఫర్వాలేదు. రాత్రి అన్న చెప్పేసరికి పొద్దున్నే హడావిడిగా బయలు దేరి వచ్చిన... కాస్త పని ఉంది.. ఈ రాత్రికి ఇంటికి పోయి తెల్లారి మళ్ళీ వస్తాను" అంటూ శాంత వద్దన్న వినకుండా యాభై రూపాయలు చేతిలో పెట్టి పోయిండు.

పిల్లవాడు నిదురపోతున్నాడు. రాత్రి అయ్యేకొలది హస్పిటల్లో రోగుల మూల్గులు.. వాళ్ళ సంబంధికుల హడావిడి తగ్గిపోయింది. డ్యూటీ మారిన నర్సు వచ్చి చూసిపోయింది.

శాంత మనసులో పేరుకుపోయిన బాధ సుళ్ళు తిరుగుతుండగా ఏవో ఆలోచనలు చుట్టుముట్టాయి.

అతను పూర్తి కాలపు విప్లవకారునిగా మారిపోయిన తరువాత పోలీసుల వేధింపులు ఎక్కువైనవి. అర్ధరాత్రి అపరాత్రి అనకుండా పోలీసులు ఇంటి మీద దాడిచేసి చేసే బీభత్సకాండ భరింపరానిదిగా మారింది. ఈ బాధలు పడలేక శాంత 'చావో రేవో నీతోనే' అంది... కాని పిల్లవాణ్ని ఏం చేసుడు అన్న ఆలోచన వెంటాడింది. ఇక లాభం లేదు... కొన్ని రోజులు శత్రువు కంట పడకుండా ఉండు తరువాత పిల్లవాణ్ని ఎవరి వద్దనన్న ఉంచే ఏర్పాటు చేసి అటు తరువాత ఉద్యమంలో పూర్తికాలం పనిచేస్తువు'' అంటూ అతను సముదాయించాడు.

ఆ విధంగా ఆమె కొన్ని రోజులు డెన్ కీపర్‌గా పని చేసింది. పిల్లవాని ఏర్పాట్లు ఇంకా పూర్తి కాకుండానే ఇంతలోనే ఈ అవాంతరం వచ్చి పడింది.

ఆమె ఆలోచనలకు అంతరాయం కల్గిస్తూ పిల్లవాడు ఉన్నట్టుండి ఉలిక్కి పడి ఎక్కెక్కి ఏడవసాగిండు. అది చూసి ఆమె గుండెలో రాయి పడ్డట్టుగా ఉలిక్కిపడి పిల్లవాణ్ని రెండుచేతులతో పొదివి పట్టుకొని 'ఎందీ బిడ్డా... ఏమైంది... ఏమైంది..'' అంటూ ఏడ్వసాగింది.

ఆమె ఎంత అదిమిపట్టుకున్నా పిల్లవాడు కాళ్ళు చేతులు కొట్టుకోవడం ఆగటం లేదు.. దాంతో భయం వేసి "డాక్టర్ డాక్టర్" అంటూ అరిచింది.

డ్యూటీ నర్సు వచ్చి బి.పి. అది ఇది చూసి వెంటనే డ్యూటీ

డాక్టర్‌కు కబురు చెసింది. ఆయన వచ్చి చాలా సేపు పరీక్ష చేసిండు. ఎవో కొన్ని ఇంజక్షన్‌లు ఇచ్చి ఆక్సిజన్ సిలండర్ పెట్టిండు.

ఈ హడావిడాంతా చూసిన తరువాత శాంతకు కాళ్ళు చేతులు ఆడటం లేదు... దుఃఖంతో మనసంత మొద్దుబారిపోయింది. కన్నీళ్ళు ఆగడం లేదు.

"ఏమైంది డాక్టర్ నా బిడ్డకు ఏమైంది" అంది రోదనతో..

"ఏం కాదమ్మా... మా ప్రయత్నం మేం చేస్తున్నాం" అంటూ డాక్టర్ అనునయంగా బదులిచ్చి "సూదులు ఇచ్చాం కదా నిదురపోతాడు... తెల్లవారే సరికి అంత బాగవుతుంది" అంటూ డాక్టర్ వెళ్ళిపోయిండు.

ఆమె కన్నీళ్ళు ఆగడం లేదు.. భరింపరాని బాధలో ఒంటరిగా పిల్లవాని కనిపెట్టుకొంటూ బెడ్ పక్క స్టూల్ మీద రాత్రంత కంటి మీద రెప్పవాల్చకుండా ఏడుస్తూనే ఉంది... పిల్లవానిలో ఉలుకు లేదు పలుకు లేదు...

పొద్దున డాక్టర్ వచ్చి మళ్ళీ ఒకసారి పరీక్ష చేసిండు. కనురెప్పలు ఎత్తి చూసిండు. స్టెతస్కోప్‌తో పరిక్షించిండు... భారంగా నిట్టూర్చి పిల్లవాని ముక్కు కున్న ఆక్సిజన్ తీసి శాంత కేసి తిర్గిండు.

"సారి అమ్మా మేము చెయగలిగిన ప్రయత్నమల్లా చేసినం... లాభం లేకుండా పోయింది. మీ వాళ్లను పిలిపించుకొని పిల్లవాణ్ని తీస్కుపోవచ్చు" అంటూ డాక్టర్ మారుమాట్లడకుండా, వెనక్కి తిర్గి చూడకుండా వెళ్ళిపోయిండు.

ఆ మాటలు విని శాంత పెద్దగా రోదిస్తూ కుప్పకూలి పోయింది. చుట్టు ఉన్న పేషంట్లు సంబంధికులు వచ్చి ఆమెను ఓదార్చసాగిండ్లు.. హెడ్డు నర్సు ఒకరు వచ్చి "అమ్మా హస్పిటల్లో ఏడ్వకూడదు" అంటూ సున్నితంగా వారించి, మీ వాళ్ళను పిలిపించుకొని బాడి తీస్కుపోవాలమ్మా" అంది.

"నీతోని ఎవరు రాలేదా బిడ్డా" అంది ఒక అవ్వ అనునయంగా...

"మా అన్న వచ్చిండు... పని ఉండి తెల్లారి వస్తానని పోయిండు ఇంక రాలే" అంది దుఃఖంతో

"ఏం చేస్తాం బిడ్డా... పిల్లవాణి ఆయుష్షు అంతవరకే ఉంది. గుండె ధైర్యం చేసుకోవాలి" అంది ఇందాకటి అవ్వ ఓదార్పుగా.

సమయం గడుస్తోంది.

"అమ్మ బాడిని తీస్కుపోవాలి. లెకుంటే వార్డుబాయ్‌లను పిలిపించి మార్చురికి పంపించమంటావా" అంది నర్సు.

"లేదు మా అన్న వస్తడు" అంది ఎడ్పుతో ప్రాధేయపడ్తూ.

"మళ్ళీ నేను వచ్చే సరికి బాడి ఇక్కడ ఉండవద్దు ఉంటే మాత్రం మార్చురికి పంపిస్తా" అంటూ నర్సు వెళ్ళిపోయింది.

రాజన్న వస్తానని ఎందుకు రాలేదు... ఏమైంది 'అన్న ప్రశ్నను ఎన్నిసార్లు అనుకుందో ఆమెకే తెలియదు.. బాడి తీయాలని నర్సులు తొందరపెట్ట సాగిండ్లు... ఇక లాభం లెదనుకొని గుండె ధైర్యం చేసుకొని కొడుకు శవాన్ని భుజం మీద వేసుకొని హస్పిటల్ నుండి బయటికి నడిచింది. హాస్పిటల్ వెనుక చెట్ల నీడలో కొడుకు శవాన్ని పెట్టుకొని అంతవరదాక అణిచి పెట్టుకున్న దుఃఖం కట్టలు తెంచుకోగా ఒక్కసారిగా బోరున కొడుకు శవం మీద పడి ఏడ్చింది. అలా ఎంత సేపు ఏడ్చిందో తనకే తెలియదు.

పొద్దు వంగింది.. రాజన్న జాడలేదు... దుఃఖం పంచుకోను నా అన్నవారు లేరు... ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లింది... కర్తవ్యం గుర్తుకు వచ్చింది. ఏం చెయ్యాలి.. ఎక్కడికి పోవాలి. ఎటు తెగని ఆలోచనలు.. పొంగి పొర్లె దుఃఖం... ఈ క్షణమే ఇక్కడే తన బిడ్డతో పాటు చనిపోతే.. లేదు లేదు నా బిడ్డది అనాథ శవం కాకూడదు. నా చేతుల మీదుగా అంతిమ సంస్కారం చెయ్యాలి. అటు తరువాత తన బతుకు ఎట్లయినా ఫర్వాలేదు. ఈ క్షణంలో ఆయన తోడుంటే దుఃఖాన్ని ఆయన పంచుకునేవాడు కదా! ఈ సమయంలో తనకు సహాయంగా ఉండగలిగింది రాజన్న ఒక్కడే... అక్కడికి తీస్కుపోయి.. అక్కడే దహన సంస్కారాలు చేస్తే... అన్న ఆలోచన వచ్చిందే తడువు... ఏదో మొండి ధైర్యం వచ్చినట్టుగా ఒక నిర్ణయానికి వచ్చింది.

కాని ఈ శవాన్ని ఎట్లా తీస్కపోవుడు. రాజన్న పోతు పోతు ఇచ్చిన యాభై రూపాయలు తప్ప చిల్లిగవ్వలేదు. దీంతో ఏదైనా వాహనాన్ని మాట్లాడుకొని పోవుడు ఎట్లా... అంతులేని ఎడతెగని ఆలోచనలు.. బస్సులో బయలుదేరితే.. బస్సులో శవాన్ని తీస్కపోనిస్తరా!... అయితే ఎట్లా... ఏదో శక్తి ఆవరించినట్టుగా లెచింది. పిల్లవాని ఒంటి నిండా బట్టకప్పుకొని భుజం మీద వేసుకుని రాత్రి బస్సుకు బయలుదేరింది.

బస్సు ఆగింది. శాంత ఆలోచనలు తెగిపోయినవి. అంతవర దాక సన్నగా కురుస్తున్న వాన జోరందుకున్నది. బస్టాండులో కరెంటు లేదు. చిమ్మని చీకటి..

"ఇదే లాస్టు స్టేజీ అందరు దిగాలి" కండెక్టర్ అరుస్తున్నాడు.

వర్షంలో తడుస్తూనే ప్రయాణికులు బస్సు దిగి నీడపాటుకు పరుగులు పెట్టిండ్లు. శాంత పిల్లవాణ్ని భుజం మీద వెసుకొని రెండు చేతులతో పాదవి పట్టుకొని వర్షంలో తడుస్తూనే బస్టాండుకు ఎదురుగా ఉన్న ఓ ఇంటి ముందుకు చెరింది.

అది ఒక చిన్న గుడిసె హోటల్. అప్పటికే హోటల్ కట్టేసే పనిలో సామాన్లు సర్దుకుంటున్నారు.

ఇప్పట్లో వర్షం వెలిసేట్టు లేదని భావించి ప్రయాణికులు ఎవరి సక్కి వాళ్ళు వెళ్ళిపోయిండ్లు. విసిరి విసిరి కొడుతున్న వర్షానికి సగం తడుస్తూ పిల్లవాణ్ని ఎత్తుకొని నిలుచున్న శాంతను కనిపెట్టి హోటల్ యజమానురాలు "జాలితో" ఎమమ్మా పిల్లవాన్ని ఎత్తుకొని వర్షంలో తడుస్తావు... లోపలికిట్లా రారాదమ్మా" అంది.

శాంత గుడిసె లోపలికి అడుగు పెట్టింది. దీపం వెలుగులో హోటల్ యజమానురాలును చూసింది. నడేడు మనిషి

"ఏవూరు పోవాలి" అంది అప్యాయంగా పలకరించింది.

"గంగారం"

"గంగారమా" అంటూ ఆమె ఆశ్చర్యపోయింది." ఈ వర్షంలో ఈ రాత్రి ఎట్లా పోతవమ్మా... ఎంత లేదన్న నాల్గు మైళ్ళు నడిచిపోవాలి అంది.

శాంత బదులు పలకలేదు... మౌనంగా నిలుచుంది.

"అట్లా ఎందుకు నిలుచుంటవు... పిల్లవాణ్ని ఆ బల్ల మీద పడుకోబెట్టి అట్లా కూచో" అంది అనునయంగా...

బాబు భుజం మీద నుండి తొలగించకుండానే... పిల్లవాణ్ని అట్లాగే పొదివి పట్టుకొని బెంచి మీద కుచున్నది..

"ఏమైంది బాబుకు జ్వరమా" అంటూ అడిగింది.

అవునన్నట్టుగా శాంత తలాడించింది. ఏడ్చి ఏడ్చి దీనమైన శాంత మొఖాన్ని చూసి ఆమె మనసు తరుక్కు పోయింది. "అంతెనమ్మా పిల్లగాండ్లకు ఏమన్నా అయితే అంతే" అంది భారంగా నిట్టూర్చింది.

ఇప్పుడు రాత్రి పదైంది. ఈ వర్షంలో నువ్వు అక్కడికి పోయ్యి చేసేదేముండదు.. అయినా ఊళ్ళో పరిస్థితేమి బాగాలేదు... ఈ రాత్రికి ఇక్కడ పండుకొని రెపు పొద్దున పోతువులే" అంది అనునయంగా... ఈ పూట నువు ఇక్కడ ఉన్నంత మాత్రన మాకు వచ్చిన ఇబ్బందేమిలేదు.." అంది తటపటాయిస్తున్న శాంతను చూసి.

శాంత మనసులో ఏదో అనుమానం పొడ సూపి "ఉళ్ళో ఏమైంది" అంది.

"ఏం చెప్పాలమ్మా" అంది భారంగా నిట్టూర్చి ఇవ్వాళ రేపు మంచికి రోజులు లేవు. ఇవ్వాళ పొద్దున చీకట్ల రెండు వ్యాన్ల నిండా పోలీసులు పోయి ఊరును చుట్టేసి ఆగం ఆగం చేసిండ్లట... కనిపించిన వాన్ని కనిపించినట్టుగా చితకబాది పట్టుకొని పోయిండ్లట.

"ఎందుకు" అంది అప్రయత్నంగానే శాంత.

"ఎందుకంటే ఏం చెప్పాలి... మొన్న ఎలక్షన్ల ఊరోల్లందరు ఒక్క ఓటైన వెయ్యకుండా బైకార్టు చేసిండ్లని సర్కారోడు ఊళ్ళో సంఘపోల్లను ఎవరిని లేకుండా చెయ్యాలని చూస్తోంది" అంటూ హోటల్ యజమానురాలు ఇంకా ఏదో చెపుతూనే ఉంది. కాని ఆ మాటలు ఏవి శాంత చెవికి సోకటం లేదు. మనసంత శూన్యం ఆవరించింది. దుఃఖం పొంగుకొచ్చింది. కాని బయటికి ఏడ్వలేని దుస్థితి.

"పోలిసోళ్ళకు ఏం పోయ్యేకాలమో... ఒక దెబ్బలు కావట. పొల్లగాండ్లు పెద్దోళ్ళు అన్న తెడా లేకుండా ఊరు ఊరంత దెబ్బల పాలు చెసిండ్లాట. ఈ పాపం ఎన్ని రోజులు నడుస్తదో.." అంటూ శాపనార్థాలు పెడుతున్నట్టుగా చెతులు ఆడించింది. హోటల్ యజమానురాలు.

పిల్లవాణ్ని ఒళ్ళో పెట్టుకొని శోకదేవతలా ఉన్న శాంతను చూసేసరికి ఆమె మాటలు ఆగిపోయినవి. ఆమె లేచి ఇంట్లోకి నడిచి పల్లెలంలో అన్నం వేసుకొని తెచ్చి "బిడ్డా ఎప్పుడు తిన్నవో ఏమో... పిల్లవాణ్ని అట్లా పడుకోబెట్టి.. బుక్కెడు తిను..." అంది.

'నాకు ఆకలిగా లేదు' అన్నటుగా శాంత తల అడ్డంగా తిప్పింది.

'అదెంది బిడ్డా అట్లా అంటావు. ఓ బుక్కెడు బువ్వ నీకు పెట్టినంత మాత్రన నాకు పోయ్యేదేమీ లేదు.. నువ్వేమి చాకిల పడిపోవు... యాల్లకాని యాల్ల వస్తివి.. ఎప్పుడనంగ తిన్నవో ఏమో... బాధ ఉంటది బిడ్డా. కడుపుల సల్లబడ్తె ప్రాణం కాస్త నెమ్మదిస్తది" అంది అనునయంగా.

ఆమె చూపించే ఆప్యాయతకు... శాంతకు దుఃఖం ఆగలేదు.. పట పట కన్నీళ్ళు కారినయి. కడుపులో దుఃఖం పెరుకపోయి ఆకలి సచ్చిపోయింది. ఆ సమయంలో ఆమె మాట కాదనలేక పిల్లవాణ్ని బల్లమీద పండుకోబెట్టి పల్లెం తీసుకుంది.

కాని కడుపులోకి మెతుకు పోతే కదా! చెయ్యిపెట్టి తిన్నట్టు చేసింది కాని కడుపులోకి మెతుకు పోలేదు.. దుఃఖం ఆగటం లేదు. ఇంటి యజమానురాలు ఏదో పని బడి ఇంట్లోకి పోయింది చూసి చేతులు కడుకున్నట్టుగా బయటికి పోయి పల్లెంలో అన్న పారెసింది.

ఇంట్లోకి పోయినామె ఒక్క చద్దరు తెచ్చేసరికి పల్లెం కాలిగా కనిపించేసరికి సంతృప్తి చెంది "ఇప్పటికే సగం తడిసినవు... పిల్లవానికి ఈ చెద్దరు కప్పు వెచ్చగా ఉంటుంది..." అంది.

ఆ తల్లి చూయించిన ఆప్యాయతకు మనసు ద్రవించింది... కడుపులోని దుఃఖం పొంగుకురాగ మొఖం చాటెసుకొంటూ పిల్లవానికి పక్కసర్దినట్టు చేసింది.

"పొద్దున నాల్గు గంటలకు లేస్తేకాని హోటల్ నడువదు నువ్వు పడుకో పొద్దున పోతువు కాని. నేను పడుకుంటా" అని చెప్పి ఆమె నిదురకు ఉపక్రమించటానికి లోనికి పోయింది.

కడుపులో దుఃఖం పొర్లి పొర్లి వస్తుంది. క్షణాలు యుగాలుగా గడుస్తున్నాయి. అంతే లేని ఆలోచనలు... రాజన్న రాకపోవటానికి కారణం తెలిసింది. ఎక్కడికి పోవాలి ఏం చెయ్యాలి. సమాధానం లేని ప్రశ్నలు.. దుఃఖం.

రాత్రి ఎంతయిందో తెలియటం లేదు. కుండపోత వర్షం. చిమ్మని చీకటి. అప్పుడప్పుడు మెరిసే మెరుపులతో ఆమె మనసులాగే వాతావరణం గందరగోళంగా ఉంది.

చివరికి ఒక నిశ్చయానికి వచ్చింది. గుండె దిటువు చేసుకుంది. చప్పుడు కాకుండా లేచి పిల్లవాణ్ని భుజాన వెసుకొని మెల్లగా తలుపు తెరుచుకొని బయటకు అడుగు పెట్టింది.

ఉరుములు మెరుపులు... జోరున వర్షం... క్షణాల్లో తడిసి ముద్దయింది. చీకట్లో అలవాటైన దారి సరిగా కనిపించడం లేదు. పొంగి పొర్లె వర్షపు నీరు ఆమె దుఃఖం ముందు దిగదుడుపైనవి.

పొట్యాల ఊరుకు ఎడమ వైపున ఉండే దారి గోదావరి నదికేసి పోతుంది. అప్రయత్నంగానే ఆమె కాళ్ళు అటువైపు సాగినవి. అలా జోరు వర్షంలో ఎంత సేపు నడిచిందో... ఎంత దూరం నడిచిందో స్పృహే లేదు. నీటి ప్రవాహంలో కాళ్ళు తెలిపోతుండగా మోకాలి బట్టి నీళ్ళలో నిలించింది.

ఇంతలో ఒక మెరుపు మెరిసింది. ఆ మెరుపులో చుట్టు అంతులేని నీళ్ళు.. భుజం మీది పిల్లవాణ్ని చేతులోకి తీసుకుని మెల్లగా ఆ నీటిలోకి కదిలింది.

అంతే... అంతవరదాక బిగపట్టిన దుఃఖం ఒక్కసారిగా కట్టలు తెంచుకుంది... ఆ వర్షపు హోరులో.. ప్రవాహపు జోరులో గుండెలు అవిసెలా రోదిస్తూ కుప్పకూలిపోయింది.

కట్టలు తెగిన ఆమె దుఃఖంతో గోదావరి పొంగిపోర్లింది.

౦

కథ

ప్రయత్నం

పలమనేరు బాలాజి

ఎస్టీ కాలనీలో ఆ రోజు సాయంత్రం గ్రామసభ జరుగుతోంది. మూడు ఇనుప కుర్చీలు, ఒక చెక్క స్టూలు, నాలుగైదు చాపలు ఎవరి కోసమో అన్నట్లు ఎదురుచూస్తున్నాయి. ఇంకా ఎండ చుర్రుమంటూనే ఉంది.

ఉపాధి హామి పనుల్ని పంచాయితీలో పర్యవేక్షించే ఫీల్డ్ అసిస్టెంట్ రమణ తెల్లకాగితాలు, గ్రామసభ హాజరు పుస్తకం, ఇంకు ప్యాడు తీసుకు వచ్చి చెక్క స్టూల్ పైన ఉంచి తను చాప పైన కూర్చున్నాడు. వాచీ చూసుకుని ఇంకా అరగంట ఉంది అనుకున్నాడు.

కాలనీలోని చేతిబోరులోంచి ఎట్లాగైనా నీళ్ళు రప్పించాలనే లక్ష్యంతో ఇద్దరమ్మాయిలు పైట కొంగుల్ని నడుములకు బిగించి ఎదురెదురుగా నిలుచుని బోర్ హ్యాండిల్‌ని నాలుగు చేతులతో బలంగా ఊపేస్తూ, లయగా ముందుకూ వెనక్కూ ఊగి పోతున్నారు. కఠోరమైన శబ్దం చేస్తోంది బోరు.

మొండోడు మొండి రాజు అనబడే నాగరాజు బీడి తాగుతూ టీ హోటల్లో బాయిలర్ ముందు నిలబడి బొగ్గుల్ని కదిపే నెపంతో ఓరగా ఆ అమ్మాయిల్నే పరిశీలనగా చూస్తూ ఉన్నాడు. ఇరవై ఐదేళ్ళలోపు వయసు, ఛామనఛాయ, పొడుగు మనిషి.

చినిగి పేలికలై పోయిన ఆనాటి దినపత్రికలోని ఒకానొక భాగాన్ని చదివి మిగతా పేపర్ కోసం వెతుక్కుంటున్న కుంటి శంకరయ్య ఒక కంట నాగరాజు పడే పాట్లన్నీ గమనిస్తూనే ఉన్నాడు. శంకరయ్యకు పూర్తిగా బట్టతల వచ్చేసింది. యాభై ఐదు దాటి ఉంటుంది. చేతులపైన తెల్ల వెంట్రుకలు హోటల్లోకి పడుతున్న ఎండకు తళతళా మెరుస్తున్నాయి.

బోర్లో నీళ్ళు రావడం లేదు. అమ్మాయిల పనిలో బలం, వేగం తగ్గిపోయాయి. చూద్దాం అన్నట్లు బోర్ హాండిల్‌ని మెల్లగా కదుపుతున్నారు. బోర్ లోంచి వస్తున్న శబ్దాలు కూడా తగ్గిపోయాయి.

ఒరే నాగరాజా సంవత్సరం దినాలుగా ఆ ఆడపిలకాయల్ని మురిపెంగా చూసుకుంటానే బతికేస్తుండావు. మొండోడివి కదా. ఇంకో సంవత్సరం అయినా నువ్విట్లే చొంగ కార్చుకుంటా ఆ అమ్మాయిల్ని ఈడి నుంచే చూస్తూనే ఉండిపోగలవ్. కానీ ఆలోగా వాళ్ళిద్దరికీ పెండిండ్లు అయిపోతాయి. అప్పుడు కూడా చూస్తూనే ఉంటే ఇంకో సంవత్సరానికి వాళ్ళకు బిడ్డలు కూడా పుట్టేస్తారు. నా మాటికి నీకు ఏ అమ్మాయి నచ్చిందో చెప్పు. నేనే దగ్గరుండి సంబంధం మాట్లాడి ఖాయం చేసేస్తా. ఏమంటావు? ఎర్రటమ్మాయా? నలుపమ్మాయా?

శంకరయ్య మాటలతో తడబడి పోయాడు నాగరాజు. బొగ్గుల్ని కదిపే పనిని చప్పున ఆపి, అవసరం లేక పోయినా చక్కెర డబ్బా మూత తీసి చక్కెరను టీ డబ్బా మూత తీసి టీ పొడిని చూసుకుంటూనే కంగారుగా తల అడ్డం ఆడిస్తూ

“లేదు మామా, సాయంకాలం ఎండలో చెమట కార్చుకుంటా పాపం ఆడపిల్లోళ్ళు అట్లా కష్టపడతా ఉండారే. ఆ బోరన్నా రిపేరు చేయిస్తే బావుండు కదా అని చూస్తూ ఉండానంతే అన్నాడు తడబడుతూ.

“ నీళ్ళు ఎక్కడో పాతాళంలో వున్నెట్లుండాయి. బోరు లోతు చేస్తేనే కానీ నీళ్ళు రావు. కొత్త బోరు ఎయ్యాలంటే మాటలు కాదు. ఏసినా ఖాయంగా నీళ్ళు పడతాయని గ్యారెంటీ ఏముంది. అప్పుడికీ ఆ సర్పంచు కదిరప్ప గాడికి, పంచాయతీ సెక్రటరీ లావణ్యమ్మకి నూరుసార్లు చెప్పింటాం కదా. ఆ కత వున్నీలే అబ్బోడా. వాళ్ళ కత ఏంది? నీ కత ఏందో అది చెప్పు ముందు” దగ్గు తెర అడ్డు రావడంతో శంకరయ్య మాటలు కాస్త ఆగాయి.

“ఇదే హోటల్లో ఈడనే కూర్చుని పిలకాయలు, పెద్దోళ్ళు, ఆడోళ్ళు, మొగోళ్ళు, ముసిలోళ్ళు, యంపిటిసి మునిరత్నమన్న, ఎంత మందని ఎన్ని తూర్లని బోరు రిపేరి కోసం ఎన్నెన్ని కాగితాలు రాసింటారో నేనే సాక్షి గద మామా. బోరు తప్పకుండా వారం దినాల్లో రెడీ చేయిస్తానని సెక్రటరీ లావణ్యమ్మ కూడా చెప్పిందిలే మామా” శంకరయ్య కూర్చున్న చెక్క బెంచీ ముందు నిలబడి, నవ్వు మొహంతో అన్నాడు నాగరాజు.

బోరు హాండిల్ శబ్దం ఆగిపోవడంతో చప్పున తలతిప్పి వీధిలోకి చూసాడు.

“ఒరే మొండోడా.. ఇప్పుడా పిలకాయలిద్దరూ నడుములు ఊపుకుంటా వయ్యారాలు బోతా నీకాడికి వస్తారు. నువ్వు కుశాలు బోతా ట్యాంకర్ లోంచి డబ్బులిచ్చి పట్టుకున్న నీళ్ళను వాళ్ళకు ఇస్తావు. ఎంతో మంది బోరింగు దెగ్గిర వాళ్ళ ప్రతాపం అంతా చూపిస్తారు. నీళ్ళు వచ్చిందా సరే. లేదంటే ముడ్డి తిప్పుకుని ఖాళీ బిందెల్ని ఎత్తుకుని ఎనక్కు తిరిగి ఎలబారి పోతారు. ఈ ఆడ పిలకాయలు మాత్రం ఎప్పుడూ ఖాళీ బిందెలతో ఎనక్కి పోరు. ఈ పాపం చేసిందే కండ్లతో ఇప్పుడికి ఎన్నెన్ని చూడలేదు నేను? రూపాయి బాకీ ఉన్నా జనాల్ని మానం కడిగేసి బాకీ వసూలు చేసుకుంటావు. మొండోడి దెగ్గర బాకీనే వొద్దురా బాబూ. యాడబడితే ఆడ వేళాపాలా లేకుండా మానం పెరికేస్తారని జనం నీకాడ టిఫినుకు కానీ టీకి గానీ అప్పు పెట్టేదానికే బయపడిపోతారు. అప్పుగా టీ ఈనంటావు. ఉద్దరంగా ఈ పిలకాయలకి నువ్వు డబ్బిచ్చి కొనుక్కోనుండే నీళ్ళిస్తావు.”

ఆ ఆడ పిల్లలందరూ ముసి ముసి నవులతో హోటల్ ముందుకు వచ్చి ఖాళీ బిందెల్ని అటూ ఇటూ ఊపుతూ నిలబడ్డారు.

నువ్వు అడుగు అని ఒకరు, నువ్వే అడుగు అని ఒకరు కనుబొమ్మలతో సైగలు చేసుకున్నారు. వాళ్ళిద్దరూ నోరు తెరవక ముందే నాగరాజు పలకరించాడు.

“ఏం సుజాతా నీళ్ళు రాలేదా?” “మల్లికా టీ తాగుతావా” ఇద్దర్నీ ఒకేసారి పలకరించి, వాళ్ళ జవాబుల కోసం ఎదురు చూడకుండా తనే చొరవగా ఖాళీ బిందెల్ని హోటల్లోపలికి తీసుకు వెళ్ళి సిమెంటు తొట్టిలోంచి పెద్దపాత్రతో నీళ్ళను తోడి బిందెల్ని

నింపి, రెండు చేతులతో పట్టుకుని హోటల్ ముందుకు తీసుకు వచ్చాడు.

మెరిసి పోయే మొహాలతో నీళ్ళ బిందెల్ని చంకన బెట్టుకుని వాళ్ళు వెడుతుంటే మంత్రించిన వాడిలా వాళ్ళ వెనకాలే ఐదారు అడుగులు నడచిన నాగరాజు, శంకరయ్య దగ్గు వినపడే సరికి చప్పున ఆగిపోయాడు. తల గోక్కుంటూ వంగి, నేలపైన పడివున్న గులక రాళ్ళను చేతిలోకి తీసుకుని దూరంగా పారేసాడు.

బీడి పొగల మధ్య, దగ్గు తెరల విరామంలో శంకరయ్య ఉండుండీ నవ్వుతున్నాడు.

"యాభైయెళ్ళ సుబ్రమ్మ అప్పుడే హోటల్ ముందు నిలబడి బిందె నీళ్ళు అరువిస్తావా నాగరాజు" అని అడుగుతుంటే నాగరాజు శంకరయ్య పై చూపించలేక పోయిన కోపాన్ని ఆమెపై చూపించేసాడు.

"దినామ్మూ బిందె రూపాయి లెక్కన ట్యాంకర్ నుండి నీళ్ళు కొంటావుండాం. నీకూ తెలుసుకద అత్తా. నీళ్ళేమైనా ఊరికే వస్తాయనుకుంటా వుండావా? నేను టీ, టిఫిన్లే అప్పులియ్యను. నీళ్ళకు కూడా అప్పంటే ఎట్లత్తా. రేపు తెల్లార్తో ట్యాంకర్ వస్తుంది. ఆ అప్పేదే వాడినే అడిగి. వాడొస్తే నీళ్ళు పట్టుకుందువులే."

ఆమె మూతి తిప్పుకుంటూ ఏమిటో గొణుక్కుంటూ అక్కడి నుండి కదిలి, బోరింగు వద్దకు వెళ్ళి ఒకసారి ప్రదక్షిణ చేసి, కీచు కీచు మంటూ శబ్దాలు రావడంతో ఉస్సూరుమంటూ ఖాళీ బిందెతో వెనుతిరిగింది.

ఆమెనే గమనిస్తున్న శంకరయ్య "ఒరే అబ్బోడా ముండమోపి దగ్గిర తిట్లుతినకూడదురా.టయాలు, జాతకాలు మారిపోతాయి. ముసలామె నిన్నుతిట్టుకుంటా పోతా ఉండింది. పిలిచి బిందెడు కాకపోయినా ఆ చిన్నపాత్ర నీళ్ళైనా ఇచ్చి పంపించురా. ఈరోజు అమావాస్య గూడా. ఆడదాని నోట్లో ఎందుకు నానతావు. నీ మంచికే చెప్తా ఉండా" అనే సరికి నాగరాజు కొంచెం మెత్తబడ్డాడు.

వీధిలోకి వేగంగా వెళ్ళి సుబ్రమ్మ చేతిలోంచి బిందెను లాక్కుని, సగంనీళ్ళు నిండిన బిందెను ఆమెకు అందించాడు. ఆ మాత్రానికే ఆమె మొహం వెలిగిపోయింది.

"నీకు బొమ్మలాంటి పెండ్లాం వస్తుందిలేరా నాగరాజా. అప్పుడప్పుడు తిక్క తిక్కగా మాట్లాడతాడు, కానీ మనిషి మంచోడేలే శంకరన్నా, యాడైనా మంచి బిడ్డను చూడగుడదా" అని, మొహానికి పట్టిన చెమటను చీరకొంగుతో తుడుచుకుంటు నీళ్ళ బిందెను మోసుకుంటూ ఆమె కదిలింది "మా రాజు చల్ల గుండాల పదికాలాలు" వెళ్ళే ముందు ఆ మాట అందామె.

ఆ మాటతో నాగరాజు మొహంలోని చికాకు మాయమైంది. ఆ మాటనే మనసులో మననం చేసుకున్నాడు. ఎందుకో సంతోషంగా అనిపించింది.

"ఎర్రటమ్మాయా? నల్లటమ్మాయా? చెప్పు అబ్బోడా" ఎరుపా, నీ భార్య నలుపా?" శంకరయ్య ప్రశ్నతో నాగరాజుకు సిగ్గు, నవ్వు రెండూ వచ్చేసాయి. గట్టిగా తృప్తిగా నవ్వేసాడు.

ఫీల్డ్ అసిస్టెంట్ రమణ అక్కడకు వచ్చి నవ్వుతున్న నాగరాజు వైపు, ప్రశాంతంగా బీడి తాగుతూ కూర్చున్న శంకరయ్య వైపు ఆశ్చర్యంగా చూసి "ఏం తాతా ఈ దినం మనోడు హుషారుగా వుండాడు. ఏంది కత? అన్నాడు."

"ఏం లేదు కానీ... ఆ బోరింగు ఎప్పుడు రిపేరు అవుతుందో చెప్పు రమణా. జనం అవస్థ చూడలేక పోతావుండా. టౌన్ లోంచి వచ్చే ట్యాంకర్ నీళ్ళు అందరూ కొనుక్కొని తాగలేరు కదా. నువ్వేమైనా చెయ్యగూడదా?" టీ గ్లాసు రమణ చేతికి అందిస్తూ అన్నాడు నాగరాజు.

"ఈ రోజంతా వింతగా వుండాదే. మొండినాగరాజు నేను అడక్కుండానే.. నాకు ఉద్దరంగా టీ ఇస్తా వుండాడంటే ఈ దినం గ్యారెంటీగా వర్షం పడుతుంది. ఏం తాతా ఏమైంది నాగరాజుకు?" టీ చప్పరిస్తూ నవ్వు మొహంతో అన్నాడు రమణ.

"నాగరాజుకి పెళ్ళి కళ వచేసిందాదిరా రమణా అదీ హుషారు" అన్నాడు శంకరయ్య.

అప్పటికే జనం చాపలపైన కూర్చునేసారు. ఇంకింత మంది గుంపులుగా నిలుచున్నారు. రుణాల కోసం కొంతమంది అర్జీలు రాసుకుని వస్తే ఇంకొంత మంది ఇందిరమ్మ ఇంటి బిల్లుల కోసం, కొత్త ఇండ్ల కోసం, ఇంకొంత మంది వృద్ధాప్య, వితంతు పించన్ల కోసం అర్జీలు రాసుకుని వచ్చికూర్చున్నారు. బోర్ రిపేర్ కోసం నాగరాజు రమణ దగ్గర అర్జీ రాయిస్తూ ఉన్నాడు. నాగరాజు మొహంలో ఏదో తృప్తి కనబడింది శంకరయ్యకి.

"ఇక్కడ పని కాకపోతే ఒకసారి కలెక్టరాఫీసుకైనా వెళ్ళొద్దాం" అంటున్న నాగరాజు వైపు ఆశ్చర్యంగా చూసాడు రమణ.

చదవండి!
చదివించండి!

వెల : రు. 50

మార్క్సిస్టు తత్వశాస్త్రం
ఒక పరిచయం
న్యూ విస్టాస్ పబ్లికేషన్స్

ప్రతులకు :
మైత్రీ బుక్ హౌస్, విజయవాడ,
దిశ పుస్తక కేంద్రం, హైదరాబాద్
ప్రజాశక్తి బుక్ హౌస్, హైదరాబాద్,
నవోదయ బుక్‌హౌస్, హైదరాబాద్
సహచర బుక్‌మార్ట్, హైదరాబాద్

పాటలు

అమరుల కన్నుల్లో వేల వెన్నెల కాంతులు

తంగెళ్ల సుదర్శనం

అమరుల కన్నుల్లో వేల వెన్నెల కాంతులు
ప్రజలదె తుది విజయమనే కలచెదరని చూపులు ॥అమరుల॥

1. ఏ తల్లి కడుపులో - మొలకయ్యి మొలిచెనో ॥2॥
ఏ వూరి పొలిమేరలో - నడకయ్యి నడిచెనో ॥2॥
పేద ప్రజలా కోరకే ప్రాణాలను ఇచ్చినరూ ॥అమరుల॥

2. గ్రామ గ్రామాలు తిరిగి గాయాలు జూసినారు ॥2॥
గాయాల వెనుకున్నా గాథలను చదివినారు ॥2॥
గాయాలు జేసెటోళ్ళ గుండెలు పగలేసినరూ ॥అమరుల॥

3. భూమిలేనోళ్ళకూ భూములివ్వాలన్నరు ॥2॥
బువ్వలేనోళ్ళకే భూములను పంచినారు ॥2॥
ప్రాణమున్నంతవరకు దున్నుకొని బతుకమనే ॥అమరుల॥

4. అడవంత కలియదిరిగేని అడవి బిడ్డల గలసీ ॥2॥
ఆదివాసి బతుకుల్లో అంధకారము జూసి ॥2॥

5. శ్రామిక శక్తి ముందూ ఏ శక్తి నిలువదని ॥2॥
ఎర్రజెండా వెలుగులోనా చీకటే తొలుగునని ॥2॥
ఎత్తినారు పిడికిళ్ళు పోరుదారులేసినరూ ॥అమరుల॥

6. బెంగాలు కొండలల్లో నిప్పురవ్వలెగిసెననీ ॥2॥
శ్రీకాకుళములోనా మంటలయ్యి మండెననీ ॥2॥
సత్యమే గెలుచువరకు పోరు జ్వాలలాగవనీ ॥అమరుల॥

ఉద్యమించ రారండోయ్

దినమణి పాట, కవిత

సెప్టెంబరు పదిహేడు
చరిత్రలో ఒక మలుపు
తెలంగాణ ప్రజావళికి
ఉద్యమాల మరో పిలుపు ॥సెప్టెంబర్॥

1. నైజామును మెడలు వంచి రజాకార్ల తరిమికొట్టి
జమీందార్ల జాగీర్దార్ల కోటలనూ మట్టిగలిపి
తరతరాల బానిసత్వ సంకెళ్ళను తెగనరికిన
తెలంగాణ ప్రజావళికి ఉద్యమాల మలి పిలుపూ ॥సెప్టెంబర్॥

2. చాకలి అయిలమ్మా, బందగీల స్ఫూర్తి వెలుగు
దొడ్డి కొమురయ్యా కొమురం భీముల పోరాటం
ఉద్యమాల వారసత్వ సంపదలై వెల్లివిరియ
పోరుబాటల్లోనా పొడిచిన తొలిపొద్దు పొడుపు ॥సెప్టెంబర్॥

3. ఎందరెందరో వీరులు నేల కొరిగినాగానీ
కష్టాలు కన్నీళ్ళు కడుపుకోత మిగిలిందా
మన వీరుల త్యాగఫలం చేయిజారిపోయిందా
తెలంగాణ రత్నగర్భ గుండెగాయమయ్యిందా ॥సెప్టెంబర్॥

4. స్వాతంత్ర్యం వచ్చిందని సంబరపడి పోకండోయ్
విలీనమే విషాదమై మనల కాటు వేసిందోయ్
విశాలాంధ్ర పేరు జెప్పి వెన్నుపోటు పొడిచిందోయ్
ఆంధ్ర వలస దోపిడిలో తెలంగాణ నలిగిందోయ్
పోరు దప్పదారిలేదు ఉద్యమించ రారండోయ్ ॥సెప్టెంబర్॥

ప్రజాగ్రహం

ఏవడురా! ఈ మైక్రో విషసర్పాన్ని
మా మీదికి ఉసికొల్పి
మా బతుకుల్ని అతలాకుతలం చేసి,
ఈ ఆత్మహత్యలకు ఆజ్యం పోస్తున్నది.

ఏవడురా! ఈ మద్యం మహమ్మారిని
ఈ బెల్టు షాపుల బ్రహ్మరాక్షసిని
మా మీదికి వదిలి
మా జీవితాల్తో చెలగాటాలాడుతున్నది.

ఏవడురా! ఈ నకిలీ పురుగు మందుల, నకిలీ విత్తనాల
అడివి పందుల్ని మా పంట పొలాల్లోకి తోలి
మా రెక్కల కష్టాన్ని ధ్వంసం చేయడానికి
మా రక్తమాంసాల్ని పచ్చనోట్లుగా మార్చుకోవడానికి
ఎగదోస్తున్నది.

ఏవడురా! మా భూముల్ని సెజ్జుల పేరున లాక్కొని
భూ బకాసుర కార్పోరేట్ మాగ్నేట్లకు
కానుకలుగా అందిస్తూ
తమ దళారీ బొజ్జల్ని నింపుకుంటూ
మా జీవనాధారాన్ని కూకేటివెళ్ళతో లాగివేస్తున్నది.

ఏవడురా! ప్రపంచీకరణ రక్కసిపాదాలపై మోకరిల్లి,
వాగ్దానాల రంగుల కలల్ని వెదజల్లుతూ
మా ఓట్లు దండుకొని గద్దెనెక్కి
ప్రైవేటీకరణ బలిపీఠంపై
మమ్ముల్ని బలిపశువుల్ని చేస్తున్నది.
రాలిన మా కన్నీటి చుక్కల సాక్షిగా
బిగిసిన మా పిడికిళ్ళ సాక్షిగా
మా ఎండిన డొక్కల ఆకలి కేకల సాక్షిగా
మీ ప్రజా వ్యతిరేక విధానాలపై
యుద్ధం ప్రకటిస్తున్నాం - మీ నయవంచనకు
గోరీ కట్టి, మా ప్రజాశక్తికి పట్టం కడతాం

(మైక్రో ఫైనాన్స్ వేధింపుల వల్ల జరుగుతున్న ఆత్మహత్యలకు స్పందిస్తూ)

చర్య ప్రతిచర్య

శాఖమూరి రవి కవితలు మూడు

మనుషుల్ని
మనుషులే చంపడం
అమానుషమే!
మరి నిషాన్నారంభించిందెవరు?

మనుషుల్ని
మనుషులే ముక్కలు చెయ్యడం
కిరాతకమే!
ఈ దురాగతానికి తారకమంత్రం ఊదిందెవరు?

మనుషుల్ని
మనుషులే వెంటాడి చంపడం
రక్తదాహమే!
ఈ దాహార్తికి దారులు తీసిందెవరు?

మనుషుల్ని
మనుషులే మంటల్లో కాల్చెయడం
మారణహోమమే!
ఈ హోమానికి ఆజ్యం పోసిందెవరు?

ఎంచెప్పను
ఎవరని చెప్పను
ఆకలేసిన పావురాలు
నూకల కోసం నేలవాలితే
"ఆపరేషన్ వల"తో
అంతం చెయ్యడం
అమానుషమా! కాదా!
గూడొదిలిన రామచిలుకలు
చెలకలో గింజలేరుతాంటే
"ఆపరేషన్ గుల్లెర్"తో
గురిపెట్టి చంపటం
కిరాతకమా! కదా!

దాహమేసిన జింకపిల్లలు
గోదారికొస్తాయని
రహదారిలో "ఆపరేషన్ దారికాసి"తో
దహనం చెయ్యడం
రక్తదాహమా! కాదా!

తులసివనంలో
గంజాయి మొలసిందనుకొని
"ఆపరేషన్ అగ్గి"తో
తులసివనాన్నే అంటుబెట్టాలను కోవడం
మారణహోమమా! కాదా!

ఆకలేసిన అడవిబిడ్డలను
"ఆపరేషన్ హంట్"తో
అంతం చెద్దామనుకొనేవారికి
స్యాచురేషన్‌గా సమాధానం చెప్పడం
ఆదివాసులకు తెలువదా!

(దంతెవాడలో సి.ఆర్.పి.ఎఫ్. పై మావోయిస్టు భూంకాల్ మిలీషియా దాడి సందర్భంగా....)

తట్టిలేపిన మట్టివాసన

చాలా కాలం తర్వాత
సంక్రాంతి పండక్కి
మా పల్లెకు బోయిన....!

పల్లెంటె....
పొట్టకూటికోసం
పొలిమేరలు దాటొచ్చి
మా తాతలు నాటిన
గుంటూర్‌పల్లె...

గొరుకొయ్యలు మొలవంగ
భోగి మంటల్లో
మొదలైన మా సంబరాలు

దూరంగా ఉన్న గూటిలోకి
సూర్యుడొకడు నిద్రలోకి
జారుతుండగా...
పొల్లగాల్లందరం పోగై
ఆలెంకిలెంకాటలతో
దుమ్మురేపుతాంటే...

ఎనుకనుండి
మా అయ్య
సద్దిగిన్నింత చేతికిచ్చి
బిడ్డా....!
పల్లి చేన్లకు పందికావలి పొమ్మనె

ముంచుకొత్తాన్న చలికి వణుకుతూ
మంచెపై
ఎర్రటి గొంగడి
జరాయువుగా చేసుకొని
తల్లి గర్భాశయంలో
పిల్లాడిలా నిద్రిస్తున్నా...

గూటి నుండి రాగమొకటి
నా కర్ణభేరిని తాకిన వేళ
ఏమిటబ్బా...!
గాయాలైన గానాలు
పోరు సంకేత గేయాలై
మొలిచిన ఓ లలితక్క... ఓ శ్రీకాంత్...

ఇట్ల
ఈ మట్టిపై
ఎన్ని మందారాలు నేలకొరిగెనో...

రాలిన పూలను
రాసులుగా లెక్కొట్టేవాడికి
పరిమళం ప్రవహించే దూరమేం తెలుసు...?

పరిమళంతో పరవశించిన
నేను నాతోటిగాళ్ళు
ఒకే ఆటై ఆడినం
ఒకే పాటై పాడినం
అదే... తెలంగాణ ఆట పాట

సంగ్రామం

సమైక్యవాదులారా...!
సంకలెగిరేయకండి
అడ్డుకుంటే
తెలంగాణ ఆగిపోయిందని
ఆనందపడకండి

ఈ నేలపై పెరిగిన మందారాలు
పురుగు మందులను
మంచినీల్లలా తాగి
విష గులికలను
అన్నం ముద్దలుగా మింగి...
ప్రసరించే విద్యుత్‌ను పట్టి
మాడి మసై
ఈ మట్టిలోని మానుకు ఎరువై...
ఎదురొచ్చిన రైళ్ళను
ఎదలతో ఎగదన్ని
ఎగసిపడిన రక్తంతో
అరుణ కిరణాలై...
అగ్గితో స్నానమాడి
ఆహూతులై
ఆత్మబలిదానాలై
ఆశయాలను
జడివానగా కురిపించిన వేళ...
అవి
ఉబ్బునీల్లే లే
తోడేద్దామనుకుంటే
పొరపాటే...
ఊట బావులై నీరందిస్తాం...
మంటబెట్టి
నీటిని కాజే(చే)ద్దామనుకుంటే
మబ్బుల్లో మేఘాలై గర్జిస్తాం...
పారే పోరాట ఏటిని
పాయలు చేద్దామనుకుంటే
ఏరులన్ని ఏకమై
నదుల్లా నడుస్తాం...
నజరానాలిచ్చి నదులకు
అడ్డుకట్టలేద్దామనుకుంటే
సముద్రమై సంగ్రామం చేస్తాం...

మెత్తటి స్పర్శ

మాతంగి

ఒక్కసారి చూడకున్నా
వేల కాంతుల స్పర్శనిచ్చిపోయిన స్నేహితుడా!

బీటలు వారిన నేలమీద
మెత్తటి పువ్వుల్లా వాలిన నీపాదాల చూపుకోసం
ఎన్ని కండ్లు తపించిపోయినయో

దుఃఖాన్ని ఆర్పే మాటలేవో వెంటబెట్టుకొని
వాడ వాడలా తిరిగిన గుర్తుల్ని
ఎవరో మళ్ళీ మళ్ళీ తట్టి చెపుతున్నట్టుగా ఉన్నది

పాటలా గాలిలో తిరుగుతూ
పాఠాలు చెప్పిన జాడలు ఇక్కడే మౌనంగా రోదిస్తున్నాయి
తూట్లుపడ్డ కట్టె తలుపుల సందుల్లోకి
పాదరసంలా జారిన సూర్యుడా!
అనుభవాన్ని సారవంతం చేస్తూ
ప్రజల మధ్య చల్లటి మబ్బులా వాలి
వానలా కురిసి వెళ్ళిపోయినావా వీరుడా!

రాలిన కనుగుడ్లలో కూడా
ఊహలు పొదుగుతున్న దృశ్యమే కనపడుతున్నది
ఆయుధం మొనలా
ఆలోచనల మెత్తదనంలా
నీ రూపపు ముఖ చిత్రం
నీడలా మా వాడకట్టును చుట్టుకునే ఉన్నది ఇంకా
నువు తిరిగిన మైదానమంతా
మొగిలి రెక్కల్లా వాడిపోయింది

భుజం మీద సిద్ధాంతాన్ని నాగలిలా మోసుకొచ్చిన వాడా
నువు లేకున్నా
నువు దున్నిన నేల ఇప్పుడిప్పుడే పచ్చగా
మొలకెత్తుతున్న దృశ్యమే కనబడుతున్నది
(శాఖమూరి అప్పారావ్‌కు నివాళిగా ఈ కవిత)

ఆదివాసీ హఠావో

పోటు నారాయణ

అయ్యా!
అభం శుభం తెలియని
ఆదివాసులం మేము
ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో
అందలం ఎక్కిన అధికార పక్షం
ఆయుధాలు ఎక్కు పెట్టింది మామీదనే
అడవిలో పుట్టి పెరిగిన ఆదివాసులం మేమే
అభివృద్ధి అభివృద్ధి అంటున్నారు
మా గూడెంలన్నింటిన్ని ఖాళీ చేయిస్తున్నారు
బూటకపు స్వాతంత్ర్యం మాకు
బుక్కెడు బువ్వ దవ్వకుండా చేస్తున్నది
నాగరికత అంటే ఏమిటో తెలియని
అనాగరికులం మేము
అఖండ భారతదేశ అభివృద్ధికి
ఆవడ దూరాన ఉన్న ఆదివాసులం మేము
అడవిలోని ఖనిజ సంపదను
వేదాంత చిదంబరం కాజేయాలనుకుంటుండు
ప్రజాస్వామ్యం అంటున్నారు
పారా మిలటరీ బలగాలను పంపుతున్నారు
గిరి మీద నివసించే మాపై
గురి చూసి గుండెల్లో కాలుస్తున్నరు
ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో
పచ్చని అడవి రక్తసిక్తం అవుతుంది
మా గ్రామాలన్నింటిని దగ్ధం చేస్తుండు
మా మాన, ప్రాణాలను హరిస్తుండు
మా బతుకలకు భరోసా లేదు
దోపిడీ రాజ్యం చేస్తున్న దౌర్జన్యాలకు
బలి అవుతున్న ఆదివాసులం మేము
అఖండ భారతావని ముద్దుబిడ్డలం మేము
అడవి తల్లిని నమ్ముకొని బతుకలీడుస్తున్న
భారతమాత ప్రియపుత్రులం మేము
దేశ ప్రగతికి పట్టుగొమ్మలం మేము
అనాగరికత జీవనాన్ని పారదోలి
అక్షరాలు నేర్పి, ఆహారోత్పత్తులు నేర్పి
జనతా ప్రభుత్వాన్ని నడుపుతున్న,
ఆసరాగా ఉంటున్న అన్నలను నిర్మూలిస్తమంటుండు

బహుముఖయుద్ధగాడు

నాగేశ్వర్

ఈ నేల మీద
జానెడు జాగలో మొలిచి
పిల్లల మర్రై విస్తరించిన వనం అతడు

వరంగల్ ఆర్ ఇ సి లో వేసిన తొలి అడుగు మొదలు
మడమ తిప్పకుండా ముందుకే నడిచి
చదువుల శిఖరాగ్రాన నిలిచి
సైద్ధాంతిక చర్చల్లో శాస్త్రీయతకు బట్టకట్టి
ప్రతి మలుపులో వేలు చూపి తూర్పుకే నడిపించి
సాయుద్ధ రంగంలో హిమాలయమై ఎదిగి
అడివి అడివంతా
పచ్చగా నవ్విన పత్రహరితం అతడు

తాత్వికం
సాహిత్యం

సాయుధం
సకల రంగాల్లో అందెవేసిన చెయ్యతడు
బహుముఖ యుద్ధగాడు అతడు
వేకువ అలల్ని మోసే ఆకుపచ్చ సముద్రం అతడు

అతనిది జ్ఞాతమా! అజ్ఞాతమా!
సందేహమేమీ అక్కరలేదు

వలకి చిక్కనంత మాత్రాన
చేపది అజ్ఞాత వాసం కాదు
సముద్ర మంతా అలలై తిరిగిన అడుగుల సవ్వడతడు

వేటగాడి ఉచ్చుకి చిక్కనంత మాత్రాన
పులిదీ అజ్ఞాతవాసం కాదు
అడివంతా అమ్మఒడై కలియతిరిగిన పాదమతడు

ఉత్తర దక్షిణ భారతలేకాదు
తూర్పు పశ్చిమ కనుమలూ
ప్రపంచం మీద వీసే వసంత మేఘ గర్జనల్లో మెరిసి మురిసి
వెలుగై వేకువ పొడ చూపినవాడు
అజ్ఞాతవాసి ఎలా అవుతాడు?

పిడికిట్లో వెలుతురు పట్టుకుని
దేశం నలుమూలలా నాటుకుంటూ వెళ్ళినాడు
సూర్యుడుగాక మరేమవుతాడు.

ఈ దేశ సంపద
ఆకలి కడుపులో అన్నమై ఉడకాలనే అతడు కలగన్నది

అడవిని
ఆదివాసి కడుపునీ
వేదాంతం వేలుపెట్టి కెలుకొద్దనేకదా అతడు పాలికేకయ్యింది
మార్క్సిజాన్ని మనస్సులో నాటుకుని

మనుషుల్ని ప్రేమించడం తప్ప మరేమి తెలియని అతడు
ప్రజాయుద్ధ ప్రతినిదే కాదు
చంద్రశేఖర్ ఆజాద్ అడుగుజాడ కూడ

వెతికే చూపుండాలి కానీ
ఈమట్టి మీద
ఎక్కడ చూసినా అతని వెన్నెలకన్నులే

సారక్కీ గేటు నుండి నాగపూర్‌దాకా
అందుకే వేటగాడి వెర్రిప్రయాణం

నాలుక మీద చర్చల్ని చాక్లెట్‌లా చప్పరిస్తూ
గ్రీన్‌హంట్ భుజానెత్తుకుని
ప్రజల మీదికి భేతాళ చిదంబరం

ప్రజలకీ రాజ్యానికీ మధ్య
మాటల వంతెన కట్టడానికి
పునాది రాళ్ళు పేర్చుకుంటూ అతడు

గెలుపోటముల కొట్లాటలో చెప్పగలం
కొట్లాటేలేని చోట
విజేతను ఎలా ప్రకటిస్తాం
పచ్చిగా పట్టుకొని చంపారని మాత్రమే ప్రకటించగలం

ఆదివాసీ

ఉదయమిత్ర కవితలు మూడు

ఓ బక్కపలుచటి
పురాతన శిలల్నిదలపించేనల్లని శరీరం
ఓ కంటిలో కలలు
ఓ కంటిలో తుఫానులు
భుజం మీద పాటలపిట్ట
పాదాల్లో నాట్యపులయ
నరాలనిండా విద్యుత్తేజం
మహాకావ్యాల సారం
వసంత మేఘ గర్జనకై
కుహుకుహుల ధ్వని
పిడికిలిని విల్లంబులజేసి
చీకటి గుండెల్లోకి దించుతూ
నాగరికతల సరిహద్దులు చెరుపుతూ
సూర్యుని వేపు నడిచే పాదాలు
చీకట్లోనూ వెల్తురు పువ్వులై మెరిసే పాదాలు
అతడాదివాసి
పోరాటాల సహవాసి

అదేం చిత్రమోగాని
ప్రకృతి అతనికిచ్చిన స్వేచ్ఛను తుడిచెయ్యడానికి
అడవి నుండి
అతడి ఉనికిని తుడిచెయ్యడానికి
అతని మీది కన్నెన్ని యుద్ధాల్ని నడిపినా
ఎన్ని విష ప్రచారాల విష నాగుల్ని విడిచినా
చీల్చేస్తే అతుకున్నట్లు
బూడిదలోంచి ఫీనిక్స్ పక్షి పైకి లేచినట్లు
బషాయిటుడు[1] లాగ

మళ్ళీ మళ్ళీ పుట్టుకొస్తూనే ఉన్నాడు

మన మిక్కడ
భద్ర జీవితాలమధ్యన
పీడకలలు మోస్తూ ఉంటే
అతనక్కడ
చుట్టూ భీకర తుపాకీ మోతలమధ్యన
ఇంద్రావతి నది ఒడ్డున కూచొని
అద్భుతమైన కలనేదో పేనుతున్నాడు
భూమి నరాల్ని మీటుతూ
జనతన సర్కార్‌ని గానం జేస్తూ
జనజాగృతం జేస్తున్నాడు
భూంకాల్ పోరాట గాథల్తో
వెన్నెల్ని మరింత శోభాయమానం జేస్తున్నాడు
గూండాదర్[2] వారసత్రంలో
కరదీపికగా వెల్గుతున్నాడు
మరణమెంతగ వెంటదరుముతున్నా
దానిముఖాన్నే వెక్కిరిస్తో
మరో ప్రపంచాన్ని వాగ్దానం జేస్తున్నాడు

ఇంతటి ధీమా నీకెక్కడిదంటే
అడవివైపుజూపిస్తూ
చరిత్ర మీద
చెరగని చిర్నవ్వుల సంతకం జేస్తున్నాడు

అతడాదివాసి
అజేయమతనిమారుపేరు
అబూజ్‌మాడ్ అతని ఊరి పేరు.

1. మహాశ్వేతాదేవి "బషాయిటుడు" నవలలోని ప్రధాన పాత్ర.
2. బస్తర్‌లో బ్రిటిష్ వ్యతిరేక ఆదివాసీ భూంకాల్ పోరాట నాయకుడు గుండాదర్ - భూంకాలం పోరాటం 1910

ఎవరికయినా

ఎంత కష్టం
నెత్తిమీద చంద్రనిప్పులు గురుస్తుంటే
ముఖం మీద ప్రశాంతత విప్పారడం
ఎవరికయినా ఎంత కష్టం
కొడుకు కంటిరెప్పలకింద
నిద్ర ఎడారైతే
తండ్రి కునుకుకు
చినుకుతొడగడమెంత కష్టం
కాలం శిలువ మీద
కొడుకు నెత్తురుగక్కుతుంటే
తండ్రికి కాలం గడవటమెంత కష్టం... ఎంత కష్టం...
కలిసి నడిచిన దూరాలూ
కలిసి చేసిన పండుగలూ
కోపాలూ, తాపాలూ
హాస్యాలూ, భాష్యాలూ
మధురాను బంధాలూ
ఒక్కటొక్కటిగా గుర్తుకొస్తే
దుఃఖసముద్రాత పొంగుకొస్తే
కంటితీరాల్లో అదిమిపట్టడం
ఆ తండ్రికి కాలం గడవటమెంత కష్టం ...
ఎంత కష్టం ... ఎంత కష్టం ...

కలిసిన నడిచిన దూరాలు
కలసి చేసిన పండుగలు
కోపాలూ, తాపాలూ
హాస్యాలూ, భాష్యాలూ
మధురానుబంధాలు
ఒక్కొటొక్కటిగా గుర్తుకొస్తే
దుఃఖసముద్రాల్ పొంగుకొస్తే
కంటి తీరాల్లో అదిమిపట్టడం
ఆ తండ్రికి ఎంత కష్టం... ఎంత కష్టం...

ఆశయాన్ని ఆచరణలోకి
అనువదించిన కొడుకు బతుకు
జైలుగోడలమధ్య ఆరిపోతూ ఉంటే
తండ్రిగ బతకటమెంత కష్టం
తండ్రిగ నిలవటమెంత కష్టం
తండ్రిగ గెలవటమెంత కష్టం
చెలిమె చల్లదనాన్నీ
కొండగాంభీర్యాన్నీ
పసిపాప నైర్మల్యాన్నీ రంగరించి
సభలెన్నో కలె దిరుగుతూ
సభకు అదనపు గాంభీర్యానిస్తూ
ఆత్మీయుల కరస్పర్శలో
తనకొడుకును జూసుకుంటూ
అగ్నిపర్వతాన్ని అలవాటుగా మోస్తూనే
ఆప్యాయంగా పలుకరిస్తూ
తనకూ కుటుంబానికీ
కుటుంబానికీ, ఉద్యమానికీ
ఉద్యమానికీ, సమాజానికీ
వర్తమానానికీ, భవిష్యత్తుకీ
ఉజ్వలత్యాగాలవారధిగవెలుగొందుతూ
జనన మరణాల కొకతాత్వికతనుజోడిస్తూ
పదమటకుంగేవయసుకు

తూరుపు రేఖలద్దే ఆ తండ్రిని
నిర్వచించడం, అనుసరించడం
చరిత్రలో నిలబెట్టుకోవడం
ఎవరికయినా ఎంత కష్టం
ఎవరికయినా ఎంత కష్టం
(రవిశర్మ తండ్రికి, శ్రీ శ్రీ కి కృతజ్ఞతలతో)

రాళ్ళు కూడా మాట్లాడతాయి

మొదలయ్యింది....
ప్రపంచాన్ని అబ్బురపరిచే
వొక కొత్త ధిక్కార భాష మొదలయ్యింది..
నాగరిక భాషలనోళ్ళు మూతపడ్డాక
ఆదిమ భాష నోరు విప్పింది

పిల్లలు రాళ్ళేస్తున్నారని
ఇళ్ళకు పరిమితం జేస్తే
తల్లులు బయల్దేరుతున్నారు
భర్తల పట్టుకెళ్ళి
మాంసం ముద్దలు జేస్తే
భార్యలు పిడికిళ్లవుతున్నారు
ముక్కుపచ్చలారని తమ్ముళ్ళకు
కరెంటు షాకులిచ్చి కడతేరిస్తే
అక్కలు అగ్గిగుండా లవుతున్నారు

శుద్ధిగ నమాజు చేసే చేతులు
రాళ్ళనందుకున్నాయి
సూఫీ ఇస్లాంను కౌగలించిన చేతులు
సూటిగ రాళ్ల విసురుతున్నాయి
ముసుగు ముఖాన్ని గప్పేస్తే
కళ్ళు క్రోధాన్ని వర్షిస్తున్నాయ్...

వాళ్ళ చేతుల్లో రాళ్ళు
తెలంగాణ సాయుధపోరులో
శత్రువును బిత్తరజేసిన వడిసె రాళ్ళు
తరతరాల రక్తచరిత్ర మీదకు
మహాధిక్కారంతో దూసుకొచ్చే
నిరసనల మిస్సైళ్ళు
రాళ్లిప్పుడు
రణకేతనాలు
రాళ్లిప్పుడు
శాంతి పావురాలు

వాళ్ళు విసిరే రాళ్ళు
శత్రువు రక్షణకవచాన్ని దాటి
చిన్న గాయమయినా చేయకపోవచ్చు
శత్రువు పేల్చిన గుండు
వాళ్ల గుండెల్ని చీల్చివేయవొచ్చుగాని
రాయిని ఆయుధంగా ఎంచుకోవడంలో
వాళ్ళు ఉన్నత నైతిక బునాది మీద నిల్చుండిపోయారు
వీధుల్లో పేరుకు పోయిన రాళ్ళగుట్టల్తో
వాళ్ళు కాశ్మీరీ ఆజాదీ చరిత్రను
సరికొత్త మలుపు దిప్పుతున్నారు

రాయి - భయాన్ని తుడిచేసే మహత్తర సాధనం
రాయి - మౌనాన్ని చీల్చికొచ్చే పొలికేక
రాయి - గుండెను సూటిగ తాకేడప్పు పాట
రాయి - సాముహిక నిరసనల సంక్షిప్తరూపం

శత్రువు మీదకు విసిరిన రాయినొకదాన్ని
నా షెల్ఫ్‌లో పుస్తకాలమధ్య
భద్రంగా దాచుకుంటా
పుస్తకాలేగాదు...
రాళ్ళుకూడా మాట్లాడుతాయి....

దుఃఖపు క్రీనీడలో చింతన

పాణి కవితలు రెండు

లోలోపలి దుఃఖానికి బైటి దుఃఖానికి చాలా తేడా

సొంతానికో... సొంతమైన వాళ్లకో
సకారణమో... అకారణమో
అర్థయుతమో... అర్థరాహిత్యమో...

దుఃఖాన్నిలా వివేచించగలమా?
ఇన్ని పొరలుగా విప్పి చూసుకోగలమా?

దేనికోసమో చూస్తుంటే
తన కోసమే అన్నట్లు దుఃఖం వొరుసుకొచ్చేస్తుంది
ఎవరి కోసమో ఆలోచిస్తోంటే
నేనేగా తోడున్నదని దుఃఖం తన్నుకొచ్చేస్తుంది
ఏదో రాస్తుంటామా
ఇదే రాయమని దుఃఖం ఎక్కడి నుంచో ఎగబాకి వస్తుంది

ఏడిస్తే తప్ప దుఃఖపు తడి అంటుకోదు

అన్నీ తెగిపోయినట్లు
ఎక్కడెక్కడివో కూలిపోయినట్లు

ఒక్కసారిగా పర్వత శిఖరం విరిగిపడ్డట్లు
కన్నీళ్లు తుడుచుకున్నాక
లోపలి సముద్ర కల్లోలాన్ని తోడేసినట్లు...

లోకం ఎందుకిలా ఉంది
మనుషులు ఎందుకిలా ఉన్నారు
శాస్త్రబద్ధం విరుద్ధమై.... విషాదమై
రెండుగా మూడుగా
వందలు వేలుగా చీలిపోతున్న మనిషిలోంచి
కన్నీళ్ల ధారాపాతం

మనిషి ఊహాశక్తికి అందనిదేమిటి?
విశ్వాసాలతోనే సరిపోల్చుకోజాలని మనిషిని
ఊహలతో తూచడం అయ్యేపనేనా?

మనిషి అందకపోవడం కంటే విషాదమేమున్నది?

జ్ఞాపకం కడుపు చించుకుంటే కన్నీరే కాళ్లమీద పడుతుంది
చనిపోయిన వాళ్ల కోసం ఏడుపు ఒకలా ఉంటుంది
మరిచిపోయిన వాళ్ల కోసం ఏడుపు మరోలా ఉంటుంది
మారిపోయిన వాళ్ల కోసం ఏడ్చినప్పుడు
ఎన్నడూ లేని భారం గుండెల మీదికి ఎక్కుతుంది
గుక్క తిరగని
దీర్ఘరాత్రుల వెతుకులాట అవుతుంది

మనిషిని ఖాళీచేసి పోవడం
మనుషులకు ఎలా సాధ్యమైంది
కూడిన వాళ్లందరినీ కూర్చిందేమిటి
చెల్లాచెదరు చేసిందేమిటి?
మనిషికి మనుషులు దక్కకపోవడం కన్నా విషాదమున్నదా?

మనుషులు... మనుషులు... అని
స్మరించి, ధ్యానించి
తుదకు మనుషులను మర్చిపోవడానికే
రాత్రింబవళ్ళ తీరని వ్యథ

నింపుకోడానికి ఆబగా పరిగెత్తి అలసిపోయి
ఇప్పుడిలా వొంపుకోడానికి యాతన!

ఇక ఒక చోట తిన్నగా కూచోగలమా?
రెండు ముద్దలు తిని ముడుచుకొని పడుకోగలమా?

బోరున ఏడిస్తే తప్ప దుఃఖం అనుభవంలోకి రాదు

ఉమ్మడి ప్రపంచపు వలపోత
అర్థాంతరంగా ఇరిగిపోతూ
ప్రతి మనిషీ ఒక విడి లోకమని రుజువు చేస్తుంది

తలపోత అన్నిటికన్నా భారం
వలపోత కళ కూడా
నాలుగు మాటలు చెప్పుకోలేకపోవడం
కాసేపైనా లోపలిది తవ్వి పోసుకోలేకపోవడం
ఇప్పటికిక శాపమే

దుఃఖమొక పరిహాసం కూడా

రిక్త హృదయంతో కష్టం
ఏదీ మొలవదు
కన్నీటి ధారాపాతానికి ఏదీ సాగు కాదు

మానవజాతి ఇంత కల్పనా సాహిత్యం రాసుకున్నాక కూడా
బంధాలంటే భారమనే అర్థమే మిగిలిపోయిందా?
ఈ బరువును మోయగలమా? దించగలమా?
ఒంటరితనంలో సుఖించడం మానసిక సమస్యా
సామాజిక సమస్యా?

దుఃఖం ఒక ఓదార్పు కూడా

నిలబడ్డ చోటు మారనంత వరకూ
దుఃఖానికొక నిశ్చితార్థమూ ఉంటుంది
నిశ్చయ స్వరమూ ఉంటుంది
దుఃఖానికి ఒక యుగ స్వభావమూ ఉంటుంది
ఏదీ మిగల్లేదనుకున్నప్పుడు
ఎవరూ లేరనుకున్నప్పుడు
దుఃఖమొక కడపటి ఆలంబన అవుతుంది
అంతర్తేజమవుతుంది

చూసినవాళ్లూ
విన్నవాళ్లూ
కలిసి బతికిన వాళ్లూ
వందలాదిగా రాలిపోయిన కన్నీటికన్నా భారమేముంటుంది
అంత కన్నా గాయమేముంటుంది
ఓదార్పు మాత్రం ఏముంటుంది

జీవితమొక ప్రయోగమనుకున్నాక
నాజూకైన సుద్దులన్నీ అపహాస్యమవుతాయి

దుఃఖమొక ఆశావాదం

కన్నీటితో దుఃఖం తీరేదైతే

ఆనందభాష్పాలకు విలువేముంటుంది?
కఠినమైన లోకాన్ని ఎదుర్కోవడం కంటే
సుఖదాయకమేముంటుంది?

మననమూ మౌనమూ

ప్రశ్నలనే కాదు
జవాబులనూ కాసేపు మర్చిపోదాం
బోధననే కాదు
బాధ్యతలను తీసి కాసేపు పక్కన పెడదాం
కేవలం మనుషులుగా మాటాడుకుందాం
మన ముందు నిమ్నోన్నత
మానవ గాథలున్నాయనుకొని మాటాడుకుందాం

ఎందుకైనా మంచిది
మాటలు మానేసి లోపలి నుంచి వెతుక్కుందాం
ఒక లిప్త విరామం కావాలని
కాలాన్ని బతిమాలుకుందాం

ప్రేమించి, స్నేహించి
హింసపడి , కన్నీరు కార్చి
ఎంతో కొంత వదులుకొని
అంతులేనంత పొందీ..

అలిగి , ఆగ్రహించి
కోప్పడి, చాడీలు చెప్పి
విన్నదంతా సత్యమని కన్నదంతా నమ్మి శాస్త్రమని ప్రవచించి
అభిప్రాయాలుగా మొదలుపెట్టి నిర్ధారణలు చేసీ..

నిలదీసి, నినదించి
మారుమూల జనానికి
గద్దెపైని పెద్దలకి వినిపించేలా బిగ్గరగా అరచి
గొంతు బొంగురుపోయేలా ఆలాపించి
ధ్వనించీ..ధ్వనించీ కడకు ఎవరిని వారే ప్రతిధ్వనించీ..

ఇదంతా తప్పనే వాదనకెందుకు దిగాలి?

కాసేపు మౌనంగా ఉందాం

కాసేపు
అన్నిటినీ, అందరినీ మననం చేసుకుందాం

మననం ఒక శోధన
మౌనం ఒక మార్గం

మానవ చరితకు మాటలందించాల్సిన వాళ్లం
సమరోత్సాహానికి చూపు అద్దవలసిన వాళ్లం
మహా సేనలో ఆలోచనగా కలవాల్సిన వాళ్లం
నేల మీది నుంచే
నేలను అంటిపెట్టుకొని
లేచి నిలబడాల్సిన వాళ్లం

సరే..
ఎప్పుడైనా మననాన్ని ఆచరించామా?
మౌనాన్ని సాధన చేశామా?

మాటలు బొగిలిపోతున్నాయి
నమ్మకాలు చెదపట్టిపోతున్నాయి
కొయ్య గాథాలింగనాలు పంజరాలయ్యాయి
అనుత్పాదక స్నేహాలు గేలి చేస్తున్నాయి

క్షణ కాలమెప్పుడైనా నిలిచి మననం చేసుకున్నామా?

మననం జ్ఞానదాయకం
స్వయం పరావర్తనమొక
దిగ్గున మేలుకొలుపు

ఎవరికి వారిదే పరమ వాస్తవం
ఎవరి వాద పద్ధతి వారిదే
ఇష్టా ఇష్టాలే తుది సూత్రాలు
వ్యూహాత్మకంగా నెరపే సంబంధాలు

ఇదేమీ బాగోలేదా?

అవును..
స్వయం సత్యానికి ఆవల కూడా సత్యముంటుంది
మనమే నిజమనుకుంటే
ఇక అంతా అబద్ధమవుతున్నందుకు వెరపు కలగాలి
ఒక దిగులు చుట్టుముట్టాలి
గడియ మౌనాన్ని ఆశ్రయిస్తే
మాటల బోలుతనం తెలుస్తుంది
మాటాడలేని శూన్యభారం తెలుస్తుంది
కాసేపు మననం చేసుకుంటే
ఎవరికి వారి పునర్దర్శనమవుతుంది

మాట బతుకుతుంది
మనసు పునర్జ్వలిస్తుంది
మార్గం ఉత్తుంగమవుతుంది.

అహింసపై చర్చ

సచ్చిదానందన్

ఒక ప్రశాంతమైన రోజున
గాంధీ దగ్గరికి ముగ్గురు సందర్శకులు వచ్చారు
మరాఠాల నేల నుంచి నిండు గర్భిణి మహర్, ఇంకా పసిపిల్లే
గాంధీ స్వస్థలం నుంచి ఒళ్లంతా తగులబడిన మూగ భిల్ యువకుడు
మధ్య భారతం నుంచి చంకలో కర్రలతో, చేతిలో బాణంతో కోర్బా

గాంధీ తన చిన్న చిన్న అక్షరాలతో పోస్ట్‌కార్డులు నింపుతున్నాడు
సందర్శకులను చూసి చెప్పమన్నట్టు సైగ చేశాడు
'ఇదిగో దీనికి నువ్వే బాధ్యుడివి'
తన పొట్టవేపు చూపిస్తూ అందా యువతి
అలవాటయిన నిగూఢపు చిరునవ్వు నవ్వాడు గాంధీ
'హింసను అసహ్యించుకొమ్మని నువు నేర్పకపోతే
నన్ను చెరిచినవాణ్ని ముక్కల కింద నరికేదాన్ని'
ఇక భిల్లు సైగలతో శబ్దాలతో మొదలెట్టాడు
మాదొర నన్ను అప్పుల్లో ముంచాడు
కట్టుబానిసగా మార్చాడు
బావి నీళ్లు తోడుకున్నందుకు చెట్టుకు కట్టేశాడు
నాలిక తెగ్గోశాడు వంటికి నిప్పెట్టాడు
అడ్డుకుంటే హింస అవుతుంది గదా అని
ఆ హింసనంతా భరించాను
కోర్బా తన బాణాన్ని కిందికి దించాడు
'పులి నా కాళ్లు కొరికేసింది

ఈ విల్లంబులతో నేను దాన్ని చంపేవాణ్నే
కాని అహింసా సూత్రాన్ని వదిలేస్తే మనకు మిగిలేదేముంది?'

గాంధీ తన కలం కింద పెట్టాడు
విధేయ శిష్యులతో మాట్లాడాడు

'నా మాటలను మీరు పైపైనే గ్రహించారు
ఇక్కడ హింస చేసింది ఆ మగమృగం, ఆ భూస్వామి, ఆ పులి
హింసోన్మత్తులు వాళ్లు
పులికి మాత్రమే హింస చేస్తున్నానని తెలియదు
కేవలం సహజాతంగా పంజా విసిరింది
మిగిలిన ఇద్దరి పట్లా జాలి అక్కరలేదు

నా ప్రియమైన బిడ్డా,
పళ్లూ గోళ్లూ పనికి రాకపోతే కొడవలినో కత్తినో వాడి
నీ మానం కాపాడుకోవలసింది'

భిల్లు వైపు తిరిగి సైగలతో బోధించాడు
'మాటలు రాని నిన్ను నీ గొడ్డలే రక్షించి ఉండేది.'

'మరి అహింస సంగతేమిటి,' అని అడిగాడు కోర్బా

'ప్రాణాన్నీ మానాన్నీ రక్షించుకోవడానికి
దుండగుడిని శిక్షించడం తప్పని నేనెక్కడా చెప్పలేదు
అది చిట్టచివరి చర్య కావాలని మాత్రమే...'

ఇదంతా చూస్తున్న శ్రోత ఒక ప్రశ్న విసిరాడు
'మరి భగత్ సింగునూ సహచరులనూ ఎందుకు ఖండిచారు మీరు?'

'అది చాలా సులభం. ఎవరి మీద పోరాడుతున్నానో నాకు తెలుసు
అక్కడ హింసను పక్కనపెడితేనే మెరుగైన అవకాశాలనుకున్నాను.'

'మరి శరీరాన్ని బాధిస్తారు శత్రువును బెదిరిస్తారు
నిరాహారదీక్ష హింస కాదా' అడిగారు మరొకరు.

'చూడూ, హింసకూ అహింసకూ మధ్య ఇనుపగోడ లేదు
జీవితంలో ఏ విలువా అంతిమం కాదు'

మహర్ మహిళ తన నిండు కడుపు వేపు చూసింది
భిల్లు యువకుడు తన సగం కాలిన శరీరాన్ని చూసుకున్నాడు
కోర్బా తన మొండి కాళ్లకేసి చూసుకున్నాడు
'మీరేం చెపుతున్నారో మాకు అర్థం కాలేదు'

మహిళ గర్భంలోంచి ఒక సున్నిత స్వరం ప్రతిస్పందించింది
'నాకు అర్థమయింది'

(కె. సచ్చిదానందన్ ప్రఖ్యాత మలయాళీ కవి, రచయిత, అనువాదకుడు, అధ్యాపకుడు. నక్సల్బరీ ఉద్యమ ప్రభావంతో కవిత్వం ప్రారంభించిన సచ్చిదానందన్ మలయాళీ విప్లవ సాహిత్యోద్యమ నిర్మాణంలో, అఖిల భారత విప్లవ సాంస్కృతిక సమితిలో భాగస్వామ్య సంస్థ అయిన జనకీయ సాంస్కారిక వేది నాయకుడిగా ఉన్నారు. కేరళ విప్లవోద్యమ విచ్ఛిన్నంతో, పోస్ట్ మాడర్నిజం ప్రభావంతో ప్రజా ఉద్యమాలకు దూరమయిన సచ్చిదానందన్ కేంద్ర సాహిత్య అకాడమీ పత్రిక ఇండియన్ లిటరేచర్‌లో చేరి, చివరికి అకాడమీ కార్యదర్శి కూడా అయ్యారు. దాదాపు రెండు దశాబ్దాలుగా గాంధేయవాదానికి దగ్గరగా, పోస్ట్ మాడర్నిస్టుగా రచనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, అరుంధతీ రాయ్ వ్యాసం తర్వాత, ఇటీవల ఆయన రాసిన రెండు కవితలు చాలా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇంకా మలయాళంలోనే ఉన్న ఒక కవిత దంతెవాడలో పోలీసు, పారా మిలిటరీ బలగాలపై దాడిలో మావోయిస్టు గెరిల్లాలు సాధిస్తున్న విజయాల గురించి రాసినది. రెండవ కవిత ఇది. దీన్ని ఆయనే ఇంగ్లిషులోకి అనువదించారు. మహిళలపై, పీడితవర్గంపై, దళితులపై సాగుతున్న హింసకు గాంధేయ అహింస అర్థవంతమైన ప్రతిస్పందన కాగలదా అని ఈ కవిత చర్చిస్తుంది.

అతడు సామాన్యుల ప్రవక్త

నల్లమల

వడగాడ్పుని దాచుకొచ్చిన వేసవి వానలా
సమస్తాన్నీ కబళించే సమాధి పాదముద్రల్లా
గుండెను చీరేసే సంచలన వార్తా శీర్షికలా
మృత్యువుకీ ఓ భాషుంటుంది.

గరుకు గానంలా
విద్రోహ స్వరంలా
లేదూ మాంత్రికుని మార్మిక వ్యాకరణంలా
లేదూ అద్దం ముందూ వెనుకదాగిన జైలుగోడలా
లేదూ కొంచెం లోతుగా దిగులు తెరచిన
తలుపులవతల కాలుతున్న ఒంటరి సముద్రంలా,
లేదూ గృహాల్ని మరిచిన వలసల భూమిలా
లేదూ దప్పికమెట్లపై తిరుగాడే యాత్రికుడి ఎడారి శ్వాసలా
మృత్యువుకీ ఓ భాషుంటుంది
సమస్తాన్నీ పల్లుబార్చేస్తోన్న
ఆ భాషకావల కనిపించని దుఃఖమేదో
చీకటిలో పురి విప్పుతోంది.
మిత్రుడా!
ఇలా రోదిస్తున్నానంటే-
నీకోసం
చీకటి నరాల్లో కొడిగడుతొన్న చివరాఖరి నెత్తుటి బొట్టుతో
ఓ చిరుదీపాన్ని వెలగిస్తున్నానంటే,
ఈ నిషేధిత రుతువులో సైతం ఎద బంజర్లను నిలువునా
చీల్చి ఓ చిరా స్వప్నాన్ని నాటుతున్నానంటే,
జలశయాలవుతోన్న ఈ రెండు కనుగుడ్లనూ పీకి
ఓ వెలుతురు గీతాన్ని ఆవిష్కరిస్తున్నానంటే,
పాలమారిన ఈ స్వర పేటికను పెకలించి
ఓ క్రోధాన్ని ఎక్కుపెడుతున్నానంటే
నీకోసం
నీవు నిర్మించిన వాస్తవంలో నన్ను నిలబెట్టుకోవడం కోసం!

ఇన్నాళ్ళుగా ఘనీభవించిందేదో
కదల బారుతోంది
ఇన్నాళ్ళుగా అచేతనమై పోయిందేదో
అలలై కుదిపేస్తోంది.

కేవలం దుఃఖం కాదిది -
నావల్ని కోల్పోయిన తీరాల యాతనేదో మెలి తిప్పేస్తోంది
తెగిపడ్డ తంత్రిలో గాయపడిన శబ్దమేదో తొలి చేస్తోంది
కల్లోల కడలి నడుమ తడబడిన నావల తెరచాపల దిగులు
గానమేదో గుచ్చుకుంటోంది
ఏమాత్రం గాయపడనితన మేదో ద్రోహిని చేసి నిలదీస్తోంది
ఏమాత్రం విప్పారని కంఠ స్వరమేదో కరుగ్గా ఒరుసుకుంటుంది.

మొద్దు బారిపోయిన పగటి క్రూరత్వం మీద
నిశ్శబ్దంగా రాత్రి తన ముసుగుని దించుతున్నప్పుడు,
మంచు కమ్మిన నదుల గడ్డ కట్టే చల్లదనం మీద
మౌనంగా సాగే పడవలు పాటల నిప్పుకణికల్ని వదిలిపోతున్నప్పుడు
నేనా పాద ధ్వనుల్ని విన్నాను
నేనా స్వేద వనాన్ని చూశాను.

అతడు
సామాన్యుల ప్రవక్త
అతడు
సాదాసీదా జనాల స్వరపేటిక

నిశ్శబ్దంగా వంగిన వరి వెన్నులో
నిగూఢంగా పాలుపొలుకొనే ఒకానొక రహస్య క్షణంలోనో,
పోటెత్తే పొదుగుల్లో గడ్డకట్టిన
దిగులు మబ్బు ఎంతకీ కరగని ఒకానొక వేదనామయ క్షణంలోనో
చెప్పకుండానే వెళ్ళిపోయిన చందమామ
వెన్నెల వనాల్లో తన జ్ఞాపకాల మెరుపుల్ని వదిలి వెళ్ళిన
ఒకానొక వెలుతురు క్షణంలోనో -
అతడు
సీతాకోక చిలుకలతో పాటు
చితికిన పల్లెల్నీ, వణికే పైరుగాలుల్నీ
పడమటి కుంగిన సూర్యుళ్ళనీ
ప్రతిరోజు పొద్దుటి పూట పతాక శీర్షికలుగా ఆవిష్కరించేవాడు

ఏమాత్రం తీరికలేనితనాల్లుండీ
ఒక బతికిన క్షణాన్నైనా దొంగిలించి
మూసిన ప్రతి ఇంటి తలుపు మీదా
తన ఉనికి శబ్దాన్ని మీటి వెళ్ళేవాడు
యాంత్రికతలతో మొద్దుబారిపోయిన ప్రతి గుండెకు
ఓ గాయపడిన పాటని వేలాడ దీసి వెళ్ళేవాడు

అతడు
సంకెళ్ళ చప్పుళ్ళ మధ్య ప్రతిధ్వనించే
రేపటి స్వేచ్ఛా గీతం!

2

ఒక్క నిష్క్రమణ
లక్షలాది ఆగమనాలుగా పరావర్తనం చెందడం చరిత్ర
ఒక మనిషి

కోట్లాది ఆక్రోశాలుగా విస్ఫోటనం చెందడం వర్తమానం

మనిషి రక్తంలోనే
సరైన చరిత్రకు
సరైన ప్రత్యామ్నాయం దొరుకుతుంది
పునర్జ్వలించే రక్తంలోనే
సరైన వర్తమానానికి
సరైన గమ్యం దొరుకుతుంది

బాధలేదు, భయం లేదు
గాయం మాత్రమే పరిచిత స్వరం
మళ్ళీ అంతటా అదే పాతదనం
అదే పొత్తిళ్ళ వెచ్చదనం
గతానికీ గమ్యానికీ మధ్య
చారిత్రక వారధిగా నిలిచిపోయిన
ఆ వర్తమాన వాక్యం కోసమే
ఈ వెదుకులాట
ఊపిరితో పెనుగులాట!

సహచరుడా!
ఇలా పిగిలిపోతున్నానంటే
నీకోసం

తలవాల్చిన గాలుల మీద బరువెక్కే సాయంకాలాల్లో
ఇంకిన కన్నీటి చారిక మీదుగా ఈ ఉప్పెనల పాటని
లాక్కెడుతున్నానంటే,
ప్రాచీన శిలాశాసన శిథిల దుఃఖం ముందు
ఇలా క్షతగాత్ర దేహంతో సాగిలపడుతున్నానంటే
నదీ గర్భలోయ శీతల పరీవాహక ప్రాంతంలో
తేలియాడే నా మొదటి శవపేటిక కోసం తిరిగి వెదుకులాడు
తున్నానంటే

నీకోసం
నీవు గురిపెట్టిన ధిక్కారాన్ని తిరిగి ఎక్కుపెట్టడం కోసం

మైదానాల్లోకి పాడుచుకొస్తోన్న
ఎముకల పక్కనే పచ్చని పచ్చిక మొలుస్తోంది
ఆకాశాన్ని చీల్చుకొచ్చిన
మెరుపుమేని మీద వెచ్చని శ్వాస మెరుస్తోంది

కేవలం పిగిలిపోవడం కాదిది
నన్ను నేను ఓ రాత్రిగా, ఓ చినుకుగా
లేదూ చిట్లిన విరామ చిహ్నంలా
లేదూ సరికొత్త దోసిలా
చేతులు కట్టుకున్న పాతకాలపు ప్రవాహగానమే ఇది

నన్ను నేను ఓ దారిగా, ఓ తెన్నుగా
లేదూ ఎడారి దుఃఖంలా
లేదూ చుక్కల పర్వతంలా
విరగ కాసిన పున్నాగ శిరస్సుల నల్లమల పాటే ఇది

ఎదుగుతున్న మొక్కలకు వాటిలో దాగిన
మహారణ్యాల గురించి బోధిస్తున్నప్పుడు
కూలిపోతున్న పక్షులకు వాటి రెక్కల్లో దాగిన
అనంతకాశాలాల గురించి విశదీకరిస్తున్నప్పుడు
నేనా యుద్ధ సౌందర్యాన్ని చూశాను
నేనా వడిసెల గానాన్ని విన్నాను.

అతడు
ప్రజల చరిత్ర
అతడు
ప్రజలెత్తిన పోరు పతాక

చీకటి కోరల మధ్య రాత్రంతా నిద్రమేల్కొన్న కళ్ళ వెనకాల
చెదిరిన స్వప్న రాశుల్ని జారవిడుచుకుంటూ నడుస్తున్న క్షణాల
వెనకాల
సంవేదనాశీల క్షతగాత్ర శిబిరాల నుంచి
రవాణా అవుతున్న రహస్య సంకేతాల వెనకాల
మానవ సౌందర్య సమూహాలని పోల్చుకొనే
నీలి హస్తం ధగధగల వెనకాల
ఆశల రుతుపవనంలా
అతడు దూసుకొస్తాడు.

రాలే ప్రతి చినుకు మొన మీద
మెలకువ మొలకల్ని మెరిపిస్తూ,
ఊగే వెదురు వనాల కొసల మీద
లేత చందమామల్ని విరబూయిస్తూ
నిలువునా చీలిన నేల పగుళ్ల మధ్య
తడియారని రణ సంగీతాన్ని ప్రవహింప చేస్తూ
నిలువెత్తు దండకారణ్యంలా
అతడు కనిపిస్తాడు

వెచ్చగా విచ్చుకొనే గాయాల్ని
ఎలుగెత్తి గానం చేస్తున్నప్పుడు
రణాన్నో, మరణాన్నో
కసితీరా కౌగిలించుకుంటున్నప్పుడు
ఎవరికి వారై పోయిన
ఏకాకి వనాల మధ్య ఎదల్ని పెనవేసే
తొలకరి చినుకై రాలుతున్నప్పుడు
కళాశాల నుండి కార్ఖానాల మీదుగా

కదనరంగానికి కవాతై సాగుతున్నప్పుడు
ఈ దేశపు భవిష్యత్ చిత్రపటంలా
అతడు కనిపిస్తాడు

అతడు
బడుగు జనుల
బతుకు సంకలనం!

3

నెత్తుటి పరిమళాల కావల
నేల తల్లి ప్రేమ అబద్ధం కాదు
మట్టికణాల బృందగానాల్లో
వికసిత మానవ పరిమాణం అబద్ధం కాదు
త్యాగాన్ని సమున్నతం చేస్తూ
తెగిపడ్డ అగ్ని శిరస్సు అబద్ధం కాదు
మాటకూ మాటకూ మధ్య
మనసుకూ మనస్సుకూ మధ్య
అతి శీతలంగా ఘనీభవించిన
ఈ నిశ్శబ్దం ఇక చెదిరిపోక తప్పదు.

ఎవరికి వారు ఏమీ కాని
పరాయీకరణల్లోకి నెట్టేసే
ఈ కుట్ర ఇక భగ్నం కాక తప్పదు

ఎముకల్లోకి రాజ్యం దట్టించిన
ఈ భద్ర జీవనం ఇక పెట్లి పోక తప్పదు

సమస్త మౌనాల్నీ చిట్లగొడుతూ
చిందే కన్నీటి చినుకొక్కటే
ఈ నిద్ర గన్నేరుల్ని విప్పార్చే పాటవుతుంది
ఎదల నెర్రెల్ని నింపే వెలుతురు వానవుతుంది

మహోపాధ్యాయుడా!
ఇలా సమూహాన్నవుతున్నానంటే -
నీకోసం!

ఓ లేతకిరణం కోసం బరువైన సంకెళ్ళతో
ఇలా రోజంతా రోడ్డు వారగా నిలబడి నిరీక్షిస్తున్నానంటే
దుఃఖాన్ని పూర్తిగా అవతల ఒడ్డున వదిలేసి
ఇలా రహస్యరాత్రి శిథిలాల్లో సూర్యుడికోసం ఎదురుచూస్తున్నానంటే
నలుగుతున్న దారులవెంట, పాత పదబంధాల మధ్య
విశ్రాంతి తీసుకుంటున్న కవిత్వాన్ని తట్టిలేపి
అమూర్త అద్భుత దృశ్యాల ఆవిష్కరణ కోసం సాహసిస్తున్నానంటే
దేన్ని పరిగ్రహిస్తున్నానో దాన్నే తృణీకరిస్తోన్న
పరస్పర ఘర్షణల మధ్య ఓ పరిపూర్ణత కోసం పరితపిస్తున్నానంటే
నీకోసం
నీవు సృజించిన వనాలూ, మైదానాలూ
సముద్రాలై సాగుతున్న ఉద్విగ్న కవాతుతో
నేనూ పదం కదపడం కోసం
ఎవరిని వారు ఆవిష్కరించుకోవడమంటే
చారిత్రక అర్థరాహిత్యాల మీద కసిగా ఉమ్మేయడం
గాయాల సంపుటాలుగా రెపరెపలాడటమంటే
చరిత్రను చెక్కిన ఆ అమరత్వాన్ని ఆర్తిగా కౌగిలించుకోవడం
కేవలం సమూహాన్నవడం కాదిది

మట్టి మెలకువతో కాందిశీకుడిలా
నెత్తుటి శిల్పానికో, గాయమందిరానికో
నన్ను నేను అంకితం చేసుకుంటున్నప్పుడు
ఎక్కడ నిలబడి ఉన్నానో అదే ప్రాంతం పదే పదే
నా పురిటి మంచంగా పరిచయమవుతున్నప్పుడు
రాలిన అడవి మల్లెపూల అజ్ఞాత దుఃఖం ముందు
నా దేహాన్ని స్మృతి వాక్యం చేసి ప్రణమిల్లుతున్నపుడు
ఆరిపోతున్న దీపం గురించి
ఇక వట్టి మాటలతో సరిపుచ్చలేను
గాయాల రహదారిపై సొమ్మసిల్లిన దాహం గురించి
ఇక కేవలం కైమోడ్చలేను.

ఎదిగిన వనాల గాలుల మీదుగా
మెల్లగా పాకి వచ్చే విశ్వాసాన్ని గొప్పగా ఆవిష్కరిస్తున్నప్పుడు
గొంగళిపురుగుల్లాంటి పదాల్ని
సీతాకోక చిలుకలుగా మలచి విశ్వమంతా ఎగరేస్తున్నపుడు
నేనా యుద్ధ శిఖరాన్ని కౌగిలించుకున్నాను
నేనా ఉగ్ర జలపాతంతో కరచాలనం చేశాను.

అతడు
ఆదివాసీ ఎత్తిన జెండా
అతడు
విముక్తికి ఏకైక ఎజెండా!

పంటచేనులు దిష్టిబొమ్మల్ని
ముక్త కంఠంతో బహిష్కరిస్తోన్న కాలానికి
మిడతల దండు నుండి పంటను కంటికిరెప్పలా కాపాడే
మహా సేద్యగాడు అతడు

గోదావరి నుండి గండకీ నదీ పరీవాహక ప్రాంతాల దాకా
విస్తరించిన ఉధృత ప్రవాహ ఝురీ
దిశా నిర్దేశం చేసే
మహా నావికుడు అతడు

సంక్షోభకాలపు సందిగ్ధతల్లో
వ్యూహ ప్రతివ్యూహాల తడబాటుల్లో
దిద్దుబాటుల పాఠాల్ని నేర్పిన
మహోపాధ్యాయుడు అతడు

అతడు
కాలమేఘాల్ని తుత్తునీయలు
చేసే పెను తుఫానుల పాట!

4

అతడు
ఉజ్వల నినాదం
ఊపిరులూదే ఉద్యమం!
ఆ నినాదమే
తరగతి గదుల నుండి
అడవి ఒడి దాకా పోరుబాటలు వేసింది
చలి చీమల చేత సైతం
చంద్ర నిప్పుల ధూలా తొక్కించింది
పల్లెలే పాఠశాలలంటూ
ప్రతి ఒక్కర్నీ యుద్ధోన్ముఖుల్ని చేసింది

ఆ నినాదమే
గడ్డి పోచలకు ఉక్కు సంకల్పాన్నిచ్చి
త్యాగాల వారపోతల రాదారిని నిర్మించింది

కొన్ని శిరచ్ఛేద రాత్రుళ్ళ తర్వాత
కొన్ని పరిహాస పగళ్ళ తర్వాత
కొన్ని నలిగిన కాలిబాటల తర్వాత
కొన్ని అసందర్భ వాక్యాల తర్వాత
కొన్ని వలస రుతువుల తర్వాత
కొన్ని గృహోన్ముఖాల తర్వాత
కనుభూముల మీద కురిసిపోయిన
నిర్విరామ నెత్తుటి రుతుపవనాల తర్వాత
మళ్ళీ ఇప్పుడు ఖచ్చితమైందే కావాలి
ఖడ్గ ఖచితమైందే కావాలి
గాలి లేత పెదాల మీదుగా సవ్వడి చేసే
ఆకుల మీద అతడు లిఖించి వెళ్ళిన చిట్ట చివరి ప్రేమలేఖని
కాలం చెరిపి వేయకుండా కాపలాకాయాలి
మునిమాపు వేళ గాజుకిరణాలని దాచిన
చీకటి నొసటి పైన అతడు పూయించిన వేకువ మందారాన్ని
ఎప్పటికీ వడలిపోకుండా భద్రపర్చుకోవాలి
ఘనీభవించిపోయిన ఈ తరం చరిత్ర మీద
అతడు చేసి వెళ్ళిన ఉక్కు సంతకాన్ని
చెరిగిపోకుండా సెంట్రీ చేయాలి
ఎగసిపడే గుండె చప్పుళ్ళ నడుమ
కెరలుతోన్న జన సముద్రపు ఘోషలో
అతడ్ని పునః ప్రతిష్టించుకోవాలి

అతడు చీకటి కనురెప్పల్ని
చీరేసే వేకువ నినాదం
అతడు రేపటి నరాల్లో
పోటెత్తె నెత్తుటి నినాదం

అత్యాధునికతలు వికట్టాహాసాలు చేసినా సరే
భద్ర ప్రపంచాలు ఫక్కున పరిహాసం చేసినా సరే

తెల్లగా వెల్ల వేసిన
నిలువెత్తు సమాధుల గోడల మీద
మరోసారి కొత్తగా
లేదూ అదే పాతగా
అతడు ప్రతిబింబించేలా
ఆ తొలి యవ్వనాలు పునర్జీవించేలా
నా నెత్తుర్నే జేగురు రంగు చేసి
ఆ నినాదాల్నే మళ్ళీ రాస్తాను
'ప్రజలే చరిత్ర నిర్మాతలు'
'తుపాకీ గొట్టం ద్వారానే రాజ్యాధికారం సిద్ధిస్తుంది!'

(కా॥ అజాద్‌కు ప్రేమతో, దుఃఖంతో, పునరంకితంతో -)



దండకారణ్య మహిళా ఉద్యమ చరిత్ర

(1980-2009)

1986 నుండి 2009 దాకా దాదాపు 23 ఏండ్ల క్రాంతికారీ ఆదివాసీ
మహిళా సంఘటన్ (కె.ఎ.ఎం.ఎస్.) ఆధ్వర్యంలో నడిచిన
మహిళా ఉద్యమ చరిత్ర
విరసం ప్రచురణ

ప్రతులకు :

సహచర బుక్‌మార్ట్, హైదరాబాద్ దిశ పుస్తక కేంద్రం, హైదరాబాద్
నవోదయ పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్ నవయుగ బుక్‌హౌస్, హైదరాబాద్

వెల : రు. 50

గల్పిక

చినిగిన మార్క్స ఎంగెల్స్ బొమ్మలు!

ఈ ఉదయం నిద్ర నుండి హాయిగా మేల్కొన్నాడు డిజిపి. నిజానికి రాత్రి ఈ విషయం తెలిసిన దగ్గరి నుండి ఆనందంగానే ఉంది. చాలా రోజులకు కాళికా దేవిని దర్శించుకొని, ప్రశాంతంగా కళ్లు మూసుకొని ప్రార్థిస్తుండగా రాత్రి ఇంటలిజెన్సి వాళ్ల నుండి వచ్చిన సమాచారం గుర్తొచ్చినది.

"సార్, పశ్చిమ మిడ్నాపూర్‌లో నలుగురు మావోయిస్టులు పట్టుబడ్డారు, అందులో ఇద్దరు తెలుగువాళ్ళు కాళికాకు బలి...?"

"వద్దు, వద్దు.... సజీవంగా ఉంచండి, వారితో చాలా పనుంది...". దండం పెట్టుకొని ఆలయం నుండి బయటకొస్తూ దీర్ఘాలోచనలో పడ్డాడు డిజిపి.

...పిడికెడు మంది లేరు వీళ్లు, రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేయబడితిరి. పారిశ్రామికంగా ముందుకు తీసుకుపోవాలని ప్రభుత్వం టాటా, బిర్లా, సలీం గ్రూపులతో తీవ్ర ప్రయత్నాలు చేస్తుంటే, రైతులకు అన్యాయం జరుగుతుందంటు నందిగ్రామ్, సింగూర్ ప్రజలను, అటవి ప్రాంత గిరిజనుల్ని రెచ్చగొట్టి ప్రభుత్వం మీదనే తిరుగుబాటు చేయిస్తారా? బుద్ధదేవ్ చెప్పినట్టు ఈ దేశద్రోహులను ఓడించి తీరాలి...

అరాచకాలను సృష్టించి, ప్రభుత్వాన్ని కూల్చాలన్నదేగా వీరి కుట్ర? ఈ కుట్రలో తెలుగు మావోయిస్టుల ప్రమేయం ఉందని అటు దేశానికి, ఇటు ప్రపంచానికంత తెలపాలి. అందుకు బలమైన సాక్ష్యాలు సృష్టించాలి!

అందుకు జిలెటిన్స్, డిటోనేటర్స్, నాటు తుపాకులు కావలసినవన్ని ప్రభుత్వ పార్టీ కార్యకర్తల దగ్గర ఉండనే ఉన్నవి. తక్షణం కావలసింది పుస్తకాలు, తెలుగు పుస్తకాలు, అవే తిరుగులేని సాక్ష్యం!

తీవ్రవాద బాధిత రాష్ట్రాల డిజిపిల సమావేశ ఒప్పందం గుర్తొచ్చింది. వెంటనే ఛత్తీస్‌ఘడ్ డిజిపిని కంటాక్ట్ చేశాడు.

"చెప్పండి సార్..."

"గత నెల సమావేశంలో రిపోర్టు చేస్తిరి గదా, ఎక్కడో డెన్‌ల ఆయుధాలు, తెలుగు విప్లవ సాహిత్యం దొరికాయని, తెలుగు పుస్తకాలు ఒక బస్త పంపగలవా?"

"అంతేనా, ఇంకేదో అనుకున్నా! అయినా ఆ పుస్తకాలు చేదలు పడుతున్నాయి. ఒకటిగాకుంటే రెండు బస్తాల పుస్తకాలు తీసుకో, ఈ రోజు సాయంత్రమే కలకత్తా ప్లైట్‌కు పంపిస్తా..." ఛత్తీస్‌ఘడ్ డిజిపి.

అధికారులను పిలిపించుకొని కేసును పకడ్బందిగా ఎలా డీల్ చేయాలో తీవ్రంగా చర్చించాడు డిజిపి, కలకత్తా హెడ్ ఆఫీస్‌లో.

మరునాడే నలుగురు తీవ్రవాదులను పశ్చిమ మిడ్నాపూర్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరుస్తున్నారని స్థానిక పత్రికల్లో వార్తలొచ్చాయి. పట్టుబడ్డ మావోయిస్టుల దగ్గర ఏవేవి దొరికాయో దేశవ్యాప్తంగా ఇంగ్లిషు పత్రికలన్ని రాశాయి.

తుపాకులు నాలుగు, కత్తులు పది, బాంబులు యాభై, డిటోనేటర్లు ఎనభై, జిలెటిన్స్ మూడొందలు, తీవ్రవాద సాహిత్యం నాలుగొందల పుస్తకాలు లభించినట్టు పత్రికల నిండ కథనాలు!

\- - -

"సార్, పొరపాటు జరిగింది...." చెమటలు కక్కుతూ ఇంటలిజెన్సి అధికారి డిజిపి దగ్గరకు పరిగెత్తాడు

"ఏమయింది?"

"మనం చూపిన ఆధారాలకు సంబంధించిన పుస్తకాలు మన పార్టీ వాళ్ళవే..."

"మన పార్టీ వాళ్ళవా?" అర్థంగాక అయోమయంల డిజిపి.

"అవును సార్, ఆంధ్రల మన ప్రభుత్వ పార్టీకి సంబంధించిన 'పీపుల్ శక్తి' వాళ్లు ప్రచురించిన పుస్తకాలని, ఆలస్యంగా అర్థమైంది మనవాళ్లకు భాషా సమస్య వల్ల..."

"ఏమిటా పుస్తకాలు?" కోపంతో అరిచాడు డిజిపి.

"దుష్టరాజ్యం, ప్రపంచీకరణ అంటే ఏమిటి? శ్రుతి తప్పిన ప్రపంచీకరణ, ప్రపంచీకరణను ప్రశ్నిద్దాం, సామ్రాజ్యవాదం - ప్రతిఘటన, ప్రపంచీకరణ - ప్రజల ప్రత్యామ్నాయాలు, ప్రపంచీకరణ - శ్రామికులు, ప్రపంచీకరణ - పదేళ్ల అనుభవాలు, కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక..."

"ఇక ఆపు...." గద్దించి డిజిపి

"సన్నాసుల్లారా, మిగిలిన పుస్తకాలు గుర్తించకపోతిరిగాని, ఆ కమ్యూనిస్టు ప్రణాళిక పుస్తక అట్ట మీద వాళ్లెవరో ఉండే... ఆ... ఆ మార్క్స్, ఎంగెల్స్ బొమ్మల్ని చూసి గుర్తించొద్దురా?"

"పైన అట్టలు చినిగిపోయినవి సార్, ఇప్పుడు ఏం చేయమంటారు?" అయోమయంగా అధికారి.

"మిమ్మల్ని నమ్ముకుంటే కుక్క తోక పట్టుకొని హుగ్లీనదిని ఈదినట్టే, నేను చేసేది చేస్తాగాని, నీవు తగలడు..." గదిమాడు డిజిపి.

కాస్తా గందరగోళంగానే ఉంది డిజిపికి ఈ వైపరీత్యం, సర్వీసుల ఎప్పుడు ఎదురుకాలే ఇటువంటి అనుభవం!

ఉద్యోగావసరీత్యా చరిత్ర, సాహిత్య, రాజకీయ, ఆర్థిక పుస్తకాలు కొన్ని చదివినోడే తను. ఎంత చదివిన, కుక్క తోక సక్కగ్గాదన్నట్టు, 'ఈ రాజ్యంలో అభివృద్ధి జరగాలంటే, శాంతి భద్రతలు సుస్థిరంగ ఉండాలని, ఈ సుస్థిరత కోసం తిరుగుబాటుదారులను చివరకు ప్రజలనైన సరే నిర్దాక్షణ్యంగా అణచివేయాల్సిందే' నన్న లాఠీ సిద్ధాంతాన్ని బలంగా నమ్మినోడు, ఆచరిస్తున్నాడు.

అతని దృఢ సంకల్పానికి ముచ్చటపడి బుద్ధదేవ్ తన ఆఫీసుల బుజం తట్టి అభినందించిన విషయం మదిలో పదిలంగానే ఉంది డిజిపికి!

అందుకే ఈ విషయాన్ని అత్యవసరంగా బుద్ధదేవ్‌తో చర్చించాల్సిందే...

'మన రాజ్యం మీద తిరుగుబాటును ప్రేరేపించే పుస్తకాలను

కథా రచయిత శారద సంస్మరణ సభ

ది. 17-08-2010 సా॥ 5-30 గంటలకు గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థలో శారద సంస్మరణ సభ విరసం ఆధ్వర్యంలో జరిగింది.

ఈ సభలో ముందుగా ఆలూరి భుజంగరావు రచించిన "సాహిత్య బాటసారి - శారద - స్మృతి శకలాలు" పుస్తకం మూడవ ముద్రణ ప్రతిని సభకు అధ్యక్షత వహించిన "సంగ్రామ్" ఆవిష్కరించారు. ఆనాటి తెనాలి సాహిత్య, సాంస్కృతిక జీవితాన్ని వివరిస్తూ శారద సాహిత్య కృషిని వివరించారు. శారద జీవన సంగ్రామం హోటల్ సెగలో పొగలో మగ్గిపోయింది. అయినా అవసరం కోసం తెలుగు నేర్చుకొని, జీవించిన కొద్ది కాలంలోనే అయిదారు నవలలు, దాదాపు నూరు కథలు రచించిన శారద సాహిత్య కృషిని వివరించారు.

అనంతరం పుస్తక రచయిత, ప్రముఖ అనువాదకులు శారద సహచరుడు అయిన ఆలూరి భుజంగరావు మాట్లాడుతూ సామాజిక బాధ్యతతో శారద రచనలు చేశారన్నారు. చిన్నతనంలోనే శారద జీవిక కోసం తెనాలి వచ్చి, తెలుగు భాషపై మమకారాన్ని పెంచుకొని ఆ భాషను తనలో ఎలా ఆకళింపు చేసుకొని రచనలు చేసింది వివరించారు. జీవితమే సాహిత్యంగా, సాహిత్యమే ప్రాణంగా భావించిన వ్యక్తి శారద అని, చివరి వరకు సాహిత్య సేవ చేస్తూ మరణించాడని భుజంగరావుగారు కొనియాడారు.

స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాల రీడర్ వి. నాగరాజ్యలక్ష్మి మాట్లాడుతూ తెలుగు నవలా రచయితలలో శారదకు ఓ విలక్షణమైన స్థానం ఉందన్నారు. నవల సమకాలీన జీవితాన్ని చిత్రించడానికి ఎంత చక్కని ప్రక్రియగా రూపొందిందో నిరూపించడానికి శారద నవలలు మంచి ఉదాహరణలు అని అన్నారు.

భాషలో, పాత్ర చిత్రణలో, వాతావరణ కల్పనలో కథ నడిచిన ప్రదేశాల వర్ణనలో తెలుగుతనాన్ని అచ్చుగుద్ది తెలుగు పాఠక లోకాన్ని వశీకృతం చేసుకున్నవాడు శారద. 1953-54 సంవత్సరాలలో ఆంధ్ర పత్రికలో సీరియల్‌గా వచ్చిన శారద నవల "మంచి - చెడు" గొప్ప మనస్తత్వ విశ్లేషణాత్మక నవల అని ప్రత్యేకంగా పరిచయం చేశారు.

దుర్భర దారిద్ర్యం, మధ్య తరగతి ఆర్థిక ఇబ్బందులు మనుషుల మనస్తత్వాల మీద ఎటువంటి ప్రభావం చూపుతాయో, మనుషులు అల్పులుగానూ, పిరికివాళ్ళుగానూ, స్వార్థపరులుగాను ఎందుకు మారతారో పరిస్థితులు మనుషులను ఏవిధంగా ప్రభావితం చేస్తాయో, ప్రవర్తింపజేస్తాయో "మంచి-చెడు" నవల కళ్ళకు కట్టినట్లు చూపిందని అన్నారు.

ఆంధ్ర దేశంలో సాంప్రదాయంతో నిండి ఉన్న ప్రాంతంలో అప్పుడే కొత్తగా అడుగుపెట్టిన వ్యాపారపు విలువలు, మనుషులను ఖరీదు కట్టె సంస్కారం - పాత్రల అంతరంగిక సంక్షోభం - ఈ నవలలో శారద చిత్రించిన తీరు అనితర సాధ్యం. "మంచీ-చెడు" నవల అప్పుడే కాదు - ఇప్పటికీ చదవదగిన మనో వైజ్ఞానిక నవల అని - అట్టి గొప్ప రచనలు చేసిన రచయిత శారద అకాల మరణంతో తెలుగు కథ నవలా సాహిత్యం ఓ గొప్ప రచయితను పోగొట్టుకుందని నివాళులర్పించారు.

విరసం రచయిత నల్లూరి రుక్మిణి మాట్లాడుతూ శారద జీవితంలో తెనాలి పట్టణం ఎలా సాహిత్యానికే ప్రేరణ అయ్యిందో, తెలుగులో రచన సాగించడానికి ఆయన ఎంతటి ఘర్షణకు గురి అయ్యారో చెప్పారు. కీర్తికోసం ఆయన రచనలు చేయలేదని, ఆయన ఆవేదనకూ, ఆలోచనలకూ రచన చేయడం అనేది ఓ అవుట్‌లేట్ అని, తాను సమాజం నుండి గ్రహించింది తిరిగి సమాజానికి చెప్పాలనుకున్నాడని అన్నారు. ఆయన నిజాయితీకి తోడు, ఆనాటి కమ్యూనిస్టు ఉద్యమం ఆయన రచనలకు శాస్త్రీయతను, సామాజిక బాధ్యతను అద్దిందని వివరించారు. ఆయన అకాల మరణం ఓ విషాదం. నిజమైన శ్రామిక వర్గ రచయితకు ప్రతీకగా నిలచినవాడు శారద అని, శ్రామిక వర్గ రచయితలకు శారద జీవితం - సాహిత్యం గొప్ప ప్రేరణ అని అన్నారు.

మన పార్టీ ఎందుకు ముద్రించాలి? 'మార్క్సిస్టు మైండ్ సెట్ మార్చుకోవాలి' అన్న బుద్ధదేవ్ కాన్సెప్ట్ ఎందుకు అర్థం కావటం లేదు మూర్ఖులకు?

ప్రభుత్వ, రాజ్యద్రోహి విలియమ్ బ్లమ్ రాసిన 'దుష్టరాజ్యం' ఇపుడు అవసరమా? ఈ సామ్రాజ్యవాదం, ప్రపంచీకరణ, ప్రతిఘటన, ప్రత్యామ్నాయాలంటూ పుస్తకాలు ఎందుకు? వాటిని చదివి నందిగ్రామ్, సింగూర్ ప్రజలు తమ ప్రత్యామ్నాయాలు ఏమిటో చూసుకోక ఏం చేస్తారు?

మార్క్స్, ఎంగెల్స్, గాంధీ, ఠాగూర్ ఆత్మకథలు కాదు కావలసింది ఇప్పుడు, బిల్‌గేట్, వారన్ బఫెట్, అంబానీ చివరికి జగన్ లాంటి వారి ఆత్మకథలు, వీరగాథలు కావాలి తక్షణం ఈ సమాజానికి!

బుద్ధదేవ్ ఎంత చెప్పితే అంత ప్రకాష్ కారత్, ఏచూరి సీతారాంలకు. వీళ్లిద్దరు చెప్పితే 'ఆంధ్రా మార్క్సిస్టు పార్టీ' వాళ్ళు గీత దాటరు. వారైన, వీరైన వినకుంటే ఏం చేస్తారు?

ఈ రాష్ట్ర ప్రభుత్వమేగా ప్రచురణలకు పార్టీకి సహాయం చేసేది...?' ఆలోచనలతో బుద్ధదేవ్ ఆఫీసుకు చేరుకున్నాడు.

తీర్మానాలు

అక్టోబరులో జరిగిన ప్రత్యేక సర్వసభ్య సమావేశ తీర్మానాలు

తెనాలికి చెందిన బిఫార్మసి విద్యార్థిని ఆయేషా మీరా 2007 డిసెంబర్ 26 అర్ధరాత్రి తర్వాత కృష్ణాజిల్లా ఇబ్రహీంపట్నంలోని దుర్గ హాస్టల్‌లో అత్యాచారానికి గురై కిరాతకంగా చంపబడింది. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించిన ఆయేషామీరా హత్యపై విజయవాడ మహిళా న్యాయస్థానం సత్యంబాబుకు యావజ్జీవ శిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. ఈ తీర్పు వెలువడిన తర్వాత బాధితులు కూడా దిగ్భ్రాంతి చెందారు. ఆయేషామీరా హత్యలో బాధ్యులయిన అసలు నిందితులను వదిలి సత్యంబాబును పోలీసులు ఇరికించారనే భావన ప్రజలలో ఉన్నది, బాధితులలో కూడా ఉన్నది. నిజానికి సత్యంబాబు ఆయేషామీరాను హత్య చేసాడని విశ్వసించే రుజువులు లేవు. బలమయిన సాక్ష్యాలు లేవు. అయినప్పటికీ సత్యంబాబుని న్యాయస్థానం దోషిగా నిలబెట్టింది. అనేక ప్రజాసంఘాలు సత్యంబాబుకి అండగా నిలబడ్డా, ఆయేషామీరా తల్లిదండ్రులు సత్యంబాబు అసలు దోషికాదు అంటున్నా సత్యంబాబు శిక్షకు గురి అయినాడు.

ఇటీవల కాలంలో విద్యార్థినులపై దాడులు పెరుగుతున్నాయి. స్త్రీల పట్ల హింసాత్మక ఘటనలు పెచ్చుమీరుతున్నాయి. వీటిని అదుపు చేయడంలో బాధితులకు న్యాయం చేయడంలో ప్రభుత్వాలు విఫలం చెందుతున్నాయి. ఆ నేపథ్యంలో ఆయేషామీరా హత్య కేసును చూడవలసి ఉన్నది. ఆయేషామీరా తల్లిదండ్రులు ఆక్రోసిస్తున్నట్లు అసలు నిందితులను శిక్షించే దిశగా పోలీసులు కదలాలని విరసం డిమాండ్ చేస్తున్నది.

***

బాబ్రీమసీదు కూల్చివేత వివాదంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు పట్ల విరసం తీవ్ర నిరసనను వ్యక్తం చేస్తోంది. చారిత్రక సాక్ష్యాధారాలతో, హేతుబద్ధతతో సంబంధం లేకుండా మెజారిటీ ప్రజల విశ్వాసాల మీద ఆధారపడి రాముడు జన్మస్థలం బాబ్రీమసీదులోనే ఉందని న్యాయస్థానం అభిప్రాయపడడం నిర్హేతుకమైన విషయం. విశ్వాసాల మీద ఆధారపడి చరిత్రలోని సంఘటనలను నిర్ధారించడం అహేతుకమూ, అచారిత్రకమూ. ఈ తీర్పు రాజ్యాంగంలోని నామమాత్రపు లౌకిక వాదానికి కూడా తూట్లు పొడిచేటట్లుగా ఉంది. ఇది చాలా ప్రమాదకరమైన తీర్పుగా విరసం భావిస్తుంది. విరసం తీవ్రంగా ఖండిస్తుంది. కూలగొట్టిన స్థలంలోనే తిరిగి బాబ్రీమసీదు నిర్మాణాన్ని చేపట్టాలని విరసం డిమాండ్ చేస్తోంది.

***

కాశ్మీర్‌లో ప్రభుత్వ హత్యాకాండ పేట్రేగిపోతున్నది. ప్రభుత్వ సాయుధ బలగాలు సాగిస్తున్న విచ్చలవిడి కాల్పులను, అత్యాచారాలను ఎడతెరపి లేకుండా విధిస్తున్న కర్ఫ్యూలను ధిక్కరిస్తూ మొత్తం కాశ్మీర్ లోయ అంతటా నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి. 'ఆజాదీ' (స్వాతంత్ర్యం) అనే నినాదంతో లోయ మారుమోగుతున్నది. 11 జూన్ 2010 నుంచి మొదలై నిరంతరాయంగా సాగుతున్న కాశ్మీరీ ప్రజల న్యాయమైన పోరాటాన్ని అణచివేయడానికి పారామిలిటరీ, సైనిక బలగాలు, పోలీసులు జరుపుతున్న కాల్పుల్లో ఇప్పటికి వందకుపైగా మంది అసువులు బాసారు. వీరిలో అత్యధికులు యువకులూ, పిల్లలే. వందలాదిమంది గాయపడ్డారు. నిరాయుధంగా, శాంతియుతంగా, న్యాయబద్ధంగా ప్రదర్శనలు చేస్తున్న కాశ్మీరి ప్రజలపై ప్రపంచంలోనే తమది అతి పెద్ద ప్రజాస్వామ్యమని చెప్పుకునే భారత పాలక వర్గాలు సాయుధ బలగాలను ఎగదోసి అత్యంత క్రూరంగా అణిచివేస్తున్నాయి.

కాశ్మీరి ప్రజలు ఎప్పుడూ తాము భారతదేశంలో అంతర్భాగమని భావించలేదు. 1947నాటికి రాజా హరిసింగ్ పాలనలో కాశ్మీర్ ఒక స్వతంత్ర్య రాజ్యంగా ఉండింది. భారత్, పాకిస్తాన్ పాలకవర్గాలు తమ తమ ప్రయోజనాల రీత్యా కాశ్మీరీయుల అభీష్టానికీ, ఆకాంక్షలకు పూర్తి విరుద్ధంగా చేరో కొంత భాగాన్ని తమ తమ దేశాల్లో కలిపేసుకున్నారు. ఆనాడు కాశ్మీరియుల నిరసనను చల్లబర్చడానికి నెహ్రూ ప్రభుత్వం కాశ్మీర్‌లో ప్లెబిసైట్ (ప్రజాభిప్రాయ సేకరణ) జరిపి ప్రజలు విడిపోతామని కోరుకుంటే స్వాతంత్ర్యాన్ని ఇస్తామని కాశ్మీర్ ప్రజలకూ, ఐక్యరాజ్య సమితికీ లిఖిత పూర్వకంగా వాగ్దానం చేసింది. ఆ వాగ్దానాన్ని నెహ్రూ నుండి ఇప్పటి సోనియా మన్మోహన్‌సింగ్‌ల ఆధ్వర్యంలోని యుపిఏ దాకా అధికారం చేపట్టిన ప్రతి పాలక పార్టీ తుంగలో తొక్కుతునే వస్తున్నాయి.

ఇప్పటికే స్వాతంత్ర్య ఆకాంక్షతో 80 వేల మంది కాశ్మీరీయులు సాయుధ బలగాల కాల్పుల్లో చనిపోయారు. వేలాది మందిని మాయం చేశారు. జాతి స్వాతంత్ర్య కోసం, స్వయం నిర్ణయాధికారం కోసం కాశ్మీరీ ప్రజలు సాగిస్తున్న ఉద్యమం పూర్తిగా న్యాయమైందని విరసం భావిస్తోంది. కాశ్మీర్ ప్రజలపై ప్రభుత్వ సాయుధ బలగాలు కొనసాగిస్తున్న హత్యాకాండకు వ్యతిరేకంగా, కాశ్మీరీయుల న్యాయమైన పోరాటానికి విరసం సంఘీభావం ప్రకటిస్తోంది. ప్రభుత్వ సాయుధ బలగాలు కాశ్మీరులో సాగిస్తున్న హత్యాకాండను వెంటనే నిలిపివేసి కాశ్మీర్‌లో ప్లెబిసైట్‌ను నిర్వహించి, కాశ్మీరీయులకు తమ భవిష్యత్తును తామే నిర్ణయించుకునే అధికారం ఇవ్వాలని విరసం డిమాండ్ చేస్తోంది.

***

పుస్తక పరిచయం

దండకారణ్య మహిళా ఉద్యమ చరిత్ర

- ఎం. రత్నమాల

(గత సంచిక తరువాయి...)

పితృస్వామ్య వ్యతిరేక పోరాటాలు

తెగ పితృస్వామ్యాన్ని ఎదిరిస్తూ

నేటి ఆదివాసీ సమాజం సమాజ అభివృద్ధి క్రమంలో, మోర్గాన్ నిర్వచించిన అనాగరిక యుగపు ఎగువదశకు చేరి, పైనుండి చొచ్చుకు వస్తున్న సామ్రాజ్యవాద ఆర్థిక విధానం ఒత్తిడితో అది వక్రమార్గం పట్టింది. సమూహాలనుండి గణ వ్యవస్థకు, గణ వ్యవస్థ నుండి వర్ణ వ్యవస్థ, భూస్వామ్య సమాజం వైపుగా రూపు దిద్దుకుంటున్న క్రమంలో స్వంత ఆస్తితో పాటు పితృస్వామ్యం వ్యవస్థీకృతమైంది. స్త్రీని సొంత ఆస్తిగా మలచుకోవడం, ఆమెపై సర్వాధికారాలు సాధించడం, కాలి కింద అణచివుంచడం-ఒక్క మాటలో చెప్పాలంటే ఆమె మెదడు - శరీరమై పూర్తి నియంత్రణ - పెత్తనం సాగించడం కోసం మాటల్లో చెప్పనలవి కాని పితృస్వామిక హింస అనేక రూపాలలో అమలవుతున్నది.

ఆదివాసీ మహిళ ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక అణచివేతలతో పాటు తెగ పితృస్వామ్యాన్ని కూడా అనుభవిస్తున్నది. ఆరుగాలం కష్టం చేసి ఇంటికి వచ్చి గాదెలో నిండిన ధాన్యాన్ని ముట్టవద్దంటే మిన్నకుండి పోయింది. ఇష్టంలేని మనువుకు మనస్సు చంపుకుని తలవంచింది. మనువాడిన మగనితో మనసు పొసగకు మనసైన వాడికోసం అన్వేషణలో 'తిరుగుబోతు' (కర్దె) గా ముద్ర వేయించుకొని అవమానాలకు, అత్యాచారాలకు గురైంది. కని పెంచిన పిల్లల మీద హక్కును కోల్పోయి మమతను చంపుకోలేక తల్లడిల్లింది. పెళ్లి కాగానే అత్తారింట రవికెను తీసేసి అర్ధనగ్నం చేస్తే అవమానాన్ని మౌనంగా దిగమింగింది.

అయితే కెఎంఎస్ విస్తరిస్తున్న ప్రాంతాల్లో పై పరిస్థితుల్లో చాలా మార్పు ఉంది. కొన్ని రకాల అణచివేతలు పూర్తిగా అంతరించే దశలో ఉన్నాయని చెప్పుకోవచ్చు. కెఎంఎస్ పనిచేస్తూ బలపడిన చోట అభ్యుదయ మార్పు అప్రయత్నంగానూ, అసంకల్పితంగానూ మహిళలను సంఘటితం చేసి పోరుబాట పట్టించింది. ఆ పోరాటాలు మహిళల జీవితాలపై మొత్తంగా ఇక్కడి సమాజంపై విశేషమైన ప్రభావాన్ని వేశాయి.

'కెర్దెల ఆక్రోశం'

ఆదివాసీ సమాజంలో ఆడపిల్ల తండ్రికి హోదా ఎక్కువ. సమాజంలో ఆడపిల్లకున్న విలువ ఆయనకు ఆ హోదానిచ్చింది. తన బిడ్డ ఇష్టాయిష్టాలతో ఏ మాత్రం ప్రమేయం లేకుండా 'నా బిడ్డను నీకిచ్చి పెళ్లి చేస్తాను' అని ఒప్పందాలు చేసుకుంటాడు తండ్రి. తండ్రి చేసిన వాగ్దానానికి బలైన బిడ్డ, నచ్చని మగనితో కాపురం చేయలేక ఇటు తల్లిగారింటికి పోలేక నడిసంద్రంలో నావ అవుతుంది. ఆమె తన మనసు మెచ్చిన వాడిని మనువాడటం కోసం రాత్రింబగళ్లు అడవిలో ఒంటరిగా తిరుగాడే యువతులను 'కర్దె' (తిరుగుబోతు) అంటారు. ఇలా తిరుగుతుండగా పొరపాటున పెద్దమనుషుల చేత చిక్కితే 'శిగ' లు కోసి వదిలేస్తారు. ఆ సందర్భంగా ఆ ఊరి యువకులంతా ఆమెను అనుభవించే అధికారం తెగ పితృస్వామ్యం వారికిచ్చింది. ఇలా అనుభవించిన వారిలో నుంచి ఒకరిని, చివరగా ఆమెను అనుభవించిన వానితో కాపురానికి వెళ్లి స్థిరపడిపోతుంది. ఈ సంప్రదాయంలోని దుర్మార్గం అనుభవించిన మహిళలు తలవంచారు. అవమానాన్ని జీర్ణించుకోలేని మహిళలు 'పురుగు మందు'ను ఆశ్రయించారు. ఎదిరించి నిలిచిన వారు 'రాగో' లుగా చరిత్రను నిర్మిస్తున్నారు.

మేనరికపు పెళ్లి

మేనరికపు పెళ్లిని 'ఫుటుల్ మర్మి' (గూడ) (నిశ్చితార్థం చేయడం) అంటారు. 'కల్లు ఉహతన' (కల్లుతాగడం) అంటారు. ఇది ఇక్కడి వివాహ పద్ధతుల్లో ఒక ఆచారంగా అమలులో ఉంది. తమ ఇంటి ఆడపడచు మరో ఇంటికి పోయినా ఆమె సంతానంపై ముఖ్యంగా ఆడ సంతానంపై పుట్టింటివారికి సర్వహక్కులు కల్పించింది తెగ ఆచారం. దీనినే 'ఫుటుల్' (మేనరికపు) హక్కు అంటారు. పుట్టిన బిడ్డ చిన్నగా ఉన్నప్పుడే 'మాల' చేస్తారు. అంటే ఆ బిడ్డను తన కొడుక్కి నిశ్చయం చేసుకుంటారు. పిల్లవాడి తల్లిదండ్రులు ఒక సీసా ఇప్పసారా తీసుకొని వియ్యానికి వస్తారు. నా కొడుకుని పెళ్లి చేసుకుంటావా అని అంటే ఆటలాడే వయసులో అంగీకారంగా 'ఇంగొ' అంటుంది. ఆ తదుపరి కాలంలో పెరుగుతున్న వయసుతో పాటు రూపుదిద్దుకున్న అభిష్టాలకు, పాత ఆచారానికి ఘర్షణ మొదలవుతుంది. కాలం చెల్లిన ఆచారానికి, జీవిత సహచరుల ఎంపికలో స్వేచ్ఛ కోసం పరితపించే ప్రజాస్వామిక ఆకాంక్షకూ నడుమ వైరుధ్యం 'బలవంతపు పెళ్ళి' రూపంలో ముందుకు వస్తుంది. విప్లవ పార్టీ, విప్లవ ప్రజాసంఘాలు కాలం చెల్లిన ఆచారాన్ని వ్యతిరేకిస్తూ దాని నుండి వచ్చే అనర్థాలను ప్రజలకు అర్థం చేయిస్తున్నారు. అందులో భాగంగా కెఎంఎస్ ఈ ఆచారానికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నది.

దండకారణ్య వ్యాప్తంగానే ఈ ఆచారం ఉంది. ఉత్తర, దక్షిణ, పశ్చిమ బస్తర్‌ల నుండి మాడ్ పీఠభూమి మీదుగా గడ్‌చిరోలి వరకు ఇది అమలులో ఉంది.

గంధర్వ వివాహ పద్ధతి

గోటుల్ వద్ద యువతీ యువకులు సామూహిక నృత్యం చేస్తూ పాటలు పాడుకోవడం కోయ సంస్కృతిలో ఒక సాంప్రదాయం. అన్నా చెల్లెల్లు, బావా మరదళ్లు, వావి వరసలు కలిసిన వారు ఎవరైనా జట్టు కట్టి నృత్యంలో పాల్గొంటారు. వయసు వచ్చిన యువతీ యువకులు తమ ఈడుకు జోడును వెతుక్కోవడానికి ఇది ఒక మంచి సందర్భం. పరస్పరం ఆకర్షణ రూపంలో నృత్యానికి జట్టు కల్పటానికి చెయ్యి అందించే దగ్గర ప్రేమ బీజాలు నాటుకుంటాయి. ఉంగరాలు మార్చు

కోవడం, చేతి రుమాళ్లు మార్చుకోవడం, దట్టించిన పొగాకును చేతిలో పెట్టడం ద్వారా పరస్పర సంకేతాలు ప్రసారమవుతాయి. మనసులు కలిసినాక తమ ప్రేమకు కార్య రూపం ఇవ్వడానికి ప్రణాళిక సిద్ధమవుతుంది. యువతి ఏదో పని సాకుతో అతడి ఇంటికి వచ్చి అతని ఆర్థిక స్థితిగతుల్ని అంచనా వేసుకుంటుంది. తర్వాత తన బట్టలు చంకన పెట్టుకుని అతని ఇంటికి వచ్చేస్తుంది. పిల్లగాని తల్లిదండ్రులు పిల్ల తల్లిదండ్రులకు విషయం తెలియజేస్తారు. తమ ఆర్థిక స్తోమతను బట్టి ఏడాదికో, రెండేళ్లకో పెళ్లి తంతును ముగిస్తారు. ఈ తరహా వివాహ పద్ధతిలో డబ్బు, హోదాల ప్రస్తావన ప్రమేయం ఉండదు. సహచరులను స్వేచ్ఛగా ఎంపిక చేసుకునే ప్రజాస్వామిక అంశం ఈ తరహా పెళ్లి పద్ధతిలో ఉంది. దీన్ని కోయలో 'లోన్ హొడియన' (ఇల్లు చొచ్చడం) అంటారు. ఈ వివాహ పద్ధతిని కెఎంఎస్ బలపరుస్తూ వీటిని సాధారణీకరించే కృషి చేస్తున్నది.

ఇలా ఇల్లు జొచ్చిన ఆడపిల్లలను తల్లిదండ్రులు వచ్చి తిట్టుకుంటూ కొట్టుకుంటూ బలవంతంగా తీసుకుపోయిన సందర్భాలు, తమకు నచ్చిన యువకునికి కట్టబెట్టిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఉదాహరణకు దక్షిణ్ బస్తర్‌లోని కుంట ప్రాంత మానుగూడలో జరిగిన ఘటన చూద్దాం.

గంగి, అందె, భీమె, కోసిలతో సహా మొత్తం ఐదుగురు ఆ గ్రామ కెఎంఎస్ కార్యకర్తలు. ఇది 1999 నాటి సంఘటన. వీరు ఐదుగురు తమకు నచ్చిన యువకులతో సహజీవనం ప్రారంభించారు. వీరిలో అందె, భీమెల తల్లిదండ్రులు తమ బిడ్డల నిర్ణయాన్ని ఆమోదించారు. మిగతా ముగ్గురు యువతుల తల్లిదండ్రులు మేనరికం పెళ్లి చేయాలనుకున్నారు. గంగి తండ్రి తన కూతురుకు తమ ఊరికి దూరంగా ఉండే తమ బంధువుతో పెళ్లి చేసారు. అయినా గంగి వినలేదు. తను ప్రేమించిన యువకుని ఇంటికి పారిపోయింది.

కెఎంఎస్, డివికెఎంఎస్ స్థానిక దళం కలిసి పంచాయతీ నిర్వహించాయి. యువతులు తాము ఇష్ట పడుతున్న వ్యక్తులతోనే సహజీవనం చేస్తామనీ తమ కాపురాలను విచ్ఛిన్నం చేయవద్దని మాట్లాడారు. తమ దౌర్జన్యం సాగదని గమనించిన యువతుల తల్లిదండ్రులు 'మీ ఇష్టం' అన్నారు.

రాక్షస పెళ్లి

ఇక్కడి కోయ సమాజంలో రాక్షస పెళ్లి పద్ధతి మహిళల పట్ల హింసాత్మక పద్ధతులలోనే అమలవుతున్నది. యువతి ఇష్టానిష్టాలతో సంబంధం లేకుండా తనకు నచ్చిన యువతిని యువకుడు తన జట్టుతో కలిసి ఎత్తుకుపోయి పెళ్లిచేసుకునే రాక్షస వివాహ పద్ధతి కూడా స్త్రీలను అణచివేసే సాంఘిక దురాచారంగా ఇక్కడ ఉన్నది. ఈ పద్ధతులకు వ్యతిరేకంగా కెఎంఎస్ పని చేస్తుంది.

కుండ మార్పిడి

కుండ మార్పిడి విధానం ఈ ప్రాంతంలో బలంగానే ఉంది. వ్యక్తుల ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా వస్తుమార్పిడితో పోలిన ఈ విధానానికి బలవుతున్న మహిళలెందరో. గుజ్జాల్ చెల్లిదీ అదే గాథ.

దక్షిణ బస్తర్ డివిజన్‌కు చెందిన నేషనల్ పార్క్ దళం ఏరియాలోగల సండ్ర రేంజి గ్రామం పీలూరుకు చెందిన గుజ్జాల్ పక్కూరుకు చెందిన భీమాల్ చెల్లిని పెళ్లి చేసుకున్నాడు. కన్యాశుల్కం ఇచ్చుకోలేని అతను ప్రతిగా తన చెల్లిని భీమాల్‌కు 'ఇవ్వడానికి' ఒప్పుకున్నాడు. భీమాల్ చెల్లి ఇష్టమేంటో, గుజ్జాల్ చెల్లి ఇష్టమేంటో ఎవ్వరూ పట్టించుకోలేదు. అయితే పెళ్లి కాకముందే భీమాల్ చనిపోయాడు. ఇప్పుడు గుజ్జాల్ ముందు రెండు సమస్యలున్నాయి. తన చెల్లిని భీమాల్ తమ్ముడికి 'ఇవ్వడం', లేదంటే భీమాల్ కుటుంబానికి కన్యాశుల్కం చెల్లించడం. కన్యాశల్కం ఇచ్చుకోలేని గుజ్జాల్, భీమాల్ తమ్ముడితో తన చెల్లి పెళ్లి చేయాలనుకున్నాడు. కానీ భీమాల్ తమ్ముడు గుజ్జాల్ చెల్లికంటే చిన్నవాడు కనుక ఈ పెళ్లి గుజ్జాల్ చెల్లికి ఇష్టం లేదు. కానీ ఆమె ఇష్టాయిష్టాలు ఎవరికీ అవసరం లేదు కనుక ఈ పెళ్లిని ఆమోదిస్తూ రెండు గ్రామాల పెద్దలూ సారాతో విందు చేసుకున్నారు. పెళ్లి తంతు ఒక రకంగా ముగిసినట్టే.

కానీ ఈ పెళ్లి ఇష్టం లేని గుజ్జాల్ చెల్లి వంగాల్ అనే యువకుడి 'ఇల్లు జొచ్చింది'. వంగాల్‌కు కూడా ఆమె అంటే ఇష్టమే. కానీ అప్పటికే సారా తాగిన పెద్దలు ఒప్పుకోరు కదా! వాళ్లు భీమాల్ తమ్ముడిని తీసుకు వచ్చి వంగాల్ ఇంట్లో వదిలి, అతడ్ని చేసుకోవాల్సిన అమ్మాయి వంగాల్‌ను చేసుకుంది కనుక వంగాల్ కుటుంబమే అతడికి (భీమాల్ తమ్ముడికి) పెళ్లి చేయాలని నిర్ణయించారు. ఆ పెళ్లి చేయడం కష్టమని భావించిన వంగాల్ తల్లిదండ్రులు కోరి వచ్చిన కోడలిని వెళ్లగొట్టారు.

ఆ అమ్మాయికి తలదాచుకునే నీడ కరువైంది. నీడను వెతుక్కునే ప్రయత్నంలో భాగంగా సప్‌మర్క గ్రామంలో మంగ్రూ అనే యువకుడిని పెళ్లి చేసుకోవాలనుకుని అతడి వద్దకు వెళ్లింది. కానీ పెద్దలు బలవంతంగా లాక్కొచ్చి భీమాల్ తమ్ముడితోనే ఉండాలన్నారు. మనసు చంపుకోలేని ఆమె మళ్లీ పారిపోయింది. కానీ పెద్ద మనుషులు తాము లాక్కొచ్చిన విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్త పడ్డారు. ఆలస్యంగా ఈ వార్త సంఘాలకూ, దళానికీ తెలిసింది. కెఎంఎస్, డివికెఎంఎస్ వాళ్లు దళంతో కలిసి ప్రజాపంచాయితీ నిర్వహించారు.

మహిళల మరణానికి దారి తీస్తున్న ఇటువంటి పెళ్లిళ్ల గురించి ఏం చేద్దామనే ప్రశ్న పంచాయితీ నిర్వాహకులనుండి వచ్చింది. అందరికీ గుజ్జాల్ దోషిలా కనపడ్డాడు. ఆవేశాన్ని ఆపుకోలేక అతన్ని కొట్టారు. పంచాయితీ నిర్వాహకులు అడ్డుపడి గుజ్జాల్‌ను కాపాడారు. ఇది గుజ్జాల్ తప్పో, మరొకరి తప్పో కాదనీ పితృస్వామ్యంపై ఆధారపడిన దోపిడీ వ్యవస్థలోనే దీని మూలాలున్నాయనీ వివరించారు. ఈ వ్యవస్థను నిర్మూలించినప్పుడే మహిళా విముక్తి అవుతుందని వివరించారు. మహిళలు సంఘటిత పోరులో మరింతగా కదిలి రావాలని పిలుపునిచ్చారు.

కులాంతర వివాహాలు

దండకారణ్యంలో దొర్ల, మురియ, రాజగొండు, మాడియా, హల్బి, బతరా, ఉరావ్, ఒతకర్ మొదలైన తెగలున్నాయి. వీరుగాక గాండొ, మహర్, ప్రధాన్‌లుగా పిలిచే దళితులున్నారు. ఈ తెగలలో దొర్ల, రాజగొండు, హల్బి అభివృద్ధి క్రమంలో ఒకడుగు ముందుండి మిగతా కులాల వారిని 'గొట్టొల్లు', 'గోండులు' అని వ్యవహరిస్తూ

కుల వ్యత్యాసాలను పాటించడం కనిపిస్తుంది. ఈ తెగల మధ్య వివాహ సంబంధాలు నిషేధించారు. తమకు తాము అధికృత గల కులంగా భావించేవాళ్లు మిగతా కులాలను చిన్నచూపు చూడడం కనిపిస్తుంది.

వ్యవసాయంతో పాటు దానికి సహాయంగా ఉండే పనులు - నాగళ్లు చెక్కడం, ఇనుప కర్రులు, కొడవళ్లు, గొడ్డళ్లు సాన బెట్టడం, కుండలు చేయడం, బుట్టలు అల్లటం, చేపలు పట్టడం - లాంటి పనులు చేసేవారు ఊరికొకరు కనిపిస్తారు. ఈ పనులు చేసే వారిని ఆ వృత్తి పేరులో 'కొలిసె', 'కుమ్మ', 'జారామి', 'వడ్లల్' - పిలుస్తూ వారిని తమ నుండి వేరు చేసి తక్కువ కులంగా చూడడం కనిపిస్తుంది.

కులాంతర వివాహం చేసుకుంటే 'విట్టడ్' పేరుతో వెలివేస్తారు. ముఖ్యంగా దేవుని దగ్గరకు రానీయరు. ఒక మేకనో, పందినో, కోడినో ఇచ్చి దేవత కోపాన్ని పోగొట్టుకోవచ్చు. ఈ తంతు జరిగినాక పిల్ల - పిల్లాడిని తమలో కలిపేసుకుంటారు.

ఈ కులాల అడ్డుగోడ ఎంతో మంది జంటల ప్రేమను భగ్నం చేసింది. భగ్న ప్రేమికులు, ముఖ్యంగా యువతులు దిక్కుతోచక విషాన్ని ఆశ్రయించిన ఘటనలు కూడా అక్కడక్కడ జరిగాయి. అయితే అటువంటి యువతులకు ధైర్యాన్ని ఇచ్చి అండగా నిలబడడానికి కెఎంఎస్ తన శాయశక్తులా కృషి చేస్తున్నది.

జీవపారె (కన్యాశుల్కం)

మాతృస్వామిక సమాజ అవశేషంగా మిగిలిన ఆచారం 'కన్యాశుల్కం'. ఆడపిల్ల తల్లిదండ్రులకు మగపిల్లవాని తల్లిదండ్రులు ఇచ్చుకునే కట్నం. ఇదే 'జీవపారె'. 100 - 150 రూపాయల ఖర్చుతో ఒక ఆచారంగా ఉండే జీవపారె బయటి సంస్కృతి ప్రభావంతో 20, 30, 50 వేలు డిమాండ్ చేసే వరకూ పెరిగిపోయింది. సామ్రాజ్యవాదం వ్యాపింపజేస్తున్న వస్తు వ్యామోహ సంస్కృతి ఇలాంటి అడియాశను పెంచి పోషిస్తున్నది. కెఎంఎస్ ఇందులో జోక్యం చేసుకొని జీవపారె 1500 నుండి ఐదువేలకు దాటరాదని నిర్ణయించింది. ఇది కూడా షరతుగా అమలుచేయకూడదనీ, దాన్ని ఆచారంగానే పాటించాలనీ, డబ్బు సంస్కృతిని తన్ని తరమాలనీ కోరింది. ఆర్థికంగా ఆ కుటుంబం స్థితిగతులను దృష్టిలో పెట్టుకొని దీన్ని అమలు చేయాలని నిర్ణయించింది.

బహుభార్యాత్వానికి వ్యతిరేకంగా

ఆదివాసీ మహిళపై వివాహేతర సంబంధాలపై నిషేధం ఉన్నది. వివాహం తర్వాత పురుషుడు పరాయి స్త్రీలతో సంబంధాలు పెట్టుకోవడానికీ, మరో వివాహం చేసుకోవడానికీ ఆమోదం ఉన్నది. భర్త ఎన్ని వివాహాలైన చేసుకోవచ్చు. దీనిపై ప్రతి బంధకం ఏదీ లేదు. అయితే ఇక్కడ ఇద్దరినీ తేవడం సాధారణంగా కనిపిస్తుంది. ముగ్గురు భార్యలు ఉన్న కేసులు అరుదుగానే కన్పిస్తాయి.

ఆదివాసీ సమాజంలో బహుభార్యత్వం సర్వసాధారణంగా ఉండేది. ఆదివాసీ స్త్రీలు వ్యవసాయం పనుల్లో కూడా భాగం పంచుకుంటారు. కనుక కుటుంబంలో ఒక మనిషి పెరిగితే ఎక్కువ ఉత్పత్తి జరుగుతుందనే ఆస్తుల సంపాదనా ఆశ కూడా బహుభార్యత్వానికి కారణమే. బహుభార్యత్వానికి మరో కారణం ఈ ప్రాంతంలో చిన్నపిల్లవాడికి అతనికంటే వయసులో పెద్ద అమ్మాయిని ఇచ్చి పెళ్లి చేయడం ఉంది. పిల్ల పెద్దగా ఉంటే వ్యవసాయపు పనుల్లో తమకు అండగా ఉంటుందని ఆలోచించి పిల్లవాడి తల్లిదండ్రులు ఇలాంటి పెళ్లిళ్లు చేస్తారు. ఆ పిల్లవాడికి యుక్త వయస్సు వచ్చేసరికి ఆయన సహజంగానే తనకంటే వయసులో పెద్ద అయిన స్త్రీకంటే సమాన వయస్కురాలైన స్త్రీ వైపు మొగ్గు చూపుతాడు. దానితో మొదటి భార్యకు కష్టాలు మొదలవుతాయి. ఇలాంటి కాలం చెల్లిన పద్ధతులతో స్త్రీలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. కాబట్టి వాటిని రద్దు చేయాలని కెఎఎంఎస్ నిరంతరం ప్రచారం చేసింది. అయినా ఇటువంటి ఘటనలు అక్కడక్కడా జరుగుతూనే ఉన్నాయి.

బహుభార్యత్వంతో భార్యా-భర్తల నడుమ తలెత్తే వైరుధ్యాలను కెఎఎంఎస్ సామరస్య పూర్వకంగానే పరిష్కరించే ప్రయత్నం చేసింది. బొంగారం గ్రామంలో జరిగిన ఒక ప్రజా పంచాయతీని పరిశీలిద్దాం. సోమాల్ అనే వ్యక్తికి ఇద్దరు భార్యలు. మొదటి భార్యకు నలుగురు కొడుకులు. ఆమెను వదిలేశాడు. పిల్లల్నీ, ఆస్తినీ ఏమీ ఇవ్వలేదు. ప్రజాపంచాయతీ జరిగి అతనికి గల భూమిని రెండు వాటాలు వేసి సమానంగా పంచి భూమితో పాటు పిల్లలను కూడా వాలసు ఇప్పించారు. ఇది మొత్తం గ్రామంపై ముఖ్యంగా మహిళలపై మంచి ప్రభావం చూయించింది.

అయితే కొన్ని చోట్ల కెఎఎంఎస్ తొందరపాటుకు గురై దేహశుద్ధులు, కాళ్లు మొక్కించడాలు, భార్యతో భర్తని కొట్టించడం లాంటి తీర్పులిచ్చింది. ప్రజల మధ్యన సామరస్యపూర్వకంగా పరిష్కారం అయ్యే, శత్రుపూరితంకాని వైరధ్యాన్ని పరిశీలించి, పరిష్కారం చూయించడంలో దూరదృష్టితో ఆలోచించలేకపోయింది.

సమాజాన్ని వెనక్కి తిప్పే దుష్టయత్నం 'సల్వాజుడుం'

సల్వాజుడుం ఫాసిస్టు సైనిక దాడి సన్నాహాలలో భాగంగా భూస్వామ్య వర్గాల ప్రతినిధులైన మహేంద్రకర్మ లాంటి వాళ్లు, 'ఇద్దరు భార్యల్ని చేసుకుందాం! చేసుకుందాం!' అంటూ ఆదివాసీల్లో ఉండే అభివృద్ధి నిరోధక శక్తుల్ని కూడగట్టాడు. మహిళా సంఘం చేతిలో శిక్షలకు గురైనవారు సల్వాజుడుంకు ఏదో మేరకు వనరుగా ఉపయోగపడ్డారనేది నిర్వివాదమైన వాస్తవం.

సల్వాజుడుం కెఎఎంఎస్‌పై అంతులేని అసహనాన్ని ప్రదర్శించింది. మహిళలపై అమలవుతున్న ఏ తెగ పితృస్వామిక అణచివేతను అది అంతం చేయాలనుకుంటున్నదో జుడుం సరిగ్గా ఆ అణచివేతనే పటిష్టం చేయాలనుకుంటోంది. ఇన్నేళ్ల పోరాటం ద్వారా కెఎంఎస్ సాధించిన విజయాలను తలకిందులు చేయడానికి విఫల ప్రయత్నం చేసింది, చేస్తున్నది.

వివాహ వ్యవస్థలో మహిళలపై అమలయ్యే మానసిక-శారీరక హింసలను నిర్మూలించడం కోసం, వివాహ వ్యవస్థను ప్రజాస్వామికీకరించడం కోసం కెఎంఎస్ పోరాడుతోంది. అందులో భాగంగా బలవంతపు పెళ్లిళ్లను వ్యతిరేకిస్తూ, స్వేచ్ఛాపూరిత ఎంపికనే పెళ్లిళ్లకు ప్రాతిపదికగా ఉండాలని కెఎఎంఎస్ ఇన్నాళ్లుగా పోరాడుతుంటే జుడుంలో ఎత్తుకుపోయి శిబిరాల్లో నిర్బంధించిన యువతులకు బలవంతంగా పెళ్లిళ్లు చేస్తున్నారు. జుడుం కాలంలో తిరిగి తలెత్తిన 'ఇప్పుడు మాకు బలవంతంగా అమ్మాయిలను

ఎత్తుకుపోయే అవకాశం వచ్చింది. మాకు ఎలాంటి అడ్డంకి లేదు,' 'మహిళా సంఘం ఏర్పడ్డాక అమ్మాయిలకు ఇష్టం లేకుండా కల్లు తాగొద్దన్నారు. కల్లు తాగితే అమ్మాయిలు వెళ్లి సంఘంకు చెప్తామని బెదిరించేవారు. ఇప్పుడు చెప్పమనండి' అని విర్ర వీగుతున్నారు.

ఒకవైపు కెఎఎంఎస్ బహుభార్యాత్వానికి వ్యతిరేకంగా పోరాడుతుంటే, జుడుం రెండు ముత్తి తత్తనాడ, తత్తనాదే (ఇద్దరు భార్యలను చేసుకోవాల్సిందే, చేసుకోవాల్సిందే) అనే నినాదాన్ని తీసుకుంది. కొన్ని ప్రాంతాలలో యువతీ-యువకుల మధ్య గోటుల్‌లో ఏర్పడుతున్న వివాహ పూర్వ లైంగిక సంబంధాలు అంతిమంగా స్త్రీలకే ఇబ్బందిగా పరిణమిస్తుండడం వల్ల కెఎఎంఎస్ గోటుల్ సంస్కృతిని సరిదిద్ది విప్లవీకరించే ప్రయత్నం చేస్తోంది. కానీ, జుడుం దీన్ని వక్రీకరించి ఆదివాసీ సంస్కృతిపై విప్లవోద్యమ దాడిగా ప్రచారం చేస్తోంది. అంతేకాదు వావి వరుసలు లేని లైంగిక సంబంధాలను ఆదివాసీ సమాజంపై రుద్దుతోంది. అక్కాచెల్లెళ్లు వరుస అయ్యే వారిని జుడుం గూండాలు అత్యాచారం చేయడం ఇందులో భాగమే. అందుకే 'చెల్లీ, తల్లీ అంతా భార్యలే, ఇది భార్యల పంట' అని నినదిస్తున్నారు.

కుర్మలోను

బహిష్టు అయిన మహిళలు ఉండే గుడిసెలను 'కుర్మలోను' అంటారు. బయటి నాగరిక సమాజం లాగానే ఇక్కడ కూడా బహిష్టుని మైలగానూ, అపవిత్రంగానూ పరిగణిస్తారు. సంతానం పునరుత్పత్తికి ఈ మైల ఎంత అవసరమో శాస్త్రీయంగా విశ్లేషించి అర్థం చేయిస్తే తప్పకుండా ఒప్పుకుంటారు. దీన్నే 'శిక్షణ' అంటాం. శిక్షణ ద్వారా భావాలను విప్లవీకరించి మార్పును తీసుకురావడానికి ఓపికతో కూడిన దీర్ఘకాల కృషి అవసరం. ఈ ప్రక్రియను వదిలేసి 'కుర్మలోను' కాలబెట్టడం వలన మహిళలకు ఒరిగిందేమీ లేదు. ఊరి చివరి నుండి వారి నివాసం అడవిలోకి మారి పురుగు పుట్రల ప్రమాదం ముందటి కంటే ఎక్కువైంది. కెఎంఎస్ తాను తీసుకున్న ఈ కార్యక్రమం మూలంగా మహిళలకూ మహిళా సంఘానికి వీసమెత్తు ప్రయోజనం రాలేదు. సరికదా నష్టాన్నే చేకూర్చిందని సమీక్షించింది.

ధాన్యపు గదిలోంచి వడ్లు తీయడం

ధాన్యపు గది, గాదెల లోకి ధాన్యం చేరినంక మహిళలు ఆ గదిలోకి రావడం, గాదెల లోంచి ధాన్యం తీయడంపై నిషేధం ఉన్నది. మహిళలను ఆస్తి హక్కునుండి దూరం చేసే ప్రక్రియలో భాగంగా ఈ నిషేధం అమలవుతున్నది. సంస్కృతితో ముడిపడిన ఒక సాంప్రదాయిక భావజాలం (సెంటిమెంటు) దాని చుట్టూ అల్లబడి ఉన్నది. ఈ భావజాలం ఒక చర్యతో అమాంతం మాసిపోయేది కాదు. కొన్ని సందర్భాలలో ఆవేశపూరిత చర్యల వలన వ్యతిరేక పరిణామాలను ఎదుర్కోవలసి వస్తుంది. 'తక్కొల్లాడులోను హొడియాన' ఆడపిల్లలు ధాన్యపు గదుల్లోకి ప్రవేశం అనే క్యాంపెయిన్ మూలంగా కెఎఎంఎస్ ఇటువంటి పరిణామాలనే ఎదుర్కొన్నది.

రవికెలు తీసివేయడానికి వ్యతిరేకంగా

పెళ్లయిన మహిళ మగాడి ఆస్తి. ఈమె నా భార్య, నా సొత్తు అని ప్రపంచానికి చాటాలి. పెళ్లయిన గుర్తు, ఆమె ఒంటి మీద కనిపించాలి. అప్పుడే పరాయి పురుషుడు ఆమె వైపు కన్నెత్తి చూడడు. ఇది ప్రపంచానికి తెలియాలి. ఆ గుర్తు ఒక దగ్గర పుస్తెల తాడు, నల్లపూసలు, మెట్టెలు, గాజు, పాపిడి నిండా నింపే కుంకుమ, ఎర్రగాజు, తెల్లగాజులా దర్శనమిస్తే ఇక్కడ మొరటుగా రవికెను తొలగిస్తారు. ఇది ఇక్కడ మగవాడి శాసనం. మాడియా సాంప్రదాయంలో ఈ ఆచారం పాతుకొని ఉన్నది.

పెళ్లి కాకముందు రవికెలు వేసుకునే స్వేచ్ఛ ఉన్నప్పటికీ పెళ్లి కాగానే బలవంతంగా రవికె తొలగించేస్తారు. ఒకవేళ పెళ్లి కాగానే తీయడానికి మహిళలు నిరాకరిస్తే ఆఖరికి పిల్లలు పుట్టగానే అయినా తీసేయాలి. అలా తీసివేయడానికి నిరాకరించిన మహిళలను హింసిస్తారు, దౌర్జన్యంగా తొలగించేస్తారు. ఏడ్చి మొత్తుకున్నా కనికరించరు. ఈ సాంప్రదాయం పాటించడానికి 'మహిళలు రవికె తొడుక్కుంటే దేవుడికి కోపం వస్తుంది' వంటి మూఢనమ్మకాలెన్నో ప్రచారంలో ఉన్నాయి.

ఈ సంస్కృతిని మార్చడం కోసం కెఎఎంఎస్ మహిళలను సంఘటితం చేస్తూ పోరాటాలు చేపట్టింది. రవికెలు బలవంతంగా తొలగించే అధికారం ఎవరికీ లేదనీ, రవికెలు తొడుక్కునే హక్కు కోసం పోరాడాలనీ మహిళలను ప్రోత్సహించింది. విప్లవోద్యమం ప్రారంభకాలంలోనూ, ఆ తదుపరి కాలాల్లోనూ భామ్రాగఢ్, పెరిమిలి, గట్ట ఏరియాలలో పార్టీ, మహిళా సంఘం రవికెలు తొడిగించే కార్యక్రమం తీసుకున్నాయి.

ఇప్పుడు కెఎఎంఎస్ ప్రచార, పోరాటాల ఫలితంగానూ, మొత్తంగా ఆదివాసీ సమాజానికి 'బైటి' సమాజంతో పెరుగుతున్న సంబంధాల కారణంగానూ యువతులెవరూ రవికెలు లేకుండా దాదాపుగా ఉండడం లేదు (ఇంకా మినహాయింపులు ఉన్నప్పటికీ). వయసు మళ్లిన స్త్రీలలో ఇప్పటికీ రవికెలు లేకుండా ఉండడం అనేది కొన్ని చోట్ల కొనసాగుతోంది. అయితే ఒక తెగ సంప్రదాయంగా, హింసగా రవికెలు తీసేయడం అనే అనాచారం పోయింది మాత్రం కచ్చితంగా కెఎఎంఎస్ కృషి మూలంగానే అని చెప్పవచ్చు.

అత్యాచార బాధితులకు అండగా

తమను తాము 'నాగరికులు'గా చెప్పుకునే వాళ్లు, ఆదివాసులకు లైంగిక కట్టుబాట్లు ఉండవని ప్రచారం చేశారు. ఆదివాసీ మహిళల జీవితం పెళ్లికి ముందు ఆటపాటలతో ఆనందంగా ఉంటుంది. ఒంటి నిండా బట్ట, ఇతర అలంకరణలకు తెగ పెద్దల అనుమతి ఉంది. గోటుల్ల వద్ద సామూహిక నృత్యం, బయటి నృత్యం, బయటి 'నాగరిక' సమాజం నుండి వచ్చినవారు అశ్లీల కళ్లద్దాల నుండి చూసి దీన్ని లైంగిక విశృంఖలత్వంగా భావిస్తారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఇతర ఉద్యోగులు, దుకాణదారులు, కాంట్రాక్టర్లు, డ్రైవర్లు, బతుకు తెరువు వెతుక్కొంటూ అటవీ ప్రాంతానికి వచ్చిన అనేక వృత్తుల మైదాన ప్రాంత వాసులు - వీరంతా ఆదివాసీ సామాజిక కట్టుబాట్లను అతిక్రమిస్తూ మాయమాటలతో మహిళలను లొంగదీయడం లేదా బలవంతంగా వారితో సంబంధాలు పెట్టుకోవడం కోసం ప్రయత్నాలు చేసేవారు. వీరు ఆదివాసీ స్త్రీల జీవితాలతో చెలగాటం ఆడారు. ఎదురు తిరిగిన వారిని పాలకుల అండతో, ధనబలంతో అణచివేశారు.

కెఎఎంఎస్ ఏర్పడి ముందుకు పోతున్న క్రమంలో ఈ అత్యాచారాల తీవ్రత తగ్గినప్పటికీ ఇంకా కొద్ది మేరకు సాగుతున్నాయి.

భూస్వామికి బుద్ధి చెప్పిన కెఎఎంఎస్

భైరంగఢ్ ఏరియాలో ఆదివాసీ స్త్రీలపై భూస్వాముల లైంగిక పీడనకు వ్యతిరేకంగా మహిళలు సంఘటిత మయినారు. 1997లో మొదలైన జనజాగరణ్‌ను మహిళలంతా గట్టిగా ప్రతిఘటించి (ప్రభుత్వం, సల్వాజుడుం కలిసి స్త్రీలపై అణచివేతను, అసమానతను యథాతథంగా నిలిపి ఉంచే ప్రయత్నంలో భాగంగా ఆదివాసీ గ్రామాల్లో ప్రభుత్వం సల్వాజుడుం కలిసి చేపట్టిన ప్రచార (దాడులు చేయడం ద్వారా) చైతన్య ప్రచార యాత్రలు. ఇక్కడ ప్రచారం అంటే భౌతిక దాడులతో సహా అన్ని రకాల దాడులు చేయడం, కార్యక్రమాలను కెఎఎంఎస్ నాయకత్వంలో ఆదివాసీ మహిళలు విజయవంతంగా ప్రతిఘటించారు.

ఈ ఘటన జరిగి ఇప్పటికి పది సంవత్సరాలు కావస్తున్నది. దక్షిణ బస్తర్ కుంట రేంజిలోని ఓందేర్ గ్రామంలో చూల వడ్డే ఒక భూస్వామి. మాలధారి, పెద్ద అహంకారి. మాల వేసుకున్న వాళ్లంతా సత్యవంతులూ, మాంసం తినేవారంతా నీచులు అనే హిందూ ఆధిపత్య భావనను అతడు నరనరానా జీర్ణించుకున్నాడు. దళం గ్రామానికి పోయినప్పుడు మహిళలు దళం వద్దకు కలవడానికి పోతే, 'మీ మొగుళ్లు వచ్చారని పోతున్నారు' అని ఇంకా చెప్పనలవికాని బూతులు తిట్టేవాడు. తన రెండవ కొడుకు గున్నాల్ దొర్ల తెగ అమ్మాయితో పెళ్లి చేసుకుంటానని నమ్మించి మూడేళ్లుగా సంబంధాలు కొనసాగించడంతో ఆమెకు ఇద్దరు పిల్లలు కూడా పుట్టారు. అయినా ఆమెను తన ఇంటికి తీసుకుపోవడానికి తండ్రీ కొడుకులు సిద్ధపడలేదు. అమ్మాయి కుటుంబం మాంసాహారులు కాబట్టి కులం గోడ లేపే ప్రయత్నం చేశారు.

సంఘాలు దళాల సహకారంతో పంచాయతీ ఏర్పాటు చేశాయి. ఓందేర్ చుట్టుప్రక్కల 12 గ్రామాల నుండి సుమారు 400 మంది ప్రజలు జమ అయ్యారు. కెఎఎంఎస్‌ను దుర్భాషలాడడం, మహిళలతో అసభ్య ప్రవర్తనపై చర్చించి ఐదువేల రూపాయల జరిమానా విధించారు. మరోసారి ఇలా తిడితే గ్రామ బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు. అతని కొడుకు గున్నాల్‌కు దేహశుద్ధి చేసి తాను మోసం చేసిన మహిళను భార్యగా స్వీకరించాలని తీర్పు ఇచ్చారు.

కుటుంబ హింసను సహించబోమని....

దక్షిణ బస్తర్ డివిజన్ ఆవపల్లి రేంజిలోని పాన్నూర్ గ్రామ నివాసి అయిన శాంతను ఆమె భర్త లచ్చుమయ్య విపరీతంగా అనుమానించేవాడు. ఆ రోగం ముదిరిన కొద్దీ ఏదో ఒక సాకుపై భార్యను విపరీతంగా కొట్టేవాడు, నానా మాటలతో వేధించేవాడు. చాలా కాలం ఓపిగ్గా భరించిన శాంత చివరికి పెద్దమనుషులకు చెప్పుకుంది. వాళ్లు మూడు నాలుగుసార్లు పంచాయితీ చేసి లచ్చుమయ్యకు అర్థం చేయించారు. అయినప్పటికీ మారకుండా పచ్చి బాలెంతగా ఉన్న సమయంలో కూడా శాంతను కొట్టాడు. మరోసారి చెట్టుకు కట్టేసి గొడ్డును బాదినట్టు బాదాడు. ఈ అఘాయిత్యాలను భరించలేని శాంత మహిళా సంఘాన్ని ఆశ్రయించింది. మహిళా సంఘం గ్రామ ప్రజలందరితో సమావేశం ఏర్పాటు చేసి వారి అభిప్రాయాల్ని తెలుసుకుంది. ప్రజాభీష్టం మేరకు కెఎఎంఎస్ మహిళలు లచ్చుమయ్యకు దేహశుద్ధి చేశారు. అతని ఆరళ్లతో విసిగి వేసారిన శాంత అతనితో కాపురం చేయనంది. ఆమె నిర్ణయాన్ని స్వాగతిస్తూ పంచాయితీలో పాల్గొన్న వారంతా చప్పట్లు కొట్టారు. శాంత కోరుకున్న విధంగా పంచాయితీ లచ్చుమయ్యకు విడాకులిప్పించింది.

మహిళలపై లైంగిక పీడనకు వ్యతిరేకంగా

గోటుల్ అంటే ఊళ్లో ప్రజల సమావేశ కేంద్రం. అదొక రాజకీయ, సాంస్కృతిక కేంద్రం. గ్రామ ప్రజల సమిష్టి నిర్ణయాల కేంద్రం. అత్యంత ప్రాధాన్యత గల చోటు. దైనందిన జీవితంలో ఒక క్రమశిక్షణను నేర్పే కేంద్రం. ఉదయం లేవగానే గోటుల్ వద్ద హాజరు వేయించుకోవడం, ఆ రోజు కార్యక్రమాల పనివిభజన జరుగుతుంది. సాయంత్రం చీకటి పడే వేళకు వచ్చి స్నానాలు - భోజనం ముగించు కొని మరోసారి గోటుల్ దగ్గర హాజరు వేయించుకుంటారు. పరస్పర సమాచారం ఇచ్చి పుచ్చుకోవడం, ఆ రోజు కార్యకలాపాల సమీక్ష జరుగుతుంది.

అది ఒక సాంస్కృతిక కేంద్రం. డోలు వారి వినోద సాధనం. అది ఒక సంకేతం. గోటుల్ దగ్గర జమ కావాలనే పిలుపుకు సంకేతం అది. గాదె, విజ్జ, పిండి, పోర, నొవ్వ పండుగల సందర్భంగా యువతీ-యువకులు జట్లు కట్టి ' రేలా' నృత్యం చేసే సాంస్కృతిక కేంద్రం.

గోటుల్‌లో యువతీ-యువకుల మధ్య లైంగిక సంబంధాలు - ఇది ఒక పాత ఆచారం. ఆదివాసీ సమాజంలో ఉత్పత్తి శక్తుల అభివృద్ధి, దానితో ముడిబడిన సామాజిక సంబంధాల నేపథ్యంలో గోటుల్ సంస్కృతిని చూడాలి. దీన్ని ఒకనాటి గుంపు పెళ్లి అవశేషంగా చెప్పుకోవచ్చు. మొత్తంగా కోయ సమాజంలో వివాహ సంబంధాలు గుంపు పెళ్లి నుండి దంపతీ వివాహ వ్యవస్థ వరకు మార్పు చెందాయి. ఇక్కడ దంపతీ వివాహ వ్యవస్థ అమలులో ఉంది. ఈ క్రమంలో తల్లిదండ్రులు, వారి సంతానం నడుమ లైంగిక సంబంధాలపై నిషేధం, ఒకే తల్లికి పుట్టిన సంతానం సోదరీ-సోదరుల నడుమ నిషేధం కచ్చితంగా అమలవుతుంది. దాని అవశేషంగా గోటుల్‌లో యువతీ యువకులు పడుకోవడం కనిపిస్తుంది. ఇది కూడా దండకారణ్య వ్యాప్తంగా ఒకే రకంగా లేదు. కొన్ని ప్రాంతాలలో గోటుల్ గురించి తెలియని యువతరం ఉంది. గోటుల్‌లో యువతీ-యువకుల నడుమ లైంగిక సంబంధాలు నియమ-నిబంధనలూ, కట్టడులూ లేకుండా మితిమీరి సాగవు. పద్ధతులు తప్పి మితిమీరి వ్యవహరించిన వారికి శిక్షలు వేస్తారు.

ఉత్తర బస్తర్ అంటే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నారాయణపూర్, కాంకేర్, బస్తర్‌లో కొండగాం, కేస్కల్‌లోని ఎడ్క, జోడియాన్ పరగణాల్లో గోటుల్ యువతీ-యువకుల మధ్య బహిరంగ లైంగిక

సంబంధాలు కొనసాగినాయి. ఈ గోటుల్ వ్యవస్థ ఇప్పటికీ కొన్ని కొన్ని చోట్ల ఓపన్‌గా, రహస్యంగా కొనసాగుతున్నాయి. ఈ గోటుల్‌లోనే ప్రతిరోజు యువతీ-యువకులు పడుకుంటారు. ఏ యువతి ఏ యువకుడితో కలిసి ఉండాలో యువక బృందం నాయకుడు నిర్ణయిస్తాడు. పెళ్లిళ్లు జరిగిన జంటలు గోటుల్‌కు రాకూడదు. పెళ్లికాని యువతీ యువకుల మధ్య వరుస కుదిరిందంటే నిరభ్యంతరంగా గోటుల్ నియమాలకు లోబడి లైంగిక సంబంధాలు కొనసాగించాలి. అయితే ఇలా గోటుల్‌లో సెక్స్ సంబంధాలున్న స్త్రీ-పురుషులు తప్పనిసరిగా పెళ్లి చేసుకోవాలన్న నిబంధన ఏమీ లేదు. అది వారి ఇష్టం. ఆ ఇద్దరు పెళ్లి చేసుకోవచ్చు, చేసుకోకుండా మరెవరినైనా చేసుకునే స్వేచ్ఛ వారికుంది.

విప్లవ ప్రజాసంఘాలైన డిఎకెఎంఎస్, కెఎఎంఎస్‌లు గోటుల్ సంస్కృతి వలన కలిగే నష్టాలు, అది తెచ్చే అనర్థాలపై చర్చించారు. కేన్‌కల్ ఏరియా ఎడ్క వరగణాలోని 15 గ్రామాలు, కిస్‌కొడ్డొరేంజి-జోడియన్ పరగణాలోని 21 గ్రామాలలో గోటుల్ లైంగిక సంబంధాల వ్యతిరేక కమిటీలను పెట్టారు. ఈ కమిటీలలో స్త్రీలూ, పురుషులూ ఉన్నారు. గోటుల్‌లో సెక్స్ సంబంధాలు కొనసాగుతుండడం మూలంగా పిల్లలు చదువుకోవడం లేదనీ, తండ్రిగా బాధ్యత పడనివారికి పిల్లలు పుడుతున్నారనీ, గోటుల్ పిల్లలను ఎదిగాక ఎవరూ పెళ్లి చేసుకోవడానికి సుముఖత వ్యక్తం చేయడం లేదనీ ఇంకా మారుతున్న సమాజంలో స్త్రీ-పురుషులకు రకరకాల సమస్యలు వస్తున్నాయనీ ఈ సమావేశాలలో చర్చించారు. కరపత్రాలు ప్రచురించి ప్రచారం చేసారు. గ్రామ సభల ద్వారా ప్రచారం చేసారు. 1999 సంవత్సరం మే-జూన్ నెలల్లో ఎడ్క, కొంగరలలో పెద్ద బహిరంగసభలు జరిపారు. ఈ క్రమం 1995 నుండి మొదలయింది. 1999 మధ్య వరకూ జరిగిన ర్యాలీలు - బహిరంగ సభలలో కనీసం 15వేల మంది మహిళలు పాల్గొన్నారు. ఒకటి నుండి నాలుగు కిలోమీటర్ల దూరం వరకూ జరిగిన ఈ ర్యాలీలలో యువజనులు, ముసలివాళ్లు అనే తేడా లేకుండా అందరూ పాల్గొని గోటుల్‌లో లైంగిక సంబంధాల వ్యతిరేక బ్యానర్లను పట్టుకొని తమ సంస్కృతిని ప్రజాస్వామికరించుకోవాలనే ఆరాటాన్ని ప్రకటించారు.

ఈ బహిరంగసభలలో కెఎఎంఎస్, డిఎకెఎంఎస్‌లతో పాటు తెగ పెద్దలు కూడా పాల్గొని కింది నిర్ణయాలు చేశారు. అవి - 1. స్త్రీ బానిస కాదు, స్త్రీకి సమాన గౌరవం ఇవ్వాలి. 2. గోటుల్ సంస్కృతి పేరుతో స్త్రీలపై కొనసాగుతున్న అణచివేత, అత్యాచారాలన్నింటికి వ్యతిరేకంగా పోరాడాలి. 3. రాత్రిపూట గోటుల్‌లో యువతీ యువకులు పడుకోవడం ఆపాలి. 4. బలవంతంగా గోటుల్ సంస్కృతిని రెచ్చగొట్టే ముఖ్యులను శిక్షించాలి. 5. యువతీ యువకులు ప్రతిరోజు చదువుకోవాలి. 6. గోటుల్ ఊడ్చడం, కట్టెలు తేవడం యువతులే చేయాలనే నియమాన్ని రద్దు చేయాలి. 7. మానసికోల్లాసం కోసం ఆట, పాట ఉండాలి. 8. పెళ్లి చేసుకోవాలని కోరుకునే యువతీ-యువకులకు వెంటనే పెళ్లి చేయాలి. 9. సమ గోత్రికుల నడుమ శారీరక సంబంధాలను నిషేధించాలి. దీని కొనసాగింపుగా అక్కడక్కడ గోటుల్లను కూల్చడం, కాల్చడంలు కూడా జరిగాయి. బలవంతంగా గోటుల్లను మూసెయ్యడం, కూల్చడం సరైంది కాదని ఉత్తర బస్తర్ డివిజన్ పార్టీ కమిటీ సమీక్షించింది. గ్రామాలలో యువతీ-యువకులను సంఘాలలో సంఘటితం చేస్తూ రాజకీయ, సాంస్కృతిక పరంగా శిక్షణ నందించడం ద్వారా ఈ దురాచారాన్ని రూపుమాపటం కోసం ప్రయత్నించాలని నిర్ణయించింది.

(ఇంకా ఉంది...)

చందాలు, బకాయిలు మనియార్డర్, డి.డి.ల రూపంలో మేనేజర్‌కు పంపించండి.

డి.డి.లను ఎస్. రవికుమార్, ప్రొద్దుటూరు పేర తీయండి.

అరుణతార చదవండి!

చదివించండి!

చందాదారులు కండి!

విడి సంచిక వెల	:	రు. 10
సంవత్సర చందా	:	రు. 100
జీవితచందా	:	రు. 1000

మేనేజర్ : ఎస్. రవికుమార్

5-1307, దొరసానిపల్లె రోడ్, ప్రొద్దుటూరు, కడప జిల్లా - 516360, సెల్ : 9866021257

మీ రచనలను అరుణతారకు ఈ-మెయిల్ కూడా చేయవచ్చు!

పేజ్‌మేకర్ ఓపెన్ ఫైల్, పి.డి.ఎఫ్. పద్ధతులలో (అను 6.0లో అయితే మేలు),

మైక్రోసాఫ్ట్ వర్డ్, ఎం.ఎస్. భాషలో కూడా అరుణతారకు మెయిల్ చేయగలరు

ఈ-మెయిల్ ఐ.డి. : arunatara1977@gmail.com

నవల సీరియల్

గుమ్మెటమోత

(8)

\- పాణి

(గత సంచిక తరువాయి...)

విశాలకు రాత్రంతా నిద్రపట్టలేదు.

ఉలిగవ్వ చెప్పిన ఊరి సంగతులే నానారకాలుగా హింసపెట్టాయి. అది కేవలం యాతనేకాదు; ఆలోచన, అన్వేషణ, ఏదో కొత్త దారిలో వెతుకులాట. కొద్ది దూరం వెళ్లాక దిక్కుతోచని సందిగ్ధత.... ఆమె వీరబ్రహ్మం మీద పరిశోధన ఏరికోరి ఎంచుకోలేదు. "ఎంతకాలం ఇట్లా ఉంటావు, చదువు కూడ అయిపోయింది గదా. ఏదో ఒక ఉద్యోగం రాకపోదు... మళ్ళీ 'ఆలోచించరాదూ...' అని తండ్రి ప్రారంభించాడు.

ఆయనకిప్పుడు తాను చేసిన తప్పుకు బైట నుండి ఒత్తిడి కూడా మొదలైంది. అపరాధ భావనతో పాటు "అయితే మాత్రం? ఇట్లా ఊరి మీద వదిలేస్తావా? అందరికీ అన్నీ దొరుకుతాయా? కావాలనుకుంటే వస్తాయా? మొగుడూ పెళ్లాలంటే సర్దుకుపోవడమే. ఏకంగా తీసుకొచ్చేస్తివి. చదువు పేరుతో దేశం మీద వదిలేసినావ్?" అనే మాటలు ముసలి తల్లి దగ్గర్నుండి అయిన వాళ్లందరి నోట వినాల్సివస్తోంది. అయితే ఈసారి తను ఇంకా తప్పు చేయకూడదనే ఎరుకా ఆయన్ను నిలబెట్టింది. కొందరి దగ్గర మౌనంగా ఉన్నా, కొందరితో తెగేసి 'అది ఎట్లా బతకాలనుకుంటే అట్లా బతుకుంది. నేను ఇంక నేరం చేయను...' అంటాడు.

తాను బుగ్గిపాలు చేసిన జీవితాన్ని విశాల తిరిగి నిర్మించుకుంటోందని ఆయనకి భరోసా. అది ఆనంద దాయకం కూడా. లేకపోతే అందరికీ ఎంత దిగులు?

తండ్రిలోని పరివర్తనను విశాల హృదయంతో చూడగలిగింది. మిగతా వాళ్ళతో అయితే మాటకు మాట తెగేసి, విరిచేసినట్లు మాట్లాడినా తండ్రి దగ్గర మెత్తగా ఉండేది. "ఇదేందమ్మా! నోట్లో నాలిక లేనట్లుండేది. మాట్లాడేకి వల్ల కావడంలా. గయ్..మని మీదకొస్తాది..." అని నానమ్మ ఊసడించుకునేది.

"నాన్నా! నీ ఇబ్బంది నాకు తెలుసు. అయినా నేనేమీ చెప్పలేను. నాకిప్పుడే నా మీద నాకు నమ్మకం కలుగుతోంది. ఎలాగైనా గౌరవంగా, ఆత్మాభిమానంతో బతకగలనని. అయితే నీకు భారంగా ఉంటున్నానని నాకూ తెలుసు. తప్పక తీరుస్తాను. ఇప్పుడైతే కాదు. ఇట్లా ఇంట్లో కూచుంటే నీకు మరీ ఇబ్బంది. పి.ఎచ్.డిలో చేరతాను. ఓ రెండేళ్లు అది సరిపోతుంది. ఈలోగా ఉద్యోగం కోసం చూస్తా. ఇప్పటికి ఇది మాత్రమే నేను చేయగలను..." అన్నది.

తండ్రి ఎదుట ఇంట్లో ఉంటూ ఆయన మీద ఒత్తిడిగా మారకూడదనే తిరిగి యూనివర్సిటీకి వచ్చేసింది. ఎవరు చెప్పారో... ఏమైందోగాని వీరబ్రహ్మం తోడయ్యాడు. మొదట గందరగోళంగా ఉండేది. మెల్లగా దారి వెతుక్కున్నది. ఇప్పుడు ప్రతిదీ ఆశ్చర్యమే. వెతుకులాట సంభ్రమంగానూ, ఉత్సాహంగానూ ఉన్నది. కులం గురించి తెల్సుకోకుండా వీరబ్రహ్మం మీద ఏమీ రాయలేనని అర్థమైంది. అప్పటి చరిత్ర, దాని గమనాన్ని నిర్దేశించిన రాజకీయార్థకం తెలియకుండా ఏ నిర్ధారణ అయినా కష్టమే అని స్పష్టమయింది. ఇన్ని వైపుల నుండి కులాన్ని చూస్తేగాని వీరబ్రహ్మం మీద కొత్త అంచునాలకు రావడం కుదరదని తేలింది. అయితే ఇప్పటితో తను కులాన్ని బయటి నుండే చూసింది. ఉలిగవ్వ చెప్పినవి విన్నాక ప్రతికులానికి లోపల తనదైన యంత్రాంగం ఉన్నదనీ, అది జీవించడానికి లోపలి తీరు ఒకటున్నదని అర్థమయింది. ఈ సంగతి తెలుసుకొంటున్న కొద్దీ ఆమెను సంక్షోభమూ, సందిగ్ధతా ఆవరిస్తున్నాయి. బైటి నుండి నిర్దేసించినవేగాక లోపల నియమాలూ దాని బలానికి కారణం అనే ఊహ కొత్త ప్రపంచాన్ని తెరిచింది.

పొద్దున్నే లేచి గబగబా కొంచెం నోట్స్ రాసేసింది. ఓ పక్క కొన్ని ప్రశ్నలను, సందేహాలను విడివిడిగా పేర్చింది. ఇది రాస్తున్నప్పుడే సుధాకర్ నుండి ఫోన్.

"ఈ మధ్య కలవడం లేదు, ఫోన్ లేదు. ఎక్కడికి పోయావ్? ఉలిగవ్వ అయితే అడ్రస్ లేదు..." అన్నాడు.

సుధాకర్ అంతే. వారం, నెల, తిరిగి చూడకుండా ఎప్పుడో ఒకసారి ఫోన్‌చేసి కనపడ్డలేదే? అని ఎదురు ప్రశ్నిస్తాడు. "మేమెక్కడికీ పోలా. నీవే గల్లంతయ్యావు. నిన్న ఉలిగవ్వ వాళ్ల మీటింగ్ జరిగింది గదా. అక్కడ గిరి కలిశాడు" అన్నది విశాల.

"గిరి కూడా కలవడం ఏంది? వాళ్లేగా ఆర్గనైజర్లు" అన్నాడు.

"అన్నీ తెలిసికుంటూనే ఉంటావు... మళ్లీ కనిపించలేదని మమ్మల్నే అంటావు. నీవూ వస్తావనే వెళ్లా. నీతో కొంచెం పని ఉంది..." అన్నది. అప్పటితో తాను రాసుకున్న నోట్స్‌లో ప్రశ్నలు, సందేహాల మీద టిక్ కొడుతూ.

"ఆ మీటింగ్ మాకు వ్యతిరేకం కదా. నేనెట్లా వస్తాననుకున్నావ్?" చివరి మాట నవ్వుతూ అన్నాడు.

విశాల అంటుకుంది.

"నోరు మూసుకో. నువ్వు కూడా అట్లనే మాట్లాడి ఉన్న మర్యాద కూడా పోగొట్టువాకు...." అన్నది.

సుధాకర్ అంతే నిండుగా నవ్వేసి ఫోన్ పెట్టేశాడు.

అయితే ఇందాక 'మమ్మల్నే అంటావా?' అని గిరిని కలుపుకొని విశాల అన్నప్పుడు కొంచెం విసుగు కలిగింది. 'ఒట్టి ఫోజు...' అని గిరి మీద అతని అభిప్రాయం. సందు దొరికితే తీసిపారేసి మాట్లాడతాడు. తాను చెప్పినవన్నీ వింటాడు కాబట్టి, మన్నన ఉలిగవ్వ అంటే. కలిసినప్పుడల్లా అప్యాయంగా దగ్గరికి తీసుకుంటాడు. సొంత అవసరాలు కనుక్కొని -- తను తీర్చగలిగేవైతే తీరుస్తాడు. అతను ఏ పుస్తకాలు చదివితే మంచిదో ఆలోచించి జాగ్రత్తగా వాటి గురించి చెప్పి తీసిస్తాడు. అభిప్రాయాల నుండి సత్యాలు తెలియవని, జీవితం నుండే జీవితం తెలుస్తుందనీ, సత్యం బోధపడుతుందని నమ్మకం. జీవితం అర్థం కావడానికే వాదాలు ఉపయోగపడాలనుకుంటాడు. దీంతో అభిప్రాయాల కోసం తగాదాలు పడేవాళ్ళంటే చిన్న చూపు ఏర్పడింది. విశాల చాలా సార్లు అభిప్రాయాల కోసం రెచ్చిపోవడం గమనించినా, డిస్టర్బ్ అయినవాళ్లు ఏదో ఒక ఆలోచనను జీవితానికి బైటి నుండి కూడా వెతుక్కుంటారనే సానుభూతి కలిగింది.

మంచి అమ్మాయి. ఆలోచించడం అవసరం అనుకుంటుంది. ఈ రోజుల్లో అదే ఒక సుగుణం, వ్యక్తిత్వం. తప్పక మంచి ఆలోచనలతో నిలబడుతుందనుకొనేవాడు. స్థిమితంగా

ఆలోచించకుండా మాట్లాడేవాళ్ళను, అలవాటు కొద్ది వాదించేవాళ్ళను చూసినప్పుడల్లా అతిగా వ్యవహరిస్తాడు. వాళ్ళను వేళాకోళం చేయడానికి మాటల గారడితో గజిబిజి చేసిపారేస్తాడు.

ఒకసారి మాల మహానాడు వాళ్ళ మీటింగ్‌కు వెళ్ళాడు. అది తెలిసినప్పటి నుండి ప్రమీల 'మీవాళ్ళు' అని ఎత్తిపొడుస్తుంటుంది.

"వాళ్ళు లాయర్లను కూడా ఆర్గనైజ్ చేశారు. అట్లా నాకు ఆహ్వానం వచ్చింది. చూద్దాం... ఎట్లా మాట్లాడతారో అని వెళ్లాను" అని సుధాకర్ ఇద్దరు ముగ్గురికైనా సంజాయిషీ ఇచ్చుకోవాల్సి వచ్చింది.

ఆ సభలో రిజర్వేషన్ల వర్గీకరణకు సంబంధించి సుధాకర్ మధ్యే మార్గంగా ఏదో ప్రతిపాదించబోయాడు. సహ వక్తలు, నిర్వాహకులు కూడా మండిపడ్డారు. హాల్లో ఉన్న వాళ్లయితే వేదిక మీదికి వెళ్లి కొట్టబోయారు.

అందరిదీ ఒకటే ప్రశ్న...

మన కులంలో పుట్టి మనకు వ్యతిరేకంగా మాట్లాడేవాడ్ని ఈ సభకు ఎట్లా పిలిచారు? అని.

"నేను మీకేమీ వ్యతిరేకంగా మాట్లాడ్డం లేదు. సమస్య పరిష్కారానికి నాకు తోచిన మార్గం చెప్తున్నానంతే..'' అని అరిచిగీపెట్టినా అక్కడెవ్వరూ ఆలకించలేదు.

ఎవరో కుర్రాడు వచ్చి మైక్ లాగిపడేశాడు.

పక్కన ఉన్న వక్తలు వేదిక దిగేదాకా వదల్లేదు.

'మీకు' అంటాడేమిటి? 'మనకు' అనాల్సినవాడు అని మాల మహానాడు సిద్ధాంతకారులనదగిన వాళ్ల అభ్యంతరం. 'మనం' అనే ఐడెంటిటీ లేకపోతే ఈ ఉద్యమం నడపడం కుదరదని వాళ్ల భావన.

'ఇట్లాంటి కోవర్టుల వల్లే ఉద్యమాలు నాశనమయ్యేది...' అని ఎవరో గట్టిగా అరిచారు.

సుధాకర్ అవమానపడలేదు.

ఆవేశపడలేదు.

ఇదెక్కడి ఉద్యమం! ఇదెక్కడి అతివాదం! స్వకులంలోని వాడు చెప్తేనే వినడం లేదే. ఇక బైటివాళ్లు చెప్తే వింటారా? న్యాయన్యాయ వివేచన లేకపోతే ఏమైపోతారు? అని ఆందోళనపడ్డాడు.

సుధాకర్ తండ్రి రెండెకరాల చిన్న రైతు. సొంత సేద్యం మీద గడవక, వీలు దొరికనప్పుడల్లా కూలి పనులకు వెళ్తాడు. అప్పుడప్పుడు మరో రెండెకరాలు కౌలు చేస్తాడు. ఆయనకు చదవడం మాత్రమే వచ్చు.

సుధాకర్ నలుగురు చిన్నాయన్లు ఆ రోజుల్లోనే గవర్నమెంట్ ఉద్యోగులయ్యారు. వాళ్ల పిల్లల్లో ఒకరు ఈ నడమే ఐ.ఎ.ఎస్.గా సెలక్ట్ అయ్యాడు. కనాకష్టం మీద సుధాకర్ లా పూర్తి చేశాడు. ఇంకా పెళ్లి కాలేదు. ప్రతి నెలా జేబు ఖర్చులకు వెతుక్కోవడమే. మొదట్లో ఎందుకు ఈ కోర్స్ చేశానా? అని విచారించేవాడు. కానీ ఇప్పుడు అట్లా అనుకోవడం లేదు. లా కోసం ఇక్కడికి రావడం వల్ల, ఇక్కడి మిత్రుల వల్ల తనకు ఒక కొత్త ప్రపంచం పరిచయం అయిందని సంతృప్తి పడుతుంటాడు. లేకపోతే ఏమయ్యేవాడు? ఇప్పుడతనికి తనలాగా ఆలోచించే మిత్రులే సంపద, ఆలంబన.

కానీ సుధాకర్‌తో మాట్లాడటానికి అందరూ ఇష్టపడ్డరు.

ఏవేవో కాన్సెప్ట్, నోరు తిరగని ఇంగ్లీషు పేర్లు గుమ్మరించి కావలనీ కొందర్నీ భయపెడుతుంటాడు. ఇతరులు సాదాసీదాగా చెప్పిన వాటిని కూడా సూత్రీకరణలుగా మలిచి అయోమయపడేలా చేస్తాడు. ఏవేవో మాటలను చిలకపలుకుల్లాగా వల్లించే వాళ్ళంటే అతనికి చిరాకు. దానితో తనకు గురి కలగలేదంటే చాలు అపహాస్యం చేసి ఆనందిస్తుంటాడు. ఒక అభిప్రాయం కలిగిందంటే ఇక అది చెదిరిపోవడం కష్టం. దానికి అనుగుణంగానే వాళ్ల గురించి వాదనలు పేర్చుకుంటాడు.

అట్లా - గిరి దగ్గర సరుకు లేదనీ, ఉలిగప్ప లైఫ్ బాగా తెలిసినవాడని, అభిప్రాయం కలిగింది.

విశాల అప్పుడప్పుడు తీరుబడిగా సుధాకర్‌ను కలుస్తుంటుంది. ఎట్లా, ఎక్కడ పరిచయమయ్యాడోగాని చదువుకున్నవాడనే గురిపడింది. తనకు ఏ సందేహం కలిగినా వెళ్లి గంటల తరబడి మాట్లాడుతుంది. రాత్రి నుండి తనను వేధిస్తున్న సందేహాలను సుధాకర్ దగ్గర తీర్చుకోవాలనుకుంది.

ఎందువల్లోగాని గిరి మీద ఇద్దరికీ కలిగిన అభిప్రాయాలు ఉండటంతో దగ్గరయ్యారు.

రాత్రి ఉలిగప్ప చెప్పినవన్నీ విన్నాక గిరి కూడా అల్లకల్లోలమై పోయాడు. ఎవరినో కలవాలని ఉలిగప్ప మీటింగ్ దగ్గర్నుండి అటే వెళ్లిపోయాడు. రాత్రంతా గదిలో ఒక్కడే. ఎన్నడూ లేని కలవరం కలిగింది.

ఈ సంఘంలోకి గిరి ఎంచుకొని రాలేదు.

యూనివర్సిటీలో ఏదో గొడవైనప్పుడు కులం వాళ్లంతా అనుకోకుండా ఏకమయ్యారు. ఏం చేయాలో దిక్కు తోచలేదు. ఒక సీనియర్ వెంకటేశ్వర్లుసారు దగ్గరికి తీసికెళ్లాడు. ఆయన ప్రొఫెసర్‌గానే తెలుసుగాని వేరే ఏమీ తెలియదు. కలిశాకే అసలు విషయం తెలిసింది. బుడగ జంగాల సంఘం ముప్పై ఏళ్ల కింద ఏర్పడ్డప్పుడు ఆయనే కీలకం. చదువుకున్న వాళ్లందర్నీ ఒక చోటికి తెచ్చాడు. కార్యదర్శిగా చాలా కాలం పనిచేశాడు. అంతకు మించి ఆయన పరిశోధనాంశమే బుడగ జంగాల సంస్కృతి, సాహిత్యాలు. దానికే డాక్టరేట్ వచ్చింది. ఆ తర్వాత బుడగ జంగాల దర్శిని అని మరో పుస్తకం రాశాడు. బుడగ జంగాలతోను పత్రికను కూడా స్థాపించాడు. చాలా నెమ్మదస్తుడు. అందరితో సమానంగా ఉంటాడు. కులం వాళ్లందర్నీ ఆదరిస్తాడు. వెంకటేశ్వర్లు సారు పరిచయంతో ఇటు వచ్చాడు. నగర కమిటీ బాధ్యతలు తీసుకోవాల్సి వచ్చింది. ఇప్పుడు ఉలిగప్ప తోడయ్యాడు.

ఒకసారి వెంకటేశ్వర్లు సారుకు చెప్పేశాడు.

"నేను అన్నీ మీలాగానే ఆలోచించడంలేదు. మీ ఆలోచనల్లో కొంత లోపం ఉందనుకుంటున్నా. కాబట్టి నేను బాధ్యతల్లో ఉండడం మంచిది కాదేమో!'' అని.

దానికి ఆయన నవ్వి... 'నీవు ఆలోచించేవి మన సంఘానికి బైటవి. మనోళ్లకు మేలు చేయడానికే సంఘం పెట్టినాం. అంతవరకు నీకే భిన్నభిప్రాయాలు లేవనుకుంటున్నా కాబట్టి సమస్యేమీ లేదు...' అని సూటిగా, స్పష్టంగా తేల్చేశాడు.

నిజమే. అందుకే ఆయన మాట తీసెయ్యలేకపోయాడు?

కానీ ఇప్పుడు సంఘం విషయాల్లోనే తనకు వేరే ఆలోచనలు కలుగుతున్నట్లుంది అనుకున్నాడు. కులం కట్టుబాట్లలో మార్పు తేవాలని అంటే వెంకటేశ్వర్లుసారు కూడా ఏమంటాడో!

తనకు ఈ కట్టుబాట్ల గురించి ఇంత దాక తేలేక కాదు. ఒక ఘటన వల్ల అనుభవం వల్ల కలిగే జ్ఞానం అపారం. అంతకుముందు లేని తెలివిడి కలుగుతుంది. అప్పట్లో ఉన్న నమ్మకాలు, నిర్ధారణలు కొత్తగా దర్శనమవుతాయి. లోకం సరికొత్తగా కనిపించడం మొదలవుతుంది.

ఇప్పుడు గిరి ఆ స్థితిలో ఉన్నాడు.

పై కులాల దాష్టీకం, న్యాయంగా రావాల్సిన వాటా అందకపోవడం సరే. ఆ విషయంలో కింద ఉన్నవాళ్లకు, వాళ్ల నుంచి ఆలోచించేవాళ్లకు ఏ సందేహాలూ, సందిగ్ధతలూ లేవు. అది తిరుగులేని పోరాటమే! ఎవరు కాదన్నా ఆగేదికాదు. కానీ ఆ ఆలోచనలు, ప్రయత్నాలు నిజమయ్యే దశలోకి వెళ్లడం అంటే ఏమిటి? ఈ కట్టుబాట్లతో, పాత పద్ధతులతో, వ్యవస్థలతో అక్కడికి చేరుకోవడం ఎట్లా? సొంతానివే అయినా ఈ నడకకు ఇవైనా వాటంతట అవే ఎందుకుపోతాయి? ఏదో ఒకటి చేయకపోతే!

గిరికి ఒకటే ఉక్కపోతగా ఉన్నది.

వెంకటేశ్వర్లు సారు ఏమంటడంటే - 'మన జనాలు ఎట్లున్నారో తెలుసుకదా. అక్కడి నుండి మనం చదువుకుని పైకి వచ్చినాం. వాళ్ల గురించి బాధ్యత లేకపోతే ఎట్లా? మనమే పట్టించుకోకపోతే బైటోళ్ళను ఏం అడుగుతాం?'

ఈ మాటకు ఎదురులేదు.

కానీ ఎంత విచిత్రం! ఒకసారి కులం గుర్తింపు మీద కలిశాక లోపలి వాటి మీద మాట్లాడ్డానికి దారి దొరకదు. ఏమేం కావాలో అడిగినట్లు ఏమి వదులుకోవాలో చెప్పడం కష్టం. ఇక బైటి వాళ్లెవరైనా న్యాయాన్యాయాల గురించి చెప్తే వినే పరిస్థితే ఉండదు.

ఎనిమిది గంటలైంది.

గదిలోకి ఎవరెవరో వస్తున్నారు, వెళ్తున్నారు. మాటలు, అరుపులు, నవ్వులు. ఇదొక వింత ప్రపంచం. తాజా ప్రపంచానికి ఈ హాస్టల్ ఒక మచ్చుతునక. గిరికి ఇది బాగా నచ్చుతుంది. అదెప్పుడూ కొత్తగా, వింతగా పరిగెత్తుతూ ఉంటుంది. దాంతోపాటు కలిసిపోవడం ఇష్టం. తనకు అది నిండుదనాన్ని ఇస్తుందని మనస్ఫూర్తిగా అనుకుంటాడు. కానీ ఒక్కోసారి విసుగు కలుగుతుంది. వెగటు కలుగుతుంది. ఎంత కలివిడిగా, కొత్తగా ఉంటుందో లోకంలోని బహుపార్శ్వాల్లో కనిపిస్తాయి. చదువులోకి వచ్చిన కులాలన్నీ ఇక్కడ ఉంటాయి. ఒకసారి సరదాకు ఎస్సీ, ఎస్టీ, బిసీ కులాల జాబితా దగ్గరపెట్టుకుని చూస్తే మూడు గ్రూపుల్లో గత పదేళ్లలో ఈ ఆవరణలోకి అడుగుపెట్టని కులాలు అనేకం కనిపించాయి. అంతకుముందు అసలే ఉండకపోవచ్చు. తనకే మంచి పరిశీలన అనిపించింది.

ఇప్పుడు గిరికి చాలా విసుగ్గా, అసహనంగా ఉంది. నిరాసక్తంగా వెళ్లి టిఫిన్ చేసి వచ్చాడు. ఏదో పుస్తకం పట్టుకొని కూచున్నాడుగాని మనసు పోవడం లేదు. ఇంతలో ఉలిగప్ప వచ్చాడు.

"మరి మీ ఊరెప్పుడు పోదాం?" ఆ మాట అడగడం కోసమే ఎదురుచూస్తున్నట్లు అడిగాడు. రాత్రి నుండి అతన్ని వేధిస్తూ, తొందరపెడుతున్న ఒత్తిడి అదే.

"ఇంకా అదే ఆలోచిస్తుండవా?....' అని నవ్వి, "పోదాంలే... మనమొక్కల్లం పోతే పిల్లనాయాల్లు వచ్చినారనుకుంటారు. మన పెద్దమంచుల కత నీకెరికేగదా. ఒక తాయాన పడనియ్యరు. మనం కూడా పెద్దమంచులను తోలకపోవాలి..." అన్నాడు ఉలిగప్ప.

ఆ మాట గిరికి ఆ స్థితిలో కూడా నవ్వు తెప్పించింది.

"అంటే... మనం మన పెద్దమనుషుల్ని ముందుపెట్టాలన్న మాట...." అన్నాడు.

"అంతేగదా. ఊర్లో వాళ్లకే బలముంటుంది. అందరూ వాళ్ల లెక్కనే ఆలోచిస్తారు కాబట్టి వాళ్ల మాటకు తిరుగుండదు. మనమేమో డిఫరెంటుగా ఆలోచించేవాళ్లమైతిమి...."

"ఒక లెక్కన ఆలోచించేవాళ్లే కులానికి ఉన్న బలం. దాంతోని కులం రీప్రొడ్యూసయితది, మనుషులు రీప్రొడ్యూసవుతరు. ఒకే కులంలో వాళ్ల ప్రపంచం, మన ప్రపంచం వేర్వేరు...." గిరికి ఏదో దారి దొరికినట్లయింది.

"మనల్ని చూసి, 'మన పొట్టెగాల్లే' అనుకుంటారు గాని, మన ప్రపంచాన్ని వాళ్లలో భాగం అనుకోరు. మన మాటలన్నీ బైటివని అనుకుంటారు. దాంతో మన మాట గాలికిపోతది..."

ఉలిగప్ప భలే చెప్పాడనిపించింది.

అదే అన్నాడు.

ఉలిగప్ప భారంగా చూస్తూ, "పంచాతి ఎందుకు ఇట్లాంటప్పుడు మా జేజినాయినే నన్ను బైటోడనుకుంటాడు. నావి పోరంబోకు కూతలని ముసలోనికి గట్టి నమ్మకం. మనోళ్లు ఎట్లుంటరంటే - మనం సదుకొని నౌకర్లు తెచ్చుకుండామనుకో మంచిదే అనుకుంటారు. కానీ మన మాటల్ను మాత్రం బైటి మాటలని తీసిపారేస్తారు. మా జేజినాయినకైతే నేను తంబూర తగిలించుకుని ఊరూరు తిరిగి కతలు చెప్తేనే బాగుంటది. పైకి అనడుగాని వాని లెక్కలో నేను కులానికి చెడిపోయినట్లే. మనం గట్టిగా నిలదీసి అడిగితే అందరు ఇట్లా చదుకుని బైటికిపోతే కడాకు కులం ఏంగావాలి? అని భయాన్ని, బాధను పంచుకుంటాడు..." అన్నాడు.

ఉలిగప్ప ఇంత లోతయిన మాటలు ఎన్నడూ అనలేదు.

"మరి మనం ఇదంతా ఎందుకు చేస్తున్నట్లు...." గిరి అమాయకంగా, దెబ్బతిన్న పసివాడిలా అడిగేశాడు. అతను అట్లా మాట్లాడటం కూడా ఉలిగప్ప ఎన్నడూ వినలేదు. ఇద్దరూ నిలబడ్డచోటు, మాట తారుమారయ్యాయనిపించింది. మామూలుగా అయితే తను ఇట్లాంటి ప్రశ్నలు వేస్తుంటాడు. అదే సమయంలో గిరి ఎంత కుదుపుకు లోనైందీ అర్థమైంది.

"బాగున్నవే! ఇదంతా లోపలి ఎవ్వారం. మా జేజినాయిన లెక్కలోల్లు యింట్లంటరేమోనని, తక్కినోల్లు, ఆయన తర్వాత జనరేషన్ అట్లే ఆలోచించడంలా. మనం ఏమేం కావాలని కొట్లాడుతున్నమో అవన్నీ కావాలని వాల్లూ అనుకుంటున్నారు. అవన్న బతకనీక అవసరం అని అంత మంది జనాలు కింద అనుకోబట్టే మన మాటలకు, డిమాండ్లకు, మీటింగ్‌లకు బలం వచ్చింది...."

బాగా తెలిసినవి కూడా ఒక్కో మనః స్థితిలో, దానికి కారణమైన అనుభవంలో, సందర్భంలో మర్చిపోవడం ఎలా ఉంటుందో గిరికి తెలిసి వచ్చింది. మర్చిపోవడమే కాదు, వాటి గురించి సంశయాత్మకంగా మాట్లాడుతం. సందేహాలు వెలుబుచ్చుతాం. తిరగేసి చెప్తాం.

అయితే ఆ క్షణాన ఉలిగప్ప మీద గొప్ప ప్రేమ కలిగింది.

తనకన్నా ఎక్కువగా జీవితంలో కాళ్లున్నవాడు కాబట్టి ఇది తనపాలిట సంక్షోభమైనట్లు ఉలిగప్పకు కాలేదని కూడా అనిపించింది.

నిజమే... ఊర్లో వాళ్లున్నదేమో ఒక ప్రాచీన స్థితి. మనం చెప్పే న్యాయాన్యాయాలు వాళ్లకు పట్టకపోవచ్చు. అంతమాత్రాన ఆకలి, భద్రత, ఆత్మగౌరవం అనేవి ఎట్లా తక్కువ అవుతాయి? వీటికోసం ఆరాటపడితేనే మిగితావి కూడా మెల్లగా ఆలోచిస్తారు....

గిరి అట్లా తనలోకి తాను కూరుకుపోయాడు.

ఉలిగప్ప గమనించి "మనం ఎవర్ని తోలకపోతే బాగుంటదో ఆలోచించు. పని అయినా కాకున్నా ఒకసారి పోయివద్దాం. మా ఊరు చూచినట్లుంటదిగా... మా జేజినాయనతో ఒకతూరి మాట్లాడితే నీవు వాడి దారిలోకి పోవడమో, వాడు మన దారికి రావడమో తేలుతుంది...." వాతావరణాన్ని తేలికపరచాలని పరిహాసంగా అన్నాడు.

"నేను మారడమా? అయ్యే పనేకాదు. ఎందుకంటే - మనకు గొంతెత్తితే ఒక కూత కూడా రాదు... అయినా మా జేజినాయన్ను చూడలని ఉంది..." గొల్లున నవ్వుతూ అన్నాడు గిరి.

"అవును మా ముసలోన్ని చూడల్సిందే. నేను చెప్పడం కాదుగాని, నిన్న పాడినారు చూడు, వాల్లకంటే మా జేజినాయన గట్టోడు. ఏటికి ఆవల్ల, ఈవల్ల రెండు జిల్లాల్లో పాత జనాలు ఇప్పటికీ వాడి కత కోసం కొటకలాడుతారు..." ఆ చివరి మాటలు ఒకింత అతిశయంగా చెప్పాడు ఉలిగప్ప.

అట్లా కాసేపు ఇద్దరూ పారవశ్యంగా జంబులు గురించి మాట్లాడుకున్నారు.

ఆ తర్వాత మళ్ళీ మొదటికి వచ్చారు.

సంఘం పెద్ద మనుషులు ఇద్దరు ముగ్గుర్ని పిలుచుకుపోవాలనుకున్నారు. వెంకటేశ్వర్లు సార్లు తప్పక ఉండాలనుకున్నారు. ఆయన్ను ముందు కలిసి మాట్లాడితే బాగుంటుందనుకున్నారు. కలిసిన వాళ్లందరితో దాని గురించి చెప్తే ఇట్లాంటి వాటి గురించి ఏమనుకున్నది తెలుస్తుంది అనుకున్నారు.

ఈ సంగతి తెలిసి విశాల "నేను తప్పక వస్తాను... అవును గాని మీ బిచ్చావతి చిన్నాయిన ఎక్కడుంటాడు. ఆయన్ను కలవాలని ఉంది. ఇక్కడ మీ కత తెలుస్తూనే ఉంది. ఊరికొస్తే మీ పెద్దోల్ల కత తెలుస్తుంది. కాని ఇంకా ముఖ్యమైన కత మీ చిన్నాయన దగ్గర ఉంది...." అన్నది.

గిరికి ఈ మాట బాగా నచ్చింది.

ఇంతకూ ఆయన తిరుగుబాటు ఎందుకు, దేనిమీద, ఎవరిమీద? అనే సందేహం కలిగింది.

"వాడు ఎక్కడుండేది చెప్పలేం. నీ అదృష్టం బాగుంటే ఆ పొద్దుకు రావచ్చు. అయితే ఒకటి మాత్రం గ్యారెంటీగా చెప్తా. వాడు నీతో మాట్లాడుతడో లేదోగాని, నీ మీద కొమరబడి కొడతాడు. వాడి దగ్గర కీసూగీసూ జాన్తానై...' వాడికి వాడే రాజు..." అన్నాడు. భయాన్ని, హాస్యాన్ని జోడిస్తూ.

"ఆఁ..... చూద్దాం. అక్కడి దాక వస్తే విడిపించేందుకు మీరు లేరూ?" అన్నది విశాల.

***

తెలతెలవారుతూ ఉన్నప్పుడు అందరూ సామాన్లు సర్దుకొని బయల్దేరారు. అక్కడ మూడు సంసారాలున్నాయి. బిజనవేముల పొలిమేర్ల నుండి మల్యాల దిక్కు వెళ్ళాలనుకున్నారు. అందరూ వేటకు పోయ్యేవాళ్లే. తుప్పల్లోకి వెళ్లి ఈత మండలు తెచ్చుకోవడం అలవాటు. నాలుగురోజులకు ఒకసారి ఈత మండలు తెచ్చుకొని ఎండబెట్టుకుంటారు. ఆ తర్వాత నానేసి రెబ్బుతారు. చుట్టుపక్కల ఈత మండలు కరువైపొయ్యాయి.

ఒకప్పుడు ఈ దిక్కున ఈత చెట్లకు కొదువేలేదు. ఇప్పుడు కూడా ఉన్నాయి. కానీ కల్లు తీసే వాళ్లు కొయ్యనియ్యడం లేదు. నాలుగు రోజుల కింద గుడారాల్లో ఒక పొట్టిగాడు దొంగతనంగా కొయ్యబోయి పట్టుబడ్డాడు. గౌడోల్లు కొట్టబోయారు. గలాటయింది. ఆ పిల్లోన్ని చేతులు కట్టేసి గుడారాలకు తోలుకొని వచ్చారు.

"దొంగనా కొడుకుల్లారా! అడుక్కు తినేటోల్లని చూచ్చా ఉంటే జాస్తి చేస్తుండారే. ఇట్లగినైతే పొలిమేరల్లోంచి తన్ని తరుముతాం. ఇంటికాడికొచ్చి నిలబడితే తినే ముద్ద పెడతాంగాని, చెట్లు కొడితే ఊకోం... ఏమనుకుంటుండారా..." అని గలీజు తిట్లకు దిగారు.

ఆ పని గుడారాల్లో వాళ్లందరూ చేసినట్లు అందర్ని కలిపి తిట్టారు. ఆ పిల్లోని అమ్మా నాయిన బిక్క చచ్చిపొయ్యారు.

"లేదులే సామీ! ఇంగుతూరి రాము..." అని ఒగపోయారు.

ఆ టయానికి జంబులు గుడారం వెనుక ముంగిసను కాల్చి వలుచుతున్నాడు. ఒక రకమైన కమురు వాసన తెరలు తెరలుగా గాల్లోకి లేస్తోంది. రాత్రి ఆ కాలంలో అనుకోకుండా వాన చినుకులు పడటంతో తుప్పల్లో ముంగిసలు తిరిగాయి. జంబులుకు ఏ ఊళ్లో జనాలు ఏ కత ఇష్టపడతారో, ఎట్ల చెప్తే కదలకుండా రాత్రంతా అలకిస్తారో తెలిసినట్లే ఏ చెట్లల్లో ఏ జీవి తిరుగుతుందో, ఏ కాలంలో ఏది బైటికొచ్చి పారాడుతుందో బాగా తెలుసు. దినాం వేటకు పోడు. నాలిక గుంజిందంటే వల తీసుకొనో, దోటిగాలం తీసుకొనో పోతడు. ఉత్త చేతులతో తిరిగిరాడు.

పొద్దున్నే ముంగిస దొరికింది.

గడిబిడైతే చేతిలో పని ఆపి లేవబోయాడు. 'ఇది యాడికి పొయ్యింది' అని పెండ్లాన్ని తలుచుకున్నాడు.

అటు తిరిగేసరికి కుక్క నేలకు కర్చుకొని తదేకంగా చూస్తూ కనిపించింది. కుక్క ఉందంటే పదిమంది కాపలా ఉన్నట్లు. తినమని పెడితే తప్ప నాలికతో రుచి చూడదు. లేచి ఇవతలకి వచ్చాడు.

ఊర్లోని గౌడోల్లు ఇంకా అరుస్తూనే ఉన్నారు.

"జంబులును చూచి ఏంది జంబులా! నీవన్నా చెప్పేది లేదా? ఇట్లయితే మేం బతకాలా లేదా? మాకూ పెండ్లాం పిల్లలు ఉండారు గదా?" అని ఒకతను ఆగ్రహంతో మొదలుపెట్టి నిష్టూరపోయాడు.

"సామీ... నువ్వా. ఏదో పిల్లోడులే. ఈ తూరికి వదిలెయ్యి. ఇంకా పోర్లే..." అన్నాడు జంబులు.

"ఏం పోరో ఏమో. ఈత చెట్లకు కూడా కావలిగాయాలంటే యాడైతది..."

"వదిలెయ్యి సామీ...." మళ్ళీ అన్నాడు జంబులు చనువుగా.

ఆ పిల్లవాడికి పదహారేళ్లు ఉంటాయేమో.

భయంతో బిక్క చచ్చిపోయాడు. కల్లు కుండలకు కట్టే తాడుతో వాడి చేతులు కట్టేశారు. వాళ్ళు కట్లు విప్పేలా లేరని జంబులు చొరవచేసి వెళ్లి విప్పేశాడు.

"లంగనాయాల... అటుకెల్లి పొయినావంటే సూడు..." అని

మందలించాడు.

గొడోల్లు వెనక్కి తిరిగిపోతూ...

"జంబులా... నీవు ఈడ ఉన్నవేంది. ఊర్లో కొడుకు కోడలు ఉండారు. ఇల్లు వాకిలీ ఉండాది..." అన్నారు. అప్పటికే అక్కడికి వచ్చిన మశమ్మ ఆ మాటలతో అదుర్దాపడింది. పేగు లాగినట్లయింది.

ఆమెకు కొడుకు కాడ్నే ఉండాలని ఉంటది.

కోడలు ఉండమని చెప్పదు. బైటకి పొమ్మని లిగాడీ పెట్టుకోదు. ఉంటే పొయ్యి రాజేసినప్పుడు నాలుగు విత్తులు పోస్తుంది. తాము అడుక్కొచ్చుకున్నది తింటే పైన ఒక మాట కూడా అడగదు. ఇంకా మిగిలిందేమైనా ఉంటే పైటాల పిల్లోల్లకు సర్దుతుంది. అది ఉండమంటదో, పొమ్మంటదోగానీ ఈ మనిసికి కాల్లు ఒకతాన నిలవొద్దూ! కొడుకు, చిన్న మనమల్లు బిందెలమ్మి, పాత గుడ్డలమ్మి నాలుగు దుడ్లు సంపాదిస్తుండారు. 'నా కొడుకు, మనమల్లు తెస్తుండారు, నేను కూచ్చొని తింటా...' అని ఏనాడైనా అంటడా? గిమగిమ గొంతుకొసినా ఆ ముక్క అనడు...

ఆమె తన బంధాల లోకంలోకి వెళ్ళిపోయింది.

కట్లు విప్పదస్తే ఆ పొట్టిగాడు అవమానంగా, పక్కన చూస్తూ నిలబడ్డ అమ్మనాయన్ల మీద ఆగ్రహంతో చరచరా గుడారాలు దాటుకుంటూ ఎక్కడికో వెళ్ళిపోయాడు.

ఈ కాలం పిల్లనాయాల్లకు రోసానికేం తక్కువలేదు! ఒకమాట అంటే తలొంచుకొని నిలబడే రకం కాదు. తప్పు చేస్తే అంటారు. పీక్కుంటే అయితదా? అనుకున్నాడు జంబులు.

ఆయన ఇలాంటి ఘటనలు ఎన్ని చూశాడో! ప్రతిదీ ములిక మాదరి దిగుతుంది. కానీ లోకం ఇట్లనే ఉండది. కాదని యాడికి పోతాం? అనుకుంటాడు. ఆయన అట్లనుకోడానికి ఆయన ఆలోచనల నిండా నిక్షిప్తమైన ఉన్న కతల్లో, పాటల్లో నుండి బలవత్తరమైన ఆవేశం అనుక్షణం హెచ్చరిస్తుంటుంది. కతల్లోని ఆగ్రహం, శోకం కూడా రెచ్చగొడ్తుంటాయి. కానీ ఆయన దుర్బలుడైపోతాడు.

ఇట్లాంటిది ఏది జరిగినా ఆయనలో పోగుబడ్డవి అనేకం తెరలు తెరలుగా పోటెత్తుతాయి. యాభై ఏళ్ల కింద జరిగిన ఘటన జంబులు స్మృతిసొరుగుల్లో దాగి ఉన్నది. అప్పటికి తల్లీతండ్రి బతికి ఉన్నారు. మశమ్మను పెండ్లి చేసుకొని యాడాది కాలేదు. కొట్కూరు, ఆత్మకూరు పల్లెల్లో, ఏటవతలి పల్లెల్లో జంబులు పాటను, కతను అప్పుడప్పుడే ఇష్టపడుతున్నారు. తండ్రి అన్ని చోట్లకూ తనను ఎనికిడ్తి తోలకపోతున్నాడు. కత తాను ఎత్తుకోవడమే... జంబులు గుమ్మెట కొడ్తూ కొడ్తూ ఎక్కడ అందుకుంటాడు. తల్లి, పెండ్లాం గుమ్మెట అందుకుంటే జంబులు కత నడిపేవాడు. తండ్రి ఒక పక్కకు వెళ్లి గొంతు మీద కూచోని కొడుకు అడుగులు నేల మీద ఎట్లా పడుతున్నాయో, గుమ్మెటలకు సరిపోయేలా తంబూర వాయిస్తున్నాడో లేదో, కతలో ఏమైనా తడుముకుంటున్నాడా ధారగా చెప్తున్నాడా అని వాళ్లంత కళ్లు చేసుకొని గమనిస్తుండేవాడు. జనం జంబులు కతలో రుచి చూస్తున్న కాలం అది. కొత్తగా పెండ్లి అయి ఉండటానా కూడా మశమ్మకు తన కళలు చూపించాలనే చతురత కొద్ది కూడా అల్లుకుపోతున్నాడు.

అట్లాంటి రోజుల్లో వానలు వంగాయి.

రెండు దినాలు, మూడు దినాలు వదలకుండా కురిశాయి. వారం గడిచినా తగ్గలేదు. రాత్రింబవళ్ళు భోరున తుఫాను హోరున గాలి. చేలగట్ల మీద వేసుకున్న గుడారాల్లో పాదాలు మునిగిపోయేంత బురద అయింది. ఆ రోజు అర్ధరాత్రి గాలివాన పోటీపడ్డాయి గుడారాలు గాలికి లేచిపోయాయి. పన్నెండు సంసారాలు పిల్లల తల్లులతో కింద బురద, పైన వాన, ఊపిరి దోచుకెళ్ళే హోరుగాలి మధ్య చెట్ల కింద తలదాచుకున్నాయి. గాలికి చెట్లు శివంగుల్లా ఊగి పెళపెళ విరిగిపడుతున్నాయి. ఆ సంసారాలు సాదుకునే ఆరు కుక్కలు అంత వానలో కూడా వాళ్ల చుట్టూతా తిరుగుతున్నాయి.

ఆ రాత్రి గడవడం కష్టమనిపించింది. గుడ్డలు, వలలు, గిన్నెలు గాలికి కొట్టుకుపోయినవి పోగా మిగిలినవి, నానిపోయినా పనికొస్తాయనుకున్నవి - చేతికందినవి తీసుకొని పాతిక మంది దాక పిల్లాపెద్దా అర మైలు నడిచి ఊర్లోకి చేరుకున్నారు. రాములగుడి గుర్తుకొచ్చి అటువెళ్లారు. వెనుకే కుక్కలూ, ముందు కాపోల్లగేరి, ఆ పక్కన అయ్యగారు. తుఫానుకు వాళ్ళ ఇళ్ళు కూడా పొటుకు పెట్టాయి. రెండు మూడు ఇళ్ళు కూలిపోయాయి. కొన్ని ఎప్పుడు కూలుతాయో అన్నట్లున్నాయి. కొందరు పెద్ద అసాముల గరండా ఇళ్ళలోకి వెళ్ళిపోయారు. అప్పటికే కొందరు రాముల గుడిలోకి వెళ్లిపోయారు.

వీళ్లు గడగడ వణుక్కుంటూ, ముద్ద కట్టుకుపోయిన గొంతులతో రాములగుడి మెట్ల దగ్గరికి పోయారు. లోపల గూట్లో గాలికి రెపరెపలాడుతున్న ప్రమిద కాంతి, గడిబిడ మాటలు, వీళ్లు మెట్లు ఎక్కేలోగా లోపల్నుంచి "ఎవురాల్లు.. వచ్చేది..." అనే కేక వినిపించింది.

బదులివ్వడానికి ఎవరి గొంతుల్లోంచి మాటరాలేదు. చలికి పళ్ళు బిగవట్టుకొని దవడలు అంటుకుపోయాయి. పిల్లలయితే మంచుముద్దల్లా ఆడవాళ్ల చంకల్లో ఉన్నారు.

మళ్లీ అదే మాట....

జంబులు తండ్రి యాకయ్య ముద్ద ముద్దగా "నేను సామీ యకయ్యను గాదూ..." అన్నాడు.

"ఎవురు... సుద్దలోల్ల యాకయ్యనా? ఏంది ఇట్లొచ్చినావు... అని మండపం అంచుదాక వచ్చి తొంగి చూచి ఏందిరోయ్... మీ బలగాన్నంత ఎనకేసుకొని వచ్చినావ్... ఈడ మేమే ఇరగబడి చస్తాంటే... మధ్యలో మీరు కూడానా? గుళ్లోకి వద్దామనే వచ్చినారు?" అన్నదా స్వరం.

అది కాపోల్ల నరసింహారెడ్డి గొంతు.

బరే! యాకయ్యా... నేనిట్ల అనగూడదుగాని, నీనోటెంట కత ఇన్నాక నవరాత్రుల్లో వచ్చే ఆ హరిదాసు కత గూడ ఇనబుద్దికాదురా. నువు చెప్తే ఉండే బిగువు వాయిన కతలో రాదు..." అని ఎన్నిసార్లు అన్నాడు నరసింహారెడ్డి.

యాకయ్య ఎనక్కి తగ్గాడు.

ఆ మాటలు విని దార్లో ఉన్నవాళ్లు గుడి మెట్లదగ్గరికి కూడా రాలేదు. "అటుకెళ్లి సత్రం ఉండదిగా... పోదాం" అన్నాడు జంబులు. అందరూ అటు నడిచారు. మాదిగ్గేరి దాటి చేలల్లోకి వెళ్లే మలుపులో సత్రం ఉన్నది. అప్పటికే మాదిగ్గేర్లు గుడిసెలు కూలిపోయి చాలా మంది సత్రం చేరుకున్నారు. తడిసిపోయిన మనుషులతో, వస్తువులతో

సత్రం చిత్తడిగా మారిపోయింది. కారు చీకటిలో మెరుపుల వెలుగు తప్ప మరేమీ లేదు. కన్ను పొడుచుకున్నా కనిపించడం లేదు.

సత్రంలోకి గబగబా వెళ్లారు. వెనుకే కుక్కలు కూడా. సత్రంలో ఉన్నవాళ్ళు తమ గేరి నుండే జనాలు వచ్చారనుకొని 'ఈ వానలు తగ్గేటట్లులేవు. తెరిపిచ్చేతలికి కొంపలన్నీ కూలిపోతాయేమో' అన్నారు.

వీళ్లు ఉలకలేదు, పలకలేదు.

'ఏందిరా పలకరు!' అని అవతలివాళ్ళు మందలించారు.

ఈసారి యాకయ్య మాట్లాడలేకపోయాడు.

జంబులు నోరు తెచ్చుకొని నేనన్నా... జంబులును. సుద్దులోల్లం... వానకు గూడారాలు కొట్టుకుపోయినై. నిలబన్నీకి లేక ఇటొచ్చినాం..." అన్నాడు.

"ఏందిరా! మీరూ ఈడికే వచ్చినారా. దిక్కు లేక మేమొచ్చినాం. ఎప్పటికి బైటపడతమో ఏమో. మీతో ఎట్ల కలిసుండాల? ఎంత ఆపదలోనైనా కులం తలం ల్యాకుండా ఎట్లరా?" అన్నాడు.

బైట మరో వాన జల్లు వేగంగా మొదలైంది.

అంత దూరం నుండి నడిచిరావడాన మొగోల్లకు మోకాళ్ళ దాకా ఉన్న సల్లాడాలు, అడ్డగుడ్డలు, ఆడోల్ల చీరెలు కాస్త ఆరి ఉండే. మళ్లీ తప్ప తడిసిపోయాయి. చంకల్లో పిల్లలు లోపల ఎక్కడ నుండో బరువుగా మూలిగారు.

జంబులు తట్టుకోలేకపోయాడు.

"సత్రం ఒకల్లదికాదు. ఊరుమ్మడిది. ఎవరైనా ఉండొచ్చు..." అని అవతలివాళ్ళ స్వరస్థాయిలోనే అన్నాడు. చివర్లో కొంచెం తగ్గి "కష్టమొచ్చినప్పుడే కాదన్నా సర్దుకుపోవాల్సింది..." అని కూడా అన్నాడు.

"ఏందిరోయ్... సుద్దులోల్ల పొట్టెగాన్నవిపిస్తుండావ్. ఇంట్లాంటియన్నీ కతల్లో చెప్పు. వింటాం." ఆ మనిషి తీవ్రంగా అన్నాడు.

యాకయ్య వెనక నుండి కొడుకు చెయి పట్టుకున్నాడు.

"ఊకో...' అన్నట్లు

ఇంతలో రెండు కుక్కలు సత్రం లోపలికి వెళ్లాయి.

"ఛాయే.... పొ.... ఈడ మంచులకు జాగా లేక తనక్కడుతుంటే..." అని లోపల్నుండి మరెవరో వచ్చి అదిలించారు.

యాకయ్యతో పాటు తక్కిన వాళ్లు దావా మీదకి వచ్చి నిలబడ్డారు. అయనకు తెలుసు. మాదిగ్గేర్లో తనకతంటే తెల్లార్లేదో కదలకుండా కూచుంటారు. మధ్యలో గొంతెండిపోయి నీళ్లడిగితే ఎత్తిపోస్తారు... అట్లా దప్పిక తీర్చుకుని మాలగేర్లో, మాదిగ్గేర్లో కతలు చెప్పడం అలవాటు...

ఆ రాత్రి వానలో తడుస్తూ పిల్లాపాపలతో పైచేల దిక్కు నడిచిపోయారు. బరక చేలల్లో చెట్ల కింద తలదాచుకున్నారు.

.... జంబులుకు లోకమంటే ఏందో అప్పుడే తెలిసివచ్చింది అది అట్లుంటది. దాని ప్రకారం మనం దాంట్లో బతకాలి.... అనుకున్నాడు.

కానీ ఇప్పటి పిల్లలు సందు దొరికితే అడ్డం తిరుగుతారు. కోపతాపాలను, ఆవేశాలను బైటపెట్టుకుంటారు. పైటాలప్పుడు గౌడోల్లు వచ్చి రగడుచేసినాక గుడారాల్లో అందరికీ అవమానం అనిపించింది. నిద్రలేచి యాటకుపోతే ఏదో ఒకదారి దొరుకుతుందని తప్ప ఈడ ఆ దారులేం కనపడ్డం లేదు. గుడారాల్లో ఆడోల్లో మొగోల్లో చాపలు అల్లి ఊర్లల్లో అమ్ముకొనేటోల్లే. రాత్రి చాలా మంది గుడారాలు పీకేశారు. ఏకున లేచిపోవాలని.

కులంలో ఒక చోట కుదురుగా ఉండే వాళ్లే జనాభా లెక్కల్లోకి ఎక్కారు. ఫలానా ఊరివాళ్ళనే గుర్తింపు పొందారు. సగానికి సగం మందికి ఇళ్లు వచ్చాయి. ఊళ్లు తిరుగుతున్నవాళ్లు లెక్కల్లోకి రాలేదు.

"యాడికి పోతాంతియ్...' అన్నది మశమ్మ.

ఆ మాట ఎన్నడూ అనలేదు. ఊర్లు తిరుగుతున్న వాళ్లు ఎన్నడూ అనుకొని ఉండరు. కానీ ఇప్పుడెందుకో మశమ్మకు పోవాలని లేదు. ఉలిగప్ప వచ్చిపోయినాక ఆమెకు తెలియకుండానే ఈ ఆలోచన పాతుకున్నట్లుంది. 'పిల్లోల్లను కాదని యాడికిపోయి ఏం బాముకుంటాం?' అనుకున్నది. ఏ ఊరికి పోయినా మునపట్లెక్క కత చెప్పమని అడిగేటోల్లు లేరు. అప్పటికన్నా గింజలు బాగానే పండుతున్నాయి. అందరి చేతుల్లో దుడ్లు ఆడుతున్నాయి. అయినా ఒక గంట కదలకుండా కత అలకించడం లేదు. 'కతలు చెప్పుకొని బతికేటోల్లు కత విన్న దానికి కాకపోతే దేనికిస్తాం...' అని నాలుగు రూపాయలు ఇచ్చేవాళ్లు లేరు. పడి జొన్నలు కొలిచేవాళ్లు లేరు. చాపలల్లుకొని, బిచ్చం తెచ్చుకొని, ఎలకలో, ఉడుములో పట్టుకొచ్చుకొని ఎన్ని దినాలు బతుకుతం? పిల్లోల్లు బాగుపడ్డారు. ఇంటి కాడ ఉంటే ఒక ముద్ద పెట్టుమంటున్నారా? .... ఇదీ మశమ్మ ఆలోచన.

జంబులుకు విచిత్రమనిపించింది.

ఆమె పైకి అన్న మాటలోని అంతరార్థాలన్నీ గ్రహించాడు. అయినా ఏమీ అనకుండా అందరికన్నా ముందులేచి గూడారం పీకాడు. అప్పుడాయన నోటి వెంట ఓ సన్నని కూనిరాగం మంద్రంగా బైటికి వచ్చింది.

మూడు వంకర్ల గుడిసెరా నాది
ముచ్చటైన చాపమిద్దిరా
మూడు వంకర్లు పాతి - కుంటెన శివ్వలు జేర్చి
వెంట్రుక తాళ్లను చుట్టి - బల్లోలలు బందించి
వెనక మూరెడు చాపలేసి పక్కబగున్‌రిక్క గట్టి
అస్తర్లు మీదవేస్తే అదే నా గుడిసోనురా....

శివ్వలు, వెంట్రుకతాళ్లు ఇంకా వాడుతున్నారు గాని, చాపలు వేసినా వేయకపోయినా గట్టి భద్రంగా ఉంటుందని గుడారాల మీద ప్లాస్టిక్ కవర్లు కప్పుకుంటున్నారు.

జంబులు అన్న కట్టకట్టి తిరిగి చూచేసరికి అందరూ సిద్దంగా ఉన్నారు. మామూలుగా అయితే గుడారానికి మూడు వంకర్లు ఉంటాయి. ఈ మూడు వంకర్లకు అడ్డంగా వాడే కట్టెలను బల్లోలలు అంటారు. వంకర్లు, బల్లోలలు కట్టాక వెనుక మూసి చువ్వలు పాతి వంకర కట్టెలను బంధిస్తారు. దాంతో అర్ధ చంద్రాకారంలో గుడారం తయారవుతుంది. పైన ఈత చాపలు కప్పుకుంటారు. తాము నివసించే గుడారాన్ని చాప మిద్దెగా పాటలు పాడుకుంటారు. కొన్ని రోజుల పాటు ఉంటామనుకున్నప్పుడు ఊరి బైట బయళ్లలో ఇట్లాంటి చాపమిద్దెలు వెలుస్తాయి. మరీ తాత్కాలికం అనుకున్నప్పుడు చాపలపైన పరచడానికి వాడే ప్లాస్టిక్ కవర్‌నే గుడారం లాగా కట్టేసుకొని కాపురం ఉంటారు.

(ఇంకా ఉంది)

-: స్వీకారం :-



దూరాల చేరువలో
ప్రపంచ సాహిత్యం - కొన్ని పుటలు
రచయిత : డా. దిలావర్
ప్రచురణ : సమత
వెల : రు. 100/-

మార్క్సిస్టు మూల సూత్రాలు
సులభ పరిచయం - వ్యాస సంకలనం
రచయిత : రావు కృష్ణారావు
ప్రచురణ : డా. చెలికాని రామారావు మెమోరియల్ కమిటీ
వెల : అమూల్యం



క్లాస్ కాస్ట్ రిలేషన్స్
మార్క్సిస్ట్ అప్రోచ్
సంపాదకులు : అనంత ఆచార్య
ప్రచురణ : డఫోడ్వమ్
వెల : రు. 75/-



చిత్ర, శిల్పకళా రామణీయకము
డా. కొండపల్లి శేషగిరిరావు గారి వ్యాసాలు
సంపాదకులు: కొండపల్లి నీహారిణి
ప్రచురణ : కొండపల్లి వేణుగోపాల్‌రావు
వెల : రు. 200/-

మోహనీలిక
కవిత్వం
రచయిత : దుర్గాప్రసాద్ అవధానం
ప్రచురణ : స్వర్ణ
వెల : రు. 30/-

కథావార్షిక 2009
సంపాదకులు: డా. వి.ఆర్. రాసాని, మధురాంతకం నరేంద్ర
ప్రచురణ : మధురాంతకం రాజారాం సాహిత్యసంస్థ
వెల : రు. 60/-

ప్రేమాభిమానాలు
(కథల సంపుటి)
రచయిత : చలపాక ప్రకాష్
ప్రచురణ : రమ్యభారతి
వెల : రు. 50/-

భూమి పుండు
ఓపెన్‌కాస్టు బొగ్గు గనులపై వ్యాస సంకలనం
సంపాదకులు : పిట్టల రవీందర్
ప్రచురణ : తెలంగాణ విద్యావంతుల వేదిక
వెల : రు. 100/-

కొడవగంటి కుటుంబరావు రచనా ప్రపంచం
నవలలు - 8
సంపాదకులు : కృష్ణాబాయి, చలసాని ప్రసాద్
ప్రచురణ : విప్లవ రచయితల సంఘం
వెల : రు. 250/-

శ్రమ గురించి... మార్క్స్
రచయిత : డేవిడ్ మాక్‌లెల్లన్
అనువాదకులు : ఇంగువ మల్లికార్జునశర్మ
ప్రచురణ : లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్
వెల : రు. 8/-

విప్లవం గురించి... మార్క్స్
రచయిత : డేవిడ్ మాక్‌లెల్లన్
అనువాదకులు : ఇంగువ మల్లికార్జునశర్మ
ప్రచురణ : లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్
వెల : రు. 10/-

హెగెల్
రచయిత : విలియమ్ కెల్లి రైట్
అనువాదకులు : సి. పటేల్
ప్రచురణ : లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్
వెల : రు. 15/-



రాజ్యము-పౌరసమాజము
(రాజనీతి సిద్ధాంత అన్వేషణలు)
ఆంగ్లమూలం : నీరా చంధోక్
సంక్షిప్త అనువాదకులు : రావెల సాంబశివరావు
ప్రచురణ : లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్
వెల : రు. 30/-



లెనిన్ ఉపదేశాలు...
రచయిత : పామీదత్తు
సంక్షిప్త అనువాదకులు : రామమోహన్
ప్రచురణ : లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్
వెల : రు. 25/-



అతడు సామాన్యుల ప్రవక్త!
(దీర్ఘకవిత బ్రోచర్)
రచయిత : అనామధేయుడు
ప్రచురణ : మరో దృక్పథం
వెల : లేదు

KLVA101 M15)

ARUNATARA A Literary and Cultural Telugu Monthly Journal of Revolutionary Writers' Association (VIRASAM)

• RNI Regn.No.21152/72 • Published on 11/12/2010 - 282 - October 2010

(ఢిల్లీలోని కోపర్నికస్ మార్గ్‌లో లిటిల్ థియేటర్ గ్రూప్‌లో కమిటీ ఫర్ రిలీజ్ ఆఫ్ పొలిటికల్ ప్రిజినర్స్ (సి.ఆర్.పి.పి.) ఆధ్వర్యంలో కాశ్మీర్ సమస్యపై అక్టోబర్ 21న జరిగిన సభలో పాల్గోన్న వక్తలు ప్రొ. అమిత్ భట్టాచార్య-చరిత్రశాఖ, జాదవ్‌పూర్ విశ్వవిద్యలయం; సుజాతోభద్ర - మానవహక్కుల కార్యకర్త, వెస్ట్‌బెంగాల్, సిఆర్‌పిపి ఉపాధ్యక్షులు; గురుశరణ్‌సింగ్ - సిఆర్‌పిపి అధ్యక్షులు, ప్రముఖ నాటక కర్త; ప్రొ. జి.ఎన్. సాయిబాబా - సహాయ కార్యదర్శి, రెవల్యూషనరీ డెమోక్రటిక్ ఫ్రంట్; ఎస్.ఎ.ఆర్. జిలానీ - సిఆర్‌పిపి వర్కింగ్ ప్రెసిడెంట్; నజీబ్ ముబారకీ - సహాయ సంపాదకులు ఎకనామిక్ టైమ్స్; రచయిత అరుంధతీ రాయ్; సయ్యద్ అలీ షా జిలానీ - చైర్మన్ ఆల్ పార్టీస్ హురియత్ కాన్ఫెరెన్స్; హర్‌చరణ్‌జీత్ సింగ్ - అధ్యక్షులు, దల్ ఖాల్సా; మాలెమ్ నింగ్‌తౌజ - కమిటీ ఫర్ పీస్ & డెమోక్రసీ, మణిపూర్; కన్వర్‌పాల్ సింగ్ - ప్రధాన కార్యదర్శి దల్ ఖాల్సా; థియాగు - ప్రధాన కార్యదర్శి తమిళ్ నేషనల్ లేబరేషన్ మూవ్‌మెంట్; జమ్ము నుంచి వచ్చిన కార్యకర్త శివనందన్; శ్రీనగర్ విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్ర ప్రొ. షేక్ షౌకత్ హుస్సేన్; నాగా మానవ హక్కుల ఉద్యమనాయకుడు డా. ఎన్. వెనుహ్; జర్నలిస్టు శ్రద్ధబ్రత్‌సేన్ గుప్తా; వరవరరావు-విరసం; ఇందర్ సలీం (కళాకారుడు) తదితరులు పాల్గొన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం విద్యార్థులు 'తూ జిందా హైతో జిందగీ కీ జీత్ మే యకీన్ కర్' అనే పాటను పాడారు. ఈ సభలో ఉన్నదేదో ఉన్నట్లు మాట్లాడినందుకు, కాశ్మీరీ ప్రజల న్యాయమైన ఆకాంక్షలకు మద్దతు పలికినందుకు వక్తలపై దేశద్రోహ నేరం కేసు పెట్టాలని కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుంది. దీనిని భావ ప్రకటనా స్వేచ్ఛపై దాడిగా పరిగణిస్తూ, ఈ చర్యలను విరసం తీవ్రంగా ఖండిస్తుంది. ఈ నేపథ్యంలో అక్టోబర్ 26న అరుంధతీ రాయ్ విడుదల చేసిన ప్రకటన. - సం.)

దశాబ్దాలుగా ప్రజలు అడుగుతున్నదే నేను మాట్లాడాను!

అరుంధతీ రాయ్

(అక్టోబర్ 26న మీడియాకు ఇచ్చిన బహిరంగ లేఖ)

నేనిది కాశ్మీర్ రాజధాని శ్రీనగర్ నుంచి రాస్తున్నాను. ఇటీవల కాశ్మీర్ గురించి బహిరంగ సభలలో నేను మాట్లాడిన దాని గురించి దేశద్రోహ నేరం కింద నన్ను అరెస్టు చేయవచ్చునని ఇవాళ ఉదయం పత్రికలలో చదివాను. ఇక్కడ ప్రతిరోజూ లక్షలాది మంది ఏమంటున్నారో అదే నేను ఆ సభల్లో అన్నాను. ఎంతోమంది వ్యాఖ్యాతలు ఎన్నో సంవత్సరాలుగా అంటున్నదే, రాస్తున్నదే నేనన్నాను. నా ఉపన్యాసపు పాఠాన్ని చదివే శ్రద్ధ ఉన్న ఎవరైనా అది కేవలం న్యాయం కోసం చేసిన విజ్ఞప్తి అని అర్థం చేసుకోగలరు. ప్రపంచంలోకల్లా అత్యంత పాశవికమైన సైనిక ఆక్రమణ కింద నలిగిపోతున్న కాశ్మీర్ ప్రజలకు న్యాయం అందించాలని నేనన్నాను. తమ స్వస్థలం నుంచి బయటికి వెళ్లగొట్టబడిన విషాదాన్ని అనుభవిస్తున్న కాశ్మీరీ పండిత్‌లకు న్యాయం అందించాలని నేనన్నాను. కాశ్మీర్‌లో చనిపోతున్న దళిత సైనికులకు న్యాయం జరగాలని నేనన్నాను. అటువంటి సైనికుల సమాధులు కడలూర్ దగ్గర గ్రామాలలో చెత్తకుప్పల మధ్యన ఉండడం నేను చూశాను. ఈ ఆక్రమణకు మూల్యంగా పోలీసు రాజ్యంగా మారిపోతున్న పాలనలో భయోత్పాతం కింద బతకవలసి వస్తున్న భారత ప్రజానీకానికి న్యాయం జరగాలని నేనన్నాను.

నిన్న దక్షిణ కాశ్మీర్‌లో ఆపిల్ పండ్లకు ప్రసిద్ధి చెందిన షోపియన్ పట్టణానికి వెళ్లాను. అక్కడ ఆసియా, నీలోఫర్ అనే ఇద్దరు యువతులపై దుర్మార్గంగా అత్యాచారం జరిపి, హత్య చేసినందుకు నిరసనగా నలభై ఏడు రోజుల పాటు బంద్ పాటించారు. ఆ ఇద్దరు యువతుల మృతదేహాలు వారి ఇంటి దగ్గర ఒక కాలువలో దొరికాయి. వారి హంతకులను ఇవాళ్టిదాకా విచారించలేదు. శిక్షించలేదు. నీలోఫర్ భర్తా, ఆసియా సోదరుడూ అయిన షకీల్‌ను నేను నిన్న కలిసాను. భారత దేశంలో ఎప్పటికైనా తమకు న్యాయం దొరుకుతుందనే ఆశలేని బాధామయ, ఆవేశమయ సమూహం అది. వాళ్లు ఇప్పుడు ఆజాదీ - స్వాతంత్ర్యం ఒక్కటే తమ ఆశ అని నమ్ముతున్నారు. మొన్నటి ఆందోళనలలో రాళ్లు విసిరిన కుర్రవాళ్లను కలిసాను. వాళ్ల మీదికి నేరుగా కళ్లకు గురిపెట్టి పోలీసులు కాల్పులు జరిపారు. అనంతనాగ్ జిల్లాలో తన స్నేహితులైన ముగ్గురు ముక్కుపచ్చలారని పిల్లలను ఎలా పోలీసులు నిర్బంధంలోకి తీసుకున్నారో, వారు రాళ్లు విసిరినందుకు వారి వేళ్ల గోర్లు ఎలా పీకివేశారో నాతోపాటు ప్రయాణించిన యువకుడు చెప్పాడు.

నేను 'ద్వేషభరితమైన' ఉపన్యాసాలు ఇచ్చాననీ, భారతదేశం విచ్ఛిన్నం కావాలని కోరుకున్నాననీ పత్రికలలో ఆరోపించారు. అందుకు భిన్నంగా నా మాటలు ప్రేమను, గర్వాన్ని ప్రకటించాయి. తమను తాము భారతీయులమని చెప్పుకొమ్మని బలవంతపెడుతూ మనుషులను చంపకూడదనీ, అత్యాచారం చేయకూడదనీ, జైళ్ల పాలు చేయకూడదనీ, వేళ్ల గోర్లు పీకివేయకూడదనీ నేనన్నాను. న్యాయభావన నిండిన సమాజంగా మన సమాజం ఎదగాలనే ఆకాంక్ష నుంచి మాట్లాడాను. తమ మనసులో ఏమున్నదో అది మాట్లాడిన రచయితల నోరు మూయించడానికి ప్రయత్నిస్తున్న దేశాన్ని చూస్తే నాకు జాలి వేస్తోంది. న్యాయం అడిగిన మనుషులను జైళ్లకు పంపాలని అంటున్న దేశమే మతోన్మాద హంతకులను, మూకుమ్మడి హత్యాకాండలకు కారణమైన వాళ్లను, కార్పొరేట్ కుంభకోణాల నిందితులను, లూటీదారులను, రేపిస్టులను, పేద ప్రజలను బలిగొంటున్న వారిని ఇష్టారాజ్యంగా తిరగనివ్వడం చూసి జాలివేస్తున్నది.

(వీక్షణం సౌజన్యంతో)

Edited, printed, published and owned by Chalasani Prasad, H.No. 33-13-3, Seetharampuram, Vijayawada - 520 002
Printed at Charita Impressions, Azamabad, Hyderabad - 500 020 for Nagendra Printing Press, Vijayawada - 520 002,
Editor : Chalasani Prasad

మనము ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA101M151
పుస్తకం పేరు	అరుణతార
తారీఖు	08 February 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	85
పెద్ద సైజు పేజీలు	no
ఖాళీ పేజీలు	no
లేని పేజీలు	no
తయారు చేసినది	naima
పేజీలు విడదీసినది	Bhanu
స్కాన్ చేసినది	shamida
పరీక్ష చేసినది	HASEEMA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good